ఈనాడు

విజయవాడ 6-7-2025 ఆదివారం సిటీ సంపుటి 51 . సంచిక 327
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 8-00 పేజీలు 16+28
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

అడవి ఒడిలో పాఠాలు!

విందాం పదండి...



మట్టి నేలే... మెత్తటి పరుపు.
చెట్టూపుట్టలే... చిరకాల దోస్తులు.
పక్షుల అరుపులే.. నిద్రలేపే అలారాలు.
ఆపదలే... జీవితపాఠాలు నేర్పే గురువులు.
ఇది గిరిజనుల జీవనవిధానం కాదు..!
నగరంలోని యువత, ఐటీ ఉద్యోగులు వారంతాల్లో..ఏరీ..కోరీ.. ఎంచుకుంటోన్న ఆటవిడుపు!!



వారమంతా ఉరుకులు పరుగుల జీవితం. వారాంతంలో పబ్బులు, క్లబ్‌లు, సరదాలు... ఇది కాదు జీవితమంటే అని భావిస్తున్న కొంతమంది యువకులు ఇప్పుడు జీవిత పాఠాలు నేర్చుకునేందుకు ప్రకృతిలోకి పయనమవుతున్నారు. ఉదయం వెళ్తే సాయంత్రానికి తిరిగిరావడం కాకుండా సాధ్యమైనంత ఎక్కువ సమయం అక్కడ గడుపుతున్నారు. సౌకర్యవంతమైన బెడ్రూంలకు బదులు టెంట్‌లలో మట్టి నేలపై పడుకుంటున్నారు. ఏసీలు, కూలర్లకు బదులు పచ్చటి చెట్ల నుంచి వచ్చే స్వచ్ఛమైన గాలిని పీల్చుకుంటున్నారు. చిమ్మచీకట్లో లాంతరు పట్టుకుని నడుస్తూ సరికొత్త అనుభూతిని పొందుతున్నారు. అడవిలో ఆపద వస్తే ఎలా ఎదుర్కోవాలో సర్వైవల్ స్కిల్స్ తెలుసుకుంటున్నారు. నేచర్ క్యాంపుల్లోకి ఆహ్లాదం కోసం వెళ్లినవారు అక్కడ నేర్చుకునే లైఫ్ స్కిల్స్ ఎన్నో...

(మిగతా 2లో)

రాజధానికి మలి విడతలో 34,964 ఎకరాల భూసమీకరణ

సీఆర్‌డీఏ ఆమోదం

ఈనాడు - అమరావతి

రాజధాని అమరావతి నిర్మాణానికి మలివిడతలో 13 గ్రామాల పరిధిలో 34,964 ఎకరాల భూసమీకరణకు ప్రతిపాదనకు ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన శనివారం జరిగిన సీఆర్‌డీఏ 50వ సమావేశంలో ఆమోదం తెలిపారు. దీనిలో పట్టాభూమి 26,369.5 ఎకరాలు, ప్రభుత్వభూమి 5,207.42 ఎకరాలు ఉంది. మిగతావి ఎసైన్డ్, ఇతర కేటగిరీల భూములు. ఈ భూముల సమీకరణకు 16 ప్రత్యేక యూనిట్లు ఏర్పాటు చేయబోతున్నారు. 16 మంది డిప్యూటీ కలెక్టర్లు, 16 మంది తహసీల్దార్లు సహా పలువురు అధికారుల్ని నియమిస్తారు. 5వేల ఎకరాల్లో అంతర్జాతీయ విమానాశ్రయం, 2,500 ఎకరాల్లో అంతర్జాతీయ క్రీడానగరం, 2,500 ఎకరాల్లో స్మార్ట్ ఇండస్ట్రీస్ ఏర్పాటుకు ప్రభుత్వం ఈ భూముల్ని సమీకరించనుంది. ఇప్పటికే గ్రామ సభలు నిర్వహించగా, భూములిచ్చేందుకు రైతులు అంగీకారం తెలిపారు, రాజధాని అమరావతిలో 33 వేల ఎకరాల సమీకరణకు అమలుచేసిన ప్యాకేజీనే మలివిడత భూసమీకరణకూ వర్తింపజేస్తూ ప్రభుత్వం ఇప్పటికే ఉత్తర్వులు జారీచేసింది.

రాజధానిలో 58 ఎకరాల్లో నివాస, మిశ్రమ అభివృద్ధి ప్రాజెక్టులు

రాజధాని అమరావతిలోని మూడు ప్రాంతాల్లో నివాస, మిశ్రమ అభివృద్ధి ప్రాజెక్టులు చేపట్టబోతున్నారు. ఫైనాన్స్, స్పోర్ట్స్ సిటీల్లో మందడం, రాయపూడి, పిచ్చుకలపాలెం సమీపంలో దాదాపు 58 ఎకరాల్లో ఈ హై డెన్సిటీ రెసిడెన్షియల్ జోన్, మిశ్రమ అభివృద్ధి ప్రాజెక్టులను ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్య (పీపీపీ) విధానంలో చేపడతారు. వీటికి టెండర్లు పిలిచేందుకు సీఆర్‌డీఏ సమావేశంలో ఆమోదం తెలిపారు. పురపాలకశాఖ మంత్రి పి.నారాయణ, ఉన్నతాధికారులు సమావేశంలో పాల్గొన్నారు. అథారిటీ నిర్ణయాల్ని మంత్రి నారాయణ విలేకర్లకు వివరించారు. ముఖ్యాంశాలు..

■ అమరావతిలో ఇప్పటివరకు భూములు కేటాయించిన నాలుగు ఫైవ్‌స్టార్ హోటళ్లకు అనుబంధంగా అంతర్జాతీయ ప్రమాణాలతో కన్వెన్షన్ సెంటర్ల నిర్మాణానికి భూములు కేటాయిస్తారు. 10వేల మందికిపైగా కూర్చునే సామర్థ్యంతో నిర్మించే సెంటర్‌కి 2.5 ఎకరాలు, 7,500 నుంచి 10వేల సామర్థ్యంతో చేపట్టే ప్రాజెక్టులకు 2 ఎకరాలు, 7,500 కంటే తక్కువ సామర్థ్యం గల ప్రాజెక్టులకు ఒక ఎకరం చొప్పున కేటాయిస్తారు.

(మిగతా 3లో)



సీఆర్‌డీఏ సమావేశంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో సీఆర్‌డీఏ కమిషనర్ కన్నబాబు, పురపాలకశాఖ మంత్రి పి.నారాయణ, అధికారులు ప్రద్యుమ్న, వాడ్రేవు వినయ్‌చంద్

15న హంద్రీ - నీవా నీటి విడుదల


3కి పుంగనూరు, కుప్పం కాలువలకు నీళ్లు

పోలవరం ఎడమ కాలువ పూర్తిచేయాలి

జలవనరులశాఖపై సమీక్షలో సీఎం చంద్రబాబు

లోపలి పేజీలో

కోతల ప్రసవాలు



- రాష్ట్రంలో 53 శాతం దాటేసిన సిజేరియన్లు
- ప్రభుత్వ వైద్యశాలల్లో 39.93%.. ప్రైవేటు ఆసుపత్రుల్లో 63.85%
- వ్యాపార ధోరణి.. విపరీత పోకడలతో ప్రమాదంలో తల్లీబిడ్డల ఆరోగ్యం

ఈనాడు - అమరావతి

లోకం చూసే ప్రతి బిడ్డ జననం వెనుక ఓ తల్లి ప్రసవవేదన ఉంటుంది. గర్భం నుంచి బయటకు వచ్చి బిడ్డ ఊపిరి పీల్చుకుంటే.. అప్పటివరకు పడిన బాధను తల్లి మరిచిపోయి.. ఆ పసిగుడ్డును ఆప్యాయంగా హత్తుకుంటుంది. అమ్మదనానికి ఓ గుర్తింపుగా చెప్పుకొనే ఈ పురిటి నొప్పులు.. ఆ సమయంలో అరుపులు ఇప్పుడు వినిపించట్లేదు. తల్లికి నొప్పి తెలియకుండానే బిడ్డలు భూమ్మీదకు వస్తున్నారు. పెరుగుతున్న సిజేరియన్ ప్రసవాలే ఇందుకు కారణం.

కాసుల వేటలో.. కోతలు

వైద్యరంగంలో పెరుగుతున్న వ్యాపార ధోరణితో సిజేరియన్లు పెరుగుతున్నాయి. తర్వాత వచ్చే సమస్యలతో గర్భసంచి తొలగింపు కేసులూ ఎక్కువవుతున్నాయి. కొత్తగా వృత్తిలోకి వస్తున్న వైద్యులు, సిబ్బందికి సాధారణ ప్రసవాలు చేయడంలో నైపుణ్యం కొరవడుతోంది. గర్భిణులు, వారి సహాయకుల్లో ధైర్యం నింపి సాధారణ ప్రసవాల దిశగా అవగాహన కల్పించే ప్రయత్నమూ చేయట్లేదు.

■ ప్రభుత్వ వైద్యశాలల్లో శిశు, ప్రసూతి, మత్తు వైద్య నిపుణుల కొరత ఉంది. కొందరు సహజ ప్రసవంలో ఉండే రిస్కు తీసుకోలేక...

(మిగతా 2లో)

రాష్ట్రంలో ఏటా పెరుగుతున్న సి-సెక్షన్ ప్రసవాల తీరిదీ..

సంవత్సరం	సిజేరియన్ల శాతం
2023	45.91
2024	49.74
2025	53.03

ఈ ఏడాది ఏప్రిల్ నుంచి మే వరకు రాష్ట్రంలో ప్రసవాలు

మొత్తం ప్రసవాలు	75,414
సాధారణం	35,425
సిజేరియన్లు	39,989



ట్రినిడాడ్-టొబాగో పార్లమెంటులో ప్రధాని మోదీ

ఆరో తరం వరకు ఓసీఐ కార్డులు

- ట్రినిడాడ్-టొబాగో ప్రవాసులకు వర్తింపు
- ఆరు ఒప్పందాలపై మోదీ సమక్షంలో సంతకాలు



బిగ్ బ్యూటిఫుల్ బిల్లుపై సంతకం చేసిన అనంతరం బల్లపై కొడుతూ ట్రంప్ హర్షం

చట్టమైన ‘బిగ్ బ్యూటిఫుల్ బిల్లు’

- స్వాతంత్య్ర దినోత్సవం రోజున సంతకం చేసిన ట్రంప్
- భారీ వేడుకగా కార్యక్రమం
- అమెరికా గెలిచిందన్న అధ్యక్షుడు



పేరులో గమ్మత్తు... రుచిలో మహత్తు!

బిర్యానీ దినోత్సవం సందర్భంగా కొన్ని విశేషాలు

లోపలి పేజీల్లో

ఆర్థిక సమానత్వంలో ప్రపంచంలోనే భారత్‌కు నాలుగో స్థానం

ప్రపంచ బ్యాంక్ నివేదిక

దిల్లీ: భారత్‌లో ఆర్థిక అసమానతలు గణనీయంగా తగ్గాయని ప్రపంచ బ్యాంక్ నివేదిక వెల్లడించింది. అంతర్జాతీయంగా సమానత్వ పరంగా భారత్ నాలుగో స్థానంలో ఉందని తెలిపింది. 2011-12లో దేశంలో అత్యంత పేదరికం 16.2 శాతంగా ఉండగా, 2022-23కు 2.3 శాతానికి పరిమితమైందని తాజా నివేదికలో వెల్లడించింది. గత దశాబ్ద కాలంగా ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు, పథకాల సక్రమ అమలు వల్లే దేశంలో అసమానతలు తగ్గినట్లు వివరించింది. ఉత్తమ జీనీ ఇండెక్స్ స్కోర్ ఆధారంగా సమానత్వాన్ని లెక్కించింది. ఈ జాబితాలో స్లోవక్ రిపబ్లిక్, స్లోవేనియా, బెలారస్ తొలి 3 స్థానాల్లో నిలిచాయి. చైనా, అమెరికా, యూకే కంటే భారత్ మెరుగుపడి నాలుగో స్థానంలో ఉంది. భారత జీనీ ఇండెక్స్ 25.5గా నమోదైంది. ఒక దేశంలో కుటుంబాలు లేదా వ్యక్తుల మధ్య ఆదాయం, సంపద లేదా వినియోగం సమానంగా ఎలా పంపిణీ అవుతుందో అర్థం చేసుకునేందుకు జీనీ ఇండెక్స్ సాయపడుతుంది. దీని విలువ 0-100 శ్రేణిలో ఉంటుంది. జీనీ ఇండెక్స్ స్కోరు ‘0’ ఉంటే కచ్చితమైన సమానత్వం ఉన్నట్లు పరిగణిస్తారు. 100 ఉంటే అందరి బదులు, ఒకే వ్యక్తి వద్ద సంపద అంతా పోగుపడినట్లు పరిగణిస్తారు. చైనా స్కోరు 35.7, అమెరికా స్కోరు 41.8 గా ఉంది. 167 దేశాల డేటాను ప్రపంచ బ్యాంక్ విడుదల చేసింది. ఈ నివేదిక ప్రకారం, గత దశాబ్ద కాలంలో 17.1 కోట్ల మంది భారతీయులు అత్యంత పేదరికం నుంచి బయటకు వచ్చారు.



■ రోజువారీ 2.15 డాలర్ల (సుమారు రూ. 184) కంటే తక్కువ మొత్తంతో బతుకుతున్న వారిని అత్యంత పేదలుగా పేర్కొంటారు. 2011-12లో మొత్తం ప్రజల్లో వీరి శాతం 16.2% కాగా, 2022-23లో 2.3 శాతానికి పరిమితమైంది. భారత జీనీ ఇండెక్స్ 2011లో 28.8 కాగా, 2022లో 25.5గా ఉంది.



పోస్టుకార్డులను చూపుతున్న విద్యార్థులు

మా బడికి రండి!

తల్లిదండ్రులు, సీఎం, డిప్యూటీ సీఎం, విద్యాశాఖ మంత్రికి విద్యార్థుల ఉత్తరాలు

సీతానగరం, న్యూస్‌టుడే: అన్ని సౌకర్యాలు ఉన్న ప్రభుత్వ బడిలో మమ్మల్ని చదువుకునేలా ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులకు, సీఎం చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు, విద్యాశాఖ అధికారులకు కృతజ్ఞతలు చెబుతూ విద్యార్థులు శుక్రవారం ఉత్తరాలు రాసి పోస్ట్ చేశారు. తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం వెదుళ్లపల్లి ఉన్నత పాఠశాలలో 6వ తరగతిలో ఈ ఏడాది 60 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందారు. వీరంతా పాఠశాలలో తమకు అందుతున్న సౌకర్యాలు, విద్యాబోధన గురించి వివరిస్తూ తల్లిదండ్రులకు ఉత్తరాలు రాశారు.

(మిగతా 3లో)

కలిసి ముందుకు సాగేందుకే చేతులు కలిపాం

ముంబయి సంయుక్త సభలో ఠాక్రే సోదరుల ప్రకటన

మహారాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామం



‘మరాఠీచా’ పేరుతో ముంబయిలో నిర్వహించిన విజయోత్సవ సభలో అభివాదం చేస్తున్న రాజ్ ఠాక్రే, ఉద్ధవ్ ఠాక్రే

ముంబయి: దాదాపు 20 ఏళ్ల అనంతరం శివసేన (యూబీటీ) అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రే, మహారాష్ట్ర నవనిర్మాణ సేన అధినేత రాజ్ ఠాక్రే ఒకే రాజకీయ వేదికపై మెరిశారు. ప్రాథమిక పాఠశాలల్లో హిందీని తప్పనిసరి చేస్తూ తెచ్చిన త్రిభాషా విధానాన్ని నిరసనల నేపథ్యంలో మహారాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయడంతో ముంబయిలోని వర్లిలో ఠాక్రే సోదరులు ఉమ్మడిగా ‘మరాఠీచా’ పేరుతో విజయోత్సవం నిర్వహించారు. ఇందులో ఇద్దరు నేతలు ఒకే వేదికను పంచుకున్నారు. 2005 తర్వాత వారిద్దరు ఇలా కనిపించడం ఇదే తొలిసారి. ‘దక్షిణ భారత దేశంలోని ప్రముఖులెందరో ఆంగ్ల మాధ్యమంలో చదువుకున్నప్పటికీ తమ మాతృభాషలైన తెలుగు, తమిళం విషయంలో ఎంతో గౌరవంతో ఉంటారు. అలాగే మహారాష్ట్ర ప్రజలకు తమ భాషపై అభిమానం ఉంటుంది. హిందీ భాషకు మేం వ్యతిరేకం కాదు. అలా అని ఇతరులపై ఆ భాషను బలవంతంగా రుద్దాలని చూస్తే మాత్రం ఊరుకోం’ అని 57 ఏళ్ల రాజ్ ఠాక్రే స్పష్టం చేశారు. బాల్ ఠాక్రేతోపాటు ఇతరులెవరూ చేయలేనిది.. ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్

(మిగతా 3లో)

వర్షం.. గాడి తప్పుతోంది!

గంటల వ్యవధిలో కుంభవృష్టి ● వానలపై వాతావరణ మార్పుల ప్రభావం

ఈనాడు - విశాఖపట్నం

నిర్మలంగా ఉన్న ఆకాశం ఒక్కసారిగా ఉరుముతోంది. జల్లులు మొదలై గంటల వ్యవధిలో కుంభవృష్టి కురుస్తోంది. ఆకస్మిక వరదల ప్రభావంతో ప్రాణ, ఆస్తి నష్టం సంభవిస్తోంది. గతేడాది సెప్టెంబరులో విజయవాడలో కురిసిన కుంభవృష్టి మొదలు తాజాగా ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్‌లోని ఆకస్మిక వరదల వరకు ఇదే ధోరణి. వాతావరణ మార్పుల ప్రభావం వర్షపాత క్రమాన్నే మార్చేసింది. కొన్నేళ్లుగా వర్షాలు కురుస్తున్న రోజులు తగ్గుతుండగా.. తక్కువ సమయంలోనే ఎక్కువ వర్షపాతం నమోదవుతోంది. భారత వాతావరణ విభాగం (ఐఎండీ) ఆధ్వర్యంలో గతంలో జరిగిన దీర్ఘకాలిక సమాచార విశ్లేషణలోనూ ఈ విషయం వెల్లడైంది. వాతావరణ మార్పుల కారణంగా దేశంలోని వివిధ ప్రాంతాల్లో అతిభారీ వర్షపాతం సహా ప్రకృతి వైపరీత్యాల్లో (సివియర్ వెదర్) తాత్కాలిక, ప్రాదేశిక వైవిధ్యం ఉన్నట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. ఈ మార్పులు భవిష్యత్తులోనూ కొనసాగుతాయని, వీటిని నివారించలేమని గతంలో విడుదలైన ఇంటర్ గవర్నమెంటల్ ప్యానెల్ ఆన్ క్లైమేట్ ఛేంజ్ (ఐపీసీసీ) నివేదికలోనూ ప్రస్తావించారు.



నైరుతి’లోనూ మార్పులు..

దేశంలో వ్యవసాయ రంగానికి కీలకమైన ‘నైరుతి’ వర్షాల్లోనూ ఏటికేడు మార్పులు చోటుచేసుకుంటున్నట్లు అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. హిందూ మహాసముద్రం వేగంగా వేడెక్కడంతో మెరిడియల్ థర్మల్ గ్రేడియంట్ బలహీనపడి రుతుపవనాల గమనం మందగిస్తోంది. దేశవ్యాప్తంగా ఈ సీజన్‌లో కురిసే వర్షాల్లో హెచ్చుతగ్గులు కనిపిస్తున్నాయి. దీని ప్రభావం భారత ఆహార భద్రత, ఆర్థిక స్థిరత్వంపై పడుతోంది. సాధారణంగా జూన్ 1 నుంచి ‘నైరుతి’ సీజన్ మొదలవుతుంది. ఈ సారి ముందుగానే రుతుపవనాలు కేరళను తాకాయి. జూన్‌లో నమోదు

(మిగతా 3లో)

‘అన్నదాతా సుఖీభవ’ ఫిర్యాదుదారులు వ్యవసాయ సహాయకులను సంప్రదించాలి

ఈనాడు, అమరావతి: ‘అన్నదాతా సుఖీభవ’ పోర్టల్‌లో ప్రవేశపెట్టిన ఫిర్యాదుల మాడ్యూల్‌పై జిల్లా స్థాయి వ్యవసాయ అధికారుల నుంచి రైతు సేవా కేంద్రం గ్రామ వ్యవసాయ సహాయకుల వరకు పూర్తి స్థాయి అవగాహనతో ఉండాలి. జిల్లా స్థాయిలో సంయుక్త కలెక్టర్లతో కలిసి తహసీల్దార్లు, వ్యవసాయ అధికారులతో అవగాహన సమావేశం ఏర్పాటు చేయాలి. జూన్ 30 తర్వాత వెబ్‌ల్యాండ్‌లో నమోదైన రైతు భూమి ఖాతాలకు కూడా ఈ పథకానికి అర్హత కల్పించిన సంగతిని గుర్తించి, తదనుగుణంగా రైతులకు సమాచారం ఇవ్వాలి’ అని వ్యవసాయశాఖ డైరెక్టర్ డిల్లీరావు పేర్కొన్నారు. మొదటి దశ పరిశీలన, రెండో దశ ధ్రువీకరణలో అనర్హత పొందిన రైతుల రికార్డులను ఫిర్యాదుల మాడ్యూల్‌లో పొందుపరిచినట్లు తెలిపారు. ప్రతి ఫిర్యాదిదారు మొదట రైతు సేవాకేంద్రంలోని వ్యవసాయ సహాయకులను సంప్రదించాలన్నారు. ఈ నెల 10 లోపు ఫిర్యాదుల స్వీకరణ ముగించాలని సూచించారు.

అడవి ఒడిలో పాఠాలు! విందాం పదండి...

(మొదటి పేజీ తరువాయి)

ఒకరికి ఒకరు..: క్యాంపుల్లో టెంట్లు వేయడం, ఆహారం తయారు చేయడం...ఇదంతా ఒకరితో అయ్యే పనికాదు. అందుకే ఒకరికొకరు సహకరించుకుంటారు. ఇది మేమంతా ఒకటే అనే భావను పెంచుతోంది. కొత్త స్నేహాలను చిగురింపజేస్తోంది.



బతకడం ఇలా..: అడవిలో అకస్మాత్తుగా పాము కనిపించింది..ఎలుగుబంటి ఎదురైతేఎలా తప్పించుకోవాలో అక్కడికక్కడే నిపుణులు చెప్పేస్తారు. సర్వైవల్ స్కిల్స్‌లో ఇదో అద్భుత శిక్షణగా భావించొచ్చు.

ఆ నిశ్శబ్దం విలువ ఇదీ..: రాత్రి వేళలో మట్టి నేలపై వరసగా టెంట్లు వేసుకుంటారు. అందులోనే నిద్రిస్తారు. ఆకాశంలోని చుక్కలను చూస్తూ సరదాగా మాట్లాడుకోవడం మంచి అనుభూతినిస్తే... ప్రకృతిలోని అంతులేని నిశ్శబ్దాన్ని ఆస్వాదించడం అద్భుతమనే చెప్పాలి.



జట్టుగా నెగ్గుతారు: ఈ క్యాంపులకు వెళ్లిన వాళ్లంతా జట్లుగా ఏర్పడతారు. కొందరు నాయకత్వం వహిస్తారు. వ్యక్తిగతంగా కాకుండా జట్టుగా ఆలోచించడం తప్పనిసరి. సాధారణంగా ముభావంగా ఉండే చాలా మంది ఈ క్యాంపుల్లో సరదాగా గడిపేస్తుంటారు. అందరితో కలివిడిగా ఉండేందుకు ఇదో మంచి అవకాశం.

అనుబంధాల కోట: చుట్టూ చిరు చీకట్లు.. చల్లటి గాలులు.. క్యాంప్ ఫైర్ నుంచి వెచ్చటి మంటలు. పాటలు పాడుతూ, కథలు చెప్పుకుంటూ ప్రకృతి సాక్షిగా మానవ సంబంధాలను బలపరుచుకోవచ్చు. ఇంట్లో ఉంటే ఎవరి ఫోన్‌లో వారే బిజీ. ఇక్కడ అందరూ ఒక దగ్గర కూర్చుని ప్రశాంతంగా మాట్లాడుకుంటారు. ఇదో గొప్ప అవకాశం కదూ!

గుండెల నిండా ధైర్యం..: నైట్‌క్యాంప్‌లో భాగంగా తలా ఓ టార్చ్ పట్టుకుని బయల్దేరుతారు. ప్రకృతిలో నిశాచర జీవులూ చాలా ఉంటాయి. గుడ్లగూబలు, తేళ్లు, కుందేళ్లు, గబ్బిలాలు, కొన్ని రకాల పాములు మనకు తారస పడుతుంటాయి. ఆసక్తిగొలిపే వాటి గమనం.. జీవనం తెలుసుకోవడం చాలా ఆసక్తికరం. దీంతో పాటు చీకటి, అడవి అంటే ఉన్న భయాలన్నీ ఈ క్యాంప్‌తో ఆమడదూరం పోయినట్టే. అడవిమధ్యలో ప్రయాణం ఉత్సాహాన్ని రెట్టింపుచేస్తుంది. వివిధ రకాల జంతువుల గురించి క్యాంపులో వీడియోల ద్వారా తెలుసుకోవడం ఆసక్తిగొలుపుతుంది.



పిల్లలు సైతం!


యువత, ఉద్యోగులే కాదు బడి పిల్లలూ ఈ క్యాంపుల్లో పాల్గొంటున్నారు. తల్లిదండ్రులతో వెళుతూ పచ్చదనం, పర్యావరణం, జీవవైవిధ్యంపై అవగాహన పెంచుకుంటున్నారు. కొన్ని పాఠశాలలూ ఈ రకమైన క్యాంపులను ఏర్పాటు చేస్తున్నాయి. అపార్ట్‌మెంట్లలోని కుటుంబాలన్నీ కలిసి వెళుతుండడం కొత్త ట్రెండ్. పిల్లలు అందరితో కలిసి ఎలా జీవించాలి, విపత్కర పరిస్థితులను ఎలా ఎదుర్కోవాలి తదితర నైపుణ్యాలు నేర్చుకుంటారు. ఫలితంగా వారిలో ధైర్యం పెరుగుతుంది.

– కల్యాణపు సుమన్, ప్రకృతిపర్యాటక నిపుణులు

ఎక్కడెక్కడ..?

- తెలంగాణలో మంచిరేవుల ట్రెక్ పార్క్, సోమశిల, వికారాబాద్‌లోని అనంతగిరి అటవీ ప్రాంతం, అమ్రాబాద్ టైగర్ రిజర్వు (అక్టోబరు-జూన్), లక్నవరం మూడో ఐలాండ్‌లలో నేచర్ క్యాంపులు ఎక్కువగా ఏర్పాటవుతున్నాయి. హైదరాబాద్‌లో కొండాపూర్ బొటానికల్ గార్డెన్ పక్కన వర్చువల్ సఫారీ ప్రాంతం కూడా మంచి అనుభూతినిస్తోంది.
- ఏపీలో అరకులోయ, లంబసింగి, రంపచోడవరం, చింతపల్లి ప్రాంతాల్లో ప్రకృతి పర్యాటకం ఊపందుకుంది. అరకులో అటవీశాఖవి 50 టెంట్లు ఉన్నాయి. ప్రైవేటు వ్యక్తుల టెంట్లు వందల్లో ఉన్నాయి. పర్యాటక శాఖ వెబ్‌సైట్లలో పూర్తి వివరాలుంటాయి.

-ఈనాడు, హైదరాబాద్



కోతల ప్రసవాలు

(మొదటి పేజీ తరువాయి)

కేసులు రిఫర్ చేస్తున్నారు. చివరి నిమిషంలో వెళ్తే సిజేరియన్ తప్పట్లేదు.

★ సహజ ప్రసవాలంటే భయం, మంచి ముహూర్తంలో బిడ్డను కని వారి తలరాతలు మార్చేయాలన్న విపరీత పోకడలూ ఇందుకు కారణమవుతున్నాయి. కొందరు వృత్తి, ఉద్యోగ వ్యాపకాల్లో పడి వయసు మీరిన తర్వాత పిల్లలను కనాలన్న ఆలోచనకు రావడంతో ఆరోగ్య సమస్యలు సాధారణ ప్రసవాలకు ప్రతికూలంగా మారుతున్నాయి.

తల్లికి, బిడ్డకూ ఇబ్బందే

అమ్మదనాన్ని ఆస్వాదించే తొలి అడుగు తడబడుతోంది. ముందే ఆసుపత్రిలో చేరి, నొప్పి బాధ తెలియకుండానే ప్రసవం చేయించుకునేవారి సంఖ్య పెరుగుతోంది. అత్యవసర పరిస్థితుల్లో తల్లీబిడ్డల ప్రాణాలు కాపాడేందుకు సిజేరియన్ చేయాల్సి ఉన్నా, చాలా సందర్భాల్లో అవసరం లేకున్నా కడుపు కోసి బిడ్డను బయటకు తీస్తున్నారు. దీంతో రక్తస్రావం, ఇన్ఫెక్షన్, ఎలర్జీ, శక్తి సన్నగిల్లడం లాంటి సమస్యలు, గర్భసంచి తొలగించే పరిస్థితీ ఎదురవుతోంది. బిడ్డల్లోనూ శ్వాసకోశ, ఇతరత్రా దీర్ఘకాలిక ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

★ ప్రపంచ ఆరోగ్యసంస్థ మార్గదర్శకాల ప్రకారం సిజేరియన్లు 10-15 శాతానికి మించకూడదు. ఆంధ్రప్రదేశ్ ఆ గీతను ఎప్పుడో దాటేసింది. జాతీయ కుటుంబ ఆరోగ్యసర్వే-5 గణాంకాల ప్రకారం 2019-21లో దేశంలో అత్యధిక సిజేరియన్లు జరుగుతున్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ 42.44%తో మూడోస్థానంలో నిలిచింది. తొలి రెండు స్థానాల్లో తెలంగాణ (60.7%), తమిళనాడు (44.94%) ఉన్నాయి. తాజాగా ఏపీలో పరిస్థితి పరిశీలిస్తే.. ఇది 50 శాతానికి దాటేసింది.

కోనసీమలోనే అత్యధికం

రాష్ట్రంలో ఈ ఏడాది ఏప్రిల్ నుంచి మే వరకు గణాంకాలు పరిశీలిస్తే.. మొత్తం ప్రసవాల్లో 53.03% సి-సెక్షన్ డెలివరీలు ఉన్నాయి. ఇందులో ప్రభుత్వ వైద్యశాలల్లో 39.93%, ప్రైవేటు వైద్యశాలల్లో 63.85% జరిగాయి. సిజేరియన్లు 50% దాటిన జిల్లాలు రాష్ట్రంలో 17 ఉన్నాయి. అత్యల్పంగా అల్లూరి జిల్లాలో 8.49% సిజేరియన్లు జరిగితే.. అత్యధికంగా అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 75% జరిగాయి.

గర్భధారణపై ప్రభావం



సాధారణ ప్రసవాలే తల్లీబిడ్డల ఆరోగ్యానికి మంచిది. తల్లులు త్వరగా కోలుకుంటారు. తల్లి పాలు, బ్యాక్టీరియా (గట్ మైక్రోబియం) బిడ్డకు చేరి వ్యాధినిరోధక శక్తి పెరుగుతుంది. సిజేరియన్ ప్రసవాల్లో తల్లి కోలుకోవడానికి ఎక్కువ సమయం పడుతుంది. ఇన్ఫెక్షన్, రక్తస్రావం లాంటి సమస్యలకూ ఆస్కారం ఉంది. భవిష్యత్తులో గర్భం దాల్చాలన్నా సమస్యలు తలెత్తుతాయి. చాలామందిలో తొలిసారి గర్భం దాల్చడం ఆలస్యమవుతోంది. గర్భిణుల్లో ప్రసవ సమయంలో నొప్పులు ఎక్కువనే భయం పోగొట్టాలి. అయినవారి సంరక్షణ, నిరంతర వైద్యసేవలు, సూచనలు తప్పనిసరి. ఆసుపత్రులకు వచ్చే గర్భిణుల్లో అవగాహన కల్పించి మానసిక స్థైర్యం నింపితే సాధారణ ప్రసవాల దిశగా ప్రోత్సహించవచ్చు.

– డాక్టర్ లక్ష్మీ శిరీష శాఖమూరి, ప్రసూతి వైద్య నిపుణులు, విజయవాడ

8, 9 తేదీల్లో శ్రీశైలం నుంచి నీటి విడుదల

కర్నూలు జలమండలి, సున్నిపెంట సర్కిల్, న్యూస్‌టుడే: శ్రీశైలం జలాశయానికి భారీగా వరద నీరు వచ్చి చేరుతుండడంతో క్రస్ట్ గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేసేందుకు జలవనరుల శాఖ అధికారులు సిద్ధమవుతున్నారు. జూరాల ప్రాజెక్టు నుంచి 1,21,471 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 66,589 క్యూసెక్కులు వస్తుండడంతో ప్రాజెక్టులో రోజురోజుకు నీటి నిల్వలు పెరుగుతున్నాయి. శ్రీశైలం కుడి, ఎడమగట్టు జలవిద్యుత్తు కేంద్రాల్లో విద్యుదుత్పత్తి చేస్తూ 67,019 క్యూసెక్కులను నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం జలాశయం నీటిమట్టం శనివారం సాయంత్రం 6 గంటల సమయానికి 877.40 అడుగులు, నీటినిల్వ 175.1050 టీఎంసీలుగా నమోదైంది. ఈ నెల 8, 9 తేదీల్లో శ్రీశైలం జలాశయం నుంచి దిగువకు నీటిని విడుదలచేసే అవకాశముంది.

12–15 మధ్యలో హంద్రీనీవాకు..: హంద్రీనీవా సుజల స్రవంతి పరిధిలోని మల్యాల నుంచి 12-15 తేదీల మధ్యలో నీటిని విడుదల చేసేందుకు ఇంజినీర్లు సిద్ధమవుతున్నారు.

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
నెల్లూరు	38.2	30.0
తిరుపతి	37.6	25.4
కడప	37.0	27.0
విజయవాడ	36.5	26.2
తాడేపల్లిగూడెం	35.3	27.2
ఒంగోలు	34.5	27.4
రాజమహేంద్రవరం	34.5	25.0
గుంటూరు	34.0	28.0
నరసాపురం	34.0	25.0
కర్నూలు	34.0	25.0
అనంతపురం	33.6	25.0
విజయనగరం	33.0	24.0
విశాఖపట్నం	31.2	27.0
శ్రీకాకుళం	29.0	26.0

గ్రహం అనుగ్రహం

6-7-2025 ఆదివారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; ఉత్తరాయణం; గ్రీష్మ రుతువు, ఆషాఢ మాసం, శుక్లపక్షం
ఏకాదశి: రా. 8-15 తదుపరి ద్వాదశి
విశాఖ: రా. 10-40 తదుపరి అనూరాధ
వర్జ్యం: తె. 3-04 నుంచి 4-50 వరకు
అమృత ఘడియలు: మ. 12-55 నుంచి 2-42 వరకు
దుర్ముహూర్తం: సా. 4-49 నుంచి 5-41 వరకు
రాహుకాలం: సా. 4-30 నుంచి 6-00 వరకు
సూర్యోదయం: ఉ.5.34; సూర్యాస్తమయం: సా.6.33
శయన ఏకాదశి, తొలి ఏకాదశి, గోపద్మవ్రతం, పునర్వసు కార్తె సా. 5.27

మాటమాత్రం చెప్పకుండా భూసేకరణా?

ప్రభుత్వ తీరుపై కరేడు రైతుల ఆగ్రహం

ఇండోసోల్ పరిశ్రమకు భూములివ్వబోమంటూ ఆందోళన

భూసేకరణ ప్రతిపాదనకు ముందు రైతుల్ని సంప్రదించని ప్రభుత్వం

ఈనాడు, నెల్లూరు: రాష్ట్రాభివృద్ధికి, ఉపాధి కల్పనకు పరిశ్రమలు అవసరం. వాటి ఏర్పాటుకు రైతుల నుంచి భూములు తీసుకోవాల్సి వచ్చినప్పుడు వారి అంతరంగాన్ని ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, అధికారులు ముందే తెలుసుకోవాలి. రైతులతో చర్చించాలి. వారిలో ఆందోళనలు తొలగించాలి. వారి భవిష్యత్తుకు భరోసా ఇవ్వాలి. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఉలవపాడు మండలంలోని కరేడు ప్రాంతంలో ఇండోసోల్ సంస్థ సోలార్ ప్యానెళ్ల తయారీ పరిశ్రమ కోసం భూసేకరణ ప్రక్రియ ప్రారంభించే ముందు... ప్రభుత్వ పరంగా ఇలాంటి కసరత్తేమీ లేకుండా, నేరుగా భూసేకరణకు సిద్ధపడటంతో రైతులు తిరగబడ్డారు.

రూ.69 వేల కోట్ల పెట్టుబడి..

సోలార్ ప్యానళ్లు, ఇతర ఉపకరణాల తయారీ, పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టుల ఏర్పాటుకు ఇండోసోల్ సంస్థకు వైకాపా హయాంలో రామాయపట్నం పోర్టు సమీపంలో 8,348 ఎకరాలు కేటాయించారు. రూ.69వేల కోట్ల పెట్టుబడితో 13,050 మందికి ఉపాధి కల్పించాలన్నది ప్రతిపాదన. గత ప్రభుత్వ హయాంలోనే అక్కడ 4వేల ఎకరాలకు పైగా భూసేకరణకు రెవెన్యూ అధికారులు నోటిఫికేషన్ ఇచ్చారు. రైతులకు పరిహారం చెల్లించి కొంత భూమిని ఏపీ మారిటైమ్ బోర్డుకు రెవెన్యూ విభాగం అప్పగించింది. పూర్తిగా సేకరణ జరగకముందే... ఇండోసోల్ సంస్థ 35 ఎకరాల్లో షెడ్ ఏర్పాటుచేసి, ఒక యూనిట్‌ను ఉత్పత్తికి తెచ్చేస్తున్నట్లు ప్రకటించింది. రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చాక ఆ భూమిని బీపీసీఎల్ రిఫైనరీకి కేటాయించింది. ప్రత్యామ్నాయంగా ఇండోసోల్ సంస్థకు కరేడు, ప్రకాశం జిల్లా సింగరాయకొండ మండలం బింగినపల్లిలో కలిపి 8,348 ఎకరాలు కేటాయిస్తున్నట్లు ఈ ఏడాది మార్చి 25న పరిశ్రమలశాఖ ఉత్తర్వులు జారీచేసింది. రామాయపట్నం పోర్టుకు అనుబంధంగా ఏర్పాటుచేస్తున్న పరిశ్రమ కావడంతో... పోర్టుకు సమీపంలో ఉండే ఈ ప్రాంతాన్ని ప్రభుత్వం ఎంపికచేసింది. దాంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. ఎంత భూమి సేకరిస్తారు? అసలు పరిహారం ఎంతిస్తారు? పొలాలన్నీ పరిశ్రమకు ఇచ్చేస్తే తమ పరిస్థితేంటి? భృతి కల్పించేందుకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుంది? ఉపాధి చూపిస్తారా? పిల్లలకు ఉద్యోగాలిస్తారా? పునరావాసం సంగతేంటి... ఇలాంటి అంశాలపై గ్రామసభల్లో ఆందోళన మొదలైంది. ప్రభుత్వం ఉత్తర్వులిచ్చే ముందే ప్రజాప్రతినిధులు రైతులతో మాట్లాడి, వారి సందేహాల్ని నివృత్తి చేసేందుకు, సమస్యల పరిష్కారానికి నిర్దిష్టమైన హామీ ఇచ్చేందుకు చొరవ చూపించలేదు.

నోటిఫికేషన్‌తో తిరగబడ్డ రైతులు

రాష్ట్ర ప్రభుత్వం జూన్ 21న భూసేకరణ నోటిఫికేషన్ జారీచేసింది. తొలివిడతలో 4,912 ఎకరాలు సేకరిస్తామంటూ, రైతుల వివరాల్ని ప్రచురించడంతో వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఉద్యమబాట పట్టారు. 'సేవ్ కరేడు' పేరుతో ఆందోళన చేపట్టారు. ప్రతిపక్షాలు, ప్రజాసంఘాలు మద్దతుగా నిలవడంతో పోరాటం ఉద్ధృతమైంది. జాతీయ రహదారిని దిగ్బంధించారు. భూసేకరణపై అధికారులు శుక్రవారం కరేడులో గ్రామసభ నిర్వహించారు. కరేడు రెవెన్యూ పరిధిలో మొత్తం 12,636 ఎకరాలుండగా, 8,214 ఎకరాలు తీసుకుంటామని చెప్పారు. దానిలో 7,023 ఎకరాలు పట్టాభూమి, 1,191 ఎకరాలు ప్రభుత్వ భూమిగా పేర్కొన్నారు. ఇది రైతుల్లో తీవ్ర ఆగ్రహానికి కారణమైంది.

రైతుల ఆందోళన ఇదీ..

- ఏడాదికి రెండు పంటలు పండే భూములిస్తే మా బతుకుతెరువు పోతుంది.
- 15 అడుగుల్లో నీరు పడుతుంది. పంటలు బాగా పండుతాయి. భూములిచ్చేస్తే మా పరిస్థితేంటి?
- పొలాలు తీసుకుని ఊళ్లను వదిలేస్తే మేమెలా బతకాలి? పశువుల్ని మేపేందుకు ఎక్కడికి పోవాలి?
- ఏళ్లతరబడి వ్యవసాయం చేస్తున్న మేము.. ఇప్పుడు పొట్ట చేతపట్టుకుని కూలీలుగా వేరే ఊళ్లకు వెళ్లాలి
- 16 గ్రామాల్లో 17వేల మందికి ఈ భూములే ఆధారం. మమ్మల్ని కాదని భూములు తీసుకుంటే ఆత్మహత్యలే శరణ్యం.



జాతీయ రహదారిపై ఆందోళన చేస్తున్న కరేడు గ్రామస్థులు

రైతులంతా కూలీలుగా మారాల్సిందే: నవరం వంశీకృష్ణ, కరేడు



"కరేడులో మాకు ఏడెకరాలు ఉంది. ఏటా రెండు పంటలు పండిస్తాం. వరి, పత్తి సాగు చేస్తాం. పశువులకు మేత పండించుకుంటాం. వాటిపై వచ్చే ఆదాయంతోనే పిల్లల్ని చదివిస్తున్నాం. భూములు తీసుకుంటే మా పరిస్థితేంటి? ఇప్పటివరకు సొంత పొలాల్లో రైతులుగా ఉన్న మేమంతా వేరేచోట కూలీలుగా బతకాలి."

రైతుల అభిప్రాయం మేరకే నిర్ణయం: రాజశేఖర్, భూసేకరణ డిప్యూటీ కలెక్టర్

"భూసేకరణ ప్రక్రియ ప్రాథమిక దశలోనే ఉంది. గ్రామసభలు నిర్వహించి ప్రజాభిప్రాయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళతాం. వారి అభిప్రాయం మేరకే ప్రభుత్వ నిర్ణయం ఉంటుంది. సేకరించే భూమికి రైతులకు ఇచ్చే పరిహారాన్ని రిజిస్ట్రేషన్ విలువను పరిగణనలోకి తీసుకుని.. కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యేతో చర్చించాక నిర్ణయిస్తారు."

15న హంద్రీ-నీవా నీటి విడుదల

ఈనాడు, అమరావతి: 'హంద్రీ-నీవా తొలిదశలో జీడిపల్లి వరకు నీటిని 15వ తేదీ నుంచి విడుదల చేయాలి. ఆలోపు తొలిదశలో చేపట్టిన పనులన్నీ పూర్తిచేయాలి. కాలువ పూర్తి సామర్థ్యం మేరకు 3,850 క్యూసెక్కుల సామర్థ్యంతో నీళ్లివ్వాలి. ఇందుకోసం 15కు మూడు రోజుల ముందే కాలువ వెడల్పు తదితర పనులు పూర్తి చేయాలి. జీడిపల్లి నుంచి గొల్లపల్లి, మారాల, చెర్లోపల్లి జలాశయాలనూ నింపాలి. హంద్రీ-నీవా రెండో దశలో పుంగనూరు, కుప్పం బ్రాంచి కాలువలకు 31న నీళ్లివ్వాలి' అని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. జీడిపల్లి రిజర్వాయర్ నుంచి పెన్నా అహోబిలం రిజర్వాయర్‌తో పాటు 3,850 క్యూసెక్కుల నీటిని వినియోగించి ఆ ప్రాజెక్టు పరిధిలోని అన్ని రిజర్వాయర్లు, చెరువులు నింపాలని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తన క్యాంపు కార్యాలయంలో శనివారం జలవనరుల శాఖపై సమీక్షించారు. ఉత్తరాంధ్ర ప్రాజెక్టులు, పోలవరం ఎడమకాలువ పనులు, జలాశయాల్లో నీటిమట్టాలు, నీటి నిర్వహణకు చేపడుతున్న చర్యలపై విస్తృతంగా చర్చించారు.

419 టీఎంసీల నీటి నిల్వలు

'రాష్ట్రంలో ప్రస్తుతం వివిధ రిజర్వాయర్లలో 419 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయి. గతేడాది ఇదే సమయానికి 182 టీఎంసీలే ఉన్నాయి. ఒక్క వైఎస్సార్ కడప జిల్లాలో తప్ప మిగిలినచోట్ల సాధారణ వర్షపాతమే నమోదైంది. రానున్న రోజుల్లో వర్షాలు ఆశాజనకంగా ఉంటాయన్న సంకేతాలు వస్తున్నాయి' అని అధికారులు సీఎంకు చెప్పారు. 'అన్ని ప్రాజెక్టుల్లోకి సమృద్ధిగా వచ్చి చేరే నీటిని సమగ్ర నిర్వహణ ద్వారా సద్వినియోగం చేసుకోవాలి. వచ్చే నీళ్లను హంద్రీ-నీవా, పోతిరెడ్డిపాడు ద్వారా రాయలసీమలో ప్రతి ప్రాంతానికీ తరలించాలి. పెన్నా బేసిన్‌లో సోమశిల, కండలేరు ప్రాజెక్టుల్లో ఎక్కువ నీటినిల్వకు ఆస్కారం ఉంది. ఆ రైతులకు సాగునీరు ఇచ్చి, తర్వాత ప్రాజెక్టులను నింపాలి. అత్యుత్తమ స్థాయిలో నీటినిర్వహణ చేసి ప్రతి చుక్కా వినియోగించుకోవాలి' అని చంద్రబాబు పేర్కొన్నారు. భూగర్భజలాల పెంపు విషయంలో పంచాయతీరాజ్ శాఖనూ భాగస్వామిని చేయాలన్నారు.

వెలిగొండకు నిధులిస్తాం

'ప్రకాశం జిల్లాకు కీలకమైన వెలిగొండ ప్రాజెక్టు పనులను 2026 జూన్ నాటికి పూర్తిచేయాలి. ఇందుకు అవసరమైన నిధులిస్తాం. పోలవరం ఎడమ కాలువ పనుల వేగం పెంచాలి. జులై 31కి పూర్తిచేయాలి. అనకాపల్లి వరకు నీళ్లు తీసుకెళ్లేందుకు అవసరమైన ఏడు ప్యాకేజీలు పూర్తిచేయాలి. ఇందులో ఎలాంటి మినహాయింపు లేదు. ఉత్తరాంధ్ర ప్రాజెక్టులను పట్టాలెక్కించాలి. తారకరామతీర్థ సాగర్ ప్రాజెక్టును ఏడాదిలో పూర్తిచేయాలి. తోటపల్లి డిస్ట్రిబ్యూటరీ పనులు, వంశధార- నాగావళి అనుసంధానంలో పెండింగ్ పనులు పూర్తిచేయాలి. ఉత్తరాంధ్ర సుజల స్రవంతిని వీటికి అనుసంధానించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలి' అని అధికారులను సీఎం ఆదేశించారు. వాసార్ ల్యాబ్స్ ద్వారా నీటి ఆడిటింగ్ చేపట్టి సమర్థ నీటి వినియోగం కోసం అవసరమైన ప్రణాళిక అమలుచేయాలి. పనిచేయని పీజోమీటర్లను మార్చేందుకు అవసరమైన నిధులిస్తాం. సీఈలు ఒక్క ప్రాజెక్టులే తమ పరిధిలో అంశం అని కాకుండా, ఆయా ప్రాంతాల్లో భూగర్భ జలాల పెంపులో కూడా భాగస్వాములు కావాలి' అని చంద్రబాబు ఆదేశించారు. ఈ సమావేశంలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు, ఈఎన్సీ నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌తో బాధపడుతున్న కార్యకర్త కోరిక తీర్చిన చంద్రబాబు

ఆకుల కృష్ణతో వీడియో కాల్ మాట్లాడిన సీఎం

ఈనాడు, అమరావతి: క్యాన్సర్‌తో బాధపడుతున్న రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గం మోరంపూడి జంక్షన్‌కు చెందిన ఆకుల కృష్ణతో సీఎం చంద్రబాబు శనివారం వీడియో కాల్ మాట్లాడారు. తన ఆరోగ్యం క్షీణిస్తుండటంతో ఒక్కసారైనా చంద్రబాబుతో మాట్లాడాలనే కోరికను తెలుసుకున్న చంద్రబాబు స్వయంగా ఫోన్ చేసి పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని, అన్ని విధాలుగా అండగా ఉంటామని కృష్ణకు, ఆయన కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు. చంద్రబాబుతో మాట్లాడటంపై కృష్ణ ఆనందం వ్యక్తం చేశారు.



క్యాన్సర్ బారిన పడిన తెదేపా కార్యకర్త ఆకుల కృష్ణ, అతని కుటుంబ సభ్యులతో వీడియో కాల్‌లో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

బనకచర్లపై 2, 3 రోజుల్లో సమాధానాలు!

- **కేంద్ర జలసంఘం లేవనెత్తిన అంశాలపై.. సీఎంకు నివేదించిన అధికారులు**

ఈనాడు, అమరావతి: పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టుకు సంబంధించి కేంద్ర జలసంఘం అనుమానాలను రెండు, మూడు రోజుల్లో నివృత్తి చేయనున్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబుకు శనివారం జలవనరుల శాఖ అధికారులు తెలియజేశారు. సీఎం జలవనరుల శాఖ ప్రాజెక్టుల పురోగతిపై సమీక్షించిన సందర్భంగా ఈ అంశం ప్రస్తావనకు వచ్చింది. ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ మాట్లాడుతూ.. ప్రాజెక్టు ప్రి ఫీజిబిలిటీ నివేదికను పరిశీలిస్తున్న కేంద్ర జలసంఘం రాష్ట్రానికి లేఖ రాసిందని, అందులో కొన్ని ప్రశ్నలు లేవనెత్తిందని పేర్కొన్నారు. మూడు రోజులుగా వాటిపై కసరత్తు చేస్తున్నామని, అన్ని ప్రశ్నలకూ సమాధానాలు కొలిక్కి వచ్చాయని, రెండు మూడు రోజుల్లో వాటిని కేంద్ర జలసంఘానికి నివేదిస్తామని వెల్లడించారు. ఆ లేఖ వెళ్లిన తర్వాత రెండు మూడు రోజులకు దిల్లీ వెళ్లి, కేంద్ర జలసంఘాన్ని సంప్రదించాలని భావిస్తున్నట్లు సాయిప్రసాద్ చెప్పారు. అక్కడే ఉండి వారి అనుమానాలన్నీ నివృత్తి చేసి వస్తామని చెప్పారు. పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు వల్ల ఎవరికీ నష్టం లేదని ప్రజలకు అర్థమయ్యేలా చెప్పాలని సీఎం సూచించారు. ఎగువ రాష్ట్రాలకు ఎలాంటి ఇబ్బందీ లేదని సాధికారికంగా ప్రజలకు అర్థమయ్యేలా వివరించాల్సి ఉందని ముఖ్యమంత్రి అధికారులకు తెలియజేశారు.

ఇవీ కేంద్ర జలసంఘం ప్రశ్నలు

వందేళ్లలో 75 సంవత్సరాల పాటు నీళ్లు అందుబాటులో ఉండే పరిస్థితుల్లో (75% విశ్వసనీయత) బనకచర్లకు 200 టీఎంసీల నీటి మళ్లింపునకు ఎంత అవకాశం ఉంటుంది? గోదావరి ట్రైబ్యునల్ అవార్డులో 75% విశ్వసనీయత వద్ద అన్ని రాష్ట్రాలూ నీటిని వాడుకుంటే పరిస్థితులు ఎలా ఉంటాయి? వరద జలాలను పోలవరం నుంచి ప్రకాశం బ్యారేజికి కాలువ ద్వారా 18 వేల క్యూసెక్కులు మళ్లించేందుకు ఎంతవరకు అవకాశం ఉంది? వరద జలాలను ఎలా లెక్కిస్తారు? ట్రైబ్యునల్ అవార్డుకు అనుగుణంగా అవి ఉన్నాయా? 200 టీఎంసీల గోదావరి జలాలు మళ్లించాలంటే.. ఆ స్థాయి వరద 129 రోజుల పాటు పోలవరం వద్ద అందుబాటులో ఉంటుందా? పోలవరం వద్ద వరద నీటి విడుదల లెక్కల ఆధారంగా గోదావరి ట్రైబ్యునల్ అవార్డును పరిగణనలోకి తీసుకుని పరిశీలించారా? ఆంధ్రప్రదేశ్‌లో జలవనరుల ప్రాజెక్టులు గోదావరి కింద అనుమతులు ఉన్నవి, లేనివీ, పూర్తయినవీ, నిర్మాణంలో ఉన్న వాటి వివరాలు, ప్రతిపాదిత నీటి వినియోగం గణాంకాలు సమర్పించాలి.

వ్యాప్కోస్‌తో చర్చలు: రాష్ట్రానికి హైడ్రాలజీ విషయంలో వ్యాప్కోస్ కన్సల్టెన్సీగా ఉంది. కేంద్ర జలసంఘానికి సమర్పించాల్సిన ముసాయిదా జవాబులను వ్యాప్కోస్ బృందం పరిశీలించి మంగళవారం నాటికి తమ సమాచారం ఇస్తామని అధికారులకు తెలియజేసింది. ఆ తర్వాత రెండు రోజుల్లో కేంద్ర జలసంఘానికి సమాధానాలు పంపనున్నారు.

తప్పిపోయిన బాలికపై ఆటో డ్రైవర్ అత్యాచారం

- **ఆదోనిలో ఘటన.. నిందితుడిపై పోక్సో కేసు**

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: తప్పిపోయిన బాలికకు మాయమాటలు చెప్పి.. ఆమెపై అత్యాచారానికి ఒడిగట్టాడు ఓ ఆటోడ్రైవర్. కర్నూలు జిల్లా ఆదోని పట్టణంలో చోటుచేసుకున్న ఈ ఘటనలో పోలీసులు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేశారు. తాలుకా సీఐ నల్లన్న వివరాల మేరకు.. ఆదోని డివిజన్‌లో ఇంటర్మీడియట్ చదువుతున్న బాలిక తల్లితో కలిసి ఈ నెల 4న ఎమ్మిగనూరుకు వచ్చారు. సాయంత్రం తిరిగి ఇంటికి వెళ్లే క్రమంలో బాలిక తప్పిపోయి.. ఆదోని పట్టణం బసవేశ్వర సర్కిల్‌కు చేరింది. అక్కడి నుంచి బస్టాండుకు వెళ్లేందుకు ఆదోని మండలం ఇస్వీ గ్రామానికి చెందిన రమేశ్ ఆటోను ఎక్కింది. బస్టాండుకు చేరుకునే సరికే రాత్రి కావడంతో.. ఇంటికి వెళ్లేందుకు బస్సులు ఉండవని, రాత్రికి ఇక్కడే ఉన్న తన అక్క ఇంట్లో ఉండొచ్చని రమేశ్ బాలికను నమ్మించాడు. అదే ఆటోలో ఆమెను పట్టణ శివారులోని ఓ వెంచర్‌లోకి తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. బాధితురాలు రోదించడంతో స్నేహితులతో కలిసి ఆదోనిలోని ఓ ప్రైవేటు లాడ్జ్‌లో వదిలేందుకు తీసుకెళ్లాడు. పోలీసుల అనుమతి ఉంటేనే చేర్చుకుంటామని నిర్వాహకులు చెప్పడంతో.. అనుమతి కోసమని నిందితుడు మూడో పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాడు. అక్కడ పోలీసులు అతని తీరును అనుమానించి, బాలికను ఆరా తీయగా అత్యాచారం ఘటన వెలుగులోకి వచ్చింది. వెంటనే నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు రమేశ్‌పై అత్యాచారం, పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు.

కలిసి ముందుకు సాగేందుకే చేతులు కలిపాం

(మొదటి పేజీ తరువాయి)

చేశారని, తమను కలిపారని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. 'మీకు విధాన సభలో బలం ఉండవచ్చు.. మాకు వీధుల్లో బలముంది' అని పేర్కొన్నారు. 'మేం కలిసి ముందుకు సాగడానికే ఒకటయ్యాం. ముంబయి స్థానిక, మహారాష్ట్ర ఎన్నికల్లో ఐక్యంగా పోటీ చేసి అధికారాన్ని కైవసం చేసుకుంటాం' అని 64 ఏళ్ల ఉద్ధవ్ ఉద్ఘాటించారు.

ఠాక్రే సోదరులది రుదాలీ సభ: ఫడణవీస్

ఠాక్రే సోదరుల సభను 'రుదాలీ' (సంతాపం తెలిపే వ్యక్తుల) సభగా మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ అభివర్ణించారు. తమ సోదరుల కలయికకు తానే కారణమన్నా రాజ్ ఠాక్రేకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. 'బాలాసాహెబ్ ఠాక్రే నన్ను తప్పక ఆశీర్వదించాలి. మీరు విజయోత్సవంగా నిర్వహించిన ర్యాలీ రుదాలీ ప్రసంగంగా మారింది' అని విరుచుకుపడ్డారు.

- ఠాక్రే సోదరుల ఉమ్మడి సభ రాజకీయ భవిష్యత్తు పునరుద్ధరణకు నిరాశతో కూడిన ప్రయత్నంగా భాజపా నాయకులు విమర్శలు కురిపించారు. విడిపోయిన కుటుంబం కలిసేందుకు ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంగా పేర్కొన్నారు.

రాజధానికి మలి విడతలో 34,964 ఎకరాల భూసమీకరణ

(మొదటి పేజీ తరువాయి)

- మందడంలో వివాంతా, హిల్టన్ హోటళ్లకు, తుళ్లూరులో హయత్ రీజెన్సీ, లింగాయపాలెంలోని నోవోటెల్‌కు ఇప్పటికే భూములు కేటాయించారు. వాటికి సమీపంలో కన్వెన్షన్ సెంటర్లు నిర్మిస్తారు.
- అంతర్జాతీయ విమానాశ్రయం లాంటి అవసరాలకు అమరావతి, పెదకూరపాడు, తుళ్లూరు మండలాల్లో 34,964 ఎకరాల భూములు సమీకరించేందుకు అథారిటీ ఆమోదం తెలిపింది. దానిలో మొదట 20,494 ఎకరాల సమీకరణకు నోటిఫికేషన్ జారీచేస్తారు.
- అమరావతిలో నిర్మాణ పనులకు వచ్చే రెండేళ్లలో 160 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుక అవసరమని అంచనా వేశారు. ఎస్ఎస్ఆర్ ధరల ప్రకారమే నిర్మాణ సంస్థలకు ఇసుక సరఫరా చేసేందుకు ప్రకాశం బ్యారేజీ ఎగువన పూడికతీత పనులు చేపట్టాలని నిర్ణయం. దీని కోసం రెండు కమిటీల ఏర్పాటు.
- అమరావతిలో మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు, అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక చిహ్నాలు ఏర్పాటుచేయాలని ముఖ్యమంత్రి ఆదేశం.
- అమరావతిలో సీఆర్‌డీఏ కార్యాలయ భవనం ఆగస్టు 15లోగా ప్రారంభం.

విమానాశ్రయంపై కేంద్రంతో సంప్రదించండి

అమరావతిలో అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణంపై కేంద్రంతో సంప్రదింపులు జరపాలని అధికారులకు ముఖ్యమంత్రి ఆదేశాలు జారీచేశారు. రాజధానిలో ఏ ప్రాజెక్టూ ఆలస్యం కావడానికి వీల్లేదని, కొత్తగా వచ్చే ప్రాజెక్టులకు వేగంగా అనుమతులివ్వాలని స్పష్టం చేశారు. నిర్మాణ పనులు సరిగ్గా చేయని సంస్థలకు నోటీసులిచ్చి వివరణ తీసుకోవాలన్నారు. గడువులోగా పనులు పూర్తిచేసేలా నిర్దేశించాలని తెలిపారు.

మండలం	గ్రామం	విస్తీర్ణం (ఎకరాల్లో)
అమరావతి	వైకుంఠపురం	3,361
"	పెదమద్దూరు	1,145
"	యండ్రాయి	2,166
"	కర్లపూడి, లేమల్లె	2,944
"	నెమలికల్లు	3,557
"	ఉంగుటూరు	2,552
"	లింగాపురం	1,452
"	నరుకుళ్లపాడు	2,324
పెదకూరపాడు	బలుసుపాడు	2,742
"	కంభంపాడు	1,843
తుళ్లూరు	వడ్డమాను	1,937
	హరిశ్చంద్రపురం	2,428
	పెదపరిమి	6,513

కిమ్స్ వైద్య కళాశాలకు 25 ఎకరాలు

రాజధానిలో వైద్య కళాశాల ఏర్పాటుకు కిమ్స్ సంస్థకు ప్రభుత్వం 25 ఎకరాలు కేటాయించింది. సీఎం అధ్యక్షతన శనివారం జరిగిన సీఆర్‌డీఏ సమావేశంలో.. రాజధానిలో ఏడు సంస్థలకు కొత్తగా 32.40 ఎకరాలు కేటాయించారు. భాజపా కార్యాలయానికి ఏడాదికి రూ.వెయ్యి లీజు చెల్లించే ప్రాతిపదికన 2 ఎకరాలు కేటాయించారు. 2014-19 మధ్య భూ కేటాయింపులు జరిగిన ఆరు సంస్థలకు చిన్నపాటి సవరణలతో కేటాయింపులు కొనసాగించారు. వాటిలో సీబీఐ, పుల్లెల గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీ, ఎంఎస్‌కే ప్రసాద్ ఇంటర్నేషనల్ క్రికెట్ అకాడమీ వంటి సంస్థలు ఉన్నాయి. గెయిల్‌కి, అంబికా సంస్థకు గతంలో చేసిన కేటాయింపుల్ని రద్దుచేశారు.

కేటాయింపుల వివరాలు https://epaper.eenadu.netలో

జిల్లా మండలం	గ్రామాలు	ఆర్ఎస్ఆర్ ప్రకారం	విస్తీర్ణం(ఎకరాల్లో)	పట్టాభూమి	ప్రభుత్వభూమి	ఎసైన్డ్	ఇనాం	సర్వీస్ ఇనాం	దేవాదాయ భూమి
పల్నాడు	అమరావతి	8	19,501	14,165	3,059	191	1,347	550	175
పల్నాడు	పెదకూరపాడు	2	4,585	3,683	435	85	154	110	118
గుంటూరు	తుళ్లూరు	3	10,878	8,521.5	1,713.42	119.26	0	0	506.3
మొత్తం		13	34,964	26,369.5	5,207.42	395.26	1,501	660	799.3

జారిపడి ఏనుగు మృతి

కల్లూరు, న్యూస్‌టుడే: చెరువు కట్ట ఎక్కే ప్రయత్నంలో ఓ ఆడ ఏనుగు జారిపడి మృతి చెందింది. ఈ ఘటన చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలం పూరేడువారిపల్లెలో శనివారం చోటుచేసుకుంది. డీఎఫ్‌వో భరణి వివరాల ప్రకారం.. ఏనుగుల గుంపు మండలంలోని పాతపేట, చల్లావారిపల్లె పరిసర ప్రాంతాల్లో సంచరిస్తూ పూరేడువారిపల్లె పొలాల్లోకి చేరుకుంది. సమీపంలో ఉన్న చెరువు కట్ట ఎక్కే క్రమంలో సుమారు 20 ఏళ్ల వయస్సు ఉన్న ఆడ ఏనుగు జారి కింద పడి అక్కడికక్కడే మృతి చెందింది. మృతి చెందిన ఏనుగు రెండు నెలల కిందట ఏనుగు పిల్లకు జన్మనిచ్చిందని.. వారం రోజులుగా మామిడి కాయలు ఎక్కువగా తినడంతో జీర్ణం కాక అనారోగ్యానికి గురై మృతి చెందిందని తిరుపతి జూ పార్కు వైద్యాధికారి అరుణ్, కల్లూరు పశుసంవర్ధక శాఖ వైద్యాధికారి ప్రదీప్‌కుమార్ నిర్ధారించారు. ఏనుగు కళేబరానికి అక్కడే పోస్టుమార్టం నిర్వహించి ఖననం చేశారు.

మా బడికి రండి!

(మొదటి పేజీ తరువాయి)

ఈ నెల 10న బడిలో జరిగే మెగా పేరెంట్స్ మీట్‌కు రావాలని కోరారు. తల్లికి వందనం, డొక్కా సీతమ్మ పేరుతో మెనూలో మార్పులు చేసి సన్నబియ్యంతో భోజనం, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ పేరుతో విద్యామిత్ర కిట్లు తదితర పథకాలు అమలు చేయడం ఆనందకరమని ముఖ్యమంత్రికి 20 మంది, డిప్యూటీ సీఎంకు 13 మంది, విద్యాశాఖ మంత్రి లోకేశ్‌కు 10 మంది ఉత్తరాలు రాశారు. డీఈవో, ఏపీసీ, ఎంఈవోలకు 10 మంది, పాఠశాలలో మౌలిక వసతులు కల్పించినందుకు స్థానిక ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణకు ఏడుగురు లేఖలు రాశారు. ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు కూడా పోస్టుకార్డులు రాయడానికి ముందుకు వస్తున్నారని పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు ఎన్‌వీవీ సత్యనారాయణ తెలిపారు.

ఎస్‌బీఐతో ఆర్థిక శాఖ ఒప్పందం

ఈనాడు, అమరావతి: ఎస్‌జీఎస్‌పీ కింద ఉద్యోగులకు సౌకర్యాలు కల్పించేందుకు ఎస్‌బీఐతో ఆర్థిక శాఖ ఒప్పందం కుదుర్చుకుంది. దీంతో ఆ బ్యాంకులో జీతాల ఖాతా ఉన్న ప్రభుత్వ ఉద్యోగులకు లభించే సౌకర్యాలను పేర్కొంటూ ఆర్థిక శాఖ సర్క్యులర్ జారీ చేసింది. ఏదైనా ప్రమాదం జరిగి మృతి చెందినా, శాశ్వత అంగవైకల్యం ఏర్పడినా రూ.కోటి వరకు, పాక్షికంగా వైకల్యం ఏర్పడితే రూ.80 లక్షల వరకు బీమా వర్తిస్తుంది. గ్రూపు టర్మ్ జీవిత బీమా రూ.10 లక్షలు ఉంటుంది. ఈ సదుపాయాలు లభించేందుకు నెల వారీ జీతాల ఆధారంగా ఖాతాలను రోడియం, ప్లాటినం, డైమండ్, గోల్డ్, సిల్వర్‌లుగా విభజించింది. లాకర్ ఛార్జీల్లో రోడియం, ప్లాటినం, డైమండ్ వారికి 50 శాతం రాయితీ, మిగితా వారికి ఉచితంగా అందిస్తుంది. ప్రతి నెలా 25 పేజీల చెక్‌బుక్‌ను ఉచితంగా ఇస్తుంది. ఖాతాల్లో కనీస నిల్వ నిర్వహించాల్సిన అవసరం లేదు. ఇందుకోసం ఉద్యోగులు ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది.

వర్షం.. గాడి తప్పుతోంది!

(మొదటి పేజీ తరువాయి)

కావాల్సిన వర్షపాతం ముందుగానే వేసవిలో నమోదైంది.

రోజుకు సగటున 6.5 సెంటీమీటర్లకు పైగా వర్షం..


- వాతావరణంలో తేమ శాతం పెరగడంతో ప్రపంచవ్యాప్తంగా తరచూ తక్కువ సమయంలో ఎక్కువ వర్షపాతం నమోదవుతోంది. ఉదాహరణకు నైరుతిలో మధ్య భారతంలో 1950-2015 మధ్యలో సగటున రోజుకు 150 మిల్లీమీటర్ల కంటే ఎక్కువ వర్షం కురిసిన సందర్భాలు 75 శాతం మేర పెరిగాయి. కరవు ప్రాంతాలైన రాజస్థాన్, గుజరాత్‌లో వర్షపాతం గణనీయంగా పెరుగుతోంది. కొద్దిరోజులుగా గుజరాత్‌లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. తరచూ వరదలు సంభవిస్తున్నాయి.
- జిల్లాల వారీగానూ వార్షిక వర్షపాతంలో గణనీయమైన మార్పులు కనిపిస్తున్నాయి. సౌరాష్ట్ర, కచ్, రాజస్థాన్‌లోని ఆగ్నేయ ప్రాంతాలు, తమిళనాడులో ఉత్తర, ఏపీలోని ఉత్తరాంధ్ర, నైరుతి ఒడిశా, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, పశ్చిమబెంగాల్, మణిపుర్, మిజోరం, కొంకణ్, గోవా, ఉత్తరాఖండ్‌లలో నైరుతిలో రోజుకు సగటున 6.5 సెంటీమీటర్ల కంటే ఎక్కువ వర్షం కురిసింది.
- గత 30 ఏళ్లలో వార్షిక వర్షపాతంలో ఉత్తర్‌ప్రదేశ్, బిహార్, మేఘాలయ, పశ్చిమబెంగాల్, నాగాలాండ్, అరుణాచల్‌ప్రదేశ్, హిమాచల్‌ప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో గణనీయమైన తగ్గుదల కనిపించింది.

తెలుగు రాష్ట్రాల్లో ఇలా..

నైరుతిలో ఆంధ్రప్రదేశ్‌లోని ఉమ్మడి అనంతపురం, కృష్ణా, పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి, విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాల్లో వర్షాలు పెరుగుతున్నాయి. కర్నూలు, చిత్తూరు, వైఎస్సార్ కడప, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు, ప్రకాశం, గుంటూరు, విజయనగరం జిల్లాల్లో వర్షపాతం తగ్గుతోంది. 1995-2014 డేటా ప్రకారం తెలంగాణలోని ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల్లో ఎక్కువ రోజులు వర్షాలు కురుస్తుండగా.. దక్షిణ తెలంగాణలో ఆ రోజులు తగ్గుతున్నాయి. నైరుతి సీజన్‌లో 2015-24 మధ్య కాలంలో దక్షిణ తెలంగాణ జిల్లాల్లో వర్షాలు కురిసే రోజుల సంఖ్య పెరిగింది. ఆ పెరుగుదల సగటున 6-10 రోజుల వరకూ ఉంటోంది. ఈశాన్య జిల్లాల్లో ఓ మోస్తరు వర్షాలు కురిసే రోజుల సంఖ్య 16-20 మధ్య ఉంది. దక్షిణ జిల్లాల్లో ఆ సంఖ్య 6-8 రోజులు మాత్రమే. ఉత్తర, తూర్పు జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసిన రోజులు గణనీయంగా పెరిగాయి.

వ్యవసాయ, ఇతర రంగాల్లో ప్రణాళిక సరిచేసుకోవాలి

–కేజే రమేశ్, పూర్వ డైరెక్టర్ జనరల్, ఐఎండీ



ప్రస్తుత పరిస్థితుల ప్రకారం దేశవ్యాప్త సగటు వర్షపాతం క్రమంగా పెరుగుతోందని అంచనా. దేశంలో వరదల ముప్పు ఎక్కువగా పొంచిఉన్న (వల్నరబులిటీ) రాష్ట్రాల్లో అస్సాం మొదటి స్థానంలో ఉంది. ఆ జాబితాలో తెలుగు రాష్ట్రాలు రెండో స్థానంలో ఉన్నాయి. గత నాలుగు దశాబ్దాల్లో ఏపీ, తెలంగాణ రాష్ట్రాలు రెండో స్థానానికి రావడం ఇదే తొలిసారి. మూడో స్థానంలో కర్ణాటక, నాలుగో స్థానంలో మహారాష్ట్ర ఉన్నాయి. మరోవైపు గత నాలుగు దశాబ్దాలుగా తెలంగాణ, ఉత్తర కోస్తా (ఏపీ)లో వర్షాలు కురవడం, తక్కువ సమయంలో ఎక్కువ వర్షపాతం సంభవించడం వంటి ఘటనలు భారీగా పెరుగుతున్నాయి. ఈ పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయ, ఇతర రంగాల్లో ప్రణాళిక సరిచేసుకోవాలి.

ఈనాడు

ఇంతవాడు ఇంతకు అంతై...

మనిషి పెరిగితే చాలదు- ఎదగాలి. పెరిగితే ముసలాళ్లవుతారు. ఎదిగితే ఉన్నత వ్యక్తులవుతారు. పెరగడం సర్వసహజం. ఎదగడం గర్వకారణం. ఎదిగేవారు ఎన్నుకునే మార్గాలు విభిన్నంగా ఉంటాయన్నారు- వ్యక్తిత్వ వికాస నిపుణులు శివ్‌ఖేరా. 'అందరం చేసే పనులనే వారూ చేస్తారు- కాకపోతే మనకన్నా విభిన్నంగా' అనే వాక్యాన్ని తన ప్రసిద్ధగ్రంథం 'యు కెన్ విన్' అట్టమీద ప్రముఖంగా ప్రకటించారు. అలాంటి విజేతల ఆలోచనల్లో ఓ గొప్పదనం తోస్తుంది. షార్జాలో క్రికెట్ పోటీ హోరాహోరీగా సాగుతోంది. ఇంతలో ఇసుక తుపాన్ రేగి ఆట ఆగిపోయింది. సమయాభావంతో ఆటను కుదించారు. కొద్ది బంతుల్లోనే పెద్ద లక్ష్యాన్ని నిర్దేశించారు. ప్రారంభం అయ్యేముందు సచిన్ నేరుగా అంపైర్ల దగ్గరకు వెళ్లాడు. 'నా దేశం గెలవాలంటే ఇంకా ఎన్ని పరుగులు సాధించాలి' అని అడిగాడు... తానే చేసితీరాలన్న సంకల్పంతో! వ్యాఖ్యాత హర్షాభోగ్లే గమనించాడు. 'నీ ఆటకు పరిమితులు ఏంటి' అని అడిగాడు. 'ఒక బంతికి ఏడు పరుగులు సాధించలేకపోవడం' అన్నాడు సచిన్. 'థింక్ బిగ్' అనే ఆంగ్లసూక్తికి అర్థమది. 'నా దేశపు జెండాకున్నంత పొగరు' అన్న శేషేంద్ర భావనకు అక్షర రూపమది!

'నాకెందుకులే' అనేది ఈ జాతిని పట్టిపీడించే సామాజిక రుగ్మత. ప్రమాదానికి గురైనవాడు పసివాడైనాసరే, నేలపైపడి రక్తం ఓడుతుంటే- పట్టించుకోని వారే మనలో ఎక్కువ. అందుకే దేశ ప్రతిష్ఠను తన భుజాలపైకి తీసుకోవాలనే సచిన్ ఆలోచనలోని ఔన్నత్యం చాలామందికి అర్థంకాదు. 'తనకంటె ఇతరమైనను- మనకెందుకులే యటంచు మానుట యొకటిన్, తనదాక వచ్చినప్పుడు- మన కర్మములే యటంచు మానుట యొకటిన్' ఈ జాతి బలహీనతలన్నారు కల్పవృక్షం మారీచఖండంలో విశ్వనాథ. ఆ నిర్లిప్తత మనలోని విజయకాంక్షను, జీవితేచ్ఛను చంపేస్తుంది. కసి అణగారిపోయేలా చేస్తుంది. దాంతో వ్యక్తిగా ఎదగక మునుపే ముసలాళ్లయిపోతాం. 'సాధనమున పనులు సమకూరు ధరలోన...' అన్న వేమన సూక్తిని మర్చిపోతాం. ఎవరో వస్తారని ఏదో చేస్తారని ఎదురుచూస్తూ జీవితాన్ని గడిపేస్తాం. 'ఏడుస్తున్నావెందుకయ్యా అంటే ఏరోజు నవ్వాను గనుక' అంటూ బతుకు బండిని ఈడ్చేవారిలో మనమూ ఒకరవుతాం.

అది కార్యసాధకుడి లక్షణం కాదు. భీష్ముడికో ధర్మజుడికో కాకుండా అర్జునుడొక్కడికే గీతోపదేశం దక్కే పక్షంలో- ఆ అర్జునుడు తానే కావాలనుకోవడం ధీమంతుల స్వభావం. అది విజేతల ఆలోచన. అలా అనుకోబట్టే సచిన్ ఆరోజు భారతదేశాన్ని గెలిపించాడు. కార్యసాధకులు 'ఇది నాకెందుకులే' అని గాని, 'నా కర్మకొద్దీ...' అనుకుని గాని కర్తవ్యాన్ని ఉపేక్షించరు; 'ఆపదలందు ధైర్యగుణం... వంటివి ప్రకృతిసిద్ధ గుణంబులు సజ్జనాళికిన్' అని భర్తృహరి స్పష్టం చేశాడు. ఆ తరహా ధైర్యశాలి గుంటూరుకు చెందిన యశ్వంత్! బతుకుతెరువైన టిఫిన్‌బండిని రోడ్డు విస్తరణకోసం అధికారులు తొలగిస్తే యశ్వంత్ కుంగిపోలేదు. యంత్రాంగాన్నో, వ్యవస్థనో తిట్టుకుంటూ కూర్చోలేదు. చనిపోవాలనుకున్న తల్లిని ఓదార్చి, ధైర్యంగా ముందుకువచ్చి, జరిగిన అన్యాయాన్ని కలెక్టర్‌కు స్పష్టంగా వివరించాడు. జీవనోపాధిని తిరిగి దక్కించుకున్నాడు. కార్యసాధకుడు అనిపించుకున్నాడు. ఇంతా చేసిన యశ్వంత్ వయసు కేవలం 8 ఏళ్లు. 'బాలుండీతడు, కొండ(బాధ్యత) దొడ్డది, మహా భారంబు నైరింపగా జాలండో...' అంటూ భయపడవద్దని చెప్పిన బాలకృష్ణుడిలా, మరో సచిన్‌లా తాను గెలిచి తనవారిని గెలిపించాడు. ఇంటింటా పిల్లలను చైతన్యవంతుల్ని చేసే పాఠాలను ఉగ్గుపాలలో ఎలా రంగరించాలో తన చేతల్లో చూపించాడు.



మానసిక అశాంతితో అల్లాడుతున్న మనిషి పట్టపగలు కూడా దారితప్పుతాడు. అదే శాంతంగా మనోనిబ్బరంతో ఉండే వ్యక్తి చిమ్మచీకట్లోనూ తన దారిన తాను వెళ్లగలడు.

– లక్ష్మీబాయి కేల్కర్, సంఘ సంస్కర్త

తొలి ఏకాదశి

సృష్టి విషయంలో బ్రహ్మదేవుడికి భూలోకంలోని అమ్మలు సాయం చేస్తారు. అయితే ఒకప్పుడు రాక్షస సంహార విషయంలో విష్ణువుకు ఓ అమ్మాయి సహాయం చేసిన వైనాన్ని భవిష్యోత్తర పురాణం వివరించింది. ఆ అమ్మాయి పేరే ఏకాదశి!

అది కృతయుగం నాటి మాట. తాళజంఘుడి కొడుకు మురాసురుడు చాలా బలవంతుడు. దేవతలతో సహా జీవులందరినీ నిరంతరం వేధించడమే వాడి పని. దిక్కుతోచని పీడితులంతా చేరి, విష్ణువుకు మొరపెట్టుకున్నారు. విష్ణువు మురాసురుడితో యుద్ధానికి దిగాడు. ఏళ్ల తరబడి పోరాడినా... మహా వరబల సంపన్నుడైన మురుణ్ని ఆయన అంతమొందించలేకపోయాడు. అలసటతో సింహవతి అనే గుహలో దాగిన సమయంలో విష్ణువు సంకల్పంలోంచి ఏకాదశి అనే స్త్రీ ఆవిర్భవించింది. పుడుతూనే వీరావేశంతో రాక్షసుడిపై దండెత్తి వాణ్ని తుదముట్టించింది. మురాసుర సంహారంలో ఏకాదశి ప్రదర్శించిన సాహసానికి సంతసించిన శ్రీహరి వరం కోరుకొమ్మన్నాడు. 'ఎల్లకాలం నీకు ప్రియమైనదానిగా ఉండాలి' అని కోరింది ఏకాదశి. విష్ణువు అంగీకరించాడు. ఏకాదశికి 'హరిప్రియ' అనే పేరొచ్చింది. తన పేరుతో ఒక పుణ్యతిథి ఏర్పడాలని, ఆనాడు హరి సంకీర్తనలో మునిగి, ఉపవాసం ఉండే భక్తులకు పుణ్యగతులు సిద్ధించాలన్న ఆమె కోరికను విష్ణువు మన్నించాడు. అదే మనకు వరమైంది. ఏకాదశి రోజున ఉపవాస, హరి ఉపాసనాది ప్రత్యేక విధులు ఆచారాలుగా స్థిరపడ్డాయి.



నిజానికి మురాసురుడు- మనలోని హింసాత్మక ప్రవృత్తికి, దురాచార ప్రీతికి, దుర్మార్గపు ఆలోచనలకు ప్రతీక. వాటిని అంతమొందించడానికే ఉపవాసాది విధులు నిర్దేశించింది. ఏకాదశిని మనలోకి ఆవాహన చేసుకుంటాం. అరిని (మనలోని శత్రువులను) జయించేందుకు హరిని ఆశ్రయించేలా చేస్తోంది కాబట్టే- ఏకాదశిని 'హరివాసరం' అన్నారు. ఏకాదశి వ్రత విధానాలను, ద్వాదశి పారణలను ఎందరో పాటిస్తున్నారు. ఆరోగ్యం, వృద్ధాప్యం లేదా మరే కారణం వల్లనైనా ఉపవాసం లేకపోవడం... పెద్ద లోపం కాదు. కారణాలతో దూరంగా ఉన్నవారూ- కనీసం శ్రీహరికి దగ్గరగా ఉండే ప్రయత్నం చేయాలి.

ఏకాదశి పూట ఓ చిన్నారి గుళ్లో దేవుడి దగ్గర కూర్చొని ఏవేవో మాటలు వల్లించడం విని, 'నీకు మంత్రాలొచ్చా?' అని అడిగాడు పూజారి. దానికా పాప 'నాకు అ ఆ ల నుంచి ఱ ర ల వ ల దాకా వచ్చు. ఏకాదశి అంటే 11 కదా! కాబట్టి నాకు వచ్చినవాటినే 11 సార్లు చెబుతా- నీకిష్టమైన మంత్రాలో శ్లోకాలో పద్యాలో నువ్వే రాసుకోమని దేవుడికి చెబుతున్నాను. నువ్వు మా తాతయ్య చెప్పారు' అంది. ఉపవాసమనే మాటకు అదీ అర్థం. దైవానికి సమీపంగా ఉండటమే ఉపవాసం. ఆ పాప చేసిందదే. కాబట్టే ఆ పాప తప్పక 'హరిప్రియ' అవుతుందనడంలో ఏమాత్రం సందేహం లేదు.

నీటిలో మునిగితే- అది స్నానం. నీలో మునిగితే- అది ధ్యానం! ఆకలిదప్పులు తోచనంతగా హరినామ స్మరణంలో, ధ్యానంలో మునిగిపోవడమే తొలి ఏకాదశి నాటి కర్తవ్యం. అప్పుడది నిజమైన హరివాసరం!

అంతర్యామి


– ఎర్రాప్రగడ రామకృష్ణ

మన కథలకేమి తక్కువ!?



సాహితీ ప్రియులు, ముఖ్యంగా కథాపాఠకులకు, మే నెలలో ఒక సంతోషకరమైన వార్త వచ్చింది... కన్నడ కథారచయిత్రి బాను ముష్తాక్‌కు ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ బుకర్ బహుమతిని ప్రకటించారని! అలా దక్షిణ భారత దేశ భాషకు మొదటిసారి బుకర్ బహుమతి లభించడం అందరికీ సంతోషం కలిగించింది. మన తెలుగులోనూ మంచి కథలెన్నో వస్తునప్పటికీ జాతీయ, అంతర్జాతీయ గుర్తింపును నోచుకోలేకపోవడానికి కారణమేంటి?

తెలుగు కథ పుట్టినప్పటి నుంచి 2014 వరకు లక్షకుపైగా కథలు వచ్చాయని ఒక అంచనా. కథలను బాగా అనుసరించే నిపుణుల ప్రకారం, ప్రస్తుతం ఏటా తెలుగులో రెండున్నర వేల నుంచి మూడు వేలవరకు కథలు వస్తున్నాయి. ఆర్థిక వనరులు అందుబాటులో ఉన్న వారు, లేదా ఇతర సంస్థల నుంచి కానీ, ప్రైవేటు దాతల నుంచి ఆర్థిక సాయాన్ని ఏర్పాటు చేసుకున్న రచయితలు కథా సంకలనాలను ప్రచురించుకుంటున్నారు. 'కథా సాహితి' అనే సంస్థ ప్రతిఏటా సుమారుగా 15 ఉత్తమకథలతో 'కథ' శీర్షికతో క్రమంతప్పకుండా సంకలనాలను తెస్తోంది. కథా సాగర్, ఉత్తమ వంద కథలు, తెలంగాణ కథలు... ఇట్లా మరికొన్ని సంకలనాలు కూడా శ్రేష్ఠ కథలతో చదువరుల ముందుకు వస్తూనే ఉన్నాయి. అయితే ఈ గొప్ప కథలన్నీ, ఏవో కొన్ని తప్ప, రెండు తెలుగు రాష్ట్రాల సరిహద్దులను దాటలేకపోతున్నాయి.



అనువాదకుల కొరత


ఒక మంచికథ హిందీలోకి వెళ్తే, అది అక్కడి పాఠకులకు చేరడంతో పాటు ఇతర భాషల్లోకి అనువాదమయ్యే అవకాశాలు బాగా పెరుగుతాయి. అలాగే ఇంగ్లిష్‌లోకి కథ వెళ్తే, దేశ సరిహద్దులను కూడా దాటుతుంది. ఈ మాటలు అనడం సులభమే కానీ, ఈ పనులు ఒక క్రమపద్ధతిలో ప్రతి ఏటా జరగాలంటే అంత సులువుగా అయ్యే పని కాదు. గొప్ప తెలుగు కథలను ఇతర భాషల్లో (ప్రధానంగా ఇంగ్లిష్, హిందీ) చూడాలనుకుంటే సరైన అనువాదకులు దొరకడం అతి కష్టం. కథకులు ప్రామాణిక భాష వాడితే అనువాదకులకు కష్టం తగ్గుతుంది. అదే రచయితలు మాండలికాల్లో రాస్తే, అనువాదకులు మరో ప్రాంతంవారైతే అనువాదాలు కుంటుపడతాయి. కొన్నేళ్లుగా మాండలికాల్లో కథలు పెద్ద సంఖ్యలో వస్తున్నాయి. ఒక్కోసారి రచయిత వాడే పదాలు చుట్టుపక్కల జిల్లాల వారికీ వెంటనే అర్థం కావు. ఇలాంటి పరిస్థితుల్లో కథలను అనువదించాలనుకునే వారికి సమయం పడుతుంది. రచయిత-అనువాదకుడు పరస్పరం మాట్లాడుకోవడం తప్పనిసరి. వేగమే వేదమైన ఈ రోజుల్లో సరైన సమయం వెచ్చించకుండా, మాండలిక పదాల మూలార్థాలను పట్టుకోకుండా తొందరపాటుతో అనువదిస్తే- పేలవంగా ఉండే అనువాదాలు బయటకొస్తాయి. మూల కథల సొగసులు దెబ్బతినే ప్రమాదం కలుగుతుంది. కాబట్టి అనువాదకుణ్ని నిర్ణయించే ముందు మూల రచయితలు ఎన్నో జాగ్రత్తలు తీసుకొంటేనే ఉత్తమ అనువాదాలు వెలువడుతాయి. పురస్కారాలు, బహుమానాలకు అర్హత సాధిస్తాయి. సాహితీరంగంలో పేరుప్రఖ్యాతులను తీసుకొస్తాయి. చివరగా తెలుగు కథల సత్తా బయటివారికి తెలుస్తుంది. ఇలాంటి ప్రయత్నాలు గతంలో కొన్ని జరిగాయి. తెలుగుకు అవి మంచి గుర్తింపునూ తెచ్చిపెట్టాయి. కానీ, అవి కొందరు వ్యక్తుల చొరవ, పట్టుదలతోనే సాధ్యమయ్యాయి.

దిల్లీలోని 'కథ' అనే స్వచ్ఛంద సేవాసంస్థ ప్రాంతీయ భాషల్లో వచ్చిన గొప్ప కథలను ఇంగ్లిష్‌లోకి అనువాదాలు చేయించేది. 'కథ- ప్రైజ్ స్టోరీస్' అనే పేరుతో 1990లో ఆరంభించి తొమ్మిది సంపుటాలను తీసుకొచ్చింది. ఈ సంస్థ స్థాపకురాలు గీత ధర్మరాజనే ఆ సంపుటాలకు సంపాదకురాలిగా పనిచేశారు. ఈ పుస్తకాలకు బహుళ ప్రాచుర్యం లభించింది. మంచి సమీక్షలు రావడంతో ఆ సంపుటాలు విదేశాలకూ వెళ్లాయి. మన దేశంలోని వివిధ రాష్ట్రాల గొప్ప కథలు ఇంగ్లిష్ పాఠకుల చెంతకు చేరాయి. ఒక స్వచ్ఛంద సంస్థ బృహత్తరంగా చేపట్టిన ఈ యజ్ఞం పుణ్యమా అని ప్రాంతీయ భాషలో వచ్చిన కథలకు మహత్తర అవకాశం దొరికింది. ఆనాడు ఆ సంపుటాల్లో తెలుగు కథలకూ చోటు లభించింది.

దిల్లీలోని శ్రీవేంకటేశ్వర కాలేజీలో ఆంగ్లోపన్యాసకుడిగా పనిచేసిన డాక్టర్ రంగారావు 1990వ దశాబ్ది ఆరంభంలో ఒక గొప్ప పనికి శ్రీకారం చుట్టారు. తెలుగునాట మూడు ప్రాంతాల నుంచి వచ్చిన, బాగా ప్రాచుర్యం పొందిన కథలను ఎంపిక చేసి ఇంగ్లిష్‌లోకి అనువదించారు. దిల్లీలో ఉంటున్న సాహితీప్రియులను ముఖ్యంగా మూడు ప్రాంతాలవారిని కలిసి ప్రాంతీయ పదాలు, మాండలికాల గురించి చర్చించి, బాగా అర్థం చేసుకుని మూలకథల అందం దెబ్బ తినకుండా ఇంగ్లిష్‌లోకి అనువదించేందుకు విశేషమైన కృషిచేశారు. ప్రాంతీయతతో పాటు సామాజిక రాజకీయ ఆర్థిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని సమతుల్యాన్ని పాటిస్తూ... అనువాదకుడిగా, సంపాదకుడిగా ద్వంద్వ బాధ్యతలను రంగారావు ఓర్పు నేర్పులతో నిర్వర్తించారు. అలా ఆయన రూపొందించిన సంకలనాన్ని 'క్లాసిక్ తెలుగు షార్ట్ స్టోరీస్' పేరిట 1995లో పెంగ్విన్ బుక్స్ ప్రచురించింది. ఆ పుస్తకానికి మంచి పేరు వచ్చింది.

ప్రభుత్వాలు ప్రోత్సహించాలి

మన కథలకు జాతీయ, అంతర్జాతీయ స్థాయుల్లో ప్రాచుర్యం రావాలంటే రెండు తెలుగు రాష్ట్ర ప్రభుత్వాల మద్దతు, దీర్ఘకాలిక ఆర్థిక వనరుల అమరికలు తప్పనిసరి. తెలుగు కథా ప్రపంచంలో గొప్ప కథలున్నాయి. వాటిని అనువదించి సరిహద్దులు దాటించాలి. ప్రామాణిక అనువాదాలు లేకపోవడం వల్ల మన రచనలకు గుర్తింపులను, అంతర్జాతీయ బహుమతులను అందుకోలేక పోతున్నాం. సమకాలీన సాహితీ జగత్తు తీరుతెన్నులను అధ్యయనం చేసి, కొత్త దృక్కోణాలతో విశ్లేషించి కథకుల సృజనాత్మక ఉత్పత్తులను ఇంటి గడపల్ని దాటించేందుకు ఒక చురుకైన యంత్రాంగాన్ని నెలకొల్పాలి. తెలుగు అకాడమీలు, సారస్వత పరిషత్తులు ఇందుకు కసరత్తు చేయాలి. రచయితలతో, అనువాదకులతో, ప్రచురణకర్తలతో, ఇంకా సంబంధిత సంస్థలతో, నిపుణులతో కార్యశాలలు నిర్వహించాలి. తెలుగు కథల అనువాదాలకోసం ప్రత్యేక ప్రాజెక్టు చేపట్టాలి. వీలైనంత త్వరగా ఆ పనిని మొదలుపెట్టాలి!




డాక్టర్ టి.సంపత్ కుమార్
కథా రచయిత, దిల్లీలోని కెనడియన్ హైకమిషన్‌లో మాజీ సీనియర్ సలహాదారు

మెచ్చేలా కాదు... నచ్చేలా బతుకు!

అందరికీ నచ్చేలా, అందరూ మెచ్చేలా కనిపించాలనుకోవడం నేటి ట్రెండ్. అలాంటప్పుడు మనల్ని ఎవరూ ఇష్టపడకపోయినా పర్వాలేదు, మనం మనలాగే జీవించవచ్చు- అనుకోగల సాహసం ఎవరికైనా ఉంటుందా? కానీ అదే ఉండాలంటున్నారు జపనీస్ రచయిత ఇచీరో కిషిమి. మరో రచయిత ఫుమితకె కోగాతో కలిసి ఆయన రాసిన పుస్తకమే 'ద కరేజ్ టు బి డిజ్‌లైక్డ్'. జపాన్ అనగానే మనకు ఇకిగాయ్, కైజెన్ లాంటి కాన్సెప్టులు గుర్తొస్తాయి. కానీ పుష్కరం క్రితం వచ్చిన ఈ పుస్తకం పలుదేశాల్లో బెస్ట్‌సెల్లర్ అయ్యింది. అడ్లరియన్ (ఫ్రాయిడ్‌లాగే మనస్తత్వశాస్త్ర సిద్ధాంతకర్తల్లో ఒకరు అడ్లర్) సైకాలజీ నిపుణుడు కిషిమి. తల్లిదండ్రుల సంరక్షణలో, తన గుండెజబ్బుకు చికిత్స పొందుతూ చాలాకాలం చదువుతూ, రాస్తూ గడిపారు. ఆ అనుభవాలు ఆయనకు జీవితం పట్ల స్పష్టమైన అవగాహనను కల్పించాయి.

'ద కరేజ్ టు బి డిజ్‌లైక్డ్' అనేది ఒక తత్వవేత్త, ఒక యువకుడి మధ్య అయిదు రాత్రుల పాటు జరిగే సంభాషణ. మొదటి రాత్రి అంశం- ట్రామా. ఏ ఒక్క అనుభవమో మన విజయానికీ లేదా వైఫల్యానికీ కారణం కానే కాదంటారు. గతం మన వర్తమానాన్నీ శాసిస్తోందంటే నిజానికి దాన్నుంచి బయటపడటం మనకే ఇష్టంలేక దాన్ని సాకుగా చూపుతున్నామంటారు. సమస్యలన్నీ వ్యక్తిగతంగా తమతో తమకు, ఇతరులతో తమకు... ఉండే సంబంధాల వల్లే వస్తాయన్నది రెండో రాత్రి చర్చించిన అంశం. సమాజం మనల్ని మెచ్చాలనుకునే ముందు బలాలూ బలహీనతలతో సహా మనల్ని మనం అంగీకరించడం నేర్చుకోవాలి. మూడో రాత్రి చర్చించిన మరో ముఖ్యమైన అంశం- అందరూ మనల్ని ఇష్టపడాలనుకోవడం. అందుకుగాను తమను తామే మార్చేసుకుంటారు చాలామంది. నిజానికి మనల్ని మెచ్చుకోవాలన్న ఆ ఒక్క విషయాన్నీ వదిలేయగలిగితే అసలైన సంతోషం ఏంటో తెలుస్తుందనీ, ప్రశాంతంగా బతకొచ్చనీ అంటారు రచయిత. అందుకు ఆయన చెప్పే పరిష్కారం చాలా సింపుల్. ఏ పని ఎవరిదో వారే చేయడం. పిల్లాడు హోంవర్క్ చేయలేకపోతున్నాడని సగం మనమే రాసేయడం సబబు కాదు. హోంవర్క్ వల్ల లాభం పిల్లాడికే. అది అతడికి తెలిసేలా చేసి, హోంవర్క్ ఎలా చేయాలో గైడ్ చేయడం వరకే తల్లిదండ్రుల పని. నాలుగో రోజు నేటి యువతరం ఎదుర్కొంటున్న ఒంటరితనం గురించి చర్చిస్తూ జపనీయుల సంస్కృతిని గుర్తుచేస్తారు. ప్రతి మనిషీ ఒంటరే కానీ, నేను అన్న పరిధి దాటి ఆలోచిస్తే చుట్టూ ఉన్న సమాజం మనదేనంటారు. అయిదో రాత్రి విషయం... వర్తమానంలో జీవించడం. ఇతరులను మనకన్నా ఎక్కువగానో, తక్కువగానో భావించకుండా మనతో సమానంగా భావిస్తే ప్రశంసల్నీ తిరస్కారాల్నీ పట్టించుకోమనీ అప్పుడు ఆటోమేటిగ్గా మనకా కరేజ్ టు బి డిజ్‌లైక్డ్ వచ్చేస్తుందంటారు. అదే మనల్ని సంతోషంగా ఉంచుతుందంటారు.



వీటన్నిటినీ ఒకదాంతో మరొకదాన్ని అనుసంధానం చేసుకుంటూ మనసు పెట్టి ఆలోచిస్తే హ్యాపీలైఫ్‌కి సీక్రెట్ తెలిసిపోతుందంటున్నారు ఈ జపనీస్ రచయితలు. బయటికి కనిపించే విజయాలమీదే ఫోకస్ చేసే పలు సెల్ఫ్‌హెల్ప్ బుక్స్‌లా కాకుండా ఈ పుస్తకం సంతోషం, సంతృప్తి మనలో నుంచి వస్తాయంటుంది. 'ఎవరికైనా నేను నచ్చలేదంటే అది నా సమస్య కాదు' అనుకోగలిగారంటే... మీకు జపనీయుల ఆలోచనాధోరణి ఒంటపట్టినట్లే!

– మిహిర

డెన్మార్క్ ఆదర్శం

ప్రపంచ అవినీతి సూచీలో ఇండియా నిరుడు 38 స్కోరు మాత్రమే సాధించింది. మూడింట రెండొంతుల దేశాలు యాభై స్కోరునూ దాటలేదు. దాన్నిబట్టి అవినీతిని అరికట్టడంలో ఆయా ప్రభుత్వాలు విఫలం అవుతున్నాయనుకోవచ్చు. డెన్మార్క్ అత్యధికంగా 90 స్కోరు సాధించి అవినీతి చాలా తక్కువగా ఉన్న దేశంగా నిలిచింది. ఫిన్లాండ్, సింగపూర్, న్యూజిలాండ్, నార్వే వంటివి ఎనభై శాతానికి పైగా రాబట్టాయి. అవినీతి సూచీలో పలు ఆసియా దేశాల స్కోర్లు...


భూటాన్	72
జపాన్	71
చైనా	43
వియత్నాం	40
మాల్దీవులు	38
ఇండోనేసియా	37
నేపాల్	34
థాయ్‌లాండ్	34
మంగోలియా	33
శ్రీలంక	32
పాకిస్థాన్	27
బంగ్లాదేశ్	23
ఇరాన్	23

(ఆధారం: కరప్షన్ పర్సెప్షన్స్ ఇండెక్స్-24)

ఉన్నత చదువులకూ అవినీతి చెదలు

ఉన్నత స్థానాల్లో నియమితులైనవారు కనీస నిబద్ధతతో విధులు నిర్వర్తిస్తారని ఎవరైనా భావిస్తారు. అలా నమ్మి వారికి కీలక బాధ్యతలు అప్పగిస్తారు. కానీ, కాసుల కక్కుర్తితో వాళ్లు నీతీ నిజాయతీలకు నీళ్లొదిలితే? వైద్యవిద్యలో తాజాగా అలాంటి భారీ దందానే ఒకటి బట్టబయలైంది. దొంగలు దొంగలు కలిసి ఊళ్లు పంచుకున్నట్లు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, ప్రైవేటు మెడికల్ కాలేజీల ప్రతినిధులు, దళారులు కలిసి పెద్ద గూడుపురాణీకి తెరతీశారు. కళాశాలల తనిఖీలు ఎప్పుడు జరుగుతాయి, గుర్తింపు పునరుద్ధరణ ప్రక్రియ వంటి విషయాలపై నోట్లకట్టలు మేసిన అధికారులు కొందరు విద్యాసంస్థల నిర్వాహకులకు ఉప్పందించారు. ఇంకేముంది... రహస్య సమాచారాన్ని తెలుసుకున్న యాజమాన్యాలు అప్పటికప్పుడు 'అద్దె' అధ్యాపకులను రంగంలోకి దించాయి. నకిలీ రోగులు, నిగనిగలాడే పడకలతో కాలేజీలకు 'దొంగకళ' తెచ్చాయి. బయోమెట్రిక్ హాజరులోనూ మాయాజాలాలకు పాల్పడ్డాయి. అలా వృత్తినిబద్ధతకు నాలుగు ఫర్లాంగుల దూరంలో ఉండే సర్కారీ సిబ్బంది సాయంతో తమ అక్రమాలకు అవి మసిపూసి మారేడుకాయ చేశాయి. తనిఖీలకు వెళ్లిన కొన్ని బృందాలైతే అంతా బాగుందని రాస్తే మాకేమిస్తారని బాహాటంగానే బేరసారాలు నడపడం- మన దేశంలో అన్ని వ్యవస్థల్లో ఊడలు దిగిన అవినీతి వికృతరూపానికి మరో సాక్ష్యం! ఈ భ్రష్టాచారాలకు సంబంధించి తాజాగా సీబీఐ మొత్తం 36 మందిపై కేసు నమోదు చేసింది. వారిలో తెలుగు రాష్ట్రాల వారు అయిదుగురున్నారు. దేశీయ ఉన్నత విద్యను ముందుండి నడిపించే యూజీసీ మాజీ అధిపతి డీపీ సింగ్ సైతం ఈ అవినీతి మేతల్లో భాగస్వామి అయ్యారని సీబీఐ గుర్తించింది. 1996లో ఉమ్మడి ఏపీలో అప్పటి కన్వీనర్ పుణ్యమా అనే ఎంసెట్ పేపర్ లీకయ్యింది. ఇలా కంచే చేను మేస్తుంటే మన ఉన్నత విద్య బాగుపడేదెన్నడు?

పదకొండు వందలకుపైగా విశ్వవిద్యాలయాలు, నలభై మూడు వేలకు పైగా కళాశాలలతో అలరారుతున్న అతి పెద్ద ఉన్నత విద్యావ్యవస్థ మనది. వాటిలో ప్రమాణాలను పెంచి మేటి మానవ వనరులను తీర్చిదిద్దుకునే లక్ష్యంతో కేంద్రం 'న్యాక్' గుర్తింపు ప్రక్రియను ప్రవేశపెట్టింది. మెరుగైన గ్రేడ్ దక్కాలంటే మంచి విద్యాబోధనా వనరులు, మౌలిక వసతులు, విశ్వసనీయత వంటివి ఉండాలి. ఇవేవీ లేకపోయినా గొప్ప గ్రేడ్‌ను కొట్టేసేందుకు తనిఖీ బృందాలకు కాలేజీలు లంచాలు మేపిన బాగోతాలు గతంలో బయటపడ్డాయి. 'సార్.. ఇంత తక్కువ మొత్తం చేతిలో పెడితే బెస్ట్ గ్రేడ్ ఇచ్చేదెలా' అంటూ ఆయా బృందాల సభ్యులు సిగ్గువదిలేసి చిర్రుబుర్రులాడిన సందర్భాలూ వెలుగుచూశాయి.



ఇంటికి కాపలాగా పెట్టుకున్న మనిషే దొంగతనం చేసినట్లు లేదూ ఈ తనిఖీల ప్రహసనమంతా! 'తనిఖీ బృందాల్లోని సభ్యులను ఏకపక్షంగా ఎంపిక చేస్తున్నారు. మొత్తం నిపుణుల్లో 70శాతం మందికి అసలు అవకాశమే దక్కకపోతుంటే, కొందరు పదేపదే క్షేత్రస్థాయికి వెళ్తారు' అంటూ న్యాక్ గుర్తింపులోని లొసుగులను గతంలో ఒక నివేదిక బయటపెట్టింది. డబ్బు వెదజల్లి ఏ, ఏప్లస్ గ్రేడ్లు తెచ్చుకుంటున్న కాలేజీలు ప్రచారాన్ని హోరెత్తిస్తూ పెద్దసంఖ్యలో విద్యార్థులను ఆకర్షిస్తున్నాయి. దండిగా ఫీజులు గుంజుతున్నాయి. తీరా పైన పటారం లోన లొటారం అని తెలిశాక విద్యార్థులు నైరాశ్యంలో మునిగిపోతున్నారు. అవినీతిపై విమర్శల నేపథ్యంలో అసలు మొత్తం గ్రేడింగ్ విధానాన్నే ప్రక్షాళిస్తామని న్యాక్ ఊదరగొడుతోంది. బాగా పుచ్చిపోయిన వ్యవస్థను సంస్కరించాలంటే ముందు చిత్తశుద్ధి ఉండాలి. మన యంత్రాంగంలో అదేపాటి అని చూడబోతే గుర్తుకొచ్చేది నేతిబీర మాత్రమే!

పుణ్యభూమి

ఏ దేశాభివృద్ధికైనా దన్నయ్యేది ఉన్నతవిద్యే. అందులోనూ ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారి ఊపిరి నిలిపే మెడిసిన్ చదువుకు సమాజంలో గౌరవంతో పాటు భారీ డిమాండ్ ఉంది. దీన్ని ఆసరా చేసుకుని కాలేజీలు విద్యార్థుల నుంచి కోట్ల రూపాయలు కొల్లగొడుతున్నాయి. కానీ, మౌలిక వసతుల కల్పన దగ్గరికొచ్చేసరికి తల అడ్డంగా ఊపుతున్నాయి. చాలా వైద్య కళాశాలల్లో ఘోస్ట్ ఫ్యాకల్టీయే గతి. ఉన్నవారూ సరిగ్గా క్లాసులకు రారు. ఇక అనుబంధ ఆస్పత్రి అన్నది పెద్ద మిథ్య. దీనిపై జాతీయ వైద్య మండలి (ఎన్ఎంసీ) గతంలో ఎన్నోసార్లు ఆగ్రహం వ్యక్తం చేసింది. భారీ జరిమానా విధిస్తామని, అనుమతులు రద్దుచేస్తామని తరచూ గుడ్లురుముతోంది. అయినా, పరిస్థితి మారుతోందా? పంజాబ్‌లోని పఠాన్‌కోట్‌లో ఉన్న ఓ ప్రైవేటు మెడికల్ కాలేజీలో 13 ఏళ్లలో ఒక్కరూ వైద్య పట్టా అందుకోలేదు. అక్కడ చదువంటే ఇసుక నుంచి తైలం తీయడమేనని ఈసడిస్తూ విద్యార్థులు ఇతర కాలేజీలకు మారిపోయారట. మరీ అంత దారుణంగా కాకపోయినా చాలా వైద్య కళాశాలల పరిస్థితి తీసికట్టుగానే అఘోరిస్తోంది. మరి వాటన్నింటినీ ఎన్ఎంసీ ఎందుకు ఉపేక్షిస్తోంది? తమిళనాడు అన్నా వర్సిటీ పరిధిలోని పలు ఇంజినీరింగ్ కాలేజీల్లో పనిచేస్తున్నవారిలో దాదాపు ఏడు వందల మంది ఘోస్ట్ ఫ్యాకల్టీయేనని నిరుటి పరిశీలనలో తేలింది. దేశవ్యాప్తంగా ఇదే దుస్థితి దాపురించింది. లాభాల పేరాశ తప్ప సామాజిక బాధ్యత తెలియని కళాశాలల యాజమాన్యాల వల్ల ఎంతోమంది అరకొర చదువులతో బయటికొస్తున్నారు. కనీస నైపుణ్యాలు కరవై వృత్తిగతంగా ఎదగలేక, పోటీ ప్రపంచంలో రాణించలేక జీవితంలో ఓడిపోతున్నారు. దానివల్ల దేశానికీ తీవ్ర నష్టం వాటిల్లుతోంది. ఈ సంక్షోభాన్ని ప్రభుత్వాలు ఎప్పటికి గుర్తిస్తాయి? పచ్చి అవినీతి కంపు కొడుతున్న ఉన్నత విద్యావ్యవస్థకు విలువల సుమగంధాన్ని ఇంకెప్పటికి అద్దుతాయి?

– వేణుబాబు మన్నం

పేరు అలా వచ్చింది..!

ధరణి, గీతా ఇరుగుపొరుగు ఇళ్లలో ఉంటారు. రోజూ సాయంత్రం స్కూల్ నుంచి రాగానే కలిసి ఆడుకుంటారు. వాళ్లిద్దరూ వేర్వేరు పాఠశాలల్లో ఆరో తరగతి చదువుతున్నారు. ఒకరోజు గీత.. 'ఇంకా ఆడుకోవడానికి రాలేదేంటి?' అంటూ ధరణి వాళ్లింటికి వెళ్లింది. 'మరేం లేదు గీతా.. మా స్కూల్లో ఉపన్యాసాల పోటీ ఉందని చెప్పాను కదా! ఏ విషయం గురించి మాట్లాడాలో తెలియట్లేదు. అదే ఆలోచిస్తూ కూర్చున్నా!' అంది ధరణి. 'అవునా.. మన ఫ్రీడం ఫైటర్స్ చాలామంది ఉన్నారు కదా. వాళ్లలో ఎవరి గురించైనా మాట్లాడు. నీకేదైనా హెల్ప్ కావాలంటే చేస్తాను' అంది గీత. 'సరే అయితే.. సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ గురించి చెబితే బాగుంటుందేమో' అంది ధరణి. 'ఆయన పేరు గురించి ఒక ఆసక్తికరమైన విషయం చెబుతాను విను.. స్వాతంత్ర్యం రావడానికి ముందు మన దేశంలో బ్రిటిష్ ప్రభుత్వం ఉండేది కదా. వాళ్లు రైతుల దగ్గరి నుంచి ఎక్కువ పన్నులు కట్టించుకోవాలని చూశారట. అప్పుడే మహాత్మాగాంధీ సత్యాగ్రహం అనే ఉద్యమాన్ని ప్రారంభించారు. అంటే, న్యాయం కోసం.. ఎలాంటి హింస లేకుండా పోరాడటమన్నమాట. కొన్నిరోజులకు ఈ ఉద్యమానికి వల్లభ్ భాయ్ పటేల్ నాయకత్వం వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా, రైతుల పక్షాన నిలబడ్డారు. గ్రామాల్లో తిరుగుతూ ఎవరూ భయపడవద్దని, ఎక్కువ పన్నులు చెల్లించొద్దని రైతులకు ధైర్యం చెప్పారు. అలా చిన్నగా మొదలైన ఉద్యమం దేశమంతటా పాకింది. చివరికి ప్రభుత్వం పెంచిన పన్ను తగ్గిస్తామని చెప్పింది. దాంతో సత్యాగ్రహం విజయవంతమైంది. దీనికి కారణమైన మహాత్మా గాంధీని, వల్లభ్ భాయ్ పటేల్‌ని అభినందిస్తూ గుజరాత్‌లోని పలు చోట్ల సభలు ఏర్పాటు చేశారు. అప్పుడు సభలో జనాల్లో కూర్చున్న ఒక మహిళ లేచి పటేల్‌ని ఉద్దేశిస్తూ.. 'ఇప్పటి నుంచి నువ్వే మా సర్దార్' అంది. సర్దార్ అంటే నాయకుడు అని అర్థం. అలా అప్పటి నుంచి ఆయన పేరు 'సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్' అయ్యింది. ఈ విషయాలు చెప్పు కచ్చితంగా నీకే మొదటి బహుమతి వస్తుంది' అంది గీత. 'చాలా బాగా చెప్పావు. థ్యాంక్స్ గీతా..' అంటూ బదులిచ్చింది ధరణి. ★



హాయ్! బుజ్జీ!!

చల్లని తల్లికి.. తియ్యని సారె


తాపేశ్వరం సారెను పరిశీలిస్తున్న ఈవో శీనానాయక్

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఆషాఢ మాసం సందర్భంగా దుర్గమ్మకు భక్తులు సారె సమర్పణ కార్యక్రమం శనివారం వైభవంగా జరిగింది. కోనసీమ జిల్లా తాపేశ్వరం నుంచి వచ్చిన మహిళా బృందం తెచ్చిన గ్రామీణ సంప్రదాయ సారె భక్తులను ఆకట్టుకుంది. రోలు,రోకలి, పాత్రం, చాట, కుండ ఆకృతుల్లో మిఠాయిలను తీసుకువచ్చారు. దేవస్థానం ఈవో శీనానాయక్ వాటిని ఆసక్తిగా పరిశీలించారు. పూలు, పండ్లు, మిఠాయిలు, కుంకుమ, పసుపు, పట్టువస్త్రాలను మహిళలు మల్లికార్జున మహామండపంలో దుర్గమ్మ ఉత్సవమూర్తి ఎదుట అర్చకులకు అందజేశారు. వారికి దేవస్థానం వేదపండితులు సామూహిక ఆశీర్వచనం చేశారు.

ఉత్సాహంగా చదరంగం పోటీలు

విజయవాడ ఎంజీ రోడ్డు పున్నమ్మ తోటలోని జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో శనివారం 'ఈనాడు-ఈటీవీ ఛాంపియన్' ఆధ్వర్యంలో విద్యా శాఖ ఉద్యోగులకు చదరంగం పోటీలు జరిగాయి. ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభకు పదును పెట్టారు. ఎత్తుకు పైఎత్తు వేసి ప్రత్యర్థిపై పైచేయి సాధించారు. అనంతరం విజేతలకు జిల్లా విద్యాశాఖాధికారి యు.వి. సుబ్బారావు బహుమతులు అందించారు.


బహుమతులు సాధించిన పురుషుల విభాగం ఎం.శ్రీనివాసరావు (ప్రథమ), ఎన్ఎస్ఎల్ శ్యామ్‌సుందర్(ద్వితీయ), మహిళల విభాగం ఎ.సరోజ (ప్రథమ), సీహెచ్ శిరీష(ద్వితీయ)లతో డీఈవో

– న్యూస్‌టుడే, విజయవాడ సిటీ, విజయవాడ క్రీడలు

ఒకే రోజు రూ.28.45 లక్షల జరిమానా

విజయవాడ నేరవార్తలు: నగరంలో ఇటీవల కళాశాల బస్సు డ్రైవర్ మద్యం తాగి వాహనం నడపడం తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనతో.. సీపీ రాజశేఖరబాబు ఆదేశాల మేరకు ట్రాఫిక్ పోలీసులు మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలకు శ్రీకారం చుట్టారు. నగరంలో 1, 3, 5, 6 ట్రాఫిక్ స్టేషన్ల అధికారులు.. 280 మందిపై కేసులు నమోదు చేశారు. వీరిని 6, 7వ అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టుల్లో ప్రవేశపెట్టారు. 9 మందికి రూ.15 వేల చొప్పున రూ.1.35 లక్షలు; 271 మందికి రూ.10 వేల చొప్పున రూ.27.1 లక్షల జరిమానా విధిస్తూ న్యాయమూర్తులు లెనిన్‌బాబు, ఆర్.వి.శర్మ తీర్పు చెప్పారు. ప్రతి రోజూ డ్రంకెన్‌అండ్ డ్రైవ్ నిర్వహిస్తామని సీపీ రాజశేఖరబాబు పేర్కొన్నారు.

ఆహ్లాద గిరుల్లో.. ఆరోగ్య సిరులు

ఒత్తిడి మాయం.. శారీరక వ్యాయామం

ఈనాడు, అమరావతి

'తెల్లవారుజామునే.. విజయవాడ, గుంటూరుల్లో వివిధ ప్రాంతాల నుంచి కొందరు ద్విచక్రవాహనాలు, కార్లలో ఇబ్రహీంపట్నం చౌరస్తాకు చేరుకున్నారు. అక్కడి నుంచి ఉదయం 6.30 గంటలకు.. కేతనకొండ వద్దకు వెళ్లారు. వాహనాలన్నీ ఆపేసి.. తమ ప్రయాణం మొదలుపెట్టారు. కొండపల్లి రిజర్వ్ ఫారెస్ట్ నుంచి నడిచి.. కొండ ప్రాంతానికి చేరారు. అక్కడ 400 మీటర్ల ఎత్తయిన కొండపైకి ట్రెక్కింగ్ చేస్తూ వెళ్లారు. తిరిగి మధ్యాహ్నానికి నగరబాట పట్టారు. వాహనాలను ఉంచినచోట నుంచి.. వెళ్లి, వచ్చే మొత్తం దూరం.. 11 కిలోమీటర్లు.'





నగరంలో ఒత్తిడిమయ జీవనం నుంచి దూరంగా వెళ్లేందుకు.. యువత నుంచి పెద్దవాళ్ల వరకూ అందరూ ఆసక్తి చూపిస్తున్నారు. అందుకే.. నగరానికి సమీపంలోని కొండలు, అటవీ ప్రాంతాలను వెతుక్కుంటూ శని, ఆదివారాల్లో ఉదయాన్నే వెళ్లిపోతున్నారు. వారమంతా ఎదుర్కొన్న ఒత్తిడి నుంచి ఉపశమనం లభించడమే కాక.. కావాల్సినంత శారీరక శ్రమ కూడా చేకూరుతోంది. ప్రకృతి ప్రేమికులైన కొందరు యువతతో ఏర్పాటైన విజయవాడ అడ్వంచర్స్ క్లబ్ (వీఏసీ) ఆధ్వర్యంలో నిర్వహించే ఈ ప్రకృతిలోకి ప్రయాణానికి విపరీత డిమాండ్ పెరిగింది.

విద్యార్థుల నుంచి ఉద్యోగుల వరకు...

వారాంతాల్లో అడవుల్లోకి చేసే ఈ ట్రెక్కింగ్‌కు.. ఓ సినిమా టికెట్ కంటే ఖర్చు తక్కువే. కానీ.. ప్రయోజనాలు అనేకం. ప్రధానంగా ఒత్తిడి నుంచి ఉపశమనం, అడవుల్లో పక్షుల కిలకిలరావాలు, చల్లని గాలుల మధ్య సెలయేళ్లను దాటుతూ.. ఎన్ని కిలోమీటర్లు నడిచినా అలసటే రాదని విజయవాడవాసి రాఘవ తెలిపారు. కళాశాల విద్యార్థుల నుంచి.. ఉన్నత స్థాయి ఉద్యోగుల వరకూ వీఏసీ ట్రెక్కింగ్‌కు వెళుతున్నారు. కొందరు కుటుంబాలతో కలిసి చిన్నారులనూ తీసుకెళ్తున్నారు. వారిలో 10-60 ఏళ్లలోపు వారుంటున్నారు.

ఆదివారం ప్రత్యేకం

ఉల్లాస ప్రాంతాలకు...

ఉమ్మడి కృష్ణా, గుంటూరు సమీప ఆహ్లాద ప్రాంతాలను ఎంపిక చేసుకుంటున్నారు. ప్రధానంగా కొండపల్లి, మూలపాడు అటవీ ప్రాంతం, కేతనకొండ వంటి ప్రదేశాలకే ఎక్కువగా వెళుతున్నారు. వీళ్లు ఓ వాట్సాప్ గ్రూప్ పెట్టుకుని.. ఎటెళ్లాలో ముందే అనుకుని వారాంతాల్లో ఉదయమే ఇబ్రహీంపట్నంలో కలుసుకుని సాగుతున్నారు. అడవిలోకి వెళ్లి జలపాతాల్లో సేదదీరుతున్నారు. నగరాల్లో కనుమరుగైన పక్షుల కిలకిలరావాలు, సీతాకోకచిలుకలు, స్వచ్ఛమైన గాలులతో.. ఇట్టే ఒత్తిడి ఎగిరిపోతోందని చెబుతున్నారు.

అనుభవజ్ఞుల పర్యవేక్షణలో.. అనుభవజ్ఞులైన మౌంటనీరింగ్ శిక్షణ పొందిన వారి పర్యవేక్షణలోనే వీటిని నిర్వహిస్తున్నారు. అన్ని జాగ్రత్తలతో తీసుకెళ్తున్నారు. ట్రెక్కింగ్‌కు వచ్చే వారికి సరైన షూస్, దుస్తులు, వాటర్‌బాటిల్ ముఖ్యం. ఇంటి నుంచి బయలుదేరాక.. ఎలా వెళ్లాలి? ఎక్కడ ఆగాలి? వయసురీత్యా ఇబ్బందులను ముందే అంచనా వేసి ప్రణాళిక వేస్తున్నారు. అందరూ ఒక గ్రూపుగా.. ఒకరి వెనుక ఒకరు వెళతారు. శారీరకంగా పటిష్ఠంగా ఉన్న వాళ్లనే ట్రెక్కింగ్‌కు అనుమతిస్తారు. మిగిలిన వారికి నడకకే అవకాశం. ఫస్ట్‌ఎయిడ్ కిట్‌నూ వెంట తీసుకెళ్తారు.

రెడ్‌క్రాస్ భాగస్వామ్యంతో పేదరిక నిర్మూలన

ఎన్టీఆర్ కలెక్టరేట్: సీఎం చంద్రబాబు పిలుపుతో పేదరిక నిర్మూలనకు దాతలు ముందుకు వస్తున్నారనీ, జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ కూడా భాగస్వామి కావాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. కలెక్టరేట్‌లో రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా నూతన కార్యవర్గంతో శనివారం సమావేశమై పీ-4పై చర్చించారు. జిల్లాలో 65,000 కుటుంబాలు పేదరికంలో ఉన్నాయనీ.. వీరిలో కొందరు పేదలను దత్తత తీసుకొని వారిని స్వయం పోషకులుగా తీర్చిదిద్దాలన్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ ఛైర్మన్ డాక్టర్ జి.సమరం, వైస్ ఛైర్మన్ వెలగా జోషి మాట్లాడుతూ.. కొన్ని కుటుంబాలను కేటాయిస్తే.. ఉన్నతులుగా తీర్చిదిద్దుతామన్నారు.

3,818 కేసులు.. రూ.32.17 కోట్ల పరిహారం

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : విజయవాడ మండల న్యాయసేవాధికార కమిటీ ఆధ్వర్యంలో విజయవాడ న్యాయస్థానాల సముదాయంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌కు చక్కని స్పందన లభించింది. 3,818 కేసులను పరిష్కరించి బాధితులకు రూ.32.17 కోట్ల పరిహారం అందించారు. మొత్తం 13 బెంచ్‌లు ఏర్పాటు చేశారు. ఒక్కో బెంచ్‌లో న్యాయమూర్తి, న్యాయవాది, సామాజిక కార్యకర్త ఉంటూ కేసులను విచారించారు. 56 మోటారు యాక్సిడెంట్ కేసులు పరిష్కరించి, బాధితులకు రూ.3.60 కోట్ల పరిహారం అందించారు. 3,690 క్రిమినల్ కేసుల్లో రూ.22.56 కోట్లు, 56 సివిల్ కేసుల్లో రూ.6 కోట్లు, 16 ప్రీలిటిగేషన్ కేసులను పరిష్కరించి రూ.20.11 లక్షల పరిహారం అందజేశారు. మండల న్యాయసేవాధికార సంస్థ ఛైర్మన్, రెండో అదనపు జిల్లా న్యాయమూర్తి ఎ.సత్యానంద్ మాట్లాడుతూ.. రాత్రి వరకు కొన్ని బెంచ్‌లు కొనసాగాయని, మరి కొన్ని కేసులు పరిష్కారం అవుతాయని తెలిపారు. జాతీయ లోక్ అదాలత్ దిగ్విజయంగా నిర్వహించిన న్యాయమూర్తులు, సహకరించిన న్యాయవాదులు, పోలీసులు, బీమా కంపెనీలు, కక్షిదారులు, న్యాయస్థానాల సిబ్బందికి సత్యానంద్ అభినందనలు తెలిపారు.


రాజీపడిన దంపతులకు అవార్డు కాపీ అందిస్తున్న సత్యానంద్, న్యాయమూర్తి రామ్మోహన్

అద్విక లావాదేవీలు ఇవ్వండి

బ్యాంకులకు పోలీసుల లేఖలు

పటమట, న్యూస్‌టుడే: అద్విక ట్రేడింగ్ కంపెనీ స్కాంపై పోలీసులు దర్యాప్తు కొనసాగుతోంది. ఏజెంట్లు చెప్పిన వివరాల ద్వారా ఇప్పటివరకు అద్విక కంపెనీలో ఎంతమంది పెట్టుబడి పెట్టారు... ఎంత మొత్తం పెట్టారనే వివరాలను పోలీసులు సేకరించారు. తాజాగా కంపెనీ ఖాతాలు, నగదు లావాదేవీలు అందించాలని పోలీసులు బ్యాంకులకు లేఖలు రాశారు. ఆ కంపెనీకి మొత్తం 5 బ్యాంకుల్లో కరెంట్ ఖాతాలున్నాయి. కంపెనీ ప్రారంభించిన నాటి నుంచి నేటి వరకు అంటే... సుమారు ఐదు సంవత్సరాల లావాదేవీల వివరాలు తీసుకొని ఏజెంట్లు చెప్పిన వివరాలతో పోల్చనున్నారు. ★ మరోవైపు విచారణలో ఆదిత్య భార్య సుజాత తమ వద్ద రూ.100 కూడా లేవని చెప్పారు. నాలుగు రోజుల కిందట ఓ బ్యాంకులో ఆమె పెట్టిన బంగారాన్ని సుమారు రూ.20 లక్షలు చెల్లించి విడిపించుకెళ్లారు. దాంతో ఆ నగదు ఎక్కడ నుంచి తెచ్చారనే అంశంపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

మినీ సూపర్‌మార్ట్‌ల పేరుతో మోసం

భవానీపురం, న్యూస్‌టుడే: విజయవాడలో రోజుకొక మోసం వెలుగు చూస్తోంది. మినీ సూపర్‌మార్ట్ ఫ్రాంఛైజీ ఇప్పిస్తానని ఒక వ్యక్తి నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేసిన సంఘటన శనివారం భవానీపురంలో వెలుగుచూసింది. రాష్ట్రంలోని పెద్ద సూపర్‌మార్కెట్‌లకు తామే సరకులు పంపిస్తున్నామని, ప్రస్తుతం విజయవాడలో మినీ సూపర్ మార్ట్‌లను ఏర్పాటు చేస్తున్నట్లుగా చెప్పి మోసానికి పాల్పడిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. భవానీపురం ఆర్టీసీ వర్క్‌షాపురోడ్డులో కేసరి సుబ్బారెడ్డి కుటుంబసభ్యులతో కలిసి నివాసం ఉంటున్నాడు. అతడు మెడికల్ షాపు నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఆయనకు ఈ ఏడాది మార్చిలో లీలా మార్ట్ ప్రైవేట్ లిమిటెడ్‌కు సీఈవోగా చెప్పి కాణిపాక అనిల్ పరిచయం అయ్యాడు. విజయవాడ పరిసర ప్రాంతాల్లో 17 మినీ సూపర్ మార్ట్‌ల ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఆ మాటలను నమ్మిన సుబ్బారెడ్డి భవానీపురం, వన్‌టౌన్, గాంధీనగర్, మైలవరం బ్రాంచుల కోసం రూ.51.85లక్షలు అనిల్ ఖాతాకు సుబ్బారెడ్డి బదిలీ చేశాడు. దుకాణాల ఏర్పాటుకు సుబ్బారెడ్డి రూ.5లక్షలు ఖర్చు చేశాడు. సరకు పంపాలని అనిల్‌ను కొన్ని రోజులుగా సుబ్బారెడ్డి కోరుతున్నా పంపటం లేదు. ఫోన్ చేసినా ఎత్తకపోవడంతో మోసపోయినట్లు గుర్తించిన సుబ్బారెడ్డి భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాసులు కొట్టేస్కో.. నచ్చినట్టు కట్టేస్కో!



అడ్డగోలుగా ప్లానింగ్ కార్యదర్శుల పనితీరు

న్యూస్‌టుడే, విజయవాడ నగరపాలక సంస్థ

విజయవాడ నగరంలోని కొందరు వార్డు సచివాలయ ప్లానింగ్ సెక్రటరీ (డబ్ల్యూపీఎస్)ల అవినీతి, అక్రమాలకు అంతు లేకుండా పోతోంది. ఇంటి ప్లాన్ల దరఖాస్తు దస్త్రాల వాస్తవికతపై రిమార్కులు నమోదు చేసి ప్రణాళికాధికారులకు వీరు పంపాలి. అయితే కాసులు కొడితేనే దస్త్రాన్ని తమ లాగిన్ నుంచి దాటిస్తున్నారు. లేకుంటే అడ్డగోలుగా రిమార్కులు రాసేసి భవన నిర్మాణదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు.

★ నగరంలో 286 వార్డు సచివాలయాలు ఉన్నాయి. వీటిల్లో 140 మంది ప్లానింగ్ సెక్రటరీలున్నారు. వీరిలో 12 మందిని నగరపాలక సంస్థ ప్రణాళికాధికారులు కొద్ది కాలం కిందట ఇన్‌ఛార్జి బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లుగా నియమించి 64 డివిజన్లకు సర్దుబాటు చేశారు. ప్లానింగ్ సెక్రటరీలు, ఇన్‌ఛార్జి బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు కుమ్మక్కయి అక్రమాలకు పాల్పడుతున్నారు. వీరు వైకాపా కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులకు మధ్యవర్తులుగా తయారయ్యారు. ప్లాన్ల కోసం వచ్చే దరఖాస్తుల దస్త్రాలను అడ్డుపెట్టుకుని రూ.30వేల వరకు దండుకుంటున్నారు.

అవినీతికి అలవాటుపడి..

ప్రతి డివిజన్ పరిధిలో కనిష్ఠంగా 2-5 వరకు అక్రమ నిర్మాణాలు, నిబంధనలు ఉల్లంఘించి కట్టడాలు చేపడుతున్నారు. వైకాపా కార్పొరేటర్లతో సన్నిహితంగా మెలుగుతూ వారు చెప్పిన వాటి వైపు కన్నెత్తి చూడడం లేదు. వీరిపై విజిలెన్స్, ఏసీబీ అధికారులకు అనేక ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో ఏసీబీ అధికారులు ఆ మధ్య నగరంలోని పలు ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. వారి తనిఖీల్లో ప్రణాళికాధికారులు, పలువురు ప్లానింగ్ సెక్రటరీల అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. ఏసీబీ అధికారులు ప్రభుత్వానికి ఇచ్చిన నివేదికతో వారిపై శాఖాపరమైన చర్యలకు ఎంఏయూడీ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది.

వీరిదంతా అక్రమాల దారే..

☛ వార్డు ప్లానింగ్ కార్యదర్శులుగా విధులు నిర్వహిస్తూ అక్రమ కట్టడాలను ప్రోత్సహించడం, నిబంధనలు ఉల్లంఘించి ప్లాన్ల మంజూరుకు ముందస్తు అనుమతులకు సిఫారసు చేయడం, అవినీతికి పాల్పడడం, తనఖాల్లో అక్రమాల కారణంగా వార్డు ప్లానింగ్ సెక్రటరీలు చుంచు నరసింహారావు, మాతంగి రాణి, మహ్మద్ అతియా ప్రవీణ్ తదితరులపై ఏసీబీ అధికారులు కేసులు నమోదు చేశారు. ☛ సింగ్‌నగర్, కృష్ణలంక, పటమట, పాతబస్తీ, విద్యాధరపురం ప్రాంతాల్లోని పలు వార్డు సచివాలయాల పరిధిలోని కొందరు ప్లానింగ్ సెక్రటరీల అక్రమాలపై ఇటీవల ప్రజా సమస్యల పరిష్కార వేదికకు పలు ఫిర్యాదులు అందాయి. ☛ భవానీపురం కోళ్లఫారం రోడ్డులోని చిన్న సందులోనూ, పాతబస్తీలోని పోలీసు స్టేషన్ సమీపంలోనూ, అక్కడి పులిపాటివారి వీధి, ఇతర ప్రాంతాల్లోని చిన్నపాటి సందుల్లోనూ నిబంధనలకు విరుద్ధంగా ప్లాన్లు మంజూరు చేయించడం ద్వారా స్థానిక ప్లానింగ్ కార్యదర్శులు అక్రమాలకు పాల్పడ్డట్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయి.

వసూళ్లకు పాల్పడితే చర్యలు తప్పవు: సంజయ్ రత్నకుమార్, చీఫ్ సిటీ ప్లానర్

ప్లానింగ్ సెక్రటరీలు అవినీతికి పాల్పడితే చర్యలు తప్పవు. నా పేరు చెప్పి కొందరు వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఫిర్యాదులు వచ్చాయి. వారిపై వస్తున్న ఆరోపణల విషయాన్ని కమిషనర్ దృష్టిలోనూ పెట్టాను. ప్లానింగ్ సెక్రటరీల బదిలీల ప్రక్రియ ప్రస్తుతం జరుగుతోంది. అది పూర్తయ్యాక మిగిలిన వారిని అంతర్గతంగా బదిలీ చేస్తాం.

బీఎస్సీ నర్సింగ్ ప్రవేశ పరీక్ష నేడు

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం: 2025-26 విద్యా సంవత్సరానికి రాష్ట్రంలోని 16 ప్రభుత్వ, 236 ప్రైవేటు నర్సింగ్ కళాశాలల్లో అందుబాటులో ఉన్న 13,800 నాలుగేళ్ల బీఎస్సీ నర్సింగ్ కన్వీనర్, యాజమాన్య సీట్ల భర్తీకి విజయవాడ డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఆదివారం ప్రవేశ పరీక్ష నిర్వహించనుంది. రాష్ట్రంలో 62, హైదరాబాద్‌లోని ఎల్.బి.నగర్, సరూర్‌నగర్‌లో రెండు పరీక్ష కేంద్రాలు పెట్టారు. 17,783 మంది దరఖాస్తు చేసుకోగా.. శనివారం సాయంత్రానికి 16,779 మంది హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకున్నారు. ప్రవేశ పరీక్ష ఆదివారం మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు జరుగుతుంది. అభ్యర్థులంతా ఆయా కేంద్రాలకు 12.30 గంటల్లోగా చేరాలి. ప్రవేశ పరీక్ష 'కీ' అదే రోజు రాత్రి విడుదల చేసి, అభ్యంతరాలు స్వీకరించనున్నామని రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి తెలిపారు. వారంలోగా ఫలితాలు విడుదల చేస్తామని ఆమె చెప్పారు.

రిజిస్ట్రేషన్ చేసేదొకరు.. ఫ్లాట్ల వద్ద మరొకరు!

ఇంటి తాళాలు ఇవ్వరు.. ఆక్యుపెన్సీ చూపరు..★ చంద్రిక అయోధ్య అపార్ట్‌మెంట్ల బాధితుల గోడు

ఈనాడు, అమరావతి: గన్నవరం చంద్రిక అయోధ్య అపార్ట్‌మెంట్ల వ్యవహారంలో రోజుకో కొత్త విషయం వెలుగులోకి వస్తోంది. కొందరు కొనుగోలుదారులు పూర్తిగా డబ్బులు చెల్లించినా.. ఇప్పటికీ రిజిస్ట్రేషన్లు చేయలేదని తెలుస్తోంది. వీళ్లకు రిజిస్ట్రేషన్లు చేసే అధికారం.. నిర్మాణ సంస్థ రాకీ అవెన్యూస్‌కే ఉంది. ఆ సంస్థతోనే కొనుగోలుదారులు ఒప్పందం చేసుకున్నారు. అందుకే.. ఇప్పుడు రాకీ అవెన్యూస్ యజమానే గుట్టుగా వచ్చి గన్నవరం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు చేసి వెళ్లిపోతున్నట్లు సమాచారం. కానీ.. రిజిస్ట్రేషన్ల తర్వాత కొనుగోలుదారులకు ఫ్లాట్ల పొజిషన్ చూపించకుండా మాయమవుతున్నట్టు తెలుస్తోంది. పొజిషన్ చూపించి, ఫ్లాట్ల తాళం అప్పగించి, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ ఇవ్వాలి. కానీ.. ఇవేవీ చేయడం లేదు. కొందరి వద్ద నుంచి సౌకర్యాలు, నిర్వహణ ఛార్జీలు అన్నీ రాకీ అవెన్యూస్ యజమానే వసూలు చేసి వెళ్లిపోయారు. వాళ్లంతా ఫ్లాట్ల వద్దకు వెళ్లేసరికి అక్కడ ఎలాంటి సంబంధం లేని.. గుర్రం నాని ఉంటున్నారు. దీంతో తాము మోసపోయామని.. కొనుగోలుదారులు గగ్గోలు పెడుతున్నారు.


చంద్రిక అయోధ్య భవన సముదాయం

రూ.లక్షలు తీసుకొని వేధింపులు: రాకీ అవెన్యూస్ సంస్థతో చేసుకున్న ఒప్పందం ప్రకారం.. తాము మొత్తం డబ్బులన్నీ చెల్లించేశామనీ, తమ ఫ్లాట్లు ఎక్కడని అడిగితే.. తనకు సంబంధం లేదని గుర్రం నాని అంటున్నారని వాపోతున్నారు. తానే ప్రస్తుతం నిర్వహణ చూస్తున్నాననీ, ఆరంభం నుంచి కలిపి నిర్వహణ కింద రూ.3 లక్షలు చెల్లించాలనీ, ఇంటీరియర్, ప్లంబింగ్, ఎలక్ట్రికల్ అన్నీ తానే చేయిస్తానని దానికి మరో రూ.20 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నట్లు చెబుతున్నారు. మేం అన్నీ కట్టేశామని చెబుతున్నా వినడం లేదనీ, కడితేనే ఫ్లాట్లు అప్పగిస్తాననీ, లేదంటే వెళ్లిపోవాలని అంటున్నారని బాధితులు వాపోతున్నారు. రాకీ అవెన్యూస్ సంస్థే బాధ్యత తీసుకుని.. ఆరంభంలో చేసుకున్న ఒప్పందాల ప్రకారం తమకు న్యాయం చేయాలని వీళ్లు డిమాండ్ చేస్తున్నారు. ఒక్కొక్కరూ రూ.40-60 లక్షలు చెల్లించారు. ఇవికాకుండా ఫేజ్-02లో ఒప్పందాలతో మరి కొందరిని ముంచేశారు. వారిలో ఒక బాధితుడు తాను ఒప్పందం చేసుకుని డబ్బులు చెల్లించాననీ, వాటిని తిరిగి ఇవ్వకుండా ఇప్పుడు వేధిస్తున్నారని తాజాగా గన్నవరం పోలీసులకు ఒక బాధితుడు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది.

అక్షర కోవెలలో అపూర్వ విజయం

- ఫలించిన ఎస్సార్ఆర్ పూర్వ విద్యార్థుల కృషి
- నిషేధిత భూమిగా ప్రకటించిన కలెక్టర్ లక్ష్మీశ

న్యూస్‌టుడే – మాచవరం, గాంధీనగర్


మాట్లాడుతున్న శంకర్. పక్కన జానయ్య, కృష్ణకుమార్

దశాబ్ద కాలం నుంచి ఎస్సార్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ కళాశాల పూర్వ విద్యార్థులు చేస్తున్న పోరాటం, శ్రమ ఫలించింది. బీఆర్టీఎస్ రోడ్డు పక్కనే ఉన్న కళాశాలకు చెందిన 6.67 ఎకరాల స్థలం కబ్జాకు గురవుతోందని పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు.. పలుమార్లు అధికారులు, ప్రజా ప్రతినిధులను కలిసి విన్నవించారు. కళాశాల స్థలంలో ఏళ్లుగా ధర్నాలు చేస్తూనే ఉన్నారు. ఈ స్థలం కళాశాలకు చెందినది అని బోర్డులు కూడా ఏర్పాటు చేశారు. అయినప్పటికీ కబ్జాదారులు బోర్డులను తొలగించి.. స్థలం తమదేనని బీరాలు పలికారు. పూర్వ విద్యార్థుల సంఘం, కళాశాల అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది సమష్టిగా పోరాటం కొనసాగించారు. ఎట్టకేలకు వారి శ్రమకు తగిన ఫలితం లభించింది. కళాశాల స్థల కబ్జాదారులపై కలెక్టర్ కొరడా ఝుళిపించారు. సెక్షన్ 22(ఎ) ప్రకారం దానిని నిషేధిత భూమిగా కలెక్టర్ లక్ష్మీశ శుక్రవారం తాత్కాలిక ఉత్తర్వులు జారీ చేశారు. ఎలాంటి క్రయ విక్రయాలు జరగకుండా అడ్డుకున్నారు. దీంతో సుమారు రూ.300 కోట్ల విలువ చేసే ప్రభుత్వ స్థలాన్ని అందరూ కలిసి కాపాడుకున్నారు.

6.67 ఎకరాలకు రక్షణ

గత పది సంవత్సరాలుగా అన్యాక్రాంతమవుతున్న నగరంలోని ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ డిగ్రీ కళాశాలకు చెందిన 6.67 ఎకరాల భూములను కలెక్టర్ నిషేధిత భూముల కింద ఉత్తర్వులు ఇచ్చారని.. ఇది అక్రమార్కులపై పూర్వ విద్యార్థులు సాధించిన విజయమని సీపీఐ నగర కార్యదర్శి, కళాశాల పూర్వ విద్యార్థి దోనేపూడి శంకర్ అన్నారు. శనివారం ఆయన ప్రెస్ క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు లంక జానయ్య మాట్లాడుతూ.. ఎన్ని బెదిరింపులు వచ్చినా, ప్రలోభాలకు గురిచేసినా తమ పోరాటం ఆపలేదని చెప్పారు. పదేళ్ల శ్రమ ఫలించిందని వ్యాఖ్యానించారు. సహకరించిన రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రతినిధులు చిగురుపాటి యుగంధర్, చెరుకూరి కృష్ణకుమార్, ఆళ్ల వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

రెండు వేల మంది విద్యార్థులతో ధర్నా

కళాశాలలో విద్యనభ్యసించిన ఎంతో మంది అధికారులు, రాజకీయ నాయకులు, అధ్యాపక వృత్తిలో స్థిరపడినవారందరినీ సంఘటితం చేసి 2017లో పూర్వ విద్యార్థుల సంఘాన్ని ఏర్పాటు చేశాం. కబ్జా కోరల్లో చిక్కుకున్న కళాశాల స్థలంలో అప్పట్లోనే సుమారు రెండు వేల మంది విద్యార్థులతో ధర్నా చేశాం. ఇది కళాశాల స్థలమని నగర ప్రజలందరికీ తెలిసేలా పోరాటం ఆరంభించాం. అప్పటి నుంచి పోరాటాలు చేస్తూనే వచ్చాం. ఇప్పటికి మా శ్రమ ఫలించింది. **- వెలగా జోషి, పూర్వ విద్యార్థి**

కలెక్టర్‌కు కృతజ్ఞతలు

అక్రమార్కులపై దశాబ్ద కాలం నుంచి పోరాడుతూ.. పూర్వ విద్యార్థులు సాధించిన విజయం. ప్రభుత్వ కళాశాల స్థల భూములు గత 50 సంవత్సరాల నుంచి కబ్జాదారుల చెరలో ఉంది. ప్రస్తుత కలెక్టర్ ఆదేశాల మేరకు 22(ఎ)కింద నిషేధిత భూముల పరిధిలోకి రావడం.. విద్యార్థి పోరాట విజయంగా భావిస్తున్నాను. కలెక్టర్ జి.లక్ష్మీశకు ధన్యవాదాలు. **- దోనేపూడి శంకర్, పూర్వ విద్యార్థి**

ఎన్నో బెదిరింపులు, ప్రలోభాలు..

పోరాటం చేస్తున్న మాకు ఎన్నో బెదిరింపులు వచ్చాయి. ప్రలోభాలకు పాల్పడినా తలొగ్గలేదు. కళాశాల భూమి స్థలంలో అడుగుపెట్టకూడదని ఆక్రమణదారులు కోర్టు ఆర్డర్ తీసుకొచ్చినా.. పోరాటాన్ని సమష్టిగా కొనసాగించాం. నిషేధిత భూమి కింద కలెక్టర్ ఉత్తర్వులు ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నాం. **- లంకా జానయ్య, పూర్వ విద్యార్థి**

ఇది సమష్టి విజయం

ఇది అందరి విజయం. మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు, ఎంతో మంది వామపక్ష మేధావులు, నాయకులను ప్రపంచానికి అందించిన కళాశాల స్థలం.. కబ్జాదారుల కోరల్లో చిక్కుకొని విలవిల్లాడింది. ఎంతో మంది సహకారంతో రాజకీయాలకతీతంగా సాగించిన పోరాటంలో విజయం సాధించడం చాలా ఆనందంగా ఉంది. **- చిగురుపాటి యుగంధర్, పూర్వ విద్యార్థి**

ఆకట్టుకుంటున్న నేషనల్ సిల్క్ ఎక్స్‌పో



బెంజి సర్కిల్(విజయవాడ సిటీ) : విజయవాడ ఎంజీ రోడ్డులోని శేషసాయి కల్యాణ వేదికలో ఏర్పాటు చేసిన నేషనల్ సిల్క్ ఎక్స్‌పో వినియోగదారులను ఆకట్టుకుంటోంది. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. దేశ సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా వస్త్రాలు, మగ్గాల ఉత్పత్తులు అందుబాటులో ఉంచామని తెలిపారు. వేలాది రకాల పట్టు, కాటన్ డిజైన్ దుస్తులు, డిజైనర్ చీరలు, బ్లౌజు, కుర్తీలను నేత కార్మికులు 50 శాతం వరకు తగ్గింపుతో విక్రయిస్తున్నారని పేర్కొన్నారు. వివిధ రాష్ట్రాల్లో పేరున్న సిల్క్, బనారస్, పట్టు, సిఫాన్, చేనేత బ్లాక్ ప్రింట్ చీరలు లభిస్తాయన్నారు. ప్రదర్శన ఈ నెల 7వ తేదీ రాత్రి 9 గంటల వరకు మాత్రమే ఉంటుందని, ప్రజలు సందర్శించాలని కోరారు. ప్రవేశం ఉచితం అని తెలిపారు.

10న తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం

ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో నిర్వహణ

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఈ నెల 10వ తేదీన జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం (మెగా పేరెంట్స్, టీచర్స్ మీట్) నిర్వహించనున్నట్లు కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. ఈ విషయమై నగరంలోని కలెక్టరేట్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. గత ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లోనే నిర్వహించగా, ఈ ఏడాది ప్రైవేటు విద్యా సంస్థల్లోనూ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయడమే లక్ష్యమని చెప్పారు. 1,500 పాఠశాలల నుంచి 2 లక్షల మంది విద్యార్థులు వారి తల్లిదండ్రులతో కలిసి హాజరవుతారని వెల్లడించారు. ఈ ఏడాది జూనియర్ కళాశాలల్లోనూ నిర్వహించనున్నట్లు చెప్పారు. 186 జూనియర్ కళాశాలల్లో 78,162 మంది విద్యార్థులు ఉన్నారని తెలిపారు. తల్లిదండ్రులకు వారి పిల్లలే ఆహ్వానాలు అందిస్తారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ప్రజాప్రతినిధులను ఆహ్వానిస్తారు. ఆయా పాఠశాలల్లో చదివి, ఉన్నత స్థానాల్లో ఉన్న వారిని ఆహ్వానించి సత్కరిస్తారు. విద్యార్థులకు పలు పోటీలు నిర్వహిస్తారు.

తల్లి పేరిట ఒక మొక్క

పాఠశాల ఆవరణ లేదా వారి ఇంటి వద్ద తల్లి పేరుతో ఒక మొక్క నాటడం ఈ ఏడాది థీమ్‌గా తీసుకున్నట్లు కలెక్టర్ తెలిపారు. దీని కోసం లీప్ యాప్‌లో లాగిన్ అయి, వారి పేరు నమోదు చేసుకోవాల్సి ఉందన్నారు. జిల్లా ఇంటర్మీడియట్ విద్య అధికారి బి.ప్రభాకర్, సమగ్ర శిక్ష అధికారి జి.మహేశ్వరరావు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు (కిలో రూపాయల్లో)

పెదవేగి: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -102 లైవ్ ధర 124 డ్రెస్ట్ విత్ స్కిన్ - 180, విత్ స్కిన్ - 205. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లైవ్ ధర - 110, 118, 120 స్కిన్ లెస్ - 210 విత్ స్కిన్ - 220.

నెక్ సూచించిన కోడిగ్రుడ్డు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 570 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.88/-.

కృష్ణా తీరం.. సంపద కేంద్రం


సమీక్షిస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్. పక్కన ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యేలు బొండా ఉమా, శ్రీరాంరాజగోపాల్, కలెక్టర్ లక్ష్మీశ, జేసీ ఇల్మకియా తదితరులు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: కృష్ణా నది తీరంలోని ఎన్టీఆర్ జిల్లాను సంపద కేంద్రంగా మార్చాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సత్యకుమార్ యాదవ్ సూచించారు. జగ్గయ్యపేటలో వివిధ వనరులు అందుబాటులో ఉన్నాయి. రాజధానికి రైల్వే లైను అనుసంధానం జిల్లా నుంచి వెళుతోంది. మైలవరం నియోజకవర్గం సెమీ అగ్రి ఏరియాగా మారనుంది. కృష్ణా నది సమీప ప్రాంతాలను పర్యాటకపరంగా అభివృద్ధి చేయడానికి అనువైన అవకాశాలున్న నేపథ్యంలో దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆయన పేర్కొన్నారు. పశుసంవర్థక, ఉద్యాన, పరిశ్రమల వరంగాలు పూర్తిగా సాధించాల్సి ఉందన్నారు. జిల్లా, అసెంబ్లీ నియోజకవర్గ దార్శనిక ప్రణాళికలు, స్వర్ణాంధ్ర పీ-4 ఫౌండేషన్‌పై నగరంలోని కలెక్టరేట్‌లో శనివారం సమావేశం నిర్వహించారు. సమీక్షలో, అనంతరం మీడియాతోనూ మంత్రి మాట్లాడారు. 2047 సంవత్సరం నాటికి రూ.18.23 లక్షల కోట్ల జిల్లా స్థూల ఉత్పత్తి (జీడీడీపీ) లక్ష్యం కావాలన్నారు. జిల్లాలో సగటున 18.5 శాతం వార్షిక వృద్ధి సాధనకు దిశానిర్దేశం చేశారు. వ్యవసాయ, పారిశ్రామిక, సేవా రంగాల్లో వృద్ధికి అవకాశం ఉన్న అంశాలు, కీలక ప్రగతి సూచికలు, పర్యాటక రంగ అభివృద్ధి, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రకృతి వ్యవసాయం, ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్స్ (ఎఫ్‌పీవోలు), వ్యవసాయ యంత్రీకరణ తదితరాలపై చర్చించారు.

యువతకు ఉపాధి అవకాశాలు

విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) మాట్లాడుతూ.. యువత సుస్థిర ఉపాధి అవకాశాలు పొందేందుకు నైపుణ్యాభివృద్ధి కీలకమన్నారు. ఆటోనగర్‌లో ఆటో మొబైల్ నైపుణ్య శిక్షణ కేంద్రం ఏర్పాటు ముఖ్యమన్నారు. నగరంలో సేవా రంగ అభివృద్ధికి పుష్కల అవకాశాలు ఉన్నాయని వివరించారు. జిల్లా ప్రణాళికపై కలెక్టర్ జి.లక్ష్మీశ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. ఏడు నియోజకవర్గాల ప్రణాళికలను ప్రత్యేక అధికారులు వివరించారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, శ్రీరాం రాజగోపాల్, కొలికపూడి శ్రీనివాసరావు, స్వర్ణాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కె.పట్టాభిరామ్, కేడీసీసీ బ్యాంకు ఛైర్మన్ నెట్టెం రఘురామ్, జేసీ ఎస్.ఇల్మకియా, వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర, సీపీవో వై.శ్రీలత, ప్రత్యేకాధికారులు జి.మహేశ్వరరావు, టి.వెంకట సతీష్, డి.చంద్రశేఖర్, విజయకుమారి, రవీంద్రరావు, ఎం.హనుమంతరావు, పి.బాలాజీ కుమార్ పాల్గొన్నారు.

'తెలుగు భాష ప్రాచీనతకు శాసనాలే ఆధారాలు' పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణలో డాక్టర్ నోరి దత్తాత్రేయ, లక్ష్మీప్రసాద్, శివనాగిరెడ్డి, మురళీమోహన్

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే : విజయవాడకు చెందిన పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈవో డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి రచించిన 'తెలుగు భాష ప్రాచీనతకు శాసనాలే ఆధారాలు' అనే పుస్తకాన్ని ప్రముఖ క్యాన్సర్ వైద్య నిపుణుడు డాక్టర్ నోరి దత్తాత్రేయ అమెరికాలో నిర్వహిస్తున్న తానా సభలో శనివారం ఆవిష్కరించారు. ప్రముఖ సినీ నటుడు మురళీమోహన్, రాజ్యసభ మాజీ సభ్యుడు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, కేంద్ర సాహిత్య అకాడమీ ప్రతినిధి వాసిరెడ్డి నవీన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం శివనాగిరెడ్డిని నిర్వాహకులు సత్కరించారు.

నగరంలో చెడ్డీగ్యాంగ్?

- విల్లాలో 209 గ్రాముల బంగారం చోరీ
- యజమానులు నిద్రపోతుండగానే ఘటన


ఈ కిటికీ అద్దాలు తీసి దొంగలు లోపలికి ప్రవేశించారు..


పోలీసు జాగిలంతో తనిఖీలు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : గుణదల పోలీస్‌స్టేషన్ పరిధిలోని విశాఖపట్నం రైల్వేట్రాక్ సమీప విల్లాల్లో శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత భారీ చోరీ జరిగింది. బాత్‌రూం కిటికీ అద్దాలు తీసి లోనికి ప్రవేశించిన దొంగలు.. ఇంట్లో యజమానులు నిద్రపోతుండగానే 209 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.20వేల నగదు చోరీ చేశారు. గుణదల, సీసీఎస్ పోలీసులను ఉరుకులు పెట్టించిన ఈ ఘటన పూర్వాపరాలు ఇలా ఉన్నాయి... గుణదల స్టార్ విల్లా-11లో ఉంటున్న వైట్ల సురేష్‌కుమార్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. శనివారం ఉదయం నిద్ర లేచి చూడగా.. అలమారా తెరిచి ఉంది. నగల బాక్సులు నేలపై పడి ఉన్నాయి. అందులో బంగారం కనిపించలేదు. బాత్‌రూమ్‌లోని కిటికీ అద్దాలు తొలగించి ఉండడంతో చోరీ జరిగినట్లు గుర్తించారు. వెంటనే గుణదల పోలీసులకు ఫిర్యాదు చేయగా.. వారు వెంటనే వచ్చేశారు. నేరం జరిగిన తీరును బట్టి.. అంతర్ రాష్ట్ర ముఠా పని అయి ఉంటుందని అనుమానిస్తున్నారు. కిటికీల నుంచి లోపలికి ప్రవేశించి గుట్టుచప్పుడు కాకుండా నేరాలు చేసేది చెడ్డీ గ్యాంగ్ మాత్రమే అని పోలీసులు అంటున్నారు. నేరం జరిగిన విల్లాకు సమీపంలోని మరో విల్లా కిటికీ ఇనుప మెష్ విరగకొట్టి ఉంది. అక్కడ నేరం చేసేందుకు ప్రయత్నించి ఉంటారని, కుదరక వెనక్కి వెళ్లిపోయి ఉండొచ్చని అనుమానిస్తున్నారు.

సీసీ కెమెరాలో నిక్షిప్తం...: పోలీసులు స్థానిక సీసీ కెమెరాలను పరిశీలించారు. ముగ్గురు ఆగంతకులు మంకీ క్యాప్‌లు ధరించి అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో వచ్చినట్లు గుర్తించారు. తెల్లవారుజామున 4 గంటల సమయంలో బయటకు వెళ్లిపోయినట్లు రికార్డు అయి ఉంది. ఈ తరహా నేరాలకు పాల్పడేది చెడ్డీ గ్యాంగ్ అని అనుమానిస్తున్నారు. నగరంలోకి వీరు ప్రవేశించి ఉండొచ్చని సీసీఎస్ పోలీసులు అంచనాకు వచ్చారు. ఒక ప్రాంతానికి వచ్చిన వీరు.. వరుస నేరాలు చేసుకుని వెళ్లిపోతారని అంటున్నారు. దీంతో పోలీసులు అప్రమత్తమయ్యారు.

సోలార్ ఫెన్సింగ్ ధ్వంసం ... : నేరం జరిగిన విల్లాల సముదాయంలో రక్షణ ఏర్పాట్లు లోపభూయిష్టంగా ఉన్నాయని పోలీసులు గుర్తించారు. విల్లాల చుట్టూ రక్షణగా సోలార్ ఫెన్సింగ్ ఉంది. దాని వెనుక వైపు ఫెన్సింగ్ ధ్వంసం కాగా.. దాన్ని బాగు చేయించలేదు. మరో చోట గోడ పడిపోయింది. నిందితుల ఆచూకీ కనిపెట్టేందుకు వచ్చిన పోలీస్ జాగిలం కూడా ఈ ప్రాంతం గుండా బయటకు వెళ్లింది. అంటే నేరం చేసిన వారు ఇటువైపు నుంచే పారిపోయి ఉండొచ్చని అనుమానిస్తున్నారు. ఘటనాస్థలంలో వేలిముద్రలు సేకరించారు. సెంట్రల్ ఏసీపీ దామోదర్, సీసీఎస్ ఘటనాస్థలాన్ని పరిశీలించారు. సురేష్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదం కేసులో రూ.43 లక్షల పరిహారం

నందిగామ, న్యూస్‌టుడే: నందిగామకు చెందిన షేక్ అమీనాబేగంకు కోదాడకు చెందిన గల్ఫ్ సమరంతో వివాహమైంది. వీరికి అయిదేళ్ల కుమారుడు షేక్ హిమాన్షు ఉన్నాడు. రెండేళ్ల కిందట కుమారుడి జన్మదినం రోజున.. నందిగామ శివారు అనాసాగరం వద్ద హైవే బైపాస్ రోడ్డులో నడిచి వెళ్తున్న గల్ఫ్ సమరం(28)ను ఆటో ఢీకొట్టడంతో మృతిచెందాడు. దీనిపై నందిగామ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. దీనికి సంబంధించి నందిగామ కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో జిల్లా అదనపు న్యాయమూర్తి కోర్టు న్యాయాధికారి పి.శ్రీనివాసరావు సమక్షంలో అమీనాబేగంకు రూ.43 లక్షల నష్ట పరిహారం చెల్లించేలా హెచ్‌డీఎఫ్‌సీ ఎర్గో బీమా సంస్థ అంగీకరించింది. సదరు మహిళ రూ.45 లక్షలు కోరగా రూ.43 లక్షలు ఇచ్చేందుకు ఒప్పందం కుదిరింది. దీంతో ఇరువర్గాలు సమ్మతితో నష్టపరిహారం మంజూరు పత్రాలను అమీనాబేగంకు న్యాయమూర్తి అందజేశారు. దీంతో ఆ కుటుంబం సంతోషం వ్యక్తం చేసింది. కార్యక్రమంలో న్యాయవాది కె.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కారం


అమీనాబేగంకు పరిహారం మంజూరు పత్రాలు ఇస్తున్న ఏడీజే శ్రీనివాసరావు

పలు మండలాల్లో తేలికపాటి వర్షాలు

ఎన్టీఆర్ కలెక్టరేట్ : జిల్లాలోని పలు మండలాల్లో తేలికపాటి వర్షాలు కురిశాయి. శనివారం ఉదయం నమోదైన వివరాలు ఇలా ఉన్నాయి. కంచికచర్లలో 5 మి.మీ., వీరులపాడు 4.2, జి.కొండూరు 3.4, ఇబ్రహీంపట్నం 2.8, విజయవాడ గ్రామీణ 2.4, మైలవరం 2, విజయవాడ సెంట్రల్, పశ్చిమ 1.8, విజయవాడ ఉత్తరం 1.6, విజయవాడ తూర్పులో 1.4 మిల్లీ మీటర్ల మేర వర్షం పడింది.

భార్యను తీసుకెళ్లాడని అనుమానం.. కత్తితో దాడి


హేమంత్‌నాయక్

ఎ.కొండూరు, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ జిల్లా ఎ.కొండూరు మండలం చీమలపాడులో శుక్రవారం రాత్రి తెలంగాణ రాష్ట్రంలోని కొత్తగూడేనికి చెందిన గుగులోతు హేమంత్‌నాయక్ అనే యువకుడిపై హత్యాయత్నం జరిగింది. అతనిపై ప్రత్యర్థులు కత్తులతో మూకుమ్మడిగా దాడి చేసి గాయపరిచారు. సంఘటన జరిగిన సమయంలో సమీప ప్రజలు చేరడంతో అతను ప్రాణాలతో బయటపడి విజయవాడలోని ఓ కార్పొరేట్ హాస్పటల్‌లో చికిత్సకు తీసుకుంటున్నాడు. తిరువూరు సీఐ కె.గిరిబాబు తెలిపిన వివరాల మేరకు భద్రాద్రి కొత్తగూడేనికి చెందిన గుగులోతు తెండూల్కర్ నాయక్ భార్యతో హేమంత్‌నాయక్ సన్నిహితంగా ఉంటున్నాడని గత ఆరు నెలలుగా ఇద్దరి మధ్య వివాదం జరుగుతోంది. కొత్తగూడెం పోలీసులు, పెద్దలు ఇరు కుటుంబాలకు నచ్చజెప్పడంతో వివాదం సద్దుమణిగింది. తదుపరి తెండూల్కర్‌నాయక్ తన కుటుంబాన్ని విజయవాడకు తీసుకువచ్చి ఇక్కడే నివసిస్తుండగా శుక్రవారం తన భార్య కనిపించకపోవడంతో.. ఆచూకీ కోసం గాలిస్తున్నారు. ఈ క్రమంలో విజయవాడలో వారికి హేమంత్‌నాయక్ కనిపించగా అతడే ఆమెను తీసుకెళ్లి ఉంటాడని అనుమానించి శుక్రవారం సాయంత్రం నుంచి వెంటాడుతున్నారు. అనంతరం విజయవాడ నుంచి కొత్తగూడేనికి కారులో వెళ్తున్న హేమంత్‌నాయక్‌ను.. తెండూల్కర్ కుటుంబ సభ్యులు మరో కారులో వెంటాడి చీమలపాడు వద్ద ఆపి కత్తులతో దాడికి దిగారు. వారి నుంచి తప్పించుకుని ఆస్పత్రిలో చేరిన బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎ.కొండూరు పోలీస్‌స్టేషన్‌లో దాడి చేసిన ఆరుగురిపై హత్యాయత్నం కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు. సంఘటనపై దర్యాప్తు పూర్తి చేసి నిందితులను అరెస్టు చేస్తామని చెప్పారు.

గేమ్‌ఛేంజర్లుగా.. మ్యాజిక్ డ్రెయిన్లు


కలెక్టర్ లక్ష్మీశకు వివరిస్తున్న డ్వామా పీడీ రాము

సోమవరం (నందిగామ గ్రామీణం), న్యూస్‌టుడే: భూగర్భ జలాల పెంపు, మురుగు నీటి సమస్య పరిష్కారానికి పైలట్ ప్రాజెక్టుగా చేపట్టిన మ్యాజిక్ డ్రెయిన్లు గేమ్ ఛేంజర్లుగా మారనున్నాయని కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. శనివారం మండలంలోని సోమవరంలో ఉపాధి హామీ నిధులతో నిర్మించిన మ్యాజిక్ డ్రెయిన్లను డ్వామా పీడీ ఎ.రాముతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కాంక్రీట్ ఛానల్(సీసీ) డ్రెయిన్ల బదులు తక్కువ ఖర్చుతో మ్యాజిక్ డ్రెయిన్లు నిర్మిస్తే పారిశుద్ధ్యం మెరుగుపడి ప్రజలు ఆరోగ్యం బాగుంటుందని చెప్పారు. మీటరు పొడవు సీసీ డ్రెయిన్ నిర్మాణానికి రూ.4 వేలు ఖర్చవుతుందని, అదే మ్యాజిక్ డ్రెయిన్ అయితే రూ.వెయ్యితో నిర్మించవచ్చన్నారు. పైలట్ ప్రాజెక్టు విజయవంతమైతే జిల్లా, రాష్ట్రవ్యాప్తంగా నిర్మిస్తామని చెప్పారు. గ్రామంలో మిగిలిన సిమెంటు రహదారుల వెంట ఈ తరహా డ్రెయిన్లు నిర్మించాలని అధికారులను ఆదేశించారు. ఓ రైతు పొలంలో మునగ విత్తనాలు నాటారు. ఉపాధిహామీ పథకం ప్లాంటేషన్ జిల్లా మేనేజరు ఉషారాణి, ఎంపీడీవో పి.శ్రీనివాసరావు, తహసీల్దారు ఎన్.సురేష్‌బాబు, ఉపాధిహామీ పథకం ఏపీడీ ఎన్.శ్రీనివాసరావు, ఏపీవో శరత్‌బాబు, ఈవోపీఆర్డీ నామేశ్వరరావు, తెదేపా నాయకులు ఉప్పుకొండూరు గురుప్రసాద్, మల్నీడి శ్యామ్‌ప్రసాద్, పల్లెకంటి ప్రభుదాసు, యోగానందం తదితరులు పాల్గొన్నారు.

వైద్యవిద్యార్థులకు న్యాయం చేయండి


ఆందోళనకారులతో మాట్లాడుతున్న రామకృష్ణ

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : విదేశాల్లో వైద్య విద్యనభ్యసించిన విద్యార్థులకు కూటమి ప్రభుత్వం న్యాయం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. శనివారం ధర్నా చౌక్‌లో ఆందోళనలు చేస్తున్న వైద్య విద్యార్థులకు ఆయన సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థుల జీవితాలతో ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ ఆటలాడడం మానుకోవాలని కోరారు. విదేశాల్లో ఎంబీబీఎస్ చదివి, ఏపీలో ఎన్ఎంసీ నిర్వహించిన పరీక్షలో ఉత్తీర్ణులైన వారిని ఇబ్బందులకు గురిచేయడం సరికాదని పేర్కొన్నారు. వీరికి సకాలంలో సర్టిఫికెట్లు ఇవ్వకపోతే పీజీ చేసేందుకు అవకాశం ఉండదన్నారు. ఇప్పటికే ఏడాది సమయం వృథా అయిందని, ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలని ఆయన కోరారు.

తిరువూరు

• తిరువూరు • మైలవరం

నట్టల నివారణ మందుల పంపిణీ

భద్రతపై దృష్టి సారించాలి

యోగా సాధనతో ఒత్తిడి దూరం

ఆయన మాట్లాడుతూ యోగా చేస్తే ఆరోగ్యంగా ఉంటారన్నారు.



మంగా జరగడంలేదని స్థానికులు మేమున్నాం.. మీకు తోడుగాకు తెలిపిన సమస్యపై పంచాయతీ కార్యదర్శి ఎస్.రమారావు స్పందించారు. శనివారం పంచాయతీ సిబ్బందిని పంపి శుభ్రం చేయించారు. -న్యూస్‌టుడే, రెడ్డిగూడెం

అమ్మవార్లకు శాకంబరి అలంకరణ

ఊటుకూరు(గంపలగూడెం), న్యూస్‌టుడే: ఆషాఢ మాసం సందర్భంగా మండలంలోని ఊటుకూరు కోదండ రామాలయంలో శనివారం దేవతామూర్తులకు శాకంబరి అలంకరణ చేశారు. సీతారామలక్ష్మణ, ఆంజనేయస్వామి మూలవిరాట్‌లకు మల్లెలతో అలంకరించారు. రాజ్యలక్ష్మి, గోదాదేవి అమ్మవార్లను వివిధ రకాల కూరగాయలతో అలంకరించగా గ్రామస్థులు దర్శించుకున్నారు. భక్తులకు అర్చకులు ప్రసాదం పంపిణీ చేశారు.



ఊటుకూరు రామాలయంలో గోదా.. రాజ్యలక్ష్మి మూలవిరాట్టులు

రాజుల కోట.. ఏదీ రాచబాట..?

అభివృద్ధికి నోచని కొండపల్లి కోటకు వెళ్లే రహదారులు

కొండపల్లి, న్యూస్‌టుడే

అత్యంత చారిత్రాత్మక గుర్తింపు కలిగిన కొండపల్లి కోటకు ఇప్పటికీ సరైన మార్గం లేదు. 13వ శతాబ్దంలో ఏర్పడిన ఈ కోటలో అనేక రహస్యాలు నిక్షిప్తమై ఉన్నాయి. ఆధునిక పనులు జరుగుతున్న ప్రతిసారి ఏదో కొత్త విషయం బాహ్య ప్రపంచానికి తెలుస్తూనే ఉంది. అయితే కోటకు చేరుకొనే ప్రధానమైన రాళ్ల మెట్ల మార్గం దాదాపుగా కనిపించకుండా పోయింది. కొండపల్లి కోటను ఈ తరానికి తెలియజేయడానికి అనేక ఆధునిక కార్యక్రమాలు చేపట్టినా మార్గం విషయంలో మాత్రం అడుగు ముందుకు వేయలేదు.

కాలక్రమేణా మరుగున: ఈ కోటపైకి చేరేందుకు మూడు మార్గాలు ఉన్నా.. ఒక్క టీవీ టవర్ రోడ్డే అందరికీ ఉపయోగపడుతుంది. 13వ శతాబ్దం రాజుల పాలనలో ఏర్పాటు చేసిన రాళ్ల మెట్ల మార్గం, స్వాతంత్ర్యం అనంతరం సత్తెమ విగ్రహం నుంచి ఏర్పాటైన బిన్నీ కంపెనీ ఘాట్ రోడ్లలో పిచ్చిచెట్లు పెరిగి అధ్వానంగా తయారయ్యాయి. రాళ్ల మెట్ల మార్గం మాత్రం దాదాపు శతాబ్దాల కాలం వరకూ మనుగడలో ఉంది. రాచరిక పాలనలో ఏర్పాటైన ఈ మార్గం నుంచే గుర్రాలు, ఏనుగులతో గ్రామస్థులు సైతం కోటకు చేరుకునేవారు. ఇదిలా ఉంటే అనంతరం ఏర్పడిన బిన్నీ కంపెనీ రోడ్డు 1985 వరకూ అందరికీ అందుబాటులో ఉంది. ఈ మార్గం నుంచి లారీలు, ఇతర వాహనాలు కోట వద్దకు చేరుకునేవి. బిన్నీ కంపెనీ తవ్వి తీసిన ఐరన్ ఓర్‌ను లారీల్లో ఇక్కడి నుంచి ఓడ రేవులకు తరలించేవారు. కాల క్రమంలో ఇవి పూర్తిగా కనిపించకుండాపోయాయి.



బిన్నీ కంపెనీ వేసిన ఘాట్ రోడ్డు

ప్రత్యామ్నాయంగా టీవీ టవర్ రోడ్డు: కొండపల్లి కొండలపై టీవీ టవర్‌ను ఏర్పాటు చేసే క్రమంలో తారు రోడ్డు వేసేందుకు ఆయా శాఖలు అంచనాలు రూపొందించి ఆ రోడ్డును ఇబ్రహీంపట్నం బూడిద చెరువు మీదుగా ఏర్పాటు చేశాయి. దీంతో దాదాపు 45 ఏళ్ల నుంచి ఆ తారురోడ్డుపై నుంచి అందరూ రాకపోకలు సాగిస్తూ కోటను సందర్శిస్తున్నారు.

ప్రతిపాదన వచ్చినా: 2004లో ఉడా ఛైర్మన్‌గా ఉన్న కొల్లి శారద మెట్ల మార్గం ఆధునికీకరించడం, రెయిలింగ్ ఏర్పాటు చేయడం వంటి పనులను కొండపల్లిలో నిర్వహించాలని రూ.50లక్షలతో ప్రతిపాదనలు పిలిచారు. ఆ సమయంలో అధికారాలు మారడంతో ప్రారంభమైన పనులు సైతం నిలిచిపోయాయి. అప్పటి నుంచి ఎవరూ దీనిపై దృష్టి సారించలేదు.



కోటకు ఉన్న రాళ్ల మెట్ల మార్గం

ఇది ఎంతో ఆవశ్యకత: కొండపల్లి బొమ్మల కళా నైపుణ్యానికి, కోటకు చేరుకునే మెట్ల మార్గం, బిన్నీ కంపెనీ మార్గాలు అభివృద్ధి చేయాల్సి ఉంది. ఇటీవల మెట్ల మార్గం నుంచి కోటకు చేరుకున్న కలెక్టర్ లక్ష్మీశ తన అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. ప్రాధాన్య క్రమంలో పర్యాటక, పురావస్తు శాఖల అనుసంధానంతో దీనిపై ప్రణాళిక చేస్తామని ఆయన చెప్పారు.

సీసీ రోడ్డు పనుల ప్రారంభం

జి.కొండూరు, న్యూస్‌టుడే: స్థానిక కేడీసీసీ బ్యాంకు సమీపంలో రూ.3 లక్షల మండల పరిషత్ నిధులతో సీసీరోడ్డు నిర్మాణ పనులను శనివారం ఎంపీపీ లక్ష్మీతిరుపతమ్మ ప్రారంభించారు. ఆ ప్రాంత వాసులు అభ్యర్థన మేరకు 100 మీటర్ల పొడవుతో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో సర్పంచి మండల అరుణ, పీఆర్ ఏఈ సాంబశివరావు, నాయకులు వి.రాంబాబు, వి.సాంబశివరావు, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రావూరి భరద్వాజ జయంతి

జి.కొండూరు, న్యూస్‌టుడే: జ్ఞానపీఠ అవార్డు గ్రహీత రావూరి భరద్వాజ జయంతి వేడుకలను గంగినేని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు వి.నారాయణరావు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన సాహిత్యానికి చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి.నాగరాజు, కె.మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం

కొండపల్లి, న్యూస్‌టుడే: కొండపల్లిలోని శ్రీ విద్య దివ్యాంగుల సేవా సంస్థలో లయన్స్ క్లబ్ ఆఫ్ కొండపల్లి ఇండస్ట్రియల్ పార్క్ సభ్యులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో దండా శ్రావణిరెడ్డి, రఘునాథరెడ్డి, సురేష్, బుల్లిరాజు, సీహెచ్ వెంకటేశ్వరరావులు పాల్గొన్నారు.

మురుగు ఇక్కట్లు తీరాయి

స్థానిక దేవునిచెరువు ప్రధాన రహదారిపై నిలుస్తున్న మురుగు, వర్షపునీటి తొలగింపునకు పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టారు. రహదారి నిర్మాణంలో నాయకుల బాధ్యతారాహిత్యంతో నీరు నిలుస్తున్న వైనంపై 'అటు ఇటు పల్లం.. ఇదెక్కడి విడ్డూరం' శీర్షికన శనివారం 'ఈనాడు' లో ప్రచురితమైన చిత్ర వార్తకు స్పందించారు. పల్లంగా మారిన మార్గంలో నీటిని మురుగు కాలువల్లోకి ప్రవహించేలా పూడిక తొలగించినట్లు కార్యదర్శి రఫి తెలిపారు. -న్యూస్‌టుడే, మైలవరం

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: కాచవరం గ్రామంలో తెదేపా నాయకులు, కేతనకొండ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలపై శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు ఉన్నాయన్నారు. ముఖ్యంగా సన్న బియ్యంతో మధ్యాహ్న భోజనం, ఏకరూప దుస్తులను ప్రభుత్వం అందజేస్తోందన్నారు. అర్హత, అనుభవం ఉన్న ఉపాధ్యాయులతో విద్యా బోధన అందిస్తున్నారన్నారు. బడి ఈడు పిల్లలందరూ బడుల్లో ఉండేలా తల్లిదండ్రులు చొరవ చూపాలన్నారు. తల్లికి వందనం పేరుతో ప్రతి విద్యార్థికి ప్రభుత్వం నగదును పంపిణీ చేసిందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భవానీ, మహమ్మద్ ఇర్ఫాన్‌పాషా, పూర్వ సర్పంచి లేపాక్షిరావు తదితరులు పాల్గొన్నారు.



బడి ఈడు పిల్లలతో ఉపాధ్యాయులు, తెదేపా నాయకులు

వైభవంగా జగన్నాథ రథయాత్ర

గొల్లపూడి, న్యూస్‌టుడే: జగన్నాథ రథయాత్రను గొల్లపూడి గ్రామంలో శనివారం వైభవంగా నిర్వహించారు. జగన్నాథ మందిరం అధ్యక్షుడు దయానిధి ప్రభు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. రథంలో జగన్నాథుడు, బలభద్ర, సుభద్రల విగ్రహాలు కొలువుదీరాయి. అయ్యప్ప ఘాట్ వద్ద రథయాత్రను ప్రారంభించి స్వామివారిని గ్రామ పురవీధుల్లో ఊరేగింపుగా తీసుకువెళ్లారు. గ్రామ తెదేపా నాయకులు బొమ్మసాని సుబ్బారావు, నర్రావాసులు అతిథులుగా పాల్గొన్నారు. హరేకృష్ణ భక్త బృందం వారితో సంకీర్తనలు, భజనలు, నాట్య ప్రదర్శనలు, కోలాటం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. భక్తులకు ప్రసాద వితరణ జరిగింది.



సందడిగా భక్తుల కోలాటం..

అంగన్‌వాడీలకు కనీస వేతనం అమలు చేయాలి



సమ్మె కరపత్రాలు చూపుతున్న సిబ్బంది

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలని సీఐటీయూ అంగన్‌వాడీ హెల్పర్స్, వర్కర్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ సుప్రజ అన్నారు. కార్మిక లోకం ఎదుర్కొంటున్న పలు సమస్యల సాధనకై కమ్యునిస్టు పార్టీల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలంటూ అంగన్‌వాడీ వర్కర్లు ఇబ్రహీంపట్నంలో శనివారం నిరసన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్‌కు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అన్నింటిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కనీసం వేతన చట్టం ప్రకారం వేతనాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి మహేష్, బుల్లెమ్మ, నిర్మల, ముంతాజ్, మణిమ్మ, అంజలి తదితరులు పాల్గొన్నారు.

అధ్వానం.. అటు బండి తోలలేం

మండలంలోని మేజర్ గ్రామ పంచాయతీ ఊటుకూరు ప్రధాన రహదారి అధ్వానంగా ఉంది. తారు రోడ్డు మట్టి రోడ్డుగా మారింది. గుంతలు ఏర్పడి వర్షం కురిసినప్పుడు నీరు నిలిచి అపరిశుభ్రంగా తయారవుతోంది. గుంతలకు మరమ్మతులు చేయించేందుకు ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకోవడంలేదని మండిపడుతున్నారు. పొట్టి శ్రీరాములు విగ్రహం నుంచి కల్లూరు వెళ్లే మార్గంలోని ఎస్‌బీఐ బ్యాంక్ వరకు ఇదే పరిస్థితి. నెమలి వెళ్లే రహదారి మలుపు వద్ద గుంతలో నీరు నిలిచి ప్రయాణికులు రాకపోకలు సాగించేందుకు అసౌకర్యానికి గురవుతున్నారు. అధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న గుంతలు పూడ్చించాలని గ్రామస్థులు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, ఊటుకూరు (గంపలగూడెం)



వదిలేసినా పట్టించుకోరా..?

మురుగునీటి పారుదల సౌకర్యంలేని వాణిజ్య సముదాయం నుంచి వచ్చే వాడుక నీరంతా రోడ్డుపైకే చేరుతుండడంతో పుల్లూరు ప్రధాన రహదారి దుర్భరంగా మారుతోంది. చాలా కాలంగా సమీపంలో దుకాణాల నుంచి వచ్చే నీటిని ఏకంగా రహదారిపైకి వదిలేస్తున్నారు. బురదమయంగా మారిన మార్గం వల్ల ఇబ్బందులు పడుతున్న వైనాన్ని స్థానికులు అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నా కనీస చర్యలు తీసుకోవడంలేదు. దీంతో వర్షాకాలంలో మరింత ఇబ్బందికరంగా మారుతోందని ప్రజలు, వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. - న్యూస్‌టుడే, మైలవరం



ఇది సీసీ రోడ్డులా ఉందా..?

కూనపరాజు పర్వ గ్రామంలోని గ్రంథాలయం కూడలిలో సీసీ రహదారి బురదకయ్యగా మారడంతో జనం ఇక్కట్లు పడుతున్నారు. ఈ రోడ్డు పల్లంగా ఉండడంతో కొద్దిపాటి వర్షం పడినా నీరంతా అక్కడికే చేరి పాదచారులు, ద్విచక్రవాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్కడ మరమ్మతులు చేసి రాకపోకలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. -న్యూస్‌టుడే, రెడ్డిగూడెం



640 కేసుల పరిష్కారం

తిరువూరు, న్యూస్‌టుడే: తిరువూరు న్యాయస్థానంలో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో 613 సివిల్, 27 క్రిమినల్ కేసులు పరిష్కారమైనట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సీహెచ్.వెంకటరెడ్డి తెలిపారు. లోక్ అదాలత్‌లో జూనియర్ సివిల్ జడ్జి ఎ.సింధూర, జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ కోర్టు జడ్జి కె.సూర్యతేజ పాల్గొని మొత్తం 640 కేసులు పరిష్కరించినట్లు తెలిపారు. సీనియర్ న్యాయవాదులు టి.రామారావు, ఎస్.జనార్దనరావు, ఆర్.శ్రీనివాసరావు ఎస్‌కే.సుభాని తదితరులు పాల్గొన్నట్లు తెలిపారు.



లోక్ అదాలత్‌లో జడ్జీలు సింధూర, సూర్యతేజ, పాల్గొన్న న్యాయవాదులు

మైలవరం, న్యూస్‌టుడే: జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక న్యాయస్థానం పరిధిలోని 93 కేసులను పరిష్కరించినట్లు కోర్టు వర్గాలు తెలిపాయి. ఆయా కేసులను ఏలూరు జిల్లా నూజివీడు కోర్టులో ఇన్‌ఛార్జి న్యాయమూర్తి ఓ.అనూష ఆధ్వర్యంలో పరిష్కరించినట్లు పేర్కొన్నారు.

గౌరవ వేతనం విడుదలకు వినతి

ఎ.కొండూరు: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం ఎంపీపీ కె.నాగలక్ష్మి అధ్యక్షతన ఏర్పాటు చేశారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ఆయా శాఖల అధికారులతో సమీక్షించారు. గత రెండేళ్లుగా స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు గౌరవ వేతనం మంజూరు చేయడం చేయడంలేదని సర్పంచులు, ఎంపీటీసీలు ఎంపీడీవో శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. జడ్పీటీసీ బి.గనియా, వైస్ ఎంపీపీ జి.శివారెడ్డి, ఎంఈవో కేశవరావు, ఏవో సాయిశ్రీ, పీఆర్ ఏఈ పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

ఉపాధి హామీ సిబ్బందికి జరిమానా

తిరువూరు, న్యూస్‌టుడే: ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ పనుల్లో అవకతవకలకు జరిగితే ఉద్యోగాలు ఊడిపోతాయని డ్వామా పీడీ ఎ.రాము హెచ్చరించారు. మండలంలో 2024 ఏప్రిల్-2025 మార్చి వరకు జరిగిన 1630 పనులపై రెండు రోజులు పాటు నిర్వహించిన సామాజిక తనిఖీల ప్రజా వేదిక శనివారం రాత్రి ముగిసింది. మండల పరిధిలో జరిగిన సామాజిక తనిఖీల ద్వారా గుర్తించిన లోపాలపై సంబంధిత సిబ్బందికి రూ.8.25 లక్షలు రికవరీ, రూ.4.50 జరిమానా విధించినట్లు చెప్పారు. ఏపీడీ పార్థసారథి, ఎంపీడీవో రవిబాబు, ఏపీవో ఎస్.మాధవరెడ్డి పాల్గొన్నారు.

సామాజిక తనిఖీపై అవగాహన ప్రదర్శన

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం సామాజిక తనిఖీపై శనివారం అన్నేరావుపేట గ్రామంలో ప్రదర్శన నిర్వహించారు. సర్పంచి బి.ప్రశాంతి తెదేపా నాయకులు బి.రమేష్, డి.వేణు, ఎన్.సత్తిబాబు, బి.గోపి, పాల్గొన్నారు.

తమ్ముడిని హతమార్చిన అన్నపై కేసు

తిరువూరు, న్యూస్‌టుడే: మద్యం తాగి ఆరోగ్యం పాడు చేసుకోవద్దని హెచ్చరించినందుకు జరిగిన వివాదంలో అన్న చేతిలో తమ్ముడు హతమయ్యాడు. ఎస్సై కేవీజీవీ.సత్యనారాయణ శనివారం తెలిపిన వివరాలిలా.. పట్టణానికి చెందిన చెన్నోజు సుబ్బాచారి(45) మద్యానికి బానిసై అనారోగ్యానికి గురికాగా ఇటీవల అతడి తల్లి శారద వైద్యం చేయించి మద్యం తాగవద్దని హితవు పలికారు. గత నెల 27న సుబ్బాచారి మళ్లీ తాగి ఇంటికి రావడంతో ఆమె పెద్ద కొడుకైన శ్రీనివాసాచారికి సమాచారం అందించగా అన్నాతమ్ముళ్ల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ క్రమంలో అన్న శ్రీనివాసచారి క్రికెట్ బ్యాట్‌తో తమ్ముడు సుబ్బాచారి తలపై బలంగా మోదాడు. వెంటనే క్షతగాత్రుడిని కుటుంబ సభ్యులే గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేయిస్తుండగా శుక్రవారం రాత్రి మృతి చెందాడు. ఎస్సై సత్యనారాయణ హత్య కేసు నమోదు చేశారు. తిరువూరు సీఐ కె.గిరిబాబు దర్యాప్తు చేపట్టారు.

తెదేపా మండల..పట్టణ శాఖల అధ్యక్షుల నియామకం



పేర్లు ప్రకటిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు, పరిశీలకులు సుఖవాసి శ్రీనివాసరావు, గన్నె ప్రసాద్, సాంబశివరావు

గంపలగూడెం, తిరువూరు, విస్సన్నపేట, న్యూస్‌టుడే: తెదేపా మండల, పట్టణ శాఖల అధ్యక్షుల పేర్లను శనివారం రాత్రి విజయవాడలోని ఎంపీ కేశినేని శివనాథ్ కార్యాలయంలో నియోజకవర్గ పరిశీలకులు సుఖవాసి శ్రీనివాసరావు, సంస్థాగత ఎన్నికల రాష్ట్ర పరిశీలకులు గన్నె ప్రసాద్(అన్న), నవనీతం సాంబశివరావుతో కలిసి ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ప్రకటించారు. గంపలగూడెం మండలానికి మానికొండ రామకృష్ణ, విస్సన్నపేటకు రాయల సుబ్బారావు, తిరువూరు పట్టణానికి మల్లెల శ్రీనివాసరావు, తిరువూరు మండలానికి దుబ్బాక వెంకటేశ్వర్లు ఎన్నికైనట్లు తెలిపారు. అదేవిధంగా తిరువూరు పట్టణంలోని 20 వార్డులు, తిరువూరు, గంపలగూడెం, విస్సన్నపేట మండలాల పరిధిలోని 55 గ్రామాలకు ఎంపికైన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, నియోజకవర్గ పరిశీలకులు సుఖవాసి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. రెండు నెలలపాటు నియోజకవర్గంలోని గ్రామాల్లో పర్యటించి సామాజిక న్యాయం అమలు చేస్తూ గ్రామ, మండల, పట్టణ శాఖలకు తెదేపా కొత్త కార్యవర్గాలను నియమించినట్లు తెలిపారు. ఎ.కొండూరు మండల శాఖ అధ్యక్షుడిని కూడా వారం రోజుల్లో ప్రకటిస్తామని చెప్పారు. మండల, పట్టణ శాఖలకు నియమితులైన అధ్యక్షులు అందరూ గత కొన్నేళ్లుగా తెదేపా బలోపేతానికి కృషి చేస్తున్నారన్నారు. పోటీ లేని చోట ఏకగ్రీవంగా, పోటీ ఉన్న చోట అత్యధికుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకునే నియామకాలు జరిగాయన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులు ఘన విజయం సాధించేందుకు నూతన అధ్యక్షులు కృషి చేయాలని రాష్ట్ర పరిశీలకులు ప్రసాద్ సూచించారు.

ఏళ్లుగా మభ్యపెడుతున్నారు

గంపలగూడెం, న్యూస్‌టుడే: మండలంలోని వినగడప సమీప కట్లేరుపై వంతెన నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించాలని కోరుతూ శనివారం సీపీఎం నాయకుల ఆధ్వర్యంలో అక్కడి మళ్లింపు రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ప్రభుత్వాలు మారుతున్నా ప్రయాణికుల కష్టాలు పట్టించుకోవడం లేదని ఆయా నాయకులు విమర్శించారు. ఏడేళ్లుగా పాలకులు, అధికారులు కట్లేరుపై వంతెన నిర్మించకుండా ప్రజలను పలు రకాల జీవోలతో అనుమతులు వచ్చాయంటూ మభ్యపెడుతున్నారని ఆరోపించారు. సమాచారం అందుకున్న ఎస్సై శ్రీను తన సిబ్బందితో వచ్చి రాస్తారోకో చేస్తున్న నాయకులను అక్కడి నుంచి పక్కకు పంపించారు. సీపీఎం గంపలగూడెం, ఎ.కొండూరు మండలాల కార్యదర్శులు ఎం.వెంకటరెడ్డి, పి.ఆనందరావు, జిల్లా నాయకులు ఎం.నాగేంద్రప్రసాద్, జి.సీతారామిరెడ్డి, జె.వెంకటేశ్వరరావు, ఎం.కుటుంబరావు, ఎం.గోపాలకృష్ణ, జనార్దనాచారి పాల్గొన్నారు.



రాస్తారోకో చేస్తున్న సీపీఎం నాయకులు

చెరువు కట్టకు మరమ్మతులు

మైలవరం: గత ఏడాది భారీ వర్షాలకు తెగిపోయిన మండలంలోని తూర్పు చెరువు కట్ట పటిష్ఠత, మరమ్మతుల పనులను శనివారం ప్రారంభించారు. భారీగా కోతకు గురవడంతో, అప్పట్లోనే తాత్కాలిక మరమ్మతులు చేయించారు. ప్రస్తుతం ఆ గ్రామ తెదేపా నాయకుల ఆధ్వర్యంలో చెరువు మట్టిని కట్టకు తరలించి, వెడల్పు చేసే పనులు నిర్వహిస్తున్నారు.

సమస్యలు పరిష్కరించాలి

తిరువూరు, న్యూస్‌టుడే: పురపాలిక ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శనివారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయం వద్ద సదరు ఉద్యోగులు ప్రదర్శన నిర్వహించారు. జీవో నంబరు 36 ప్రకారం వేతనాలు చెల్లించాలని, వయో పరిమితి 62ఏళ్లకు పెంచాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ నాయకులు బి.వెంకటేశ్వరరావు, పి.శ్రీనివాసరావు, ఎస్.బాజీ, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



పురపాలిక ఇంజినీరింగ్ కార్మికుల ఆందోళన

రాష్ట్రంలో పారదర్శక పాలన



గొల్లపూడి: ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేస్తున్న మాజీ మంత్రి దేవినేని



జి.కొండూరు కట్టుబడిపాలెంలో..

గొల్లపూడి, న్యూస్‌టుడే: సూపర్-6 పథకాలు అమలు చేయడం ద్వారా ప్రజల్లో సంతోషం నెలకొందని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని గొల్లపూడిలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలకు పారదర్శకమైన పాలన అందుతోందన్నారు.

మైలవరం, న్యూస్‌టుడే: స్థానిక తారకరామానగర్‌లో నాయకులు లీలేష్, బాలకృష్ణ, బాబూరావు, షహనవాజ్, ఆంజనేయులు, సుభాని కరపత్రాలు అందజేశారు.

కొండపల్లి, న్యూస్‌టుడే: కొండపల్లి 17వ బూత్‌లో పురపాలిక వైస్ ఛైర్మన్ శ్రీను, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ ఉమా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించారు.



విస్సన్నపేట: కొర్లమండలో..

జి.కొండూరు, న్యూస్‌టుడే: కట్టుబడిపాలెంలో నియోజకవర్గ పరిశీలకుడు దారునాయక్, రాష్ట్ర పార్టీ సంయుక్త కార్యదర్శి జంపాల సీతారామయ్య కరపత్రాలు పంపిణీ చేశారు.

ఊటుకూరు(గంపలగూడెం), విస్సన్నపేట, న్యూస్‌టుడే: ఊటుకూరు ఎన్డీయే కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల కరపత్రాలను తెలుగు రైతు జిల్లా కార్యదర్శి సీహెచ్.రాజశేఖరరావు ఆధ్వర్యంలో ఇంటింటా పంపిణీ చేశారు.

'స్మార్ట్ మీటర్లు వద్దు'

గంపలగూడెం, న్యూస్‌టుడే: స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా సీపీఐ నాయకుల ఆధ్వర్యంలో శనివారం గంపలగూడెం మండల పరిషత్ కార్యాలయం వద్ద నియోజకవర్గ, మండల కార్యదర్శులు ఎస్‌కే.నాగుల్‌మీరా, జి.రామకృష్ణ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకోవాలని నినాదాలు చేశారు.

తిరువూరు, న్యూస్‌టుడే: పట్టణంలో సీపీఐ నాయకులు జిల్లా, పట్టణ, మండల కార్యదర్శులు టి.కృష్ణయ్య, సీహెచ్.వెంకటేశ్వరరావు, ఎం.ఉదయ్, ఎస్‌కే.సుభాని ఆధ్వర్యంలో శనివారం చీరాల కూడలిలో ధర్నా చేశారు.

ఎ.కొండూరు, న్యూస్‌టుడే: సీపీఐ నాయకులు ఎం.దేవిక్, ఎం.వెంకటేశ్వరరావు తదితరుల ఆధ్వర్యంలో తహసీల్దారు కె.లక్ష్మికి వినతిపత్రం అందజేశారు.

విస్సన్నపేట, న్యూస్‌టుడే: సీపీఐ మండల కార్యదర్శి మర్రిశెట్టి త్యాగరాజు ఆధ్వర్యంలో స్థానిక విద్యుత్తు ఉపకేంద్రం వద్ద ధర్నా చేశారు. కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.



తిరువూరు చీరాల సెంటర్‌లో సీపీఐ నాయకుల ధర్నా

EENADU Classifieds

AGRI BUSINESS

గుడివాడ రామనపూడిలో 20,000 బ్రాయిలర్ పౌల్ట్రీ ఫార్మ్ లీజుకు కలదు. ✆ 91777 59109.

AUTO

VEHICLES FOR SALE

2021 Model KIA Seltos HTK Plus Petrol Manual, White Color Excellent Condition for Sale. ✆ 92463 40700

2021 Model ★ TATA Tippers - 4 No.s ★ Good Condition For Sale ✆ 99496 60655.

మంచి కండిషన్‌లో ఉన్న AL 3518, 12 టైర్స్ గల లారీలు రెండు అమ్మబడును. ✆ 81061 43295.

BUSINESS SERVICES

BUSINESS OFFER

Wanted investors for Solar Power Project in 300 acres 100 megawatts location: Sangam, Nellore District. ✆ 7989247568.

FOR SALE

గుంటూరు, స్నూకర్ సంబంధించిన క్లాత్ బెంచ్, ఫర్నిచర్, ల్యాంప్, కుషన్లు, ఫ్రిడ్జ్, టీవీ, టేబుల్ 2016 & 2017 మోడల్, 37 సీట్ అమ్మబడును. 94948 05749.

PACKERS & MOVERS

Tirumala Packers & Movers an ISO 9001:2015 Certified Co. Household Goods Shifting Any Time Any Where. ✆ 97043 64389, 92900 87673.

SOLAR PRODUCTS

PM సూర్య ఘర్ ద్వారా 3.3 KW సోలార్ సిస్టం 2,10,000/- & 78,000/- రూ. సబ్సిడీ + ఉచిత ఇన్‌స్టాలేషన్ + 90% బ్యాంక్ లోన్ [illegible] 30 Years వారంటీ. ✆ 98667 28063.

BUILDING CONSTRUCTION

Raghava Constructions. We do Building Contracts on Turn Key basis for VMC / APCRDA approvals, Vasthu, Plans, elevations & structural Designs. ✆ 98851 12999.

20 సం||ల [illegible] 100% [illegible] S.Ft. [illegible] KSB Constructions, VJA. ✆ 95531 31548.

ARCHITECT & ENGINEERS

Civil supervisor కావలెను. ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ అంతటా poultry farms ఉన్న కంపెనీ కొరకు, 15k-20k , vinukonda దగ్గర పోస్టింగ్ ఇవ్వబడును. తరువాత వేరే sites కూడా వెళ్ళవలసి ఉంటుంది. ✆ 9177262347

WATER PROOFING

Tarun Slab Leakage Works ★ 25 Yrs. Exp. ★ 5 Yrs. Warranty ★ Bathroom Leakage, Grouting Epoxy Works. ✆ 94940 02285, 99516 07504.

101% వాటర్ ప్రూఫింగ్ [illegible] ✆ 80967 22999/ [illegible] 99124 71999. www.water-proofing.in

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసినదిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిముల విషయంలో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకు అమ్మకం లేదా అందించే సేవల విషయంలో ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తలను బ్లాక్‌లిస్ట్‌లో ఉంచటం మరియు/ లేదా అవసరమైతే చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

EDUCATION

పారా మెడికల్ Diploma in Medical Laboratory Technology, Diploma in Operation Theater Technology, Diploma in Anaesthesia Technology, Diploma in Cardiology, MPHA కోర్సు, Inter, MLT. Inter MPHW (F) అడ్మిషన్లు జరుగుచున్నవి. అమృత ఇన్‌స్టిట్యూట్, విజయవాడ. [illegible] ✆ 98482 42880.

TUITIONS

Mathematics for Inter, EAMCET, ECET, DIPLOMA & MECHANICAL Engineering Subjects for Diploma, B.Tech. K.S.Ravi Opp: Kandhari Hotel Gate ✆ 99634 96844.

TUITIONS
INTER: Maths, Phy, Chem. EAPCET Also Only 3000/- PM Time: 6 Pm To 9 Pm
Labbipet, VJA
✆ 90140 78430

Weekend Home Tuitions (Online & Offline) LKG to PG, NEET, IIT, JEE, EAMCET. Home Tuition కావాలా (ట్యూటర్) ✆ 63043 88766.

SPOKEN HINDI

Learn Online / Offline Spoken Hindi / English, French & German within 30 days. 100% Guarantee for all Ages. Free Demo. Cont ✆ 98495 42456.

HOME TUITIONS

Vijayawada Home Tutions LKG - 10th (CBSE / ICSE / State) IIT / JEE / NEET (All Subjects) 70751 23677.

Are u looking for the best Home Tuition for your Kids? LKG - 10th (CBSE / State Syllabus) 18 Years of Teaching Excellence. ✆ 90109 99177.

ప్రతిభ (ఆన్‌లైన్ & ఆఫ్‌లైన్) ట్యూషన్స్ LKG to PG, NEET, IIT, EAMCET, B.Tech. CA-CPT, BIT-SAT [illegible] ✆ 92900 05677, 74165 35749.

FINANCIAL SERVICES

[illegible] ✆ 96665 47438.

[illegible] ✆ 83099 11995, 93904 35013.

HOME NEEDS

PEST CONTROL

Priyanka Pest ★25 Yrs. Exp. 5 Yrs. Warranty. Smell Less Bayer Chemicals (Pest & Other Insects Control). ✆ 94924 82494, 93932 30136.

Tarun Pest ★ 25 Yrs. Exp. ★ 5 Yrs. Warranty ★ Smell Less ★ Bayers Chemicals (Pest and Other Insects Control). ✆ 94940 02285, 99516 07504.

INDUSTRY

INDUSTRIAL SHED

Running Condition Detergent soap Unit for sale Contact : 9866077613

PROFESSIONAL SERVICES

ఉచిత న్యాయ సలహాలు- సివిల్, క్రిమినల్, ఫ్యామిలీ, కన్స్యూమర్. VJW. ✆ 93467 04003

ASTROLOGY

[illegible] VJA ✆ 63026 94747.

PEOPLE CARE

రామకృష్ణ గ్రూప్ (AP No. 1) VJA. [illegible] ✆ 95420 85588, 95423 05588.

REAL ESTATE

సిద్ధార్థ అమరావతి [illegible] (SAV) Plots [illegible] CRDA [illegible] ✆ 93903 41499.

గుంటూరు సిటీ, [illegible] ✆ 99399 55545.

VJ [illegible] APCRDA [illegible] RERA [illegible] ✆ 78808 00789.

A.P. రాజధాని అమరావతిలో [illegible] ✆ 96035 30555.

గుంటూరు సిటీ, [illegible] A1 [illegible] ✆ 73823 96677.

[illegible] 9492118999.

బందరు రోడ్డు [illegible] ✆ 92906 88557, 92460 30956.

గొల్లపూడి, [illegible] ✆ 93970 43430.

మొగల్రాజపురం [illegible] ✆ 92464 12213.

FLAT FOR SALE

KANURU

[illegible] 100 Ft. [illegible] 3 BHK, 2 BHK [illegible] ✆ 91826 60539.

2400 Sft, 3 BHK Dulexe Flats for Sale with all facilities near Ratnadeep Super Market, Kanuru. ✆ 89196 79256, 99898 55219.

కానూరు Shamrock [illegible] ✆ 81218 85555.

కానూరు [illegible] 155 [illegible] G+1 [illegible] ✆ 70750 17255.

Occupancy [illegible] E/F, W/F 3 BHK [illegible] 1700 Sft [illegible] 100% [illegible] ✆ 81214 07585.

2&3 BHK [illegible] E/F [illegible] 1362 Sft [illegible] 2114 Sft [illegible] ✆ 97017 98726, 89196 79256.

TADIGADAPA

Poranki, Prabhu Nagar: Premium Individual, E/F, New 3 BHK (Total 2500 S.Ft. & Plinth 1850 S.Ft.) Flats Sale, All Facilities. UD 77 Yards. ✆ 89789 14242.

VJA తాడిగడప [illegible] 2 BHK 1150 Sft. [illegible] ✆ 81435 55360, 98850 50576.

తాడిగడప, [illegible] 3BHK (2150 S.Ft.) [illegible] ✆ 98483 31213.

CURRENCY NAGAR

[illegible] ✆ 99485 98331.

VJA, కరెన్సీనగర్, [illegible] 2& 3& 4BHK [illegible] ✆ 86884 66789.

GANNAVARAM

2 & 3 Premium BHK Ready to Occupy Flats for Sale at Vijaya Meadows, Gannavaram Very near to HCL. ✆ 94945 30066.

[illegible] Ready to Occupy 2 BHK [illegible] ✆ 91826 60539, 95778 99999.

విజయవాడ ఎయిర్‌పోర్ట్, HCL, [illegible] Elite Vistas [illegible] 444 [illegible] 5 BHK Triplex Villa [illegible] 267 [illegible] 3 BHK [illegible] ✆ 91000 82222.

పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కాలేజ్ & హాస్పిటల్‌కి అతి దగ్గర్లో ELITE బృందావన్, గేటెడ్ కమ్యూనిటీ నందు 165చ॥గ॥ల్లో 2BHK ఇండిపెండెంట్ హౌస్‌లు పూర్తి డెవలప్‌మెంట్స్‌తో బ్యాంకు లోన్ సౌకర్యంతో కలవు. ✆ 91000 71111.

TADEPALLI

గృహప్రవేశమునకు సిద్ధముగా విజయవాడ-గుంటూరు హైవేకి దగ్గరలో తాడేపల్లి టౌన్‌లో, రెయిన్‌బో విల్లాస్‌కి సమీపంలో, నవోదయ కాలనీనందు 25 ఫ్లాట్స్‌తో, తూర్పు, పడమర ఫేసింగ్‌తో 3 BHK లగ్జరీ ఫ్లాట్స్ (1750 S.Ft.) అన్ని సౌకర్యములతో అమ్మకమునకు కలవు. ✆ 99088 45511.

SATYANARAYANAPURAM

2BHK Flat in SN Puram, VJA For Sale, 24yrs old, Around 1350Sq.feet including Free Space. No car Parking. Ph: 8179800259

GENERAL

Independent 3 Bhk Flat with Attached Bath, Drawing Hall, Kitchen, Dining Hall with L-Shaped Big Balcony, Including All Amenities, Car Parking at "Akruti Appartments, Indiranaik Nagar, Ajitsingh Nagar Area" Vijayawada. Contact: 9535593572.

2BHK West Facing 1000 S.Ft., Commercial Flat for sale in Kavuri Towers, Kamayyathopu Center, VJA. ✆ 81422 45999.

భవానీపురం టెలిఫోన్ కాలనీ, బ్రహ్మానంద వీధి, M.S.N. Sunrise-2. న్యూ అపార్ట్‌మెంట్ 5th ఫ్లోర్ E/F, 3BHK ఫ్లాట్ 1753 S.Ft.తో పుల్లీ ఫర్నిష్డ్ కార్ పార్కింగ్‌తో అమ్మకం. ✆ 89774 77477/ 89778 99899.

LAND OWNER'S SHARE
2 BHK, 3 BHK, Deluxe Flats
Ready to Occupy
Poranki to Nidamanuru Main Road East Facing Apartment
✆ 98481 45800 76708 81144

3BHK ఫ్లాట్స్ అమ్మకం. 3rd & 5th ఫ్లోర్స్ కలవు. ఫ్లింత్ : 1350 S.Ft., మొత్తం : 1795 S.Ft., ఫ్లాట్ నెం: 147, Trendset Meadows, మధురానగర్, VJA. ✆ 89777 88889, 89777 77797.

పోరంకి బందరు రోడ్డు VRR Vaibhavam గేటెడ్ కమ్యూనిటీనందు 4169 Sft 4 BHK + హోమ్ థియేటర్‌తో Duplex Flat అమ్మకమునకు కలదు. ✆ 96768 15555.

ఈడుపుగల్లులో 800చ॥అ॥ Un finished 2B/R Flats-2, మరియు 1400 S.Ft., 2B/R Finished Flat అమ్మకం మరియు అశోక్‌నగర్‌లో 144గ॥ స్థలం అమ్మకం. ✆ 96668 24804.

గుణదల ప్రశాంత్‌కాలనీ 2nd రోడ్ ఉలవచారు కంపెనీ వద్ద 1150 Sft. 2 BHK ఫ్లాట్ తూర్పు, ఉత్తరం ఫేస్, కబోర్డ్స్, కార్ పార్కింగ్‌తో 39 లక్షలకే అమ్మకం. ✆ 70137 23023 / 96427 20729.

VJA ఇబ్రహీంపట్నం MRO ఆఫీస్ ఎదురు రోడ్‌లో మూర్తిగారి హాస్పిటల్ దగ్గర గ్రూప్ హౌస్‌లో 2 BHK ఫ్లాట్ సెంటు స్థలం రిజిస్ట్రేషన్‌తో అమ్మకంనకు కలదు. ✆ 96403 37555.

2BHK 1200 Sft, Multiple Flats E/F, 100% Vastu, Ready to Occupy At Muralinagar and Singh Nagar. Ph: 7801040404

3 BHK Flat for Sale in Loyola Gardens Near Sentini Hospital & Loyola College Main Gate. Ph: 8184838980

2 BHK, N/F 850 S.Ft., Plinth 1050 Total, 50 Sqrd U/D Satyam Towers FS-2, No. Lift, No Car Parking, Maruthi Nagar, Eluru Road, VJA. ✆ 98851 12999.

FLATS for SALE
(2 Car Parking)
4BHK 3150 Sft, floor wise 5 Flats in Bharathi Nagar
4BHK 2850 Sft, 10 Flats in Kanuru
✆ 9989855219

New 3 BHK East Face, 1800 Sq. Ft., 2nd & 3rd Floors with full wood work ready to occupy in Marvel Heights, 2 Flats / Floor, Mahanadu Road, VJA. ✆ 94405 28023.

3B/R + Home Theatre E/F, 1540 S.Ft., with Car Park, Furnished, 12 Yrs Old, UDS 58 Yards @ Ramachandra Nagar, Vijayawada. ✆ 98495 68939.

2BHK, 900 S.Ft., East face Flat No: 302, Surya Mansion, with cupboards, Carparking, near park N Hotel, NTR Colony, VJA. UDS: 45 Yards. (55 Lk. Neg.) ✆ 94907 93423/ 98664 74637.

2BHK West Face 2nd Floor 1200 S.Ft., Lift Generator, Car Parking for Resale in Poranki, VJA. ✆ 94406 55141.

3 BHK (New) 1345 Sft C709 7th Floor, Siris Vertex Apt, Gated Community, One Car Parking for Sale. Behind Siris Compnay, VJA. ✆ 98481 11211.

3BHK లగ్జరీ ఫ్లాట్
కామయ్యతోపు సెంటర్ వద్ద బందరు రోడ్డుకి వాకబుల్ డిస్టెన్స్‌లో మొత్తం 2353 Sft తో ఫ్లోర్‌కి ఒక ఫ్లాట్ చొప్పున నిర్మించిన 3BHK ఫ్లాట్ 5th ఫ్లోర్‌లో అమ్మకం
✆ 99483 46699

Deluxe 3BHK Flats 1522 S.Ft. for sale, near SS Convention, Y.V.Rao Hospital Road, Labbipet, Vijayawada. Ready to Occupy. No GST. ✆ 98481 77277.

గృహప్రవేశమునకు సిద్ధంగా 2 BHK & 3 BHK ఫ్లాట్స్ ప్రసాదంపాడు వివేకానంద స్కూల్ రోడ్‌లో నేషనల్ హైవేకి 100 మీ॥ దూరంలో ఎకరం స్థలం 75 ఫ్లాట్స్‌తో టొప్పన వారి సంకల్ప్ కాసా అపార్ట్‌మెంట్‌నందు A/C, జిమ్, చిల్డ్రన్ ప్లే ఏరియా, పార్క్ మొ॥ సౌకర్యములతో అమ్మకమునకు కలవు. ✆ 99088 45111.

గన్నవరం సెయింట్ జాన్స్ స్కూల్ ప్రక్కన శ్రీనగర్ కాలనీలో నూతనంగా నిర్మించిన భాను ఎంపైర్ నందు 2 BHK ఫ్లాట్స్ రెడీ టూ ఆక్యుపై అమ్మబడును. వెంకట్. ✆ 98481 47485.

విజయవాడ మహానాడు రోడ్డు గణేష్‌నగర్ కాలనీ నందు సత్య రెసిడెన్సీలో 1st ఫ్లోర్ మరియు 5 ఫ్లోర్‌లో 2110 Sft. 3 BHK ఫ్లాట్స్ అమ్మబడును. ✆ 92480 77299.

FLAT FOR SALE
పెనమలూరు Z.P. హైస్కూల్ దగ్గర గల అపార్ట్‌మెంట్ 1St ఫ్లోర్ ఈస్ట్ ఫేసింగ్ 2 BHK ఫ్లాట్ అమ్మకానికి కలదు
✆ 94908 77796 97054 91111

2350 S.Ft. గల న్యూ 3 BHK లగ్జరీ ఫ్లాట్స్ అన్ని సదుపాయాలతో అమ్మకానికి కలవు. ప్రియ పిల్లల హాస్పిటల్ దగ్గర, పంటకాలువ రోడ్, పటమట. ✆ 97017 98726, 93931 88388.

పోరంకి బందరు రోడ్డుకి దగ్గరగా టెలిఫోన్ ఎక్స్చేంజ్ రోడ్డులో 2 BHK ఫ్లాట్ అన్ని సౌకర్యములతో అమ్మకమునకు కలదు. సంప్ర ✆ 92464 75466.

సింగ్‌నగర్, నందమూరినగర్‌లో శ్రీదుర్గ ఎన్‌క్లేవ్ నందు 2BHK G+2 ఫ్లాట్స్ టోటల్‌గా అమ్మబడును. ప్లాన్ & BPS కలదు రైల్వే : ✆ 83411 32777, 99898 92474.

కానూరు సూపర్ బిజ్ రోడ్డునందు ఫ్లోర్‌కి ఒక 3 BHK కలిగి ఉన్న ఇండివిడ్యువల్ అపార్ట్‌మెంట్‌నందు గృహ ప్రవేశనకు సిద్ధంగా ఉన్న లగ్జరీ ట్రిబుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్స్ అమ్మకానికి కలవు. ✆ 98488 50675.

అశోక్‌నగర్ బందరు రోడ్డుకి అతి సమీపమున పప్పుల మిల్లు బస్టాప్ నందు నిర్మించిన 3 BHK ఫ్లాట్స్ గృహప్రవేశమునకు సిద్ధముగా కలవు. ✆ 73829 81107.

COMMERCIAL SPACE FOR RENT
1500 Sq.ft 3rd Floor, Near Ayush Hospital, High Tension Line Road, Vijayawada
PH.9848120049

పోరంకి to నిడమానూరు రోడ్డులో North/ East కార్నర్ 2 BHK Flat అమ్మకమునకు కలదు. (Plinth 1300 S.Ft.). ✆ 91691 75959, 90102 46655.

2BHK 1275 S.Ft (పడమర ఫేస్) పుల్లీ ఫర్నిష్డ్ 5 వ ఫ్లోర్ బందరు రోడ్డుకు అతి దగ్గరలో పోరంకి నందు అమ్మకమునకు కలదు. (నో బ్రోకర్స్) ✆ 81214 78167.

విజయవాడ అయ్యప్పనగర్ వీరసవర్కార్ రోడ్డులో SKR హైట్స్‌నందు వెస్ట్ ఫేస్ 1200 Sft గల 2 BHK ఫ్లాట్ లిఫ్ట్, కార్ పార్కింగ్‌తో గృహప్రవేశమునకు కలదు. ✆ 98492 33345.

VJA, గాయత్రి నగర్, నలంద స్కూల్ ఎదురుగా, వాహిని అపార్ట్‌మెంట్ 3rd ఫ్లోర్, నార్త్/ ఈస్ట్ కార్నర్ 2 B/R ఫ్లాట్ (1400 S.Ft.) లిఫ్ట్, 2 వీలర్ పార్కింగ్‌తో అమ్మబడును. ✆ 99895 30361.

విజయవాడ, డాక్టర్స్ కాలనీ: New 3 BHK (1600 S.Ft) అమ్మకం. ఈస్ట్ & వెస్ట్ ఫేసింగ్‌తో గృహప్రవేశనకు సిద్ధంగా కలవు. AVS రెడ్డి రోడ్డు: ✆ 94402 42092/ 92464 74817.

విజయవాడ, మహానాడు రోడ్డు, రామచంద్రనగర్‌లో 1950 S.Ft. గల 3 BHK ఫ్లాట్ కబోర్డ్స్, కార్ పార్కింగ్‌తో అమ్మకానికి కలదు. ✆ 99497 88497.

పాత చెక్‌పోస్ట్ సెంటర్‌నందు శ్రీదేవి టవర్ చైతన్య స్కూల్ ఎదురుగా త్రీ బెడ్‌రూమ్ అపార్ట్‌మెంట్ కలదు. 1435 Sft, 48 Yards స్థలం. ✆ 99599 72304.

VJA ఎనికేపాడు NH ఫేస్ SBI దగ్గర Jeep షోరూమ్ ప్రక్కన రిలయన్స్ కృష్ణ గ్రాండియర్ 4వ ఫ్లోర్ 3BHK (2376 చ॥అ॥) ఫ్లాట్ Ready to Occupy. ✆ 81422 24444.

విజయవాడ మాచవరం డౌన్, బుల్లెమ్మ స్ట్రీట్, పావని అపార్ట్‌మెంట్‌లో 2 BHK ఫ్లాట్స్, 2nd ఫ్లోరు F-2, లిఫ్ట్ సౌకర్యంతో అద్దెకు కలదు. ✆ 83320 23055.

సింగ్‌నగర్, ఆంధ్రప్రభకాలనీ, మారుతీ కార్ల షోరూం వెనుక, షిర్డీసాయి హైట్స్ నందు 4th ఫ్లోర్, టాప్ ఫ్లోర్ W/F ఫుల్లీఫర్నిష్డ్ 3 BHK ఫ్లాట్ టోటల్ ఫ్లింత్ 1,431 S.Ft. గృహప్రవేశానికి సిద్ధంగా కలదు. ✆ 98492 42413.

విజయవాడ, సీతారామపురం, ఏలూరు రోడ్డు Icon Public School ప్రక్కన సాయి కార్తీక్ హైట్స్ నందు Flat 104, 3 BHK కారు పార్కింగ్‌తో అమ్మబడును. Contact: 94411 95221.

కానూరు శ్రీరామ్‌నగర్, సిద్ధార్థ కాలేజ్ రోడ్, Opp. శ్యామ్‌రాక్ ఇంటర్నేషనల్ స్కూల్, 2145 S.Ft. డీలక్స్ 3BHK విత్ కబోర్డ్స్, ఫ్లోర్‌కి ఒక ఫ్లాట్‌తో, 2nd ఫ్లోర్ అమ్మకం. ✆ 98481 23235.

HOUSE FOR SALE

TADIGADAPA

150 చ॥గ॥ల్లో G+1 ఇండిపెండెంట్ హౌస్‌లు (E/F) తాడిగడప మనోజ్‌నగర్‌లో అమ్మకానికి కలవు. ★ కబోర్డ్స్ & కార్ పార్కింగ్ సౌకర్యం. ✆ 98851 22909.

RAMAVARAPPADU

విజయవాడ, రామవరప్పాడు, SLV Green Medows, No.136, Luxurious Villa (G+2), 220 చ॥గ॥ 3443 SFT ఈస్ట్ ఫేసింగ్ విల్లా అమ్మకానికి కలదు. 92915 82934.

VILLA for Sale a new Villa is for Sale in SLV Green Meadows Venture at Ramavarappadu near inner Ring Road Second Railway over Bridgr. ✆: 98667 54171

విజయవాడ ప్రసాదంపాడు కొమ్మారాము స్ట్రీట్‌లో పడమర ఫేసింగ్‌తో 195చ॥గ॥ల్లో G+1 ఇండివిడ్యువల్ బిల్డింగ్ అమ్మబడును. సంప్ర: ✆ 93984 81243.

GENERAL

భారతీనగర్, రోడ్డు నెంబర్ 10లో Novotel హోటల్ దగ్గర, 288 చ॥గ॥లలో New G+3 బిల్డింగ్ (Each ఫ్లోర్-3 BHK-2000 Sft) మొత్తంగా అమ్మకం. ✆ 81426 68666.

205 గజాల స్థలం కలిగిన G+1 ఇండిపెండెంట్ హౌస్ సౌత్ ఫేస్ హౌసింగ్ బోర్డ్ కాలనీ, భవానీపురంనందు అమ్మకం. ✆ 88975 63506.

డాబా ఇల్లు అమ్మబడును
విజయవాడ । టౌన్, పొట్టి శ్రీరాములు ఇంజనీరింగ్ కాలేజీకి అతి దగ్గరలో, గొల్లపాలెం గట్టు వద్ద నార్త్ ఫేసింగ్ 195 గ॥ డాబా ఇల్లు అమ్మకమునకు కలదు.
✆ 99635 13055 96424 88688

విజయవాడ ముత్యాలంపాడు సాయిబాబా టెంపుల్ దగ్గర, వరుగు వారి వీధిలో 47 గజాలలో నార్త్ ఫేసింగ్ 2 Years న్యూ G+1 ఇండిపెండెంట్ బిల్డింగ్ అమ్మకంనకు కలదు. నో మీడియేటర్స్/ డైరెక్ట్ ✆ 99894 61342, 77027 73398.

VJA గురునానక్ కాలనీ వద్ద RR గార్డెన్స్‌లో 312 చ॥గ॥లలో కమర్షియల్ & రెసిడెన్షియల్ G+2 బిల్డింగ్ అమ్మకానికి కలదు. ✆ 90327 93366.

విజయవాడ గన్నవరం దగ్గర NH-16 హైవేని ఆనుకుని 60 అ॥ రోడ్డు తూర్పు ఫేసింగ్ ఒక్కొక్క ఫ్లోరు 2000 Sq.Ft.తో 466 చ॥గ॥లలో G+3 Triplex బిల్డింగ్ అమ్మకమునకు కలదు. ✆ 88774 58888.

విజయవాడ పటమటలంక రామాలయం వీధిలో Dr. No. 63-2-31నందు సుమారు 260 చ॥గ॥లలో ఇండివిడ్యువల్ హౌస్ అమ్మబడును. ✆ 94913 38124.

విజయవాడ, రాజరాజేశ్వరిపేట పోలీస్‌స్టేషన్ వెనుక ఉత్తరం ఫేస్ 44చ॥గ॥ల్లో G+1 బిల్డింగ్ అతితక్కువ ధరకే అమ్మకమునకు కలదు సంప్ర: ✆ 99899 04998.

Poranki House 5000 sft 2F W/F 40ft road, 20ft road, near Priya pickles factory. Rs 2.3cr (neg). Ph: 9440229588.

Ind. House for Sale. CRDA Plan, Vijayawada Pedapulipaka G+1, N/F, Ind. House (3 Yrs Old) Immediate for Sale. Direct Parties. ✆ 92908 84244.

విజయవాడ వన్ టౌన్ సయ్యద్ గులాబ్ స్ట్రీట్ అమ్మ హాస్పిటల్ సందులో 150 గజాలు 3 అంతస్తుల బిల్డింగు అమ్మకమునకు కలదు. సెల్: 97054 02888, 90750 48770.

కేసరపల్లి దగ్గర CRDA గేటెడ్ కమ్యూనిటీ నందు ఇండివిడ్యువల్ హౌసెస్ మరియు CRDA లే అవుట్ ఓపెన్ ప్లాట్లు బ్యాంక్ లోన్ సౌకర్యముతో అమ్మకమునకు కలవు. సంప్ర : ✆ 99489 51999.

కానూరు మహదేవపురం కాలనీలో 138 గ॥ స్థలం, ఈస్ట్ ఫేస్, నిడమానూరులో 268 గ॥ స్థలంలో ఇల్లు సౌత్‌బజారు వుడా అప్రూవ్డ్ స్థలం అమ్మకం. ✆ 85005 46386.

లబ్బీపేటలో బిల్డింగ్ అమ్మకం
230 చ॥గ॥లలో 3ఫ్లోర్స్ ఇండిపెండెంట్ సౌత్ ఈస్ట్ కార్నర్ బిల్డింగ్ పైడయ్యవీధి, లబ్బీపేటలో అమ్మకమునకు కలదు. సంప్రదించండి.
081-869-93388

మచిలీపట్టణం- ఇంగ్లీష్ పాలెంలో ఇండిపెండెంట్ House అమ్మకానికి కలదు. కావలసిన వారు ఈ క్రింది నంబరుకు సంప్రదించగలరు. నో మీడియేటర్స్, డైరెక్ట్ కస్టమర్స్ ఓన్లీ ✆ 9346741252.

బందర్ రోడ్‌కి దగ్గరలో ఈడుపుగల్లు UDA layout Gated Communityలో 190 గ॥ New G+2 with pent house అమ్మకానికి కలదు Ph: 9182376322

కంకిపాడు దగ్గర నెప్పల్లిలో D.No: 3-46 నందు 152 చ॥గ॥ల్లో R.C.C బిల్డింగ్ అమ్మకమునకు కలదు. ✆ 86864 78287, 81435 21235.

200 గజాల బిల్డింగ్ ఈడుపుగల్లు, G+2 కానూరు & ప్లాట్లు గోశాల 180 గ., కానూరు 360, 650 గ., పోరంకి 1500 గ., భవానీపురం 700 గ., కరెన్సీనగర్ 700 గ. సేల్‌కు ✆ 83329 96699.

LAND FOR SALE

PENAMALURU

Bunder H/W, 2250 Sq.yds Commercial Plot Sale N/F, 97'x205' Nr.Madhiravamma Temple, Nidumolu, 10k for sq.yd (Neg). ✆ 9848228927

GENERAL

3 Acres of Land for Sale Situated at Kotturu, Mudunuru, Krishna, AP. Contact No: ✆ 75877 24186.

హైదరాబాద్- విజయవాడ NH-65, 128 KM వద్ద హైవే Facing కు, NH-365 BB ఖమ్మం న్యూ హైవే టర్నింగ్‌కి దగ్గరలో, సూర్యాపేట మున్సిపల్ లిమిట్స్‌కి సమీపమున గల 8.5 ఎకరాలు కమర్షియల్ ల్యాండ్ Sale. EV Hub ఏర్పాటుకు 33, 11 KV లైన్స్ సౌకర్యం కలిగి, కన్వెన్షన్, రిసార్ట్, రెస్టారెంట్, విల్లాలకు అనుకూలం. బ్యాంక్ 66' రోడ్, ప్రహరీ గోడ, 2100 Sft డూప్లెక్స్ గెస్ట్ హౌస్, సర్వెంట్ రూమ్స్ కలవు. 9849521666, 9700979666.

మోగా ★అవకాడో ★ఫామ్‌ల్యాండ్‌లో 11 సెంట్లు ★ 5 లక్షలకే ★ 5వ సంవత్సరం నుండి సంవత్సరంకి 2 లక్షల ఆదాయం పొందండి. ఫోన్: 9133574455

కాకినాడ అచ్చంపేట జంక్షన్, 100అ. బైపాసు రోడ్డు, నార్త్ ఫేసింగ్, 310/ 500/ 535 చ॥ గ॥ విడిగా లేక కలిపి, మంచి కమర్షియల్ ల్యాండ్ అమ్మబడును. ✆ 9347073899.

Land for Sale 6.5 Ac. Jujjuru Village NTR Dist., 500mt from ORR, 30ft Road Facing, 45 Lakhs per Acre, negotiable. Contact : ✆ 9652390826.

NH 65 గన్నవరం అవుటర్ రింగ్‌రోడ్ దగ్గర 60 సెంట్లు పొలము అమ్మకమునకు కలదు. ✆ 93460 43988.

పొలం అమ్మకము
కృష్ణాజిల్లా, పామర్రు మండలం పెదముద్దాలి గ్రామము నందు NH 165 మరియు NH 65దగ్గర్లో, అరబిందోస్కూల్ ఎదురురోడ్డులో 5 ఎకరాల మాగాణి పొలం అమ్మకము
9494648998

గుండిమెడ దగ్గర 3 ఎకరములు & పరిసర ప్రాంతాలలో పొలములు మరియు జగ్గయ్యపేట దగ్గర 17 ఎకరములు, లయోలా కాలేజ్ దగ్గర 267 గ॥లలో ఇల్లు అమ్మకమునకు కలవు. ✆ 98496 33982.

NTR జిల్లా నందిగామ మండలంలోని కొత్త బెల్లంకొండవారిపాలెం ఊరిలో 2.5 ఎకరాల పొలం అమ్మబడును. వివరాలకు Ph: 9000654713.

కమర్షియల్ స్థలం అమ్మకం. గన్నవరం నేషనల్ హైవే ఫేసింగ్ 20 సెంట్లు, 30 సెంట్లు, 40 సెంట్లు ఉత్తరం, దక్షిణం 2 రోడ్ల కార్నర్. రియల్ ఎస్టేట్ మీడియేటర్ : Y.శ్రీనివాస్. ✆ 80998 36999.

వాణిజ్య భూమి విక్రయానికి చెన్నై హైవేపై, మార్టూరు (ప్రకాశం జిల్లా) నుండి 4 Km దూరంలో 3 ఎకరాలు అమ్మకం. ధర: రూ. 1.5 కోట్లకు ఎకరం. ✆ 98848 84210.

అమ్మకానికి 1 ఎకరము ఇళ్ల స్థలం, మామిడి తోట అప్పన పాలెం గ్రీన్ ఫీల్డ్ ఫ్లై ఓవర్‌కు 200 మీటర్లు కొత్తవలస నుండి అరకు NH 516B కు 5 కి.మీ., దూరంలో ఉన్నది. ✆ 89856 52909.

అతి తక్కువ బడ్జెట్ అవకాడో ఫామ్ ల్యాండ్ కేవలం 11 సెంట్లు 4,99,999/- లకే, 5వ సంవత్సరం నుండి 60 సంవత్సరాల వరకు 2,50,000/- పైబడి ఆదాయం పొందగలరు. ఫోన్: 9951123379/ 9100235956.

7ఎ॥ పొలము అమ్మకం
గుంటూరు హైవే సిబార్ డెంటల్ హాస్పిటల్‌కు 5KM దూరంలో 7 ఎకరముల వ్యవసాయ భూమి అమ్మకమునకు కలదు.
✆ 69131 23123

కృష్ణాజిల్లా పామర్రు మండలం పెదముద్దాలి గ్రామంలో యలమర్రు రోడ్డులో 3ఎకరముల పొలము అమ్మబడును. ✆ 91772 95157.

PLOT FOR SALE

PENAMALURU

విజయవాడ బందరురోడ్డు పెనమలూరులో CRDA లే అవుట్ నందు ఓపెన్ ప్లాట్లు బ్యాంకు లోన్ సౌకర్యంతో అమ్మకమునకు కలవు. ✆ 80962 27889.

బందరు రోడ్డు పోరంకి STBL వారి పద్మావతి గార్డెన్స్‌లో 33 అ॥ రోడ్డుతో 4 ప్లాట్లు అమ్మకమునకు కలవు. చ॥గ॥ 40,000/- రూ. సంప్ర ✆ 93462 22427.

కంకిపాడు బైపాస్ 1.5 km & ఎయిర్‌పోర్ట్ 10 km పునాదిపాడు సాయి చలపతి-2 లేఔట్ 240 గ॥ వెస్ట్ 40x54 కార్నర్ ప్లాట్ అమ్మకం. ✆ 79957 78744

GANNAVARAM

కేసరపల్లి జ్యూయల్‌కౌంటీ & NRI ఓల్డేజ్ హోమ్స్ దగ్గర CRDA అప్రూవ్డ్ ఓపెన్ ప్లాట్లు 220, 230, 320చ॥గ॥లు & 3BHK Ind హౌస్ అ॥ కలవు. ✆ 86397 97570.

GOLLAPUDI

గొల్లపూడి A1 సెంటర్‌కు దగ్గరగా శ్రీ జగన్నాథ మందిర్ రోడ్, కరకట్ట దిగువ 166.66 గజాలు (30x50) E/F రిజిస్టర్డ్ ప్లాట్ అమ్మకానికి కలదు. గజం: 20,000/- ✆ 8919522403.

గొల్లపూడి శ్రీకర 200 గ॥, లక్ష్మీ 400 గ॥, SP-2లో 300 గ॥, సాయిపురం 200 గ॥, రవికల్పతరు 200 గ॥, సాయిబాల 200 గ॥, సాయిశంకర్ 200 గ॥. ప్లాట్లు అమ్మదలచిన, కొనదలచిన ✆ 99080 75269.

GENERAL

మంగళగిరి Delight దాబా ప్రక్కన సందులో 221 చ॥గ॥, ఉత్తరం ఫేస్ ఖాళీ స్థలము అమ్మకానికి కలదు. ఇల్లు / గోడౌన్కు అనుకూలము. 79894 27931, 98490 73671.

VJA - GNT హైవే కొలనుకొండ సాయిబాబా గుడి దగ్గర, 33 అ॥ రోడ్డు ఉన్న వెంచర్‌లో, తూర్పు ఫేస్, 200 చ॥గ॥ స్థలం కాంపౌండ్ వాల్, బోరు సౌకర్యంతో అమ్మబడును. (నో బ్రోకర్స్). ✆ 77025 77653.

417 చ॥గ॥ స్థలం అమ్మకం. (40x94) నాగార్జుననగర్, యలమంచిలి హైట్స్ ప్రక్కన, ఆయుష్ హాస్పిటల్ దగ్గర, ఉత్తరం ఫేస్ లేఅవుట్ స్థలం 417 గ॥ అమ్మకం. ✆ 92466 45899.

వణుకూరు RK వెంచర్‌లో తూర్పుఫేస్ 194 గజాలు రేటు 25 లక్షలు, నెప్పల్లిలో 250 గజాలు పడమర ఫేస్ అమ్మకము రేటు: 30 లక్షలు. ✆ 98857 54999, 73824 22777.

రామలింగేశ్వరనగర్, శివగంగా భవానీ రోడ్డులో, పడమర ఫేస్ 30 అ. రోడ్డుతో 169 చ.గ. స్థలం అమ్మబడును. మార్కెట్ వాల్యూ గ॥ 60,000/- గలది కేవలం 45,000/- మాత్రమే. ✆ 91778 57001.

VJA సైఫుల్‌రోడ్‌కి దగ్గర్లో ఓపెన్ ప్లాట్స్ గ: 24 వేలు, నందిగామ - 8 వేలు & గుంటూరు లామ్ CRDA ప్లాట్స్ - 26 వేలు, 35 వేలు, లింగాపురం - 12 వేలు, 15 వేలు (బ్యాంక్ లోను) సైట్ కొరకు. ✆ 96182 82731.

రాజధాని అమరావతి తుళ్లూరు గ్రామంలో 250 చదరపు గజములు రాజధాని పూలింగ్‌లో ఉన్న కమర్షియల్ స్థలము అమ్మకమునకు కలదు. ✆ 73968 40626.

విజయవాడ పోరంకి, కంచికచర్ల, అమరావతి ఏరియాలలో ఓపెన్ ప్లాట్లు అమ్మదలచిన - కొనదలచిన సంప్రదించండి. మార్కెటింగ్ ఏజెంట్స్ M/F కావలెను. లక్షకు పైగా కమీషన్. ✆ 81429 75999.

చీరాల, NH- 167-A దగ్గర, రామాపురం బీచ్ దగ్గర, 15 సెంట్స్ నుండి 1/2 ఎకర్ ప్లాట్స్ అమ్మకం. రిసార్ట్స్ & బీచ్ విల్లాస్‌కు అనుకూలం. ✆ 9246187205, 9912345533.

అర్జెంట్ కమర్షియల్ బిట్ సేల్: VJA కండ్రిక D-మార్ట్ వద్ద హైవే నుండి 2వ బిట్ W/F, 33 Ft. రోడ్‌తో లేఅవుట్ 266 చ.గ. (40x60) కార్పొరేషన్‌లో 3 బిట్లు. ✆ 83090 94588.

కంకిపాడు వద్ద నెప్పల్లిలో బందరు రోడ్డుకి, ORRకి దగ్గరగా గేటెడ్ కమ్యూనిటీ న్యూ వెంచర్ నందు 183, 220, 350 చ॥గ॥ల CRDA ప్లాట్లు బ్యాంక్ లోన్‌తో కలవు. ✆ 90322 12829.

విజయవాడ ఉడాకాలనీ To అంబాపురం జన్మభూమి రోడ్డు, వెస్ట్ బైపాస్‌కు దగ్గరగా, తూర్పుఫేస్, 127 చ॥గ॥ స్థలం అమ్మబడును. ✆ 85009 23432.

గ్రేటర్ విజయవాడ న్యూ RR పేట, పురుగుల అంజనేయ స్వామి టెంపుల్ ఎదురుగా డెవలప్డ్ ఏరియాలో, అప్రూవ్డ్ లేఅవుట్‌తో 216 చ॥గ॥ (61x32) ఇంటి స్థలం (ప్లాటు) అమ్మకమునకు కలదు. ✆ 93939 90333.

గుంటూరుజిల్లా కాజా టోలుగేటు దగ్గరలో హైవే రోడ్డుకి 2వబిట్టు 300 చ॥గజాలు (41x65) గల ప్లాటు అమ్మబడును. సంప్ర॥ 98662 30276, 99896 47681.

VJA, పెనమలూరు CRDA గృహ నిర్మాణానికి అనువైన గేటెడ్ కమ్యూనిటీ ప్లాట్లు, హౌసెస్, విల్లాలు ★ బ్యాంక్ లోన్ సౌకర్యం. ✆ 94404 83810, 95531 29369.

విజయవాడకు చేరువలో పామర్రు దగ్గర 4.5 లక్షలకు 100 చ॥గ॥ ★ నందిగామ హైవే ఆనుకొని గ॥ 8999 రూ॥, కొండపల్లి హైవే ఆనుకొని గ॥ 9999 రూ॥. Plots అమ్మకమునకు కలవు. ✆ 93982 13364.

స్థలం అమ్మకం
రామవరప్పాడు నుండి నున్న రోడ్‌లో 1st ఫ్లై ఓవర్ ప్రక్కన, బుడమేరు దగ్గరలో పడమర ఫేస్ 80 X 68 కొలతలతో 609 చ.గ.లు మరియు 68 X 84 కొలతలతో 613 చ.గ.లు 3 రోడ్ల ఫేసింగ్‌లో స్థలం అమ్మకమునకు కలదు.
✆ 9440666333 9948142499

విజయవాడ 9 కి.మీ.లో మెగా గేటెడ్ కమ్యూనిటీ హౌసింగ్ ప్రాజెక్ట్‌లో ఇల్లు, గ్రూప్ హౌస్‌కు అనువైన 345 గజాలు సేల్. క్లి॥ టై॥. స్పా॥ రి॥. నో బ్రోకర్స్. 9966266070

రాజధాని ORR నుండి 10 కి.మీ దూరంలో మైలవరం దగ్గర 500 sq.yds విస్తీర్ణంలో మామిడి చెట్లు ఉన్న ప్లాట్లు కేవలం 10 లక్షలకు అమ్మబడును ప్లాట్లు అమ్మబడును. Contact: 9908075269

మచిలీపట్నం, commercial, corner plot 1001 గజ. (N107.3 ft/W84 ft). 80ft వలందపాలెం మెయిన్ రోడ్. 40ft north జెవెల్లెరి పార్క్ రోడ్. కమర్షియల్ బిల్డింగ్స్‌కి బెస్ట్. పాత బిల్డింగ్ మంచి కలపతో. ✆ 9441130069.

కంకిపాడు సబ్‌రిజిస్ట్రార్ ఆఫీస్ ఎదురు రోడ్డు గరుడాద్రి వెంచర్‌నందు East Face 33 Feet Road Phase-I 35x54 కొలతలు గల ప్లాట్లు అమ్మబడును. ✆ 63020 03231, 87129 26789.

పటమట బందరు రోడ్డుకి దగ్గరలో లేఅవుట్ E/F 300 గ॥ అశోక్‌నగర్ టైం హాస్పిటల్ ఎదురుగా E/F 160 గ॥ RR గార్డెన్స్‌లో N/E 270 గ॥లు అయ్యప్పనగర్‌లో E/F 300 గ॥ ✆ 94406 72474.

బృందావన్ గార్డెన్స్ 270 గజాలు ప్రధాన రోడ్డు వెనుక వైపు ప్లాట్ N/F, స్టేడియంకు & చౌదరి మెడికల్స్ చాలా దగ్గరగా. తక్కువ ధరకే. Ph: 9391032238.

తుమ్మలపాలెంలో, గుంటుపల్లికి & High Wayకి దగ్గరలో 326 చ॥గ॥ల తూర్పు ఫేసింగ్ Layout Plot అమ్మకు. లారీ ఓనర్స్ సొసైటీ స్థలంకు తూర్పు వైపు లేఅవుట్. డైరెక్ట్ ఓనర్ 9 AM to 8 PM. ✆ 89784 58577.

అమరావతి రాజధానిలో 1000 గ॥జ ప్లాట్ తూర్పు ఫేసింగ్ కొత్త హైవే దగ్గరలో అమ్మకానికి కలదు. రేటు: 38 వేలు గజం. ✆ 93921 00210.

పోరంకి సీతాపురం కాలనీ ప్రక్కన ఉన్న సాయిసూర్యలో 250 గజాలు తూర్పు ప్లాట్ నెం: 7 అమ్మబడును. వెంకటాపురం కాలనీలో 400గజాలు పడమర ప్లాట్ అమ్మబడును. ✆ 94404 44464.

యనమలకుదురు గ్రామంలో వెంచర్ నందు ప్లాట్లు అమ్మకానికి కలవు. ✆ 92464 65225.

బందరు రోడ్డు ఫేసింగ్ ఉత్తరం వైపు కంకిపాడు దగ్గరలో 388 చ॥గ॥ ప్లాట్ అమ్మకమునకు కలదు. సంప్రదించగలరు. ✆ 98483 43355.

మంగళగిరి క్రికెట్ స్టేడియం ఎదురు నిడమర్రు రోడ్ దగ్గర 120 గ. (30x36), కంచికచర్లలో CRDA లేఅవుట్ ప్లాట్స్ - 12 వేలు, నాన్ లేఅవుట్ ప్లాట్స్ - 6 వేలు అమ్మకం. ✆ 98669 14274.

సెంటు 74 వేలు. విజయవాడ 20 ని॥లో 25, 35 సెంట్ల ఫామ్ ల్యాండ్ ORR 1KM వ్యవసాయ క్షేత్రం. కృష్ణా ఐలాండ్ నందు పట్టాదారు పాస్‌బుక్‌తో. 9491435234. నో బ్రో.

గన్నవరం ఎయిర్‌పోర్ట్‌కి ఎదురుగా HCL ప్రక్కన UDA Layout Plots. లోను సౌకర్యంతో అమ్మకమునకు కలవు. సంప్ర: ✆ 94401 20033.

విజయవాడ మహానాడు రోడ్డు ఫేసింగ్ 900 గ॥ ★ పోరంకి - నిడమానూరు రోడ్డు లేఅవుట్‌లో రోడ్డుకి 2,3 బిట్లు, 200 గ॥, 400 గ॥ ★ అశోక్‌నగర్ కరివేపాకు తోటలో 200 గ॥ అమ్మకం: ✆ 98497 25707.

పోరంకిలో 750 గ॥, 23 వేలు గ॥, ★ ఫన్ టైమ్స్ దగ్గర 300 గ॥ E/F, 300 గ॥ W/F ★ NRI హాస్పిటల్ దగ్గర 3000 గ॥, 14,000/- గ॥ ★ కొలనుకొండలో 2 B/R అపార్ట్‌మెంట్స్ ★ సింగ్‌నగర్‌లో 2 B/R, 14L ✆ 94919 57844.

విజయవాడ పరిసర ప్రాంతాలలో అపార్ట్‌మెంట్ ఫ్లాట్స్, ఖాళీ స్థలాలు, ఇండిపెండెంట్ హౌస్‌లు అమ్మాలన్నా కొనాలన్నా సంప్ర॥ ★ డెవలప్‌మెంట్‌కు కన్స్ట్రక్షన్ చేయబడును. ✆ 63098 77122.

విజయవాడ మధురానగర్ లెక్చరర్స్ కాలనీ, 2వ లైన్‌లో, 2 రోడ్ల కార్నర్, 315 చ॥గ॥ స్థలం అమ్మబడును. ✆ 97045 55444, 98481 21658.

విజయవాడ, కొండపల్లి మున్సిపాలిటీ ఖిల్లా రోడ్ ప్రముఖ పర్యాటక కేంద్రం రాజధానికి 6 KM దూరం, వివిధ చెట్లు, ఇల్లు ఉన్న 410 చ॥గ॥ ప్లాటు, 33 అ॥ రోడ్ అమ్మకం. ✆ 98491 52902.

కృష్ణా జిల్లా పామర్రు మండలం, అడ్డాడ గ్రామం, ఐనంపూడి సాయిబాబా గుడి వద్ద, 150 గ॥జ మరియు 165 గ॥జ వెంచర్‌లో స్థలము అమ్మకం. ✆ 82475 99597.

మైలవరం లక్కిరెడ్డి ఇంజనీరింగ్ కాలేజి దగ్గర E/F 123 గ॥ W/F 105 గ॥ నాన్ లేఅవుట్ Plots అమ్మకానికి కలవు. గజం: 5,000/-. ✆ 98661 49659.

COMMERCIAL SPACE FOR SALE

Vijayawada, Near Vijaya Talkies: Commercial C+G+2 Building in 300 Sq. Yards. Monthly Rental Income 2.50 Laks. ✆ 94949 59855 / 92472 34119.

SHOP FOR SALE

VJA, గాంధీనగర్, ఐలాపురం హోటల్ ఎదురు, మెయిన్ రోడ్డు ఫేస్ 920 చ॥అ॥, 150చ॥అ॥ షాపులు - 2, శైలజ థియేటర్ వైపు 200 చ॥అ॥ షాపులు- 2 అమ్మబడును. ✆ 86606 77987.

SHOPS FOR SALE
విజయవాడ, గొల్లపూడి ఉత్తరముఖ వేంకటేశ్వర స్వామి గుడి ఎదురుగా గల ఫార్మా కాంప్లెక్స్‌లో గ్రౌండ్, 3వ మరియు 4వ అంతస్తులలో గల షాపులు అమ్మకమునకు కలవు. సంప్రదించండి.
Ph: 98481 10301

LEASE/ RENT

Commercial facility proposed for development in Tatipaka, Konaseema Dt. Site is Ideal for retail outlets, banks, supermarkets, shops, workshops, offices, Game Zones etc. To be offered on rent. only Genuine parties contact: 9441530866

VJA, పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్డులో 60x40 ఏరియాలో 40x40 గల ఇండస్ట్రియల్ షెడ్డు అద్దెకు/ లీజుకు ఇవ్వబడును. ✆ 92679 23927.

పోరంకి క్యాపిటల్ హాస్పిటల్ దగ్గరలో G+4 9200 S.Ft., Total బిల్డింగ్ కార్ పార్కింగ్‌తో స్టడీ సెంటర్స్‌కు, ఇన్‌స్టిట్యూషన్‌కు అద్దెకు ఇవ్వబడును. ✆ 93921 21613, 63045 72665.

PROPERTY FOR SALE

VJA, బందరు రోడ్డుకి దగ్గరలో లబ్బీపేట నందు మంచి రన్నింగ్‌లో ఉన్న హోటల్ అమ్మకమునకు కలదు. సంవత్సరమునకు 30 లక్షలు అద్దె వస్తుంది. ధనసాయి రియల్ ఎస్టేట్. ✆ 94401 73696.

TO LET

Single Room for Rent. Near Stella College, New P&T Colony-2, H.No. 102, 2nd Floor only for Employees. ✆ 98494 44707.

Three Bhk 1650 Sft House Second Floor Car Parking Near ZPH school Ramavarappadu Vijayawada. Ph: 9440988881.

Rent for 2 BHK Flat, 1200 Sft at FF2, Vijayalaxmi Tower-2, Kannuru, Nr. Autonagar Bus Terminal, Vijayawada. ✆ 99995 77316, 77804 96086.

New 3BHK DP Independent House for Rent (2000 S.Ft.) 2nd fl, Close to Eluru Rd. for Govt./ Corporate Officials. ✆ 94410 72460.

VJA, లబ్బీపేట, కళానికేతన్ వెనుక, ఆదర్శ రోడ్ సంగం అపార్ట్‌మెంట్‌నందు ఫ్లాట్ నెం. A5, 2 BHK లిఫ్ట్, కార్ పార్కింగ్, జనరేటర్ సౌ॥లతో అద్దెకు కలదు. ✆ 78937 38999, 89789 45999.

విజయవాడ వెటర్నరీ కాలనీలో డూప్లెక్స్ ఇండిపెండెంట్ హౌస్ 3BHK, 3100 SFT, 3 కార్ల పార్కింగ్ అన్ని వసతులతో డాక్టర్స్/ హయ్యర్ ఆఫీషియల్స్‌కు మాత్రమే అద్దెకు ఇవ్వబడును. ✆ 77023 87956.

సూర్యారావుపేట ప్రకాశం రోడ్‌లో నందన స్కిన్‌కేర్ ఎదురుగా గ్రౌండ్ ఫ్లోర్‌లో 2 సింగిల్ బెడ్‌రూమ్ పోర్షన్స్ 1st ఫ్లోర్‌లో 1 సింగిల్ బెడ్‌రూమ్ ఫ్యామిలీస్‌కి మాత్రమే అద్దెకు. ✆ 91609 12102.

గుంటూరు- విజయవాడ హైవే, నాగార్జున యూనివర్శిటీ ఎదురుగా, IJM రెయిన్ ట్రీ పార్క్‌లో తూర్పు ఫేసింగ్ C-52, 3BHK డ్యూప్లెక్స్ విల్లా అద్దెకు కలదు. Ph : 83319 34548 & 79970 81125.

విజయవాడ టిక్కిల్ రోడ్డు అంబటి సిల్క్స్ సందులో ప్రశాంతి 1st ఫ్లోర్ 2 BHK పోర్షన్ అద్దెకు కలదు. శాకాహారులకు మాత్రమే. బ్రాహ్మణులకు ప్రాధాన్యత. ✆ 0866-2472863.

COMMERCIAL

VJA Patamata Old PNT Colony Beside Nirmala Convent, Plot No:1 Ground Floor 600 Sq.Ft. Semi Furnished Commercial Space for Rent. ✆ 70368 82222.

MORE CLASSIFIEDS ON PAGES 9

ఆరోగ్య.. ఆనందమయ జీవితానికి క్రీడలు దోహదం

సందడిగా 'ఈనాడు-ఈటీవీ ఛాంపియన్' చదరంగం పోటీలు

విజయవాడ సిటీ, విజయవాడ క్రీడలు- న్యూస్‌టుడే



పోటీలో తలపడుతున్న ఉద్యోగులు

క్రీడలు శారీరక, మానసిక వికాసానికి దోహదపడతాయని జిల్లా విద్యాశాఖాధికారి యు.వి.సుబ్బారావు అన్నారు. విజయవాడ ఎంజీ రోడ్డు పున్నమ్మ తోటలోని జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో శనివారం 'ఈనాడు-ఈటీవీ - ఛాంపియన్' చదరంగం పోటీలను జ్యోతి వెలిగించి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విధి నిర్వహణలో ఉద్యోగులు ఒత్తిడికి గురవుతారని, ఫలితంగా తక్కువ వయసులోనే దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడుతున్నారని అన్నారు. ఆరోగ్యకర, ఆనందమయ జీవితం గడపాలంటే రోజూ కొద్దిసేపు ఆటలు ఆడాలని సూచించారు. ఫలితంగా రోజంతా ఉత్సాహంగా ఉండి విధులు సక్రమంగా నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఉద్యోగుల్లో క్రీడా నైపుణ్యాలు వెలికితీసేలా 'ఈనాడు-ఈటీవీ' పోటీలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. చెస్ ఆర్బిటర్ మందుల రాజీవ్, కార్యాలయం సూపరింటెండెంట్లు డి.సూరిబాబు, పి.నాగరాజు, జి.వి.రమణ, మినిస్ట్రీరియల్ స్టాఫ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎం.ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా నైపుణ్యాలు మెరుగు పడతాయి



చదరంగం అంటే ఇష్టం. ఖాళీ సమయాల్లో ఆడేవాడిని. ఉద్యోగరీత్యా పని ఒత్తిడి వల్ల ఇప్పుడు కుదరడం లేదు. క్రీడా పోటీలు ఉద్యోగులకు నిర్వహించడం వల్ల సాధన చేయాలనే తపన పెరుగుతుంది. క్రీడా నైపుణ్యాలు మెరుగుపడతాయి. ఆరోగ్యకరంగా ఉంటాం. - **ఎం.శ్రీనివాసరావు, పురుషుల విభాగం విన్నర్**

క్రీడా స్ఫూర్తి నింపడం అభినందనీయం



ఉద్యోగ రీత్యా అందరం ఒత్తిడిలో ఉంటాం. అవసరమైతేనే మాట్లాడుకునే పరిస్థితి. అలాంటి పరిస్థితిలో ఉన్న ఉద్యోగులకు 'ఈనాడు-ఈటీవీ' పోటీలు నిర్వహించి క్రీడా స్ఫూర్తి నింపడం అభినందనీయం. ఇలాంటి కార్యక్రమాలతో ఉద్యోగ వర్గాలకు మేలు జరుగుతుంది. - **ఎ.సరోజ, మహిళల విభాగం విన్నర్**

ఏకాగ్రత పెరుగుతుంది



ఓ క్రీడని రోజూ సాధన చేస్తే ఆరోగ్యంగా ఉంటాం. చదరంగం ఆడడం వల్ల ఏకాగ్రత పెరుగుతుంది. చిన్నపాటి ఇబ్బందులను ఒత్తిడికి గురికాకుండా ఎలా ఎదుర్కోవాలనే ఆలోచనశక్తి మెరుగుపడుతుంది. మనసు కూడా ప్రశాంతంగా ఉంటుంది. - **ఎన్.ఎస్.ఎల్.శ్యామ్‌సుందర్, పురుషుల విభాగం రన్నర్**


ఆనందానికి అవధులు ఉండవు



పోటీలో విజేతగా నిలిస్తే ఆనందానికి అవధులు ఉండవు. చిన్నపాటి తప్పుల వల్ల ఓటమి ఎదురైనా కుంగిపోకుండా లోపాలు సరి చేసుకోవాలి. ఉద్యోగులందరం కలిసి పోటీల్లో పాల్గొనడం.. బహుమతులు సాధించడం చాలా సంతోషకరంగా ఉంది. - **సీహెచ్ శిరీష, మహిళల విభాగం రన్నర్**

సిద్ధం కండి.. సీటు పొందండి!

ఇంజినీరింగ్ కౌన్సెలింగ్‌కు వేళాయె



కానూరు, పోరంకి, న్యూస్‌టుడే

ఉమ్మడి కృష్ణా జిల్లా పరిధిలో ఈఏపీసెట్-2025లో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ఇంజినీరింగ్‌లో ప్రవేశాలకు కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభం కానుంది. జులై 7 నుంచి ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈ-నమోదు, రుసుము చెల్లింపు ప్రక్రియకు జులై 16 వరకు గడువు ఇచ్చారు.

ముఖ్యమైన తేదీలు.. ✪ జులై 7 నుంచి 16 వరకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, ప్రాసెసింగ్ రుసుం (ఎస్సీ, ఎస్టీలకు రూ.600, ఇతర రూ.1200) ✪ 7 నుంచి 17వరకు ధ్రువపత్రాల పరిశీలన ✪ 13 నుంచి 18 వరకు వెబ్ ఆప్షన్ల ఎంపిక ✪ 19న ఆప్షన్ల మార్పునకు అవకాశం ✪ 22న సీట్లు కేటాయింపు ✪ 23 నుంచి 26 వరకు సెల్ఫ్ జాయినింగ్, కళాశాలలో రిపోర్టింగ్ ✪ తరగతులు ప్రారంభం: ఆగస్టు 4 నుంచి

కొత్త బ్రాంచులు: ప్రస్తుతం ఉన్న సీఎస్ఈ, ఈసీఈ, ఈఈఈ, సివిల్, మెకానికల్‌తో పాటు సీఎస్ఈలో కృత్రిమ మేధ, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ, మెషిన్ లెర్నింగ్ బ్రాంచులు అందుబాటులోకి వచ్చాయి. ఎక్కువ కళాశాలలో గతం కన్నా సీఎస్ఈ సీట్లు పెరిగాయి.

మొత్తం కళాశాలలు: 32 సీట్లు: 19,150
జిల్లాలో ఈఏపీసెట్ రాసింది: 42,000
క్వాలిఫై అయిన వారు: 37,000
వీరే కాకుండా ఉత్తమ ర్యాంకులు సాధించిన ఇతర జిల్లాల విద్యార్థులు విజయవాడ కళాశాలలకు దరఖాస్తు చేసుకుంటారు.

మూడు హెల్ప్‌లైన్ కేంద్రాలు : విజయవాడ నగరంలో ఈఏపీసెట్-2025 అడ్మిషన్ల ప్రక్రియకు సంబంధించి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, ఎస్ఆర్ఆర్‌సీవీఆర్ డిగ్రీ కళాశాల, ఆంధ్ర లయోలా కళాశాలలో హెల్ప్‌లైన్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. సాంకేతిక సమస్యలు, రిజిస్ట్రేషన్, ధ్రువపత్రాల పరిశీలనలో ఏమైనా సమస్యలు, సందేహాలు ఉంటే విద్యార్థులు ఆయా కేంద్రాలకు వెళ్లి నివృత్తి చేసుకోవచ్చు.

అప్రమత్తత అవసరం : మొదట విద్యార్థులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ప్రాసెసింగ్ రుసుం చెల్లించి అన్ని ధ్రువపత్రాలను అప్‌లోడ్ చేయాలి. చరవాణి నంబరు, మెయిల్ ఐడీ ఇవ్వాలి. బ్రాంచులు, కళాశాలలు ఎంపిక చేసుకునే సమయంలో అప్రమత్తంగా ఉండాలి. వీలైనన్ని ఎక్కువ కళాశాలలు ఎంపిక చేసుకోవాలి. వచ్చిన ర్యాంకుకు ఎక్కడ సీటు వస్తుందో, గతేడాది పరిస్థితులను కూడా విద్యార్థులు అంచనా వేసుకోవాలి.



-తూమాటి వెంకటేశ్వరరావు, ప్రిన్సిపల్, విజయ మహిళా ఇంజినీరింగ్ కళాశాల

చరిత్ర.. భావితరాలకు మార్గదర్శిగా ఉండాలి

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : చరిత్ర భావితరాలకు మార్గదర్శిగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ హైపవర్ కమిటీ ఛైర్మన్, జస్టిస్ ఉప్మాక దుర్గాప్రసాదరావు అన్నారు. ఆంధ్రప్రదేశ్ సృజనాత్మకత, సంస్కృతి సమితి ఆధ్వర్యంలో రచయిత జీవీ పూర్ణచందు రచించిన 'భువన విజయం- రాయలనాటి కథలు, గాథలు' గ్రంథావిష్కరణ కార్యక్రమాన్ని శనివారం స్థానిక ఒక హోటల్‌లో నిర్వహించారు. జస్టిస్ దుర్గాప్రసారావు ముఖ్యఅతిథిగా విచ్చేసి గ్రంథాన్ని ఆవిష్కరించి, ప్రసంగించారు.



గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న జస్టిస్ దుర్గాప్రసాదరావు, ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, పూర్ణచందు, మల్లికార్జునరావు తదితరులు

రాయల చరిత్ర తరగని గని అని పేర్కొన్నారు. రాయలనాటి సామాజిక, సాంస్కృతికతో పాటు అనేక విషయాలు వెలుగులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. భువన విజయం.. చారిత్రక పరిశోధకులకు ఉపయుక్తమైన గ్రంథమని చెప్పారు. చరిత్రపై చక్కని అవగాహనతో రచయిత పరిశోధనాత్మకంగా రచన చేశారని కొనియాడారు. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ.. తెలుగు జాతిని భాషాపరంగా ఏకం చేయగలిగే శక్తి రాయల కాలంనాటికి మాత్రమే ఉందన్నారు. తెలుగు వారి చరిత్రలో స్వర్ణయుగం.. రాయల పాలనాకాలం అని గుర్తు చేశారు. పరిశోధక విద్యార్థులకు ఈ గ్రంథం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఏపీ సృజనాత్మకత సమితి సీఈవో ఆర్.మల్లికార్జునరావు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో కృష్ణా జిల్లా రచయితల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జీవీ పూర్ణచందు, గుత్తికొండ సుబ్బారావు, గుమ్మా సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై 10న మహా ధర్నా

విజయవాడ(గాంధీనగర్): విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 10వ తేదీన ధర్నా చౌక్‌లో ధర్నా నిర్వహిస్తున్నట్లు పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.భాస్కర్, ఎం.వినోద్‌కుమార్‌లు తెలిపారు. శనివారం విజయవాడ ప్రెస్ క్లబ్‌లో కార్యక్రమ గోడపత్రికలు ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో పాఠశాలల విలీన ప్రక్రియ వల్ల చాలా పాఠశాలలు మూతపడుతున్నాయని చెప్పారు. రూ.6400 కోట్ల ఫీజు రీఎంబర్స్‌మెంట్, ఉపకార వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. మహాధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. పీడీఎస్‌యూ నాయకులు కె.నాని, మానస, ప్రసన్న, సింధు పాల్గొన్నారు.

పటమట పోలీస్ స్టేషన్‌కు వంశీ

పటమట, న్యూస్‌టుడే: వైకాపా నేత, మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ శనివారం పటమట పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. గన్నవరం తెదేపా కార్యాలయం దాడి కేసులో ఫిర్యాదుదారుడిగా ఉన్న సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులో కోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసిన నేపథ్యంలో సంతకం చేసేందుకు పటమట స్టేషన్‌కు వచ్చారు. ఆయన వెంట న్యాయవాదులు, అనుచరులు ఉన్నారు.



సంతకం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే వల్లభనేని

ఇన్నోవేషన్ హబ్‌లో ఉద్యోగాలు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : విజయవాడ గ్రామీణ మండలం ఎనికేపాడులోని రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ (ఆర్టీఐహెచ్)లో ఒప్పంద విధానంలో ఛార్టర్డ్ అకౌంటెంట్ (సీఏ), కంపెనీ కార్యదర్శి (సీఎస్)గా పని చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జేసీ ఎస్.ఇలక్కియా శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 12వ తేదీ సాయంత్రం 5.30 గంటల్లోగా కొటేషన్లను సీల్డ్ కవర్లలో పోస్టల్ ద్వారా లేదా నేరుగా గానీ విజయవాడ కలెక్టరేట్‌లోని జాయింట్ కలెక్టర్ ఛాంబరులో సమర్పించవచ్చని సూచించారు. అకౌంటింగ్ సిస్టమ్, టూల్స్ ప్రొఫిషయన్సీ, రెగ్యులేటరీ ఫైలింగ్, గవర్నెన్స్ పాలసీలు, స్టాట్యుటరీ డాక్యుమెంటేషన్ తదితర అంశాలపై పరిజ్ఞానం ఆధారంగా ఎంపికలు ఉంటాయని వివరించారు.

చిట్టీల పేరుతో రూ.17 లక్షలు.. అప్పుల పేరిట రూ.కోటి టోకరా..?

జి.కొండూరు, న్యూస్‌టుడే: చిట్టీల పేరుతో రూ.17 లక్షలు ప్రజల నుంచి వసూలు చేసి..అప్పుల పేరిట రూ.కోటికి పైగా అప్పులు పెట్టిన మండలంలోని దుగ్గిరాలపాడు గ్రామానికి చెందిన ఇందుర్తి సత్యనారాయణ పరారీలో ఉన్నట్లు సమాచారం. దీనిపై బాధితులు తెలిపిన వివరాల మేరకు సత్యనారాయణ పదేళ్ల కిందట తన భార్య చనిపోగా ముగ్గురు కుమారులతో కలిసి గంగినేని గ్రామానికి వచ్చి దర్జీగా జీవనం కొనసాగిస్తున్నాడు. తన ఇద్దరు కుమారులు హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్నారు. మరొకరు ఇతడితోనే కలిసి ఉంటున్నాడు. ఈ క్రమంలో సత్యనారాయణ కొంత కాలంగా నమ్మకంగా ఉంటూ చిట్టీలు కట్టించుకుంటున్నాడు. ఇదే కాక ఒకరికి తెలియకుండా మరొకరి వద్ద గ్రామంలో దాదాపు రూ.కోటికిపైగా అప్పులు పెట్టినట్లు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఇద్దరూ గ్రామంలో పది రోజులుగా కనపడకపోవడం, ఫోన్ కలవకపోవడంతో స్థానికులు అప్రమత్తమై విచారించగా పరారయ్యారని తెలిసింది. హైదరాబాద్‌లో ఉన్న ఉన్న ఇద్దరి కుమారులకు ఫోన్ చేసి అడుగగా మాకేమి సంబంధం లేదనడంతో ఒక్కసారి బాధితులు ఏమి చేయాలో తెలియక జి.కొండూరు పోలీసులను ఆశ్రయించినట్లు తెలుస్తోంది.

సందేశంతో వల.. ఇంజినీర్ విలవిల!

దాడి చేసి రూ.3.11 లక్షలు లాగేసిన వైనం

పెనమలూరు, న్యూస్‌టుడే: ఇన్‌స్టాలో పరిచయమైన మహిళ.. ఓ ఇంజినీరుకు చేదు అనుభవం మిగిల్చింది. కానూరులో కలుసుకొందాం రమ్మంటూ ఆమె పంపిన చరవాణి సందేశంతో అక్కడికి వెళ్లిన అతడిపై సదరు మహిళ మరో ముగ్గురితో కలిసి బెదిరించి రూ.3.11 లక్షలు లాగేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని కృష్ణలంకకు చెందిన ఈ.రాజు అనే వ్యక్తి ఓ ప్రైవేటు సంస్థలో ఇంజినీరుగా పనిచేస్తున్నాడు. అతడికి ఏడాది కిందట ఎనికేపాడుకు చెందిన కె.రాజేశ్వరి అలియాస్ అమ్ము అనే మహిళతో ఇన్‌స్టాలో పరిచయం ఏర్పడింది. కొంతకాలం నుంచి వారి మధ్య ఛాటింగ్ నడిచింది. గత నెల 24న రాజు సదరు మహిళకు చరవాణి సందేశం పంపగా.. తాను కానూరు బల్లెంవారి వీధిలో ఓ అపార్ట్‌మెంట్ సమీపంలో ఉన్నానని, కలుసుకోవడానికి అక్కడికి రావాలని రాజేశ్వరి తిరుగు సందేశం పంపింది. దీంతో అక్కడికి వెళ్లిన రాజు వద్దకు కారులో రాజేశ్వరి, మరో ముగ్గురు వ్యక్తులు వచ్చారు. వచ్చీరావడంతోనే ఛాటింగ్ ఎందుకు చేస్తున్నావంటూ దాడికి దిగారు. పోలీస్ కేసు పెడతామంటూ బెదిరించి, కర్రలతో దాడి చేశారు. రాజు చరవాణి, ద్విచక్ర వాహనం తాళాలు, రూ.6 వేల నగదు తీసుకొని, అతడి బ్యాంకు ఖాతాలోని సొమ్మును బదిలీ చేయించుకున్నారు. ఈ వ్యవహారంపై బాధితుడు శనివారం పెనమలూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తన వద్ద రూ.3.11 లక్షలు లాగేశారంటూ ఫిర్యాదులో పేర్కొన్నాడు. దీంతో రాజేశ్వరి, మరో ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండో విడత ఐటీఐ ప్రవేశాలకు గడువు 15

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో మొదటి విడత కౌన్సెలింగ్ అనంతరం మిగిలిన సీట్ల భర్తీకి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ ఎం.కనకారావు తెలిపారు. ఎనిమిది, పదో తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అభ్యర్థులు 'ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఇన్'లో దరఖాస్తులను ఈ నెల 15వ తేదీలోగా డౌన్‌లోడ్ చేసుకొని పూర్తి చేసి, 17వ తేదీలోగా విద్యార్హత ధ్రువీకరణ పత్రాల పరిశీలన పూర్తి చేసుకోవాలని చెప్పారు. సందేహాల నివృత్తికి విజయవాడ ప్రభుత్వ ఐటీఐ కళాశాలలోని హెల్ప్ డెస్క్‌ని సంప్రదించాలని, 0866-2475575, 94906-39639, 77804-29468 నెంబర్లకు ఫోన్ చేయవచ్చని తెలిపారు. దరఖాస్తులు పూరించే సమయంలో తప్పులు రాకుండా చూసుకోవాలని, కౌన్సెలింగ్ సమయంలో ఒరిజినల్ ధ్రువపత్రాలు సక్రమంగా లేకపోతే ప్రవేశానికి అనర్హులుగా ప్రకటిస్తామని చెప్పారు.

పులిచింతల.. పట్టిసీమ నీరు పరుగులు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : నగరంలోని ప్రకాశం బ్యారేజీకి రెండు వైపుల నుంచి సాగునీటి ప్రవాహం ఉంది. శనివారం కృష్ణా నదిలో పులిచింతల ప్రాజెక్టు పవర్ హౌస్ నుంచి 5,000 క్యూసెక్కులు విడుదల చేశారు. పులిచింతల-ప్రకాశం బ్యారేజీల మధ్య నీటి ప్రవాహం కొనసాగుతోంది. మరోవైపు పట్టిసీమ నుంచి 8 పంపుల ద్వారా 2,382 క్యూసెక్కుల గోదావరి జలాలను విడుదల చేశారు. ఇవి బ్యారేజీకి చేరడానికి కొద్ది రోజుల సమయం పడుతుంది.

కాల్వలకు 7,389 క్యూసెక్కులు.. కృష్ణా డెల్టా పరిధిలోని కాలువలకు 7,389 క్యూసెక్కులు విడుదల చేశారు. కృష్ణా తూర్పు (కేఈ) ప్రధాన కాలువకు 7,084, కృష్ణా పశ్చిమ (కేడబ్ల్యూ) ప్రధాన కాలువకు 305 క్యూసెక్కులు ఇచ్చారు. కేఈ ప్రధాన కాలువ నుంచి రైవస్ కాల్వకు 3,707, ఏలూరు 1,110, బందరు 1,259, కేఈబీ (దివిసీమ) కాల్వకు 1,008 క్యూసెక్కుల చొప్పున ఇస్తున్నారు.

14 నుంచి ట్రిపుల్ ఐటీ తరగతులు

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: ట్రిపుల్ ఐటీ తరగతులు ఈ నెల 14 నుంచి ప్రారంభమవుతాయని ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్ తెలిపారు. శనివారంతో అడ్మిషన్ల ప్రక్రియ ముగిసిందన్నారు. ఖాళీలు ఉన్న ప్రకారం రెండో కౌన్సెలింగ్ కొనసాగిస్తామని తెలిపారు. నూతనంగా చేరిన విద్యార్థులకు అవగాహన తరగతులు నిర్వహించి ట్రిపుల్ ఐటీపై అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు.

లాభాలతో సేవలందిస్తున్న కేడీసీసీ బ్యాంకు


మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే : రాష్ట్రంలోని డీసీసీబీలకు కేడీసీసీ బ్యాంకు ఆదర్శమని ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు అన్నారు. అంతర్జాతీయ సహకార దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం మచిలీపట్నంలోని కేడీసీసీ బ్యాంకులో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సహకార జెండా ఆవిష్కరించి మాట్లాడారు. కృష్ణా జిల్లా సహకార కేంద్ర బ్యాంకు రూ.11,500 కోట్లకుపైగా టర్నోవర్‌తో, రూ.76 కోట్ల లాభాలతో రైతులకు, ఇతర వృత్తిదారులకు సేవలు అందిస్తుందన్నారు. ఇదే స్ఫూర్తి కొనసాగించాలని సూచించారు. బ్యాంకు ఛైర్మన్ నెట్టెం రఘురాం మాట్లాడుతూ బ్యాంకు ఈ స్థాయిలో ఉందంటే ఎంతో మంది మహనీయుల కృషి ఉందన్నారు. ఇటువంటి బ్యాంకులో సేవలు అందించే అవకాశం రావడం తన అదృష్టమన్నారు. ఆప్కాబ్ ఎండీ ఆర్.శ్రీనాథరెడ్డి మాట్లాడుతూ రుణాల మంజూరులో జాప్యం జరగకుండా, ప్రయాణ వ్యయ ప్రయాసలు తగ్గిస్తూ వ్యవస్థలను సక్రమంగా నడిపించడంలో ఉత్తమ ఫలితాలను సాధిస్తుందన్నారు. జిల్లాలో ఆరు డివిజనల్ క్రెడిట్ ప్రాసెసింగ్ కేంద్రాలు ప్రారంభించడం ప్రశంసనీయమన్నారు. ఇతర జిల్లా సహకార బ్యాంకులు ఈ విధానాలను పాటించాలన్నారు. రాష్ట్ర సహకార యూనియన్ విద్యాధికారి కె.భోజరంగరాజు, కేడీసీసీ బ్యాంకు సీఈవో శ్యామ్‌మనోహర్ తదితరులు ప్రసంగించారు. జీఎంలు బీఎల్ చంద్రశేఖర్, ఎన్.రంగబాబు పాల్గొన్నారు.



సహకార జెండా ఆవిష్కరించి వందనం చేస్తున్న వీరాంజనేయులు, రఘురాం తదితరులు

ఈనాడు ప్రతిభ
విజయవాడ, ఆదివారం, జులై 6, 2025
◆ https://pratibha.eenadu.net ◆ https://eenadupratibha.net
విద్య, ఉద్యోగ పరీక్షల ప్రత్యేకం!

కరెంట్ అఫైర్స్ — **మాదిరి ప్రశ్నలు**



* పునరుద్ధరించిన జాతీయ భద్రతా సలహా బోర్డు (ఎన్ఎస్ఏబీ) అధిపతిగా ఇటీవల ఎవరు నియమితులయ్యారు? (పహల్గామ్ ఉగ్రవాద దాడి తర్వాత పాకిస్థాన్‌తో పెరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో భారత్ తన జాతీయ భద్రతా సలహా బోర్డును పునర్ నిర్మించింది.) **జ:** అలోక్ జోషీ (RAW మాజీ అధిపతి)
* ఏ ప్రమాదకరమైన పురుగుమందును ప్రపంచ వ్యాప్తంగా ఇటీవల నిషేధించడంపై భారత్ వ్యతిరేకత వ్యక్తం చేసింది? (ఇటీవల జెనీవాలో జరిగిన బీఆర్ఎస్ (బాసెల్, రోటర్‌ డామ్, స్టాక్‌హోమ్) కన్వెన్షన్స్ సమావేశాల్లో ఈ పురుగు మందును నిషేధించాలని అనేక దేశాలు వాదించాయి.) **జ:** క్లోర్‌పైరిఫోస్
* కేర్ ఎడ్జ్ రేటింగ్స్ స్టేట్ ర్యాంకింగ్ 2025లో ఏ మూడు రాష్ట్రాలు వరుసగా తొలి మూడు స్థానాల్లో నిలిచాయి? **జ:** మహారాష్ట్ర, గుజరాత్, కర్ణాటక
* అటవీ సంరక్షణను మెరుగుపరచడమే లక్ష్యంగా దేశంలోనే మొదటిసారిగా ఏ రాష్ట్రం ఏఐ ఆధారిత రియల్-టైమ్ ఫారెస్ట్ అలర్ట్ సిస్టమ్‌ను ప్రారంభించింది? **జ:** మధ్యప్రదేశ్
* ఏ రోజు నుంచి ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్, మొబైల్ యాప్‌లో తత్కాల్ టికెట్లను బుక్ చేసుకోవడానికి ఆధార్ ఆధారిత ఓటీపీని తప్పనిసరి చేస్తూ రైల్వే శాఖ నిర్ణయం తీసుకుంది? **జ:** 2025, జులై 15

మరింత సమాచారం

మాక్ కౌన్సెలింగ్ 2025 — ఈఏపీసెట్ | నీట్



జన స్థిరీకరణకు జాతీయ వ్యూహాలు!

దేశ జనాభా పరిమాణం, కూర్పును ప్రభావితం చేయడానికి అమలుచేసే ప్రభుత్వ చర్యలే జాతీయ జనాభా విధానాలు. జనాభా సవాళ్లను పరిష్కరించడం, సంతానోత్పత్తి, మరణాలు, వలసలు మొదలైన అంశాలను నియంత్రిస్తూ స్థిరమైన అభివృద్ధిని సాధించడమే వీటి లక్ష్యం. ప్రస్తుతం భారత్‌లో అనేక ఆర్థిక, సామాజిక సమస్యలకు అత్యధిక జనాభానే మూల కారణంగా, అతిపెద్ద సమస్యగా మారింది. అయితే దేశ జనాభా అదుపు కోసం స్వాతంత్ర్యానికి ముందు నుంచే చర్యలు ప్రారంభమయ్యాయి. అనంతరం స్థిరీకరణే ధ్యేయంగా రెండు జనాభా విధానాలు రూపొందాయి. జనాభాను అభిలషణీయ జాతీయ సంపదగా మార్చేందుకు జరిగిన ఈ ప్రయత్నాలు, వాటిలోని ముఖ్యాంశాలు, చేపట్టిన కార్యక్రమాలు, ఉద్దేశాల గురించి పోటీ పరీక్షార్థులు తెలుసుకోవాలి. దీనికి సంబంధించి నీతిఆయోగ్ తీసుకుంటున్న చర్యలు, దేశంలో సంతానోత్పత్తి రేటులో మార్పుల ప్రభావాలను అర్థం చేసుకోవాలి.



భారతదేశంలో జనాభా విధానాలు
(జనాభా స్థిరీకరణలో ప్రణాళికలు-నీతిఆయోగ్ పాత్ర)

ఆర్థికాభివృద్ధిలో జనాభా, మానవ వనరులకు అధిక ప్రాధాన్యం ఉంటుంది. మానవులు ఉత్పత్తి చేయడంతోపాటు దాన్ని వినియోగించుకుంటారు. భారత్ సహా అనేక అభివృద్ధి చెందుతున్న దేశాలు జనాభా విస్ఫోట దశలో ఉన్నాయి. అందుకే జనాభా విధానాలను రూపొందించాల్సిన అవసరం ఏర్పడింది.

జనాభా పెరుగుదల నియంత్రణ: జనాభా పెరుగుదల రేటును తగ్గించడం, జనాభాను స్థిరీకరించడం, ఆరోగ్య సంరక్షణను పెంచడం, తల్లీ పిల్లల ఆరోగ్యాన్ని మెరుగుపరచడం, వ్యాధుల నివారణకు చర్యలు తీసుకోవడం.

కుటుంబ నియంత్రణ: గర్భ నిరోధక పద్ధతులను ప్రోత్సహించడం, కుటుంబ నియంత్రణ గురించి అవగాహన కల్పించడం.

సామాజిక, ఆర్థిక అభివృద్ధి: విద్య, ఉపాధి, జీవన ప్రమాణాలను మెరుగుపరచడం.

భారతదేశ జనాభా విధానాల పరిణామం, పంచవర్ష ప్రణాళికలు: స్వాతంత్ర్యానికి ముందే భారతదేశంలో పెరుగుతున్న జనాభా సమస్యకు పరిష్కారాలను రూపొందించే ప్రయత్నాలు జరిగాయి.

రాధాకమల్ ముఖర్జీ కమిటీ (1940): 1921 తర్వాత వేగంగా పెరుగుతున్న జనాభాను అరికట్టడానికి, పరిష్కారాలను సూచించేందుకు 1940లో సామాజిక శాస్త్రవేత్త రాధాకమల్ ముఖర్జీ నేతృత్వంలో భారత జాతీయ కాంగ్రెస్ ఒక కమిటీని నియమించింది. అది జనాభా పెరుగుదల రేటును తగ్గించడానికి స్వీయనియంత్రణ, చౌకైన, సురక్షితమైన జనన నియంత్రణ చర్యలపై అవగాహన కల్పించాలని సిఫార్సు చేసింది.



◆ 1952లో మొదటి పంచవర్ష ప్రణాళికలోనే జనాభా నియంత్రణ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ విషయంలో ప్రపంచంలోనే మొదటి దేశంగా భారత్ నిలిచింది. ఈ కార్యక్రమం కుటుంబ నియంత్రణ కోసం సహజ పరికరాల వాడకాన్ని నొక్కి చెప్పింది. ◆ 2వ ప్రణాళికలో విద్య, పరిశోధన దిశగా అభివృద్ధి జరిగింది. క్లినికల్ విధానాన్ని ప్రోత్సహించింది. ◆ 3వ ప్రణాళికలో 1965లో పురుషులు, స్త్రీలు ఇద్దరికీ స్టెరిలైజేషన్ (సంతానరహిత క్రియ) పద్ధతి ప్రవేశపెట్టారు. కుటుంబ నియంత్రణ విభాగం అనే స్వతంత్ర విభాగం ఏర్పాటైంది. ◆ 4వ ప్రణాళికలో అన్ని రకాల జనన నియంత్రణ (సంప్రదాయ + ఆధునిక) పద్ధతులను ప్రోత్సహించారు. ◆ 5వ ప్రణాళికలో జాతీయ జనాభా విధానాన్ని 1976, ఏప్రిల్ 1న ప్రకటించారు. ◆ 6, 7, 8వ ప్రణాళికల్లో దీర్ఘకాలిక జనాభా లక్ష్యాలను నిర్ణయించడం ద్వారా జనాభా నియంత్రణ ప్రయత్నాలు జరిగాయి. ◆ జనతా ప్రభుత్వ కాలంలో కుటుంబ నియంత్రణ శాఖను కుటుంబ సంక్షేమ శాఖగా మార్చారు. ◆ 9వ ప్రణాళికలో జాతీయ జనాభా విధానాన్ని రూపొందించడానికి ప్రభుత్వం ఎం.ఎస్.స్వామినాథన్ అధ్యక్షతన ఒక నిపుణుల బృందాన్ని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ ఇచ్చిన ముసాయిదా ఆధారంగా 2000, ఫిబ్రవరిలో కొత్త జాతీయ జనాభా విధానం రూపొందింది. ◆ 10వ ప్రణాళికలో పేర్కొన్న విస్తృత అభివృద్ధి ఎజెండాలో భాగంగా అనేక కీలక జనాభా సంబంధిత లక్ష్యాలపై దృష్టి పెట్టింది. జనాభా పెరుగుదల రేటును తగ్గించడం, మాతా, శిశు ఆరోగ్యం, విద్య, ఆరోగ్య సంరక్షణ సేవలను పొందడం మొదలైనవి. 2001-2011 మధ్య దశాబ్ది జనాభా పెరుగుదల రేటును 16.2%కు తగ్గించడం ఈ ప్రణాళిక లక్ష్యం. ◆ 11వ పంచవర్ష ప్రణాళిక జనాభా, ఆరోగ్యానికి సంబంధించిన నిర్దిష్ట లక్ష్యాల్లో సామాజికవృద్ధిపై దృష్టి సారించింది. సమ్మిళిత వృద్ధి లక్ష్యంగా మాతా శిశు మరణాల రేటును తగ్గించడం, పిల్లల లింగ నిష్పత్తిని మెరుగుపరిచే ప్రయత్నం చేసింది. ◆ 12వ ప్రణాళిక జనాభా స్థిరీకరణ ప్రయత్నాలను విస్తృత సామాజిక, ఆర్థిక అభివృద్ధి లక్ష్యాల్లోకి అనుసంధానించడంపై దృష్టి పెట్టింది.

> **“జనాభా పెరుగుదలను నియంత్రించడం, ఆరోగ్య సంరక్షణ పరిస్థితులను మెరుగుపరచడం, సామాజిక, ఆర్థిక అభివృద్ధిని సాధించడమే దేశంలో జనాభా విధానాల ప్రధాన లక్ష్యం.”**

భారతదేశంలో జనాభా విధానాలు

మొదటి జనాభా విధానం: 1976, ఏప్రిల్ 1న ప్రవేశపెట్టారు. జనాభా, సంతానోత్పత్తిని నియంత్రించడం దీని లక్ష్యం. జనాభా పెరుగుదలను పరిష్కరించడానికి భారత ప్రభుత్వం చేసిన మొదటి సమగ్ర ప్రయత్నం.

ముఖ్యాంశాలు:

కుటుంబ నియంత్రణపై దృష్టి: జనాభా పెరుగుదలను నియంత్రించేందుకు కుటుంబ నియంత్రణ పద్ధతులు, ముఖ్యంగా స్టెరిలైజేషన్‌పై దృష్టి పెట్టింది.

చట్టబద్ధ వివాహ వయసు పెంపు: బాలికల చట్టబద్ధమైన వివాహ వయసు 18 ఏళ్లకు, బాలుర వివాహ వయసు 21 ఏళ్లకు పెంచడం దీని లక్ష్యం.

స్త్రీ విద్యను ప్రోత్సహించడం: అన్ని రాష్ట్రాల్లో మహిళల విద్యాస్థాయి పెంపొందించే చర్యలు తీసుకున్నారు.

ద్రవ్య ప్రోత్సాహకాలు: స్టెరిలైజేషన్ చేయించుకున్న వ్యక్తులకు నగదు ప్రోత్సాహకాలను అందించారు.



రాష్ట్రాలకు కేంద్ర సహాయం: రాష్ట్రాలకు కేంద్ర సహాయ పరిమాణాన్ని నిర్ణయించడంలో జనాభాను ఒక ప్రమాణంగా చేశారు.

ప్రచారాలు: కుటుంబ సంక్షేమ కార్యక్రమాల ప్రచార్యానికి వివిధ రకాల మాధ్యమాలను ఉపయోగించారు.

జనాభా విద్య: అధికారిక విద్యావ్యవస్థలో జనాభా విద్యను ప్రవేశపెట్టారు.

జనరల్ స్టడీస్
ఇండియన్ ఎకానమీ

జాతీయ జనాభా విధానం-2000

ఇది కేంద్ర ప్రభుత్వ రెండో జనాభా విధానం. 2000, ఫిబ్రవరి 15న ప్రకటించారు. వివిధ సామాజిక జనాభా లక్ష్యాల ద్వారా 2045 నాటికి జనాభా పెరుగుదలను స్థిరీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది.

తాత్కాలిక లక్ష్యం: జనన నియంత్రణ పరికరాలను సులభంగా సరఫరా చేయడాన్ని ఇందులో చేర్చారు. అంతేకాకుండా ఆరోగ్య రక్షణ చట్టాన్ని అభివృద్ధి చేయడం, ఆరోగ్య కార్యక్రమాల నియామకాలను పొందుపరిచారు.

మధ్యకాలిక లక్ష్యం: 2010 నాటికి మొత్తం సంతానోత్పత్తి రేటు (టీఎఫ్ఆర్)ను 2.1 భర్తీ స్థాయికి తగ్గించడం.

దీర్ఘకాలిక లక్ష్యం: 2045 నాటికి జనాభా స్థిరీకరణ లక్ష్యాన్ని సాధించడం.

జనాభా విధానం ముఖ్య లక్షణాలు: ★ పునరుత్పత్తి ఆరోగ్య సేవల నుంచి గరిష్ఠ ప్రయోజనాలను సాధించడానికి స్వచ్ఛంద, సమాచారంతో కూడిన ఎంపికలను బలోపేతం చేయడం. ★ 14 ఏళ్ల వయసు వరకు పాఠశాల విద్య ఉచితంగా, నిర్బంధంగా అమలుచేయడం. బాలబాలికల డ్రాపౌట్ రేటును తగ్గించడం. ★ దేశంలో శిశుమరణాల రేటును ప్రతి 1000 సజీవ జననాలకు 30 కంటే తక్కువ చేయడం. ★ ప్రసూతి మరణాల రేటు (ఎం.ఎం.ఆర్.)ను లక్ష జననాలకు 100 కంటే తక్కువ చేయడం. ★ టీకా ద్వారా నివారించగలిగిన వ్యాధుల నుంచి పిల్లలందరికీ సార్వత్రిక రోగ నిరోధక శక్తి సాధించడం. ★ బాలికల్లో 20 సంవత్సరాలపైనే వివాహాన్ని ప్రోత్సహించాలని సూచించడం. ★ 80% సంస్థాగత ప్రసవాలు, 100% శిక్షణ పొందిన వ్యక్తుల ద్వారా ప్రసవాలు జరిగేలా చూడటం. ★ విస్తృతశ్రేణి ఎంపికల్లో సంతానోత్పత్తి నియంత్రణ, గర్భనిరోధకం కోసం సమాచారం/కౌన్సెలింగ్, సేవలను సార్వత్రికంగా అందుబాటులోకి తీసుకురావడం. ★ పునరుత్పత్తి, శిశు ఆరోగ్య సేవల్లో భారతీయ వైద్య వ్యవస్థ (ఆయుష్)ను సమగ్రపరచడం. ★ నియోజకవర్గాల పునర్విభజన మరో 25 ఏళ్ల (2026) వరకు 1971 సెన్సస్ ప్రాతిపదికన కొనసాగేలా చేయడం.

NITI Aayog

జనాభా నియంత్రణలో నీతిఆయోగ్ పాత్ర: భారతదేశంలో విధానపర మేధో సంస్థ అయిన నీతి ఆయోగ్ కుటుంబ నియంత్రణ, సంబంధిత సామాజిక నిర్ణయాధికారాలకు వ్యూహాలు, సిఫార్సులను అభివృద్ధి చేయడం ద్వారా జనాభా స్థిరీకరణ ప్రయత్నాల్లో కీలక పాత్ర పోషిస్తోంది.



రచయిత: వమరవల్లి రమణయ్య

తక్కువ హానికరం.. ఎక్కువ శక్తి!

అణుశక్తి సాంకేతికతను శాంతియుత ప్రయోజనాలకు వినియోగిస్తూ, అవసరాల రీత్యా అణువిద్యుత్తు సామర్థ్యాన్ని వేగంగా పెంచుకుంటున్న దేశాల్లో భారత్ ఒకటి. పెరుగుతున్న ఇంధన అవసరాలను తీర్చేందుకు, పర్యావరణ లక్ష్యాలను సాధించేందుకు మేలైన ప్రత్యామ్నాయంగా అణుశక్తిని ఎంచుకుంది. ఇందుకోసం యురేనియం, థోరియం మొదలైన అణు ఇంధనాలను దేశీయంగా ఉత్పత్తి చేయడంతో పాటు ఎక్కువ శాతం దిగుమతి చేసుకుంటోంది. ఈ అంశంపై పోటీ పరీక్షార్థులకు స్థూల పరిజ్ఞానం ఉండాలి. దేశంలో ఏర్పాటైన అణు విద్యుత్తు ప్లాంట్లు, వాటి సామర్థ్యం, వినియోగిస్తున్న రియాక్టర్ల రకాలు, సాంకేతికత, పర్యవేక్షక వ్యవస్థలు, సంబంధిత అంతర్జాతీయ నిబంధనలు, దేశీయంగా అణు ఇంధనాల లభ్యత, ఎదురవుతున్న సవాళ్లు తదితరాలను తెలుసుకోవాలి.



అణు ఇంధనాలు


1. భారతదేశ అణువిద్యుత్తు ఉత్పత్తికి సంబంధించి కింది ప్రకటనల్ని పరిగణించండి.
   ఎ) భారతదేశ అణువిద్యుత్తు ఉత్పత్తి సామర్థ్యం గత దశాబ్దంలో గణనీయంగా పెరిగింది. 2014లో 4,780 మెగావాట్ల నుంచి 2024 నాటికి 8,180 మెగావాట్లకు రెట్టింపు అయింది.
   బి) 2031 - 32 నాటికి 16,000 మెగావాట్లకు పెరగనుంది.
   సి) అణుశక్తిని విద్యుత్తు ఉత్పత్తికి మాత్రమే కాకుండా, 70 ఉత్పరివర్తన పంట రకాలను అభివృద్ధి చేయడానికి, ఆరోగ్య సంరక్షణ రంగంలో ఐసోటోపులతో క్యాన్సర్ చికిత్స కోసం ఉపయోగిస్తున్నారు.
   కింది కోడ్‌ని ఉపయోగించి సరైన సమాధానాన్ని ఎంచుకోండి.
   1) ఎ, బి 2) సి 3) ఎ, సి 4) ఎ, బి, సి
2. భారతదేశ కోణంలో 'అంతర్జాతీయ అణుశక్తి', 'అదనపు ప్రోటోకాల్'లకు సంబంధించి అంతరార్థం ఏమిటి?
   1) పౌర అణు రియాక్టర్లు ఐఏఈఏ రక్షణ కిందకు వస్తాయి.
   2) సైనిక అణు వ్యవస్థాపనలు ఐఏఈఏ తనిఖీ కిందకు వస్తాయి.
   3) అణు ఇంధన సరఫరా సంస్థ (ఎన్ఎస్‌జీ) నుంచి యురేనియం కొనుగోలు చేసే అధికారం దేశానికి ఉంటుంది.
   4) దేశం స్వయంచాలకంగా ఎన్ఎస్‌జీలో సభ్యత్వం పొందుతుంది.
3. అంతర్జాతీయ థర్మోన్యూక్లియర్ ఎక్స్‌పరిమెంటల్ రియాక్టర్ ప్రాజెక్ట్‌లో భారత్ ముఖ్యమైన సభ్య దేశం. ఈ ప్రయోగం విజయవంతమైతే, మనదేశానికి తక్షణ ప్రయోజనం ఏమిటి?
   1) విద్యుత్తు ఉత్పత్తికి యురేనియం స్థానంలో థోరియంను ఉపయోగించవచ్చు.
   2) ఇది ఉపగ్రహ నావిగేషన్‌లో ప్రపంచ పాత్రను పొందగలదు.
   3) ఇది విద్యుత్తు ఉత్పత్తిలో దాని విచ్ఛిత్తి, రియాక్టర్ల సామర్థ్యాన్ని బాగా మెరుగుపరుస్తుంది.
   4) ఇది విద్యుత్తు ఉత్పత్తి కోసం ఫ్యూజన్ రియాక్టర్లను నిర్మిస్తుంది.
4. వేగంగా పెరుగుతున్న ఇంధన డిమాండ్‌ను తీర్చడానికి, భారతదేశం అణుశక్తికి భవిష్యత్తు ఇంధనంగా థోరియంపై పరిశోధన అభివృద్ధిని కొనసాగించాలని కొందరు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంలో యురేనియం కంటే థోరియం ఏ ప్రయోజనం కలిగి ఉంది?
   ఎ) ప్రకృతిలో యురేనియం కంటే థోరియం ఎక్కువగా లభిస్తుంది.
   బి) తవ్విన ఖనిజం యూనిట్ ద్రవ్యరాశి ఆధారంగా, సహజ యురేనియంతో పోలిస్తే థోరియం ఎక్కువ శక్తిని ఉత్పత్తి చేస్తుంది.
   సి) యురేనియంతో పోలిస్తే థోరియం తక్కువ హానికర వ్యర్థాలను ఉత్పత్తి చేస్తుంది.
   పై ప్రకటనల్లో ఏది సరైంది?
   1) ఎ 2) బి, సి 3) ఎ, సి 4) ఎ, బి, సి
5. న్యూక్లియర్ సైన్స్ అండ్ టెక్నాలజీని ఏ రంగాల్లో ఉపయోగించవచ్చు?
   ఎ) ఆహార సంరక్షణ బి) వైద్య చికిత్స
   సి) విద్యుత్తు ఉత్పత్తి
   డి) రేడియోమెట్రిక్ డేటింగ్ ఇ) స్మోక్ డిటెక్షన్
   కింది కోడ్‌ని ఉపయోగించి సరైన సమాధానాన్ని ఎంచుకోండి.
   1) బి, సి 2) బి, సి, డి
   3) ఎ, బి, సి, డి 4) ఎ, బి, సి, డి, ఇ
6. భారతదేశానికి సంబంధించి కింది ప్రకటనల్ని పరిగణించండి.
   ఎ) మోనోజైట్ భూమిలో దొరికే అరుదైన మూలకం.
   బి) మోనోజైట్‌లో థోరియం ఉంటుంది.
   సి) మోనోజైట్ భారత్‌లోని మొత్తం తీరప్రాంతాల్లోని ఇసుకలో సహజంగా దొరుకుతుంది.
   డి) భారతదేశంలోని ప్రభుత్వ సంస్థలు మోనోజైట్‌ను మాత్రమే ప్రాసెస్ చేయగలవు లేదా ఎగుమతి చేయగలవు.
   పై ప్రకటనల్లో ఏది సరైంది?
   1) ఎ, బి, సి 2) ఎ, బి, డి
   3) సి, డి 4) ఎ, బి, సి, డి

పర్యావరణ అంశాలు

7. అణు రియాక్టర్లలో మోడరేటర్, శీతలీకరణి.. రెండింటిలోనూ ఉపయోగించే పదార్థం?
   1) సాధారణ జలం 2) భార జలం
   3) ద్రవ అమ్మోనియా 4) ద్రవ హైడ్రోజన్
8. ప్రపంచంలో ప్రస్తుతం ఫాస్ట్ బ్రీడర్ న్యూక్లియర్ రియాక్టర్లు నిర్వహిస్తున్న దేశాలు?
   ఎ) చైనా బి) జపాన్ సి) ఇండియా
   డి) రష్యా ఇ) పాకిస్థాన్
   కింది కోడ్‌ని ఉపయోగించి సరైన సమాధానాన్ని ఎంచుకోండి.
   1) ఎ, బి, సి 2) ఎ, సి, డి
   3) ఎ, బి, సి, డి 4) ఎ, బి, సి, డి, ఇ
9. ఒక కేంద్రకం రేడియోధార్మిక క్షయంలో ఒక ఎలక్ట్రాన్ కూడా విడుదలవుతుంది. దీని కారణంగా ఇది జరగొచ్చు.
   1) న్యూక్లియర్ లోపల ఎలక్ట్రాన్‌లు ఉంటాయి.
   2) న్యూట్రాన్‌ను ప్రోటాన్‌గా మార్చే సమయంలో ఎలక్ట్రాన్ సృష్టి జరుగుతుంది.
   3) ప్రోటాన్‌ను న్యూట్రాన్‌గా మార్చే సమయంలో ఎలక్ట్రాన్ సృష్టి జరుగుతుంది.
   4) మొమెంటం పరిరక్షణ కోసం ఎలక్ట్రాన్‌లు విడుదల కావాలి.
10. కింది వాటిని జతపరచండి.

మూలకం	ఉపయోగం
ఎ) యురేనియం ఐసోటోప్	1) క్యాన్సర్ చికిత్స
బి) కోబాల్ట్ ఐసోటోప్	2) గాయిటర్ చికిత్స
సి) అయోడిన్ ఐసోటోప్	3) ద్వితీయ క్యాన్సర్ చికిత్స
డి) రేడియో ఐసోటోప్	4) అణు ఇంధనం

   1) ఎ-3, బి-2, సి-1, డి-4
   2) ఎ-4, బి-2, సి-1, డి-3
   3) ఎ-4, బి-1, సి-2, డి-3
   4) ఎ-3, బి-1, సి-2, డి-4
11. కింది రేడియోధార్మిక పదార్థాల్లో ఏది గరిష్ఠ అర్ధ జీవిత కాలాన్ని కలిగి ఉంటుంది?
   1) కార్బన్ - 14 2) ప్లుటోనియం - 239
   3) రేడియం - 226 4) యురేనియం - 238
12. అణు విచ్ఛిత్తి ప్రక్రియ ద్వారా నిరంతర అణు గొలుసు చర్య కోసం అణు రియాక్టర్లలో కార్బన్ లేదా గ్రాఫైట్ కడ్డీలను మోడరేటర్లుగా ఉపయోగిస్తారు.
   ఈ ప్రక్రియలో:
   1) న్యూట్రాన్‌లు వేగంగా తయారవుతాయి.
   2) ప్రోటాన్‌లు వేగంగా తయారవుతాయి.
   3) న్యూట్రాన్‌లు నెమ్మదిగా తయారవుతాయి.
   4) ప్రోటాన్‌లు నెమ్మదిగా తయారవుతాయి.
13. అంతర్జాతీయ థర్మోన్యూక్లియర్ ఎక్స్‌పరిమెంటల్ రియాక్టర్ (ఐటీఈఆర్) ప్రాజెక్టును కింది వాటిలో ఏ ప్రదేశంలో నిర్మించారు?
   1) ఉత్తర స్పెయిన్ 2) దక్షిణ ఫ్రాన్స్
   3) తూర్పు జర్మనీ 4) దక్షిణ ఇటలీ



14. భారతదేశం అణుశక్తి కార్యక్రమానికి సంబంధించి, కింది ప్రకటనల్ని పరిగణించండి.
   ఎ) భారతదేశంలోని థోరియం నిల్వలను దేశ ఇంధన అవసరాలను తీరేలా ఉపయోగించుకోవడంపై ఈ కార్యక్రమం ప్రధానంగా దృష్టి సారిస్తుంది.
   బి) మొదటి దశలో యూ-235 మెరుగుదలకు యురేనియం సుసంపన్నత అవసరం లేదు.
   సి) పీహెచ్‌డబ్ల్యూఆర్ (ప్రెషరైజ్డ్ హెవీవాటర్ రియాక్టర్) నిర్మాణం, కమిషన్, ఆపరేషన్‌కు న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ బాధ్యత వహిస్తుంది.
   పై ప్రకటనల్లో ఏది సరైంది?
   1) ఎ, బి 2) బి, సి 3) ఎ, సి 4) ఎ, బి, సి
15. ట్రాంబేలో అటామిక్ ఎనర్జీ ఇన్‌స్టిట్యూషన్ (ప్రస్తుతం బార్క్-బీఏఆర్‌సీ)ను ఎప్పుడు స్థాపించారు?
   1) 1954 2) 1963 3) 1948 4) 1985
16. కింది ప్రకటనల్లో సరైన వాటిని గుర్తించండి.
   ఎ) తమిళనాడులోని కల్పక్కంలో భారతదేశ మొదటి స్వదేశీ ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్ చారిత్రక కోర్ లోడింగ్ ప్రారంభానికి సాక్షిగా నిలిచింది.
   బి) ఆత్మనిర్భర్ భారత్ స్ఫూర్తితో, ఎంఎస్ఎంఈలతో సహా 200 కంటే ఎక్కువ భారతీయ పరిశ్రమల సహకారంతో ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్ (ఎఫ్‌బీఆర్)ను స్వదేశీయంగా భారతీయ విద్యుత్తు నిగమ్ లిమిటెడ్ (భవిని) రూపొందించి, నిర్మించింది.
   సి) రష్యా తర్వాత వాణిజ్య నిర్వహణ ఫాస్ట్‌బ్రీడర్ రియాక్టర్ ఉన్న రెండో దేశం భారత్.
   పై ప్రకటనల్లో ఏది సరైంది?
   1) ఎ, బి 2) బి, సి 3) ఎ, సి 4) ఎ, బి, సి
17. కింది వాటిని జతపరచండి.

న్యూక్లియర్ పవర్ ప్రోగ్రామ్ దశలు	వాడిన ఇంధనం
ఎ) ప్రెషరైజ్డ్ హెవీ వాటర్ రియాక్టర్/ 1వ దశ	1) ప్లుటోనియం 239
బి) ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్ (ఎఫ్‌బీఆర్)/ 2వ దశ	2) యురేనియం
సి) అధునాతన హెవీ వాటర్ రియాక్టర్ (ఏహెచ్‌డబ్ల్యూఆర్)/3వ దశ	3) థోరియం

   కింది కోడ్‌ని ఉపయోగించి సరైన సమాధానాన్ని ఎంచుకోండి.
   1) ఎ-1, బి-2, సి-3 2) ఎ-2, బి-1, సి-3
   3) ఎ-3, బి-1, సి-2 4) ఎ-1, బి-3, సి-2
18. కింది వాటిలో సరైన స్టేట్‌మెంట్స్‌ను గుర్తించండి.
   ఎ) భారతదేశం ఫ్లోటింగ్ సోలార్ ఎనర్జీ టెక్నాలజీ అమలు కోసం నార్వే కంపెనీతో కలిసి పనిచేస్తోంది.
   బి) దక్షిణ కొరియా శాస్త్రవేత్తలు న్యూక్లియర్ ఫ్యూజన్‌లో కొత్త ప్రపంచ రికార్డు సాధించారు.
   పై ప్రకటనల్లో ఏది సరైంది?
   1) ఎ 2) బి 3) ఎ, బి 4) ఏదీకాదు
19. కింది ప్రకటనల్ని పరిగణించి, సరైన సమాధానాన్ని ఎన్నుకోండి.
   ఎ) నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్ అనేది 2022 - 23 కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించారు.
   బి) కేంద్ర బడ్జెట్ 2024 - 25 భారత్ స్మాల్ రియాక్టర్ల ఏర్పాటును ప్రకటించింది.
   1) ఎ 2) బి 3) ఎ, బి 4) ఏదీకాదు
20. మన దేశంలో స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన మొదటి అతిపెద్ద అణువిద్యుత్తు ప్లాంట్ యూనిట్?
   1) నరోరా 2) రావత్భట
   3) కాక్రపార 4) కుడంకుళం

సమాధానాలు
1-3; 2-1; 3-4; 4-4; 5-4; 6-2; 7-2; 8-3; 9-2; 10-3; 11-4; 12-3; 13-2; 14-4; 15-1; 16-4; 17-2; 18-3; 19-2; 20-3.



మహిళా శక్తి జాతీయ కీర్తి!



పేదరికం, సామాజిక ఒత్తిళ్లు, గ్రామీణ నేపథ్యం, నిరక్షరాస్యత... ఇవేవీ తమ ఎదుగుదలకు అడ్డంకి కావని నిరూపిస్తున్నారు రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండల సమాఖ్య మహిళలు. తాము ఆర్థికవృద్ధి సాధిస్తూ, తోటి మహిళలకు స్ఫూర్తినిస్తూ సాగుతున్నారు. వీరి పనితీరుని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం తాజాగా జాతీయ ఆత్మనిర్భర్ సంఘటన్ అవార్డుకు ఎంపిక చేసింది. ఈ మండల సమాఖ్య పరిధిలో మొత్తం 46 గ్రామ సంఘాలుండగా 1,103 స్వయం సహాయక సంఘాలున్నాయి. ఇందులో 12,900మందికి పైగా సభ్యులున్నారు. దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన 22 మహిళా సంఘాల్లో ఇదొకటి. వీరంతా చిరు వ్యాపారాలు చేయడమే కాదు... ఆదాయాభివృద్ధికి వేపగింజలు, కందులు, మొక్కజొన్న, ధాన్యం కొనుగోలు కేంద్రాల్ని ఏర్పాటు చేశారు. పౌష్టికాహార కేంద్రాలను నిర్వహిస్తున్నారు. వ్యవసాయ పరికరాలను అద్దెకిస్తున్నారు. నూతన స్వశక్తి సంఘాల ఏర్పాటుతోపాటు సేంద్రియ వ్యవసాయాన్నీ పెద్ద ఎత్తున చేస్తున్నారు. సామాజిక భద్రత కింద సభ్యులకు లోన్ బీమా, స్త్రీనిధి సురక్ష లాంటివీ కల్పిస్తున్నారు. ఈ కృషే వీరికి జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చిపెట్టింది.

– ఎర్రోజు రాజేందర్, ఇల్లంతకుంట

శాస్త్ర సాంకేతిక రంగాల్లో మహిళల సంఖ్య పెరుగుతున్నా... నాయకత్వ స్థానాల్ని అందుకుంటున్న వారు మాత్రం అరుదే. ఈ జాబితాలో తెలుగు మహిళ రేవతి మన్నెపల్లి చేరారు. తాజాగా ఆమె అంతర్జాతీయ టెలి కమ్యూనికేషన్ యూనియన్(ఐటీయూ) రేడియో రెగ్యులేషన్స్ బోర్డు డైరెక్టర్‌గా మనదేశం నుంచి నామినేట్ అయ్యారు. ఈ సందర్భంగా...

కుగ్రామం నుంచి అంతర్జాతీయ స్థాయికి!



రేవతి

ప్రపంచ రేడియో స్పెక్ట్రమ్, ఉపగ్రహ కక్ష్యలను దేశాలకు కేటాయించే ఐటీయూ రేడియో రెగ్యులేషన్స్ బోర్డు డైరెక్టర్‌గా తెలుగు మహిళ రేవతిని కేంద్ర ప్రభుత్వం నామినేట్ చేసింది. ఐటీయూ కేటాయింపులపై దేశాల మధ్య వివాదాలు చాలా సంక్లిష్టంగా ఉంటాయి. భౌగోళిక రాజకీయ సమీకరణాలను ప్రభావితం చేస్తాయి. అందుకే ఈ పదవి అత్యంత కీలకం. ఈ స్థాయికి చేరుకోవడానికి ముందు ఆమె మరెన్నో కీలక బాధ్యతల్ని నిర్వర్తించారు. రేవతిది తిరుపతి జిల్లా కొండాపురం. తండ్రి వెంగమనాయుడు వ్యవసాయం చేసేవారు. తల్లి సుశీలమ్మ గృహిణి. వారికి నలుగురు సంతానం. అందులో ముగ్గురాడపిల్లల్లో రెండో అమ్మాయి రేవతి. వెంగమనాయుడు తన పిల్లలందరినీ బాగా చదివించాలని తపన పడేవారు. వాళ్ల ఊరికి దగ్గర్లోని శ్రీహరికోటలో భారత అంతరిక్ష ప్రయోగ కేంద్రమైన సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్ (ఎస్‌డీఎస్‌సీ-షార్) ఉంటుంది. అలా చిన్నతనం నుంచే అంతరిక్ష సంబంధిత విషయాలపై ఎనలేని ఆసక్తి ఏర్పడి... అందులో పనిచేయాలని కలలు కనేవారామె.

అబ్బాయిని చూడటం కష్టమన్నారు...

పదోతరగతివరకూ నాయుడుపేటలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో చదివారు రేవతి. ఆపై నెల్లూరులోని ప్రభుత్వ బాలికల పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా కోర్సులో చేరారు. అందులో స్టేట్ ఫస్ట్‌గా నిలిచి బంగారు పతకం అందుకున్నారు. తర్వాత హైదరాబాద్ జేఎన్‌టీయూలో ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగంలో చేరి బీటెక్ చేశారు. వాళ్ల ఊరిలో ఇంజినీరింగ్ పూర్తిచేసిన తొలి వ్యక్తి కూడా. తర్వాత గురుగ్రామ్‌లోని మేనేజ్‌మెంట్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్(ఎండీఐ)లో ఎంబీఏ, పారిస్‌లో సైన్స్ పీవోలో ఎంఎస్ పూర్తిచేశారు. కానీ, ఇదంతా అంత సులువుగా ఏమీ జరగలేదు. రేవతి ఉన్నత చదువులకు వెళ్తుంటే... 'ఆడపిల్లలు బాగా చదివితే ఆ స్థాయికి తగ్గ అబ్బాయిని చూడటం కష్టం. భారీగా కట్నం ఇవ్వాలి' అంటూ కొందరు వాళ్ల నాన్నకు చెప్పేవారట. కానీ, ఆయన మాత్రం నచ్చింది చదవమని ప్రోత్సహించారు. బీటెక్ పూర్తవగానే... షార్‌లో ఇంజినీర్‌గా చేరారు రేవతి. అక్కడ పనిచేసిన రెండేళ్లలో... ఏఎస్ఎల్‌వీ, పీఎస్ఎల్‌వీ రాకెట్ ప్రయోగాల్లో భాగస్వామి అయ్యారట. కొన్నాళ్లు సార్క్ దేశాలకు అత్యవసర సేవలు అందించేందుకు బార్క్‌లో శాస్త్రవేత్తగానూ పనిచేశారు. ఆ తర్వాత డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్స్‌కి మారారు. ప్రస్తుతం ఇందులో జాయింట్ వైర్‌లెస్ అడ్వైజర్‌గా వ్యవహరిస్తున్నారు.

అత్యధిక ఓట్లతో...

2015 నుంచి ఆసియా పసిఫిక్ ప్రాంతంలో స్పేస్ స్పెక్ట్రమ్‌కు సంబంధించి ఫ్రీక్వెన్సీ ఎక్స్‌పర్ట్‌గా ఇంటర్నేషనల్ టెలి కమ్యూనికేషన్స్ శాటిలైట్ ఆర్గనైజేషన్ డైరెక్టర్ జనరల్‌కు సలహాలు అందిస్తున్నారు. 2017లో భారత్ ప్రయోగించిన దక్షిణాసియా శాటిలైట్‌కు ఆర్బిటల్ హక్కులు సాధించడంలో కీలకపాత్ర పోషించారు. స్పెక్ట్రమ్‌కు సంబంధించిన టెక్నో రెగ్యులేటరీ విషయాల్లో 2018లో ది హేగ్‌లోని ఇంటర్నేషనల్ కోర్ట్ ఆఫ్ జస్టిస్‌కు మనదేశం తరఫున ప్రాతినిధ్యం వహించారు. 6జీ, ఎన్‌జీఎస్‌వో, స్పెక్ట్రమ్ ఫ్యూచర్ పాలసీలపై మన దేశానికి సూచనలు అందించారు. 2022లో అంతర్జాతీయ టెలికమ్యూనికేషన్ యూనియన్(ఐటీయూ)రేడియో నియంత్రణ బోర్డు(ఆర్ఆర్‌బీ)లో సభ్యురాలిగా అత్యధిక ఓట్లతో ఎన్నికయ్యారు. త్వరలో 2027-30 కాలానికిగానూ డైరెక్టర్ పదవికి ఎంపికైతే... ఈ పోస్టుని అధిరోహించిన తొలిమహిళగా చరిత్ర సృష్టించనున్నారు.

– కల్లిపూడి దేవేంద్రరెడ్డి, సూళ్లూరుపేట

వసుంధర

vasundhara@eenadu.in

అధునాతన టెక్నాలజీ, అంతరిక్షం, రక్షణ రంగం... ఇలా పురుషాధిక్యత రాజ్యమేలుతోన్న అన్ని రంగాల్లోకీ నేటి మహిళ ధైర్యంగా అడుగుపెడుతోంది. ముఖ్యంగా సాయుధ దళాల్లో స్త్రీల ప్రాధాన్యం రోజురోజుకీ పెరుగుతోంది. ఆపరేషన్ సిందూర్‌తో మన నారీశక్తి సామర్థ్యం ప్రపంచానికి తెలిసింది. తాజాగా సబ్‌లెఫ్టినెంట్ ఆస్థా పూనియా... భారత నౌకాదళంలో ఏవియేషన్ ఫైటర్ స్ట్రీమ్‌కు ఎంపికైన తొలి మహిళా అధికారిణిగా చరిత్ర సృష్టించారు.



ఆస్థా

నౌకాదళంలో... 'ఆస్థా' కిరణం!

ఆస్థా స్వస్థలం ఉత్తర్‌ప్రదేశ్‌లోని మేరఠ్. ఇంజినీరింగ్ పూర్తి చేసి 24 ఏళ్ల వయసులో షార్ట్ సర్వీస్ కమిషన్ ద్వారా నౌకాదళంలో చేరారీమె. దేశానికి సేవ చేయాలన్న సంకల్పం తప్ప ఎలాంటి సైనిక కుటుంబ నేపథ్యం లేదీమెకు. కేరళలోని ఎజిమలలోని ప్రతిష్ఠాత్మక ఇండియన్ నావల్ అకాడమీలో కెరియర్‌ను ప్రారంభించారు. ఆపై దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో ప్రాథమిక శిక్షణ తీసుకున్నారు. అందులో భాగంగా పిలాటస్ పీసీ-7ఎంకే విమానాన్ని నడిపారు. మిలిటరీ ఏవియేటర్లకు ప్రాథమిక దశలో దీన్ని నడపడంలోనే శిక్షణ ఇస్తారు.

అది పూర్తయ్యాకే... విశాఖపట్టణంలోని ఐఎన్ఎస్ డేగాలో పైలట్ శిక్షణకు వెన్నెముకగా ఉన్న హాక్ ఎంకే 132 అడ్వాన్స్‌డ్ జెట్ ట్రైనర్ (ఏజేటీ)గా కఠిన శిక్షణ తీసుకున్నారు. నావల్ ఏవియేటర్‌గా అర్హత సాధించి, 'వింగ్స్ ఆఫ్ గోల్డ్' అవార్డునీ అందుకున్నారు. పరిమిత స్థలం, అధిక వేగం, నిరంతరం కదిలే ప్లాట్‌ఫామ్ కారణంగా నేవీలో యుద్ధ విమానాల్ని నడపడం కత్తిమీద సాములాంటిదే. అయినప్పటికీ విజయవంతంగా పూర్తిచేశారు ఆస్థా. ఇక్కడితో పూర్తవలేదు. అయితే అడ్వాన్స్‌డ్ ట్రెయినింగ్ కూడా అయ్యాకే ఫ్రంట్‌లైన్ ఫైటర్స్ అయిన మిగ్-29కే లేదా రఫేల్ యుద్ధ విమానాల్ని నడపడానికి నియమిస్తారు. ఈ రెండూ భారతీయ ఎయిర్ క్రాఫ్ట్ కారియర్ నౌకలైన ఐఎన్ఎస్ విక్రమాదిత్య, ఐఎన్ఎస్ విక్రాంత్ నుంచి పనిచేస్తాయి.

యుద్ధ విమానాల్లో...

ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద వైమానిక దళం మనది. ఈ రంగం 2016 నుంచి అమ్మాయిల్ని స్వాగతిస్తోంది. దాంతో ఇప్పటికే యుద్ధ విమానాలను మహిళలు నడుపుతున్నారు. అవని చతుర్వేది, భావనా కాంత్, మోహనా సింగ్... వంటి అధికారిణులు తొలి దశలో ఎంపికై ఫ్రంట్‌లైన్ యుద్ధ జెట్‌లను నడుపుతూ తమ పోరాట పటిమను చాటుతున్నారు. ప్రస్తుతం దాదాపు 25 మంది మహిళా యుద్ధ పైలట్లు ఉన్నారు. భారత నేవీ సైతం అదే బాటలో పయనిస్తోంది. 2019లో లెఫ్టినెంట్ శివాంగి సింగ్ నౌకాదళంలో తొలి మహిళా పైలట్ అయ్యారు. అలా ఇప్పటికే సముద్ర నిఘా విమానాలు, హెలీకాప్టర్లలో పైలట్లు, నావల్ ఎయిర్ ఆపరేషన్స్ ఆఫీసర్లుగా మహిళా అధికారులు ఉన్నారు. అయితే వీళ్లంతా నాన్- ఫైటర్ ఆపరేషన్లకే పరిమితం. కానీ ఫైటర్ స్ట్రీమ్‌లోకి ఆస్థా ప్రవేశం కొత్త అధ్యాయానికి తెరలేపింది. తీవ్ర ఒత్తిడితో కూడిన హై-స్పీడ్ వైమానిక పోరాటాల్లోనూ స్త్రీలకు సమాన అవకాశాలు కల్పించేందుకు ప్రయత్నిస్తోంది నౌకాదళం. అదేసమయంలో ఈ ఘనత సాధించిన ఆస్థా... నారీశక్తికి ప్రతీకగానూ మరెందరో అమ్మాయిలు యుద్ధ విమానాల్ని నడిపేందుకు రోల్ మోడల్‌గానూ నిలుస్తారనడంలో సందేహం లేదు.



రిషిత

గర్భిణులకు సురక్షిత ప్రయాణం కోసం...



రిషితది ఒడిశాలోని భువనేశ్వర్. చిన్నప్పటి నుంచి నిరుపేదలకు సాయం చేయాలనుకునే రిషిత హైస్కూల్ స్థాయిలోనే నిధుల సేకరణ చేసి ఎన్జీవోలతో కలిసి పనిచేయడం ప్రారంభించింది. తమ ఇంట్లో సహాయకురాలిగా ఉండే మహిళ సొంతూరికి ప్రయాణమైంది. సరిగ్గా లేని రోడ్డు మార్గంలో బస్సులో ప్రయాణించడంతో ఆమెకు గర్భస్రావమైంది. ఇలా రెండుసార్లు జరిగిందని తెలిసి గర్భిణులకు సురక్షిత ప్రయాణాన్ని అందించేలా ఏదైనా చేయాలనుకుంది. రహదారులు గోతులుగా ఉన్నప్పుడు ఆ వాహనంలో గర్భిణులున్నారని డ్రైవరు గుర్తిస్తే కాస్త జాగ్రత్తగా డ్రైవ్ చేస్తారనిపించింది రిషితకు. అలాగని ఎక్కిన ప్రతి ఒక్కరి గురించి డ్రైవరు తెలుసుకోవడం కష్టమైన విషయం. దీనికి ప్రత్యామ్నాయంగా ట్రాక్ చేసే విధానం మంచిదనిపించింది. అందుకే బస్సులోని సాంకేతికతకు అనుసంధానం చేస్తూ బయోమెట్రిక్ పరికరాన్ని రూపొందించింది. గర్భిణులు, వృద్ధులు, వికలాంగులకు సంబంధించిన ప్రభుత్వ డేటాబేస్ ఈ సిస్టమ్‌కు అనుసంధానమవుతుంది. ఇందులోని కెమెరా డేటాబేస్ ద్వారా ప్రయాణికుల గుర్తింపును స్కాన్ చేస్తుంది. జీపీఆర్ఎస్ షీల్డ్ ద్వారా బస్సు డ్రైవర్, కండక్టర్‌కు ప్రయాణంలో అదనపు జాగ్రత్తలు తీసుకోవడానికి హెచ్చరికను పంపుతుంది. దీంతో ఆయా వ్యక్తులకు అనుకూలమైన సీటింగ్ ఏర్పాటు చేస్తారు. 'గర్భిణులకు సురక్షితమైన ప్రయాణం' పేరుతో రూపొందించిన ఈ ప్రాజెక్టు బస్సు ప్రయాణాలతో మహిళల్లో గర్భస్రావం కాకుండా ఉండేలా చేయడానికి ఉపయోగపడుతుంది. రిషిత రూపొందించిన ఈ పరికరానికి 'డాక్టర్ అబ్దుల్‌కలాం ఇగ్నైట్ మైండ్ ఇన్నోవేషన్ అండ్ క్రియేటివిటీ' అవార్డు దక్కింది.

ఆషాఢంలో మునగాకు ఎందుకు తినాలి?

నాకు మునగాకు రుచి అస్సలు నచ్చదు. కానీ, అమ్మ ఏటా ఆషాఢంలో తినాలంటూ బలవంతం చేస్తుంది. ఎందుకు తినాలి అంటే... మంచిది అంటుంది తప్ప సరైన కారణం చెప్పదు. మీరైనా వివరంగా చెప్పగలరు?

– రిత్విక, హైదరాబాద్

మునగాకు రుచి చిరు చేదుగా అనిపించినా, ఇందులో పోషకాలు మాత్రం ఘనంగా ఉంటాయి. సంవత్సరంలోని పదకొండు నెలల్లోనూ అసలు తినకపోయినా, ఆషాఢ మాసంలో మాత్రం ప్రతి ఆదివారమూ మునగాకు తినాలన్నది ఒక ఆచారం. ఆచారం అంటే ఆచరించవలసిన, అనుసరించవలసిన పద్ధతి అని అర్థం. ఆషాఢం (వర్షాకాలం ప్రారంభమయ్యే మాసం)లో జఠరాగ్ని మందగిస్తుంది, వాత దోషం పెరుగుతుంది. వ్యాధి నిరోధక శక్తి తగ్గుతుంది. దీంతో వాత సంబంధ నొప్పులు, జీర్ణ సమస్యలు వచ్చే అవకాశం ఎక్కువ. అందుకే, ఆకలినీ, జీర్ణశక్తినీ పెంచే మునగాకుని తప్పనిసరిగా తినాలి అనేది. ఇది వాత దోషాన్ని అదుపులో ఉంచుతుంది. తద్వారా నొప్పులూ తగ్గుతాయి. ఇక, వానాకాలంలో ఉష్ణోగ్రతలు చల్లగా ఉండటంతో అనేక అనారోగ్యాలు పొంచి ఉంటాయి. మునగాకు బయటి వాతావరణానికి తగ్గట్లుగా... ఒంట్లోని వేడినీ పెంచుతుంది. అంతేకాదు, ఇందులో ఉండే విటమిన్ సి, ఐరన్, కాల్షియం, యాంటీ ఆక్సిడెంట్లు రోగనిరోధక శక్తిని పెంచి వ్యాధుల నుంచి రక్షణ కల్పిస్తాయి. ఆ కారణాలతోనే మునగాకు తినడం పూర్వం నుంచి ఓ ఆచారంగా మారింది.

డియర్ వసుంధర



డాక్టర్ గాయత్రీదేవి
ఆయుర్వేద నిపుణురాలు

– డాక్టర్. గాయత్రీ దేవి, ఆయుర్వేద నిపుణురాలు.

ఆందోళన నుంచి బయటపడేందుకు..!



ఒత్తిడి, ఆందోళనలు ఎక్కువై... ఆలోచనల ప్రవాహంలో కొట్టుకుపోతుంటాం చాలాసార్లు. మహిళలైతే మరీనూ. ఒకదానికి ఒకటి జోడించుకుంటూ ఎక్కడో మొదలైన ఆలోచనలు ఎక్కడెక్కడికో చేరుకుంటాయి. వీటన్నింటి పర్యవసానం మానసిక సమస్యలు. ఈ లేనిపోని తలనొప్పులు... ఆలోచనలు వేధిస్తున్నప్పుడు ఇలా చేసి చూడండి...

మీకు ఇష్టమైన పాటని పెట్టుకుని... కళ్లు మూసుకుని డ్యాన్స్ చేయడం మొదలుపెట్టండి. ఆ అవకాశం లేదనుకుంటే హమ్మింగ్ అయినా చేయండి. మనసు స్థిమితపడి హ్యాపీ హార్మోన్లు విడుదల కావడానికి ఇది మంచి మార్గం. ఒత్తిడి తగ్గి ప్రస్తుత స్థితి నుంచి బయటపడతారు.

షాడో బాక్సింగ్...

ఎక్కువ ఆలోచిస్తున్నప్పుడు ఒకే భంగిమలో ఉండిపోయి... కదలం. దీనివల్ల మన ఆలోచనలతోపాటూ అవయవాలు స్తంభించిపోతాయి. ఇలా అవుతుంది అనుకున్నప్పుడు 10 నుంచి 20 నిమిషాలు షాడో బాక్సింగ్ చేయండి. ప్రత్యర్థిని ఊహించుకుంటూ బాక్సింగ్ చేయాలి. అంటే గాల్లోకి పంచ్‌లు వేసి, అవతలి నుంచి పంచ్‌లు వస్తున్నట్లు కదలికలు ఉండాలి. ఇది మానసిక, శారీరక ఒత్తిళ్లను దూరం చేస్తుంది.

వ్యాయామాలు...

ఉన్నచోట నుంచి లేచి... వేగంగా నడవడం, పరుగెత్తడం చేయండి. ఇది ఎండార్ఫిన్లను ఎక్కువ స్థాయిలో విడుదల చేసి, మనసుకు స్థిమితాన్ని ఇస్తుంది. పుష్-అప్స్, జంపింగ్ జాక్స్, బర్పీస్ లాంటివన్నీ మీకు ఒత్తిడి నుంచి ఉపశమనం కలిగించేవే. మీరున్న ప్రదేశాన్ని బట్టి మీకు తగినవి ఎంచుకుంటే చాలు.

ఏమిటీ ఎమోజీలు?



కాబోయే అమ్మగా ప్రెగ్నెన్సీ షూట్‌ల్నీ పంచుకుంటారు. పాపాయి రాకనీ ఆనందంగా సోషల్‌మీడియాలో షేర్ చేస్తారు. కానీ... పిల్లల ఫొటోలు పంచుకోవడానికి మాత్రం ఇష్టపడరు. పోస్ట్ చేసినా వాళ్ల ముఖంపై ఓ ఎమోజీని పెట్టేస్తారు. తారల నుంచి సామాన్యుల వరకూ ఇదే వరస. ఏమిటీ ఎమోజీలు?

'హైడింగ్ ఆన్ ఎమోజీ'... ఇది ఎప్పుడో మొదలైన ట్రెండ్. హాలీవుడ్ ప్రముఖులే కాదు, మెటా అధినేత మార్క్ జుకర్‌బర్గ్ సహా ఎంతోమంది దీన్ని పాపులర్ చేసినవాళ్లే. ఒక ప్రాణాన్ని ఈ లోకంలోకి తీసుకురావడం ఏ అమ్మకైనా ఆనందమే. దీంతో ఆ సంబరాన్ని అందరితో పంచుకుంటారు. ఇందుకు సాధారణ మహిళ, సెలెబ్రిటీ అన్న తేడా లేదు. అయితే ప్రముఖులు చేసే ప్రతి పనినీ భూతద్దంలో చూసేవారే ఎక్కువ. పిల్లల పోలికల దగ్గర్నుంచి, వాళ్లు చేసే ప్రతి పని మీదా ఫోకస్ ఎక్కువే. దానికి దూరంగా స్వేచ్ఛగా పెరగాలనే ఉద్దేశంతోనే తారలు, ప్రముఖులు తమ పిల్లలను సోషల్‌మీడియాకు, కెమెరా కళ్లకు దూరంగా పెంచాలనుకుంటున్నారు. ఎంతైనా వాళ్లూ అమ్మానాన్నలే కదా! పిల్లలతో కొన్ని సరదాలుండవా? వాళ్లతో గడిపే చిన్న ఆనందాల్ని పంచుకోవాలనుకుంటారు. అయితే పిల్లల గోప్యత కోసమని ముఖాలపై ఎమోజీలను ఉంచడం పరిపాటిగా మారింది. సరే... వాళ్లంటే ప్రముఖులు. మరి సాధారణ అమ్మలూ ఇలాగే చేస్తున్నారుగా అంటే... దీనికీ కారణముంది. ఇంటర్నెట్ కారణంగా గోప్యత కరవవుతోంది. ఏఐతో పిల్లల ఫొటోలనీ మారుస్తున్న దాఖలాలు బోలెడు. అంతేనా, వాటితో ఫేక్ ప్రొఫైళ్లను రూపొందిస్తున్న ఉదాహరణలూ ఉన్నాయి. పోనీ ఇంత ముందు చూపుతో ఆలోచించకపోయినా పిల్లలకే ఇష్టాన్ని వదిలేద్దామనుకుంటున్నవారూ ఉన్నారు. చిన్నప్పటి ఫొటోలు మనకి ముద్దుగానే ఉంటాయి. కానీ పెద్దయ్యాక అవే పిల్లలకు అవమానంగా అనిపించవచ్చు. కాబట్టి, వాళ్లు షేర్ చేసుకుంటే సరే... మనం కావాలని పరిచయం చేయడమెందుకన్న భావన కూడా ఉంది. సురక్షితంగా ఉంచడం, గోప్యత... ఈ ఎమోజీ వెనక ఇన్ని కారణాలున్నాయి.

ఆహ్వానం వసుంధర పేజీపై మీ అభిప్రాయాలు, సలహాలు, నిపుణులకు ప్రశ్నలు... ఇలా మాతో ఏది పంచుకోవాలన్నా 9154091911కు వాట్సాప్, టెలిగ్రాంల ద్వారా పంపవచ్చు.

మీకు తెలుసా!



2020లో 108 అంబులెన్స్ డ్రైవర్‌గా ఎం. వీరలక్ష్మీ అనే మహిళను తమిళనాడులో నియమించారు. దేశంలోనే మొట్టమొదటి మహిళా అంబులెన్స్ డ్రైవరీమె. సమాజానికి సేవ చేయాలనే ఉద్దేశంతో ఈ వృత్తిని ఎంచుకున్నారట.

బంగారం - వెండి



5న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,00,050	91,000	1,10,940
విజయవాడ	97,100	90,600	1,11,100
ప్రొద్దుటూరు	97,300	89,560	1,08,500
రాజమహేంద్రవరం	98,830	90,600	1,20,000
విశాఖపట్నం	98,480	90,600	1,12,000
తమిళనాడు	-----	90,600	1,20,000

చదువూ... వినోదం కలగలిపి!





పిల్లల్ని కుదురుగా ఒక చోట కూర్చోబెట్టి చదివించడానికి అమ్మలు పడే కష్టాలు అన్నీ ఇన్నీ కావు. ఎంత చెప్పినా వింటేనా... అల్లరి ప్రపంచం వాళ్లది. కసురుకునో... బెత్తం పట్టో పుస్తకం పట్టిస్తే అక్షరాలేం వంటపడతాయి. అనవసరంగా వాళ్లని ఒత్తిడికి గురిచేయడం తప్ప. అందుకే వాళ్లకి ఈ రీడింగ్ టేబుళ్లను బహుమతిగా ఇచ్చి చూడండి. సింహం, జింక, టెడ్డీ, బస్, రైలు ఆకారాల్లో ఎన్ని రకాల టేబుళ్లు అందుబాటులోకి వస్తున్నాయో. వీటి వల్ల చిన్నారులు చదువుకునే సమయం... ఎడ్యుటెయిన్‌మెంట్ అవర్‌లా సులువుగా గడిచిపోతుంది. అంటే ఆటా, చదువూ రెండూ ఉంటాయన్నమాట. పైగా ఇవి నేచర్ ఫ్రెండ్లీ కూడానూ. చెక్కతో చేసిన చాలా రకాలు మార్కెట్లోకి అందుబాటులోకి వచ్చాయి. మీకూ నచ్చితే... తెచ్చేసుకోండి మరి!

















కొరియన్ హెయిర్ కావాలా!

కొరియన్ల జుట్టు నల్లగా సిల్కీగా మెరుస్తూ ఉంటుంది కదా! అలా మీకూ కావాలనిపిస్తే... ఈ సింపుల్ చిట్కాలపై ఓ లుక్కేయండి.

జుట్టు ఆరోగ్యంగా ఉండాలి, ఒత్తుగా పెరగాలని అమ్మాయిలు తరచూ హెయిర్ స్పాలు చేయిస్తుంటారు. ఈ క్రమంలో కుదుళ్ల కంటే జుట్టుపైనే ఎక్కువ శ్రద్ధ పెడుతుంటారు. కానీ, కొరియన్లు జుట్టు ఆరోగ్యంతోపాటూ కుదుళ్లపైనా దృష్టి పెడతారు. అందుకే వాళ్ల కురులు బలంగా పెరుగుతాయి. వాళ్లు అనుసరించే ఈ హెడ్ స్పా ట్రెండ్‌తో అనేక ప్రయోజనాలున్నాయి. ముందుగా స్కాల్ప్‌ను డీటాక్స్ చేయడంతో ప్రారంభిస్తారు. దీనికోసం వారానికోసారి మాడుపై ఉన్న మృత కణాలు, అదనపు నూనెలను తొలగించాలి. అప్పుడే జుట్టు ఆరోగ్యంగా పెరుగుతుంది. ఇప్పుడు కుదుళ్లలోని చర్మతత్వానికి నప్పే రసాయనాలు లేని షాంపూని వాడితే దుమ్మూధూళీ తొలగిపోతాయి. జుట్టు తేమను కోల్పోకుండా అవసరాన్ని బట్టి మాస్క్, సీరమ్‌లను పట్టించాలి. ఈ క్రమంలోనే వేళ్లతో 3నుంచి 5 నిమిషాలు మాడుని మృదువుగా మర్దనా చేయాలి. దీనివల్ల ఒత్తిడి తగ్గడమే కాకుండా రక్తప్రసరణ మెరుగుపడుతుంది. అంతే కాదు, జుట్టు ఆరోగ్యంగానూ పెరుగుతుంది.




ఛాంపియన్

ఆఖరి పంచ్‌కు టీమ్‌ఇండియా సిద్ధమైంది. అద్భుత ఆటను కొనసాగిస్తూ ఎడ్జ్‌బాస్టన్ టెస్టుపై పట్టుబిగించింది. భీకర ఫామ్‌లో ఉన్న కెప్టెన్ శుభ్‌మన్ గిల్ మరో భారీ శతకం సాధించిన వేళ.. రెండో టెస్టులో గెలుపు ముంగిట నిలిచింది. భారత్ కనీసం సురక్షితం. ఇక రెండు ఫలితాలే సాధ్యం! గిల్ జట్టు గెలవడం లేదా ఇంగ్లాండ్ పోరాడితే డ్రా కావడం. గిల్‌తో పాటు పంత్ చెలరేగడంతో రెండో ఇన్నింగ్స్‌లోనూ పరుగుల వరద పారించిన టీమ్‌ఇండియాకు సిరీస్‌ను సమం చేయడానికి సువర్ణావకాశం లభించింది. ఎందుకంటే ఏమాత్రం సమయం వృథా చేయకుండా మన బౌలర్లు వికెట్ల వేట మొదలెట్టారు. 608 పరుగుల ప్రపంచ రికార్డు లక్ష్యంతో బరిలోకి దిగిన ఇంగ్లాండ్ 72 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయింది. ఆఖరి రోజంతా నిలిచి, టీమ్‌ఇండియా విజయాన్ని అడ్డుకోవాలంటే ఇంగ్లాండ్ అసాధారణంగా పోరాడాల్సిందే.

అదిగదిగో విజయం

- ఎడ్జ్‌బాస్టన్‌లో గెలుపు బాటలో భారత్
- గిల్ భారీ శతకం
- మెరిసిన పంత్
- ఇంగ్లాండ్ లక్ష్యం 608; ప్రస్తుతం 72/3


గిల్ 161

బర్మింగ్‌హామ్

రెండో టెస్టులో టీమ్‌ఇండియా గెలుపుపై కన్నేసింది. ఓవర్‌నైట్ స్కోరు 64/1తో నాలుగో రోజు, శనివారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన భారత్.. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (161; 162 బంతుల్లో 13×4, 8×6) భారీ సెంచరీతో 427/6 వద్ద డిక్లేర్ చేసింది. రిషబ్ పంత్ (65; 58 బంతుల్లో 8×4, 3×6), జడేజా (69 నాటౌట్; 118 బంతుల్లో 5×4, 1×6) రాణించారు. తొలి ఇన్నింగ్స్‌లో 180 పరుగుల ఆధిక్యం సంపాదించిన భారత్.. 608 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. ఛేదనలో ఇంగ్లాండ్ తడబడింది. ఆట ముగిసే సమయానికి 3 వికెట్ల నష్టానికి 72 పరుగులు చేసింది. ఆకాశ్‌దీప్ (2/36), సిరాజ్ (1/29) ఆ జట్టును దెబ్బతీశారు. పోప్ (24), బ్రూక్ (15) క్రీజులో ఉన్నారు. ఆదివారం ఉదయం సెషన్లో భారత బౌలర్లు ఎలా బౌలింగ్ చేస్తారన్నది మ్యాచ్‌లో కీలకం. టెస్టుల్లో అత్యధిక లక్ష్య ఛేదన (418) రికార్డు వెస్టిండీస్ పేరిట ఉంది. కరీబియన్ జట్టు 2003లో ఆస్ట్రేలియాపై ఈ ఘనత సాధించింది.


ఆకాశ్‌దీప్ 2/36

విజృంభించిన ఆకాశ్‌దీప్: బ్యాటుతో అదరగొట్టి భారీ లక్ష్యాన్ని నిర్దేశించిన భారత్‌కు నాలుగో రోజు బౌలర్లు అదిరే ముగింపునిచ్చారు. ఇంగ్లాండ్ బ్యాటర్లు బజ్‌బాల్ ఆటను పక్కన పెట్టేలా చేశారు. ఆ జట్టును తొలి దెబ్బతీసింది సిరాజ్. రెండో ఓవర్లో అతడు క్రాలీ (0)ను ఔట్ చేశాడు. క్రాలీ ఎడ్జ్‌తో సాయి సుదర్శన్‌కు దొరికిపోయాడు. ఆ తర్వాత ఇంగ్లాండ్‌కు ఆకాశ్‌దీప్ షాకిచ్చాడు. రౌండ్ ద వికెట్ నుంచి ఆకాశ్‌దీప్ వేసిన బంతిని ఆడబోయిన డకెట్ (25) ఇన్‌సైడ్ ఎడ్జ్‌తో బౌల్డయ్యాడు. ఆ తర్వాత రూట్ (6)తో కలిసి పోప్ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే ప్రయత్నం చేశాడు. కానీ వారి భాగస్వామ్యం ఎంతో సేపు సాగలేదు. ఓ కళ్లు చెదిరే బంతితో రూట్‌ను బౌల్డ్ చేసిన ఆకాశ్‌దీప్.. ఇంగ్లాండ్‌ను ఒత్తిడిలోకి నెట్టాడు. ఆఖరి రోజు ఆ జట్టు ఎంత ప్రతిఘటించగలదో చూడాలి.


రూట్ బౌల్డ్

పరుగులు అలవోకగా..: నాలుగో రోజు కూడా టీమ్‌ఇండియా బ్యాటుతో అదరగొట్టింది. అలవోకగా పరుగులు రాబట్టింది. ధనాధన్ బ్యాటింగ్‌తో పంత్, సూపర్ ఫామ్‌ను కొనసాగిస్తూ గిల్ జట్టును పటిష్ఠ స్థితిలో నిలిపారు. రాహుల్ కూడా విలువైన అర్ధశతకం సాధించాడు. ఓవర్‌నైట్ స్కోరు 64/1తో భారత్ తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించగా.. కరుణ్ నాయర్ (ఓవర్‌నైట్ 7)తో కలిసి రాహుల్ (ఓవర్‌నైట్ 28) ఇన్నింగ్స్‌ను నడిపించాడు. ఇన్నింగ్స్ మంచి రన్‌రేట్‌తో సాగింది. కార్స్ బౌలింగ్‌లో ఆఫ్‌స్టంప్ ఆవల పడ్డ బంతిని చక్కని కవర్ డ్రైవ్‌తో బౌండరీ దాటించిన రాహుల్ (55).. ఆ తర్వాత మరికొన్ని ముచ్చటైన కవర్ డ్రైవ్‌లు ఆడాడు. నాయర్ కూడా కొన్ని చక్కని షాట్లతో బౌండరీలు రాబట్టాడు. కానీ ఎక్కువసేపు నిలవలేకయాడు. అతడు నాలుగో రోజు తొలి వికెట్‌గా వెనుదిరిగాడు. ఆఫ్‌స్టంప్ లోగిలిలో టంగ్ బంతిని ఆడిన కరుణ్ (26) ఎడ్జ్‌తో వికెట్‌కీపర్‌కు చిక్కాడు. ఆ తర్వాత గిల్, రాహుల్ అడపాదడపా బంతిని బౌండరీ దాటిస్తూ మంచి వేగంతోనే ఇన్నింగ్స్‌ను నడిపించారు. రాహుల్ చక్కగా బ్యాటింగ్ చేస్తున్న సమయంలో టంగ్ ఓ కళ్లు చెదిరే బంతితో అతణ్ని బౌల్డ్ చేశాడు. కానీ ఇంగ్లాండ్‌కు పెద్దగా సంతోషించడానికేమీ లేకపోయింది. 30వ ఓవర్లో క్రీజులోకి వచ్చిన హిట్టర్ పంత్.. తనదైన శైలిలో అభిమానులను అలరించాడు. ధనాధన్ బ్యాటింగ్‌తో స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. పంత్ వస్తూనే విరుచుకుపడ్డాడు. టంగ్ బౌలింగ్‌లో బ్యాక్‌వర్డ్ స్క్వేర్ లెగ్‌లో బౌండరీతో ఖాతా తెరిచిన అతడు.. ఆ వెంటనే ముందుకొచ్చి లాంగాఫ్‌లో సిక్స్ బాదేశాడు. టంగ్ తర్వాతి ఓవర్లో పంత్ స్లాగ్ స్వీప్‌తో సిక్స్ దంచిన తీరును చూసి తీరాల్సిందే. బషీర్‌నూ రెండు ఫోర్లతో దండించాడు. లంచ్ వరకు గిల్‌తో 51 పరుగుల భాగస్వామ్యంలో పంత్ చేసినవే 41 (35 బంతుల్లో) కావడం విశేషం. లంచ్ తర్వాత కూడా జోరు కొనసాగించాడు పంత్. టంగ్ ఓవర్లో అతడు కొట్టిన ఓ సిక్స్‌తో భారత్ ఆధిక్యం 400 దాటింది. అయితే ధాటిగా ఆడే క్రమంలో బషీర్ బౌలింగ్‌లో పంత్ ఔట్ కావడంతో ఓ మెరుపు ఇన్నింగ్స్‌కు తెరపడింది. ముందుకొచ్చి ఆడిన పంత్ ఆ క్రమంలో బ్యాట్‌ను కూడా చేజార్చుకున్నాడు. డకెట్ క్యాచ్ అందుకున్నాడు. అయితే పంత్ నిష్క్రమించినా ఇంగ్లాండ్ బౌలర్లను గిల్ వదల్లేదు. అదిరే ఆటతో జట్టును తిరుగులేని స్థితికి తీసుకెళ్లాడు.

గిల్ మళ్లీ..: సిరీస్‌లో కెప్టెన్ గిల్ సెంచరీల మోత, పరుగుల వరద కొనసాగుతోంది. తొలి ఇన్నింగ్స్‌లో ద్విశతకంతో జట్టుకు భారీ స్కోరు అందించిన అతడు.. రెండో ఇన్నింగ్స్‌లో భారీ సెంచరీతో అదరగొట్టాడు. గిల్ ఆటలో అదే ప్రశాంతత, అదే సంయమనం. అదే సమయంలో దూకుడుగానూ ఆడి మ్యాచ్‌ను ఇంగ్లాండ్‌కు అందనంత దూరంలో పెట్టాడు. ముందు రాహుల్‌తో కలిసి 30 పరుగులు జోడించిన అతడు.. ఆ తర్వాత స్ట్రైక్‌రొటేట్ చేస్తూ జోరు మీదున్న పంత్‌కు సహకరించాడు. లంచ్ తర్వాత గిల్ గేర్ మార్చాడు. ముఖ్యంగా టంగ్‌ను ఓ ఆటాడుకున్నాడు. అతడి బౌలింగ్‌లో కళ్లు చెదిరే షాట్లతో వరుసగా 6, 4, 4 బాదేశాడు. అతడి తర్వాతి ఓవర్లో సిక్స్, ఫోర్‌తో అర్ధశతకం పూర్తి చేశాడు. నాలుగో వికెట్‌కు 110 పరుగులు జోడించాక పంత్ ఔటైనా గిల్ సాధికారిక బ్యాటింగ్‌ను కొనసాగించాడు. కాస్త వేగం తగ్గినా అలవోకగా పరుగులు రాబడుతూ ... జడేజాతో కలిసి మరో భాగస్వామ్యం నెలకొల్పాడు. జడేజా ఎలాంటి తడబాటు లేకుండా బ్యాటింగ్ చేశాడు. టీ విరామానికి కాసేపటి ముందు గిల్ సెంచరీ పూర్తి చేశాడు. టీ తర్వాత అతడు మరింత చెలరేగిపోయాడు. ఇంగ్లాండ్ బ్యాటర్లు చాలా దూకుడుగా ఆడుతున్న నేపథ్యంలో ఆధిక్యం 500 దాటినా.. ఇన్నింగ్స్ డిక్లేర్ చేయడానికి గిల్ తొందరపడలేదు. అయితే వీలైనంత ఎక్కువ లక్ష్యాన్ని నిర్దేశించడం కోసం అతడు నిర్దాక్షిణ్యంగా విరుచుకుపడ్డాడు. ఎడాపెడా ఫోర్లు, సిక్స్‌లతో ఇంగ్లిష్ బౌలింగ్‌ను ఉతికేశాడు. చివరికి జట్టు ఆధిక్యం 600కు చేరువలో బషీర్ బౌలింగ్‌లో గిల్ ఔటయ్యాడు. విరామం తర్వాత గిల్.. 32 బంతుల్లోనే 61 పరుగులు చేయడం విశేషం. అతడు జడేజాతో నాలుగో వికెట్‌కు 175 పరుగులు జోడించాడు. నితీశ్ (1) త్వరగానే ఔట్ కాగా.. సుందర్ (12 నాటౌట్), జడేజా ఆధిక్యాన్ని 600 దాటించాక గిల్ ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేశాడు.

ఒక్కడే 430

ఈ మ్యాచ్‌లో గిల్ చేసిన పరుగులు 430. ఓ టెస్టులో అత్యధిక స్కోరు చేసిన బ్యాటర్ల జాబితాలో అతడు గూచ్ (456) తర్వాత రెండో స్థానంలో ఉన్నాడు.

2 ఓ టెస్టు మ్యాచ్‌లో రెండు 150+ స్కోర్లు సాధించిన రెండో బ్యాటర్‌గా గిల్ నిలిచాడు. బోర్డర్ (150*, 153; పాకిస్థాన్‌పై 1980లో) ఈ ఘనత సాధించిన మొదటి బ్యాటర్.

9 ఓ టెస్టు మ్యాచ్‌లో సెంచరీ, డబుల్ సాధించిన తొమ్మిదో బ్యాటర్ గిల్. భారత్ నుంచి గావస్కర్ తర్వాత రెండోవాడు.

3 గావస్కర్, కోహ్లి తర్వాత టెస్టు మ్యాచ్ రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ శతకాలు సాధించిన మూడో భారత కెప్టెన్ గిల్.

4 ఈ టెస్టులో గిల్ శతక భాగస్వామ్యాలు. టెస్టు మ్యాచ్‌లో నాలుగు సెంచరీ భాగస్వామ్యాల్లో భాగమైన తొలి భారతీయుడు అతడే.

1014 ఈ టెస్టులో టీమ్‌ఇండియా చేసిన పరుగులు. ఓ టెస్టు మ్యాచ్‌లో భారత్ సాధించిన అత్యధిక పరుగులివే.

వదలొద్దు.. ఈసారి!

608 పరుగుల లక్ష్యం.. నాలుగో రోజు ఆట చివరికి 72/3. ఏడు వికెట్లు చేతిలో ఉండగా ఇంకా 536 పరుగులు చేయాలి. ఈ స్థితిలో ఏ జట్టు ఉన్నా ఓటమి తప్పించుకోవడం కష్టమే. బౌలింగ్ జట్టు సులువుగా గెలిచేయాలి. కానీ భారత్ గెలుపు మీద ఏ మూలనో చిన్న సందేహం! తొలి టెస్టులో గెలవాల్సిన.. కనీసం డ్రా చేసుకోవాల్సిన మ్యాచ్‌ను ఎలా చేజార్చుకుందో చూశాం. ఇప్పుడు సందేహాలు నెలకొనడంలో ఆశ్చర్యమేమీ లేదు. ఎలాంటి స్థితిలో అయినా దూకుడుగా ఆడే ఇంగ్లిష్ జట్టు.. ఇప్పటికే బజ్‌బాల్‌ను పక్కన పెట్టేసింది. చివరి రోజు కూడా ఆ శైలిని పక్కన పెట్టడం ఖాయం. గెలవడం అసాధ్యం కాబట్టి ఆ జట్టు డ్రా కోసమే ఆడే అవకాశముంది. మరి మిగతా ఏడు వికెట్లు తీసి భారత్ విజయాన్ని సొంతం చేసుకుంటుందా.. తొలి టెస్టులో మాదిరి పట్టు వదిలి ఇంగ్లాండ్ డ్రా చేసుకునే అవకాశమిస్తుందా అన్నది ప్రశ్న. సుదీర్ఘ సమయం క్రీజులో నిలిచే జో రూట్ ఔటైపోవడం భారత్‌కు కలిసొచ్చే విషయం. ఇక ప్రధాన ముప్పు స్టోక్స్, పోప్‌ల నుంచే ఉంది. ఈ ఇద్దరూ నిలిచి ఆడగల సత్తా ఉన్న వాళ్లే. తొలి ఇన్నింగ్స్‌లో బ్రూక్, స్మిత్ ఎలా పోరాడారో తెలిసిందే. ఈ నలుగురిని మధ్యాహ్నం లోపు ఔట్ చేయగలిగితే భారత్ గెలిచేసినట్లే. నాలుగో రోజు ఉన్న కొంచెం సమయంలో పేసర్లు ఆకాశ్‌దీప్, సిరాజ్ అదరగొట్టారు. మిగతా బౌలర్ల మీద ఆశలు తక్కువే. ఉదయం ఈ ఇద్దరూ రెండు మూడు వికెట్లు పడగొడితే విజయానికి ద్వారాలు తెరుచుకున్నట్లే.


పంత్ 65

24 ఇంగ్లాండ్‌లో టెస్టుల్లో పంత్ సిక్స్‌లు. ఓ దేశంలో అత్యధిక సిక్స్‌లు కొట్టిన పర్యటక బ్యాటర్‌గా పంత్ ఘనత సాధించాడు. స్టోక్స్ (దక్షిణాఫ్రికాలో 21)ను అతడు అధిగమించాడు.

భారత్ తొలి ఇన్నింగ్స్: 587

ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్: 407

భారత్ రెండో ఇన్నింగ్స్: జైస్వాల్ ఎల్బీ (బి) టంగ్ 28; రాహుల్ (బి) టంగ్ 55; కరుణ్ నాయర్ (సి) స్మిత్ (బి) కార్స్ 26; గిల్ (సి) అండ్ (బి) బషీర్ 161; పంత్ (సి) డకెట్ (బి) బషీర్ 65; జడేజా నాటౌట్ 69; నితీశ్ కుమార్‌రెడ్డి (సి) క్రాలీ (బి) రూట్ 1; సుందర్ నాటౌట్ 12; ఎక్స్‌ట్రాలు 10 మొత్తం: (83 ఓవర్లలో) 427/6 డిక్లేర్డ్; వికెట్ల పతనం: 1-41, 2-96, 3-126, 4-236, 5-411, 6-412

బౌలింగ్: వోక్స్ 14-3-61-0; కార్స్ 12-2-56-1; జోష్ టంగ్ 15-2-93-2; స్టోక్స్ 7-1-26-0; బషీర్ 26-1-119-2; రూట్ 9-1-65-1

ఇంగ్లాండ్ రెండో ఇన్నింగ్స్: డకెట్ (బి) ఆకాశ్‌దీప్ 25; క్రాలీ (సి) సుదర్శన్ (బి) సిరాజ్ 0; ఒలీ పోప్ బ్యాటింగ్ 24; రూట్ (బి) ఆకాశ్‌దీప్ 6; బ్రూక్ బ్యాటింగ్ 15; ఎక్స్‌ట్రాలు 2 మొత్తం: (16 ఓవర్లలో 3 వికెట్లకు) 72

వికెట్ల పతనం: 1-11, 2-30, 3-50; బౌలింగ్: ఆకాశ్‌దీప్ 8-1-36-2; సిరాజ్ 5-1-29-1; ప్రసిద్ధ్ కృష్ణ 3-0-6-0


నీరజ్ చోప్రా

నీరజ్ టోర్నీలో నీరజ్‌దే టైటిల్

బెంగళూరు: ప్రపంచ వేదికల్లోనే కాక సొంతగడ్డ మీదా నీరజ్ చోప్రా తన ఆధిపత్యాన్ని చాటాడు. దేశంలో తొలిసారిగా, తన పేరిటే నిర్వహించిన అంతర్జాతీయ జావెలిన్ త్రో ఈవెంట్లో నీరజ్ విజేతగా నిలిచాడు. శనివారం బెంగళూరులోని శ్రీ కంఠీరవ స్టేడియంలో ఉత్సాహభరిత వాతావరణంలో జరిగిన నీరజ్ చోప్రా క్లాసిక్ ఈవెంట్లో ఈ భారత స్టార్ 86.18 మీటర్ల దూరం బల్లేన్ని విసిరి అగ్రస్థానంలో నిలిచాడు. తన మూడో త్రోలో అతను ఈ దూరాన్ని అందుకున్నాడు. కెన్యా అథ్లెట్ జూలియస్ యెగో (84.51 మీ), శ్రీలంకకు చెందిన రుమేష్ పతిరాగె (84.34 మీ) వరుసగా 2, 3 స్థానాల్లో నిలిచారు. నీరజ్ వరుసగా మూడో ఈవెంట్లో ఛాంపియన్‌గా నిలవడం విశేషం. గత నెల డైమండ్ లీగ్, గోల్డెన్ స్పైక్ టోర్నీల్లో అతను అగ్రస్థానం సాధించాడు. భారత అథ్లెటిక్స్ సమాఖ్య (ఏఎఫ్‌ఐ), జేఎస్‌డబ్ల్యూ స్పోర్ట్స్‌తో కలిసి నీరజ్.. తన పేరిట ఈవెంట్ నిర్వహించాడు. ప్రపంచ అథ్లెటిక్స్ సమాఖ్య ఈ టోర్నీకి 'ఏ' రేటింగ్ ఇచ్చింది.

అమ్మాయిలు.. 5 పరుగుల తేడాతో

ఇంగ్లాండ్ చేతిలో భారత్ ఓటమి

లండన్: ఇంగ్లాండ్‌తో 5 టీ20ల సిరీస్‌లో భారత అమ్మాయిలకు తొలి ఓటమి. మూడో మ్యాచ్‌లో 5 పరుగుల స్వల్ప తేడాతో భారత్ ఓటమిపాలైంది. మొదట ఓపెనర్లు సోఫియా డంక్లీ (75), డాని వ్యాట్ (66) అదిరే ఆరంభాన్నివ్వడంతో ఇంగ్లాండ్ 16 ఓవర్లలో 146/1తో తిరుగులేని స్థితిలో నిలిచింది. కానీ చివరి 4 ఓవర్లలో అరుంధతి రెడ్డి (3/32), దీప్తి శర్మ (3/27), శ్రీ చరణి (2/43) కట్టుదిట్టంగా బౌలింగ్ చేసి ఇంగ్లిష్ జట్టును 171/9కు పరిమితం చేశారు. ఛేదనలో భారత్ 5 వికెట్లు కోల్పోయి 166 పరుగులు చేసింది. స్మృతి మంధాన (56) సూపర్ ఫామ్‌ను కొనసాగించగా.. షెఫాలి వర్మ (47) సత్తా చాటింది. చివరి ఓవర్లో 12 పరుగులు అవసరం కాగా.. హర్మన్‌ప్రీత్ (23) క్రీజులో ఉన్నా జట్టును గెలిపించలేకపోయింది. 6 పరుగులే ఇచ్చిన లారెన్ బెల్ (1/37) చివరి బంతికి హర్మన్‌ను ఔట్ చేసింది.

వైభవ్.. అక్కడా సంచలనమే

- యూత్ వన్డేల్లో వేగవంతమైన శతకం
- అత్యంత పిన్న వయస్కుడిగానూ ఘనత


వైభవ్ 143

వర్సెస్టర్: ఐపీఎల్‌లో, టీ20 క్రికెట్లో శతకం సాధించిన అత్యంత పిన్న వయస్కుడిగా రికార్డులు నెలకొల్పిన బిహార్ యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ.. అంతర్జాతీయ క్రికెట్లోనూ రికార్డుల వేట మొదలుపెట్టాడు. అండర్-19 వన్డేల్లో అత్యంత వేగంగా, చిన్న వయసులో సెంచరీ కొట్టిన బ్యాటర్‌గా అతను రికార్డు సృష్టించాడు. ఇంగ్లాండ్ అండర్-19 జట్టుతో వన్డే సిరీస్‌లో చెలరేగిపోతున్న వైభవ్ (143; 78 బంతుల్లో 13×4, 10×6) శనివారం నాలుగో వన్డేలో విధ్వంసక శతకం సాధించాడు. అతను 52 బంతుల్లోనే మూడంకెల స్కోరును అందుకున్నాడు. యూత్ వన్డేల్లో పాకిస్థాన్ బ్యాటర్ కమ్రాన్ గులామ్ (53 బంతుల్లో, 2013లో)దే ఇప్పటిదాకా వేగవంతమైన శతకం. అండర్-19లో సెంచరీ చేసిన పిన్న వయస్కుడిగా బంగ్లాదేశ్ బ్యాటర్ నజ్ముల్ శాంటో (14 ఏళ్ల 241 రోజులు) పేరిట ఉన్న రికార్డును సైతం వైభవ్ బద్దలు కొట్టాడు. శనివారానికి వైభవ్ వయసు 14 ఏళ్ల 100 రోజులే. ఈ మ్యాచ్‌లో భారత్ 55 పరుగుల తేడాతో నెగ్గి మరో వన్డే మిగిలుండగానే సిరీస్‌ను 3-1తో సొంతం చేసుకుంది. మొదట వైభవ్‌తో పాటు విహాన్ మల్హోత్రా (129; 121 బంతుల్లో 15×4, 3×6) కూడా సెంచరీ చేయడంతో భారత్ 9 వికెట్లకు 363 పరుగులు చేసింది. ఇంగ్లాండ్ బౌలర్లలో జాక్ హోమ్ (4/63), సెబాస్టియన్ మోర్గాన్ (3/54) రాణించారు. అనంతరం ఆతిథ్య జట్టు 45.3 ఓవర్లలో 308 పరుగులకు ఆలౌటైంది. ఆండ్రూ ఫ్లింటాఫ్ తనయుడు రాకీ ఫ్లింటాఫ్ (107; 91 బంతుల్లో 7×4, 4×6) జట్టు గెలుపు కోసం పోరాడాడు. కానీ నమన్ పుష్పక్ (3/63), అంబ్రిష్ (2/5) చకచకా వికెట్లు తీసి భారత్‌ను గెలిపించారు.


శ్రీకాంత్

టాప్ సీడ్‌కు శ్రీకాంత్ చెక్

కాల్గరీ (కెనడా): పేలవ ఫామ్ నుంచి బయటపడి ఈ ఏడాది నిలకడగా రాణిస్తున్న భారత స్టార్ షట్లర్ కిదాంబి శ్రీకాంత్.. కెనడా ఓపెన్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నీలో సెమీఫైనల్లోకి దూసుకెళ్లాడు. పురుషుల సింగిల్స్ క్వార్టర్స్‌లో అతను ప్రపంచ ఆరో ర్యాంకర్, టాప్ సీడ్ చౌ టీన్ చెన్ (చైనీస్ తైపీ)ని ఓడించాడు. 43 నిమిషాల్లో ముగిసిన పోరులో శ్రీకాంత్ 21-18, 21-9తో విజయం సాధించాడు. ఒకప్పుడు ప్రపంచ నంబర్‌వన్ ర్యాంకుకు ఎదిగిన శ్రీకాంత్.. గత కొన్నేళ్లలో పేలవ ప్రదర్శనతో కెరీర్లో పతనం చూశాడు. ప్రస్తుతం తన ర్యాంకు 49. ఈ ఏడాది మెరుగ్గా ఆడుతున్న శ్రీకాంత్.. మేలో మలేసియా మాస్టర్స్ టోర్నీలో రన్నరప్‌గా నిలిచాడు. ఈ జోరును కొనసాగిస్తూ ఇప్పుడు కెనడా ఓపెన్ తుది నాలుగులో చోటు సంపాదించాడు. సెమీస్‌లో శ్రీకాంత్.. మూడో సీడ్ కెంటా నిషిమోటో (జపాన్)ను ఢీకొంటాడు.

ఫైనల్లో అయిదుగురు భారత బాక్సర్లు

అస్తానా (కజకిస్థాన్): ప్రపంచ బాక్సింగ్ కప్‌లో మరో అయిదుగురు భారత బాక్సర్లు ఫైనల్ చేరారు. హితేష్ (70 కేజీ), మీనాక్షి (48 కేజీ), సాక్షి (54 కేజీ), పూజ రాణి (80 కేజీ), జుగ్నూ (85 కేజీలు) తుదిపోరులో అడుగుపెట్టారు. మీనాక్షి 5-0తో నూర్‌సెలెన్ (తుర్కియె)పై నెగ్గగా.. సాక్షి అంతే తేడాతో ఫిరోజా (ఉజ్బెకిస్థాన్)ను ఓడించింది. పూజ రాణి 3-2తో గునెరి (తుర్కియె)పై పైచేయి సాధించగా.. జుగ్నూ 5-0తో టెగాన్ స్కాట్ (ఇంగ్లాండ్)పై గెలిచాడు. ట్రారోర్‌పై హితేష్ విజయం సాధించాడు. సంజు (60 కేజీ) 0-5తో విక్టోరియా గ్రాఫెయెవా (కజకిస్థాన్) చేతిలో ఓడి కాంస్యంతో సరిపెట్టుకుంది. అభినాష్ (65 కేజీ) ఇప్పటికే ఫైనల్ చేరాడు. ఆదివారం భారత బాక్సర్లు ఆరు స్వర్ణాల కోసం పోటీపడనున్నారు.

భారత్‌కు ఆసియాకప్ ఫైనల్స్ బెర్తు

చియాంగ్ మయ్ (థాయ్‌లాండ్): భారత మహిళల ఫుట్‌బాల్ జట్టు ఆసియాకప్ ఫైనల్స్ బెర్తును దక్కించుకుంది. క్వాలిఫయర్స్ టోర్నీలో శుక్రవారం జరిగిన ఆఖరి మ్యాచ్‌లో 2-1తో థాయ్‌లాండ్‌ను ఓడించింది. సంగీత రెండు గోల్స్ చేసి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించింది. మహిళల ఫుట్‌బాల్‌లో థాయ్‌లాండ్‌పై గెలవడం భారత్‌కు ఇదే తొలిసారి. గ్రూప్-బీలో 4 మ్యాచ్‌ల్లో నాలుగు విజయాలతో భారత్.. 2026 ఆసియాకప్ ఫైనల్స్ టోర్నీకి అర్హత సాధించింది. ఈ పోటీలు ఆస్ట్రేలియాలో జరుగుతాయి. 2022 తర్వాత ఆ టోర్నీలో భారత్ ఆడబోతోంది.

ఛాంపియన్ ఇంటికి

- క్రెజికోవా ఔట్
- ప్రిక్వార్టర్స్‌లో సినర్, జకోవిచ్, స్వైటెక్
- అల్కరాస్, సబలెంకా కూడా


క్రెజికోవా

లండన్: వింబుల్డన్‌లో మరో సంచలనం. డిఫెండింగ్ ఛాంపియన్ బార్బొరా క్రెజికోవా (చెక్) ఇంటి ముఖం పట్టింది. శనివారం మహిళల సింగిల్స్ మూడో రౌండ్లో పదిహేడో సీడ్ క్రెజికోవా 6-2, 3-6, 4-6తో ఎమా నవారో (అమెరికా) చేతిలో ఓడింది. టైటిల్ ఫేవరెట్ ఇగా స్వైటెక్ (పోలెండ్) ప్రిక్వార్టర్స్ చేరింది. మూడో రౌండ్లో ఈ ఎనిమిదో సీడ్ క్రీడాకారిణి 6-2, 6-3తో కొలిన్స్ (అమెరికా)ను ఓడించింది. ఏడో సీడ్ ఆండ్రీవా (రష్యా) ముందంజ వేసింది. ఆమె 6-1, 6-3తో బాప్టిస్ట్ (అమెరికా)ను తేలిగ్గా ఓడించింది. టాప్ సీడ్ సబలెంకా (బెలారస్) కొంచెం కష్టంగా ప్రిక్వార్టర్స్ చేరింది. ఆమె 7-6 (8-6), 6-4తో స్థానిక ఫేవరెట్ ఎమా రదుకాను (బ్రిటన్) పోరాటానికి తెరదించింది. పదకొండో సీడ్ రిబకినా (కజకిస్థాన్) 6-7 (6-8), 3-6తో టౌసన్ (కెనడా) చేతిలో ఓడింది. సంసోనోవా (రష్యా) 6-2, 6-3తో కసత్కినా (ఆస్ట్రేలియా)పై గెలిచి ప్రిక్వార్టర్స్ చేరింది. బెన్సిచ్ (స్విట్జర్లాండ్) 6-4, 3-6, 7-6 (10-7)తో కాక్సియారెటో (ఇటలీ)పై గెలిచింది.

సినర్ ముందంజ: వింబుల్డన్ టైటిల్ రేసులో ఉన్న యానిక్ సినర్ (ఇటలీ) ప్రిక్వార్టర్స్‌కు దూసుకెళ్లాడు. ఈ టాప్ సీడ్ ఆటగాడు 6-1, 6-3, 6-1తో మార్టినెజ్ (స్పెయిన్)ను చిత్తు చేశాడు. జకోవిచ్ 6-3, 6-0, 6-4తో కెమనోవిచ్ (సెర్బియా)ను ఓడించాడు. డిఫెండింగ్ ఛాంపియన్ అల్కరాస్ (స్పెయిన్) కూడా ప్రిక్వార్టర్స్ చేరాడు. ఈ రెండో సీడ్ 6-1, 3-6, 6-3, 6-4తో స్ట్రాఫ్ (జర్మనీ)పై నెగ్గాడు. దాదాపు రెండున్నర గంటలు సాగిన ఈ పోరులో అల్కరాస్ రెండో సెట్ కోల్పోయినా.. పుంజుకుని విజయాన్ని అందుకున్నాడు. మరో మూడో రౌండ్ పోరులో కొబాలి (ఇటలీ) 6-2, 6-4, 6-2తో మెన్సిచ్ (చెక్)పై నెగ్గాడు. దిమిత్రోవ్ 6-3, 6-4, 7-6 (7-0)తో అప్నర్ (ఆస్ట్రియా)పై నెగ్గాడు.

బాలాజీ జోడీ ఔట్: పురుషుల డబుల్స్‌లో శ్రీరామ్ బాలాజీ-మిగుయెల్ రెయస్ (మెక్సికో) జంట ఇంటిముఖం పట్టింది. రెండో రౌండ్లో బాలాజీ ద్వయం 4-6, 4-6తో మార్సెల్ గ్రానోలర్స్ (స్పెయిన్)-హోరాసియో జెబల్లాస్ (అర్జెంటీనా) జంట చేతిలో ఓడింది.

ఆస్ట్రేలియా 77/3

సెయింట్ జార్జెస్: వెస్టిండీస్‌తో రెండో టెస్టులో ఆస్ట్రేలియాకు 33 పరుగుల స్వల్ప ఆధిక్యం లభించింది. రెండో ఇన్నింగ్స్‌లో కంగారూ జట్టు తడబడింది. మూడో రోజు, శనివారం కడపటి వార్తలందే సమయానికి 3 వికెట్లకు 77 పరుగులు చేసింది. గ్రీన్ (35), స్టీవ్ స్మిత్ (20) క్రీజులో ఉన్నారు. ఓవర్‌నైట్ స్కోరు 12/2తో ఇన్నింగ్స్ కొనసాగించిన ఆసీస్.. నైట్‌వాచ్‌మన్ లైయన్ (8) వికెట్ కోల్పోయింది. తొలి ఇన్నింగ్స్‌లో వెస్టిండీస్ 253 పరుగులకు ఆలౌటైంది. బ్రెండన్ కింగ్ (75) టాప్ స్కోరర్. తొలి ఇన్నింగ్స్‌లో ఆసీస్ 286 పరుగులు చేసింది.

800 మీ.లో అఫ్సల్ రికార్డు

పోజ్నాన్ (పోలెండ్): పోలెండ్‌లో జరిగిన అంతర్జాతీయ అథ్లెటిక్ మీట్‌లో భారత అథ్లెట్ మహ్మద్ అఫ్సల్ సత్తా చాటాడు. 800 మీటర్ల హీట్స్‌ను 1 నిమిషం 44.96 సెకన్లలో పూర్తి చేసి ఆరో స్థానంలో నిలిచాడు. ఈ క్రమంలో ఈ మేలో తానే నెలకొల్పిన జాతీయ రికార్డు (1 నిమిషం 45.61 సెకన్లు)ను అధిగమించాడు. 800 మీటర్ల పరుగును 1 నిమిషం 45 సెకన్లలోపు పూర్తి చేసిన భారత తొలి అథ్లెట్‌గానూ అఫ్సల్ ఘనత సాధించాడు.

ఒంటికాలితో సైకిలుపై 7 దేశాలు చుట్టేశాడు



సాధారణ వ్యక్తికి కూడా సవాలుగా అనిపించే 10,000 కి.మీల సైకిల్ యాత్రను అస్సాంలోని నాగావ్ జిల్లా బలియాబోర్‌కు చెందిన రాకేశ్ బనిక్ ఒంటికాలితో పూర్తిచేసి ఔరా అనిపించాడు. 2012లో జరిగిన రోడ్డుప్రమాదంలో రాకేశ్ కుడికాలు కోల్పోయాడు. వైకల్యం తన ఆత్మవిశ్వాసాన్ని తగ్గించలేదని చాటేందుకు ఆయన సైక్లింగును ఎంచుకొని ముందుకు సాగాడు. పారా సైకిలిస్టుగా గుర్తింపు పొందిన రాకేశ్ ఏడు దేశాల సైకిల్ యాత్రను రష్యాతో మొదలుపెట్టాడు. 'ఒకే భూమి పుత్ర నైత్రోణం - 25' పేరిట జరిగిన ఈ సాహసయాత్రను 'ఎక్స్‌ప్లోర్స్ నెట్' అనే అడ్వెంచర్ స్పోర్ట్స్ సంస్థ నిర్వహించింది. మాస్కోలోని భారత రాయబార కార్యాలయం నుంచి ప్రారంభమైన రాకేశ్ యాత్ర 120 రోజులపాటు కొనసాగి అఫ్గానిస్థాన్, నేపాల్ మీదుగా భారత్‌కు చేరింది.

ఈటీవీ భారత్

రూ.450 పెట్టుబడితో వ్యాపారం.. 300 మందికి ఉపాధి



హరియాణాలోని కురుక్షేత్రకు చెందిన ఉషారాణి చిన్నమొత్తంతో వ్యాపారం ప్రారంభించి, నేడు మరో 300 మంది మహిళలకు ఉపాధి కల్పించే స్థాయికి ఎదిగారు. 2018లో సొంతంగా ఏదైనా వ్యాపారం చేయాలన్న ఆలోచన వచ్చిన ఉషారాణి వద్ద కేవలం రూ.450 నగదు, కొన్ని సుగంధ ద్రవ్యాలు తప్ప మరేమీ లేవు. 8వ తరగతి వరకు చదివిన ఈమె పచ్చళ్ల వ్యాపారాన్ని ప్రారంభించారు. చిన్న వంటగది నుంచి మొదలైన ఈ ప్రయాణం అంతర్జాతీయ మార్కెటింగ్ వరకు చేరింది. కొత్తలో సొంత కుటుంబం నుంచి ఆమె తీవ్ర వ్యతిరేకత ఎదుర్కొన్నారు. అయినా కృషి విజ్ఞాన కేంద్రంలో శిక్షణ పొంది తన వ్యాపారానికి మెరుగులు దిద్దారు. సొంత గానుగలో స్వయంగా తీసిన ఆవనూనెను పచ్చళ్ల తయారీకి వాడటం ఈమె ప్రత్యేకత. ఉష తయారుచేసే 24 రకాల ఊరగాయలు నేడు భారత్‌లోని వివిధ రాష్ట్రాలతో పాటు విదేశాలకూ సరఫరా అవుతున్నాయి.

ఆరో తరం వరకు ఓసీఐ కార్డులు

- ట్రినిడాడ్ టొబాగో ప్రవాసులకు వర్తింపు
- ఆరు ఒప్పందాలపై మోదీ సమక్షంలో సంతకాలు



ట్రినిడాడ్-టొబాగో పార్లమెంటును ఉద్దేశించి మాట్లాడుతున్న ప్రధాని మోదీ

పోర్ట్ ఆఫ్ స్పెయిన్: ట్రినిడాడ్-టొబాగో జనాభాలో దాదాపు 40 % మంది వరకు భారత సంతతివారే ఉన్నారు. వారిలో ఆరో తరంవారి వరకు 'దేశాంతర భారత పౌరసత్వ' (ఓవర్సీస్ సిటిజెన్‌షిప్ ఆఫ్ ఇండియా-ఓసీఐ) కార్డులు జారీచేస్తామని భారత ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. అయిదు దేశాల పర్యటనలో భాగంగా శుక్రవారం ట్రినిడాడ్-టొబాగోకు వచ్చిన ఆయన.. ఆ దేశ ప్రధాని కమ్లా పర్సాద్ బిసెసర్‌తో చర్చలు జరిపారు. మౌలిక సదుపాయాలు, సంస్కృతి, క్రీడాకారులకు శిక్షణ, ఔషధాల రంగాల్లో సహకారం పెంపునకు ఆరు ఒప్పందాలపై ఇరుదేశాలు సంతకాలు చేశాయి. రక్షణ, వ్యవసాయం, ఆరోగ్య రక్షణ, డిజిటల్ రూపాంతరీకరణ, ఏకీకృత చెల్లింపుల వ్యవస్థ, సామర్థ్య పెంపు వంటి రంగాల్లో రెండు దేశాలూ కలిసి పనిచేయడానికి ఉన్న అవకాశాలపై ఇద్దరు నేతలు చర్చించుకున్నారు. ఐరాస భద్రత మండలిని విస్తరించి భారత్‌కు శాశ్వత సభ్యత్వం కల్పించాలన్న అంశానికి ట్రినిడాడ్-టొబాగో మద్దతు ప్రకటించింది. ట్రినిడాడ్-టొబాగోకు చెందిన క్రీడాకారుల్ని క్రికెట్లో రాణించేలా శిక్షణ ఇచ్చేందుకు భారత్ ముందుకు వచ్చింది. ప్రస్తుత వాస్తవాలు ప్రతిబింబించేలా ఐరాసలో సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరం ఉందని నేతలిద్దరూ గట్టిగా అభిప్రాయపడ్డారు. ప్రపంచంలో పలుచోట్ల ఉద్రిక్తతలు నెలకొన్న ప్రస్తుత పరిస్థితుల్లో చర్చలు, దౌత్యం ద్వారానే ముందుకు వెళ్లాలని నేతలు అభిప్రాయపడినట్లు సంయుక్త ప్రకటన తెలిపింది. ట్రినిడాడ్-టొబాగో అధ్యక్షురాలు క్రిస్టీన్ కర్లా కంగాలూతోనూ మోదీ సమావేశమయ్యారు. అక్కడి పార్లమెంటును సందర్శించినప్పుడు సభాపతి కుర్చీ గురించి ప్రస్తావిస్తూ భావోద్వేగానికి లోనయ్యారు. బ్రిటిష్ పాలన నుంచి బయటపడిన ట్రినిడాడ్-టొబాగోకు 1968లో భారత ప్రభుత్వం ఓ ప్రత్యేక కుర్చీని పంపించింది. అలాంటి అనేక రూపాల్లో రెండుదేశాల మధ్య బంధాలు బలపడ్డాయని మోదీ గుర్తుచేసుకున్నారు.

అర్జెంటీనాతో ఒప్పందాలు

ట్రినిడాడ్-టొబాగో నుంచి అర్జెంటీనాకు చేరుకున్న మోదీ.. బ్యూనస్‌ఎయిర్స్‌లో జాతీయ స్మారకం వద్ద నివాళులర్పించారు. తర్వాత.. అర్జెంటీనా అధ్యక్షుడు జేవియర్ మిలీ ఆయనకు స్వాగతం పలికి ద్వైపాక్షిక చర్చలు జరిపారు. రక్షణ, వ్యవసాయం, గనుల తవ్వకం, ఇంధనం, వాణిజ్యం, పెట్టుబడులపై వారు ఒప్పందాలు చేసుకున్నారు. 57 ఏళ్ల తర్వాత భారత ప్రధాని అర్జెంటీనాలో పర్యటించడం ఇదే తొలిసారి.

నేడు, రేపు బ్రిక్స్ సదస్సు

బ్రిక్స్ దేశాల శిఖరాగ్ర సదస్సు ఆది, సోమవారాల్లో జరగనుంది. బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, దక్షిణాఫ్రికా దేశాల నేతలు బ్రెజిల్‌లోని రియో డీ జనీరోలో సమావేశం కానున్నారు.



ఝార్ఖండ్‌లో బొగ్గు గని కూలి నలుగురి దుర్మరణం

రాంగఢ్: ఝార్ఖండ్‌లోని రాంగఢ్ జిల్లాలో అక్రమ తవ్వకాలు జరిపిన బొగ్గు గనిలోని ఓ భాగం కూలి నలుగురు మృతిచెందారు. మరో నలుగురు గాయపడ్డారు. ఇంకొందరు చిక్కుకుపోయి ఉండొచ్చని అనుమానిస్తున్నారు. కుజు అవుట్ పోస్టులోని కర్మా ప్రాంతంలో ఉన్న సెంట్రల్ కోల్డ్‌ఫీల్డ్స్ లిమిటెడ్(సీసీఎల్)కు చెందిన పాడుబడిన బొగ్గు గనిలో శనివారం ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ఘటనా స్థలం నుంచి నాలుగు మృతదేహాలను వెలికితీసినట్లు పోలీసులు తెలిపారు. ఈ ప్రదేశంలో అక్రమ తవ్వకాలు జరపకుండా సీసీఎల్ ప్రత్యేక కాపలా ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. పూర్తి సమాచారం అందిన తర్వాతే సీసీఎల్‌కు సహకరిస్తామని ఎస్పీ అజయ్‌కుమార్ తెలిపారు. కొందరు గ్రామస్థులు ఈ అక్రమ తవ్వకాల్లో పాల్గొన్నట్లు ఆయన తెలిపారు.



సాకులతో జీవితం మారదు

జీవితాన్ని మార్చుకోవాలన్న బలమైన కోరిక ఉన్నవారికి అందుకు అవసరమైన మార్గాలు తప్పకుండా దొరుకుతాయి. ఆ తపన లేనివారికి సాకులు మాత్రమే దొరుకుతాయి. అలాంటివారు ఎన్ని వ్యక్తిత్వ వికాస పుస్తకాలు చదివినా, ఎందరి విజయగాథలు విన్నా ఎలాంటి ఉపయోగమూ ఉండదు.

– జెన్ సిన్సెరో, రచయిత్రి

చట్టమైన 'బిగ్ బ్యూటిఫుల్ బిల్లు'

- స్వాతంత్ర్య దినోత్సవం రోజున సంతకం చేసిన ట్రంప్



బిగ్ బ్యూటిఫుల్ బిల్లుపై సంతకం చేస్తున్న ట్రంప్

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కల నెరవేరింది. రెండోసారి అధికారంలోకి వచ్చాక ప్రతిష్ఠాత్మకంగా భావించి తీసుకొచ్చిన 'బిగ్ బ్యూటిఫుల్ బిల్లు' చట్టంగా మారింది. ఇప్పటికే కాంగ్రెస్‌లోని ఉభయసభల ఆమోదం పొందిన ఈ బిల్లు. దేశ స్వాతంత్ర్య దినోత్సవం రోజైన శుక్రవారం అధ్యక్షుడి సంతకంతో చట్ట రూపు సంతరించుకుంది. అధ్యక్షుడి సంతకం కార్యక్రమాన్ని భారీ వేడుకగా నిర్వహించారు. శ్వేతసౌధాన్ని తెలుపు, ఎరుపు, నీలి రంగుల జెండాలతో అలంకరించారు. శ్వేతసౌధం డ్రైవ్ వేలో నిర్వహించిన సంతకం కార్యక్రమంలో చట్టసభల రిపబ్లికన్ సభ్యులు, మంత్రులు, భారీ సంఖ్యలో పార్టీ అభిమానులు, జులై 4 పిక్నిక్‌కు వచ్చినవారు పాల్గొన్నారు. సంతకం చేసే సమయంలో ఫైటర్ జెట్లు, స్టెల్త్ బాంబర్లు శ్వేతసౌధంపై విన్యాసాలు చేశాయి. అమెరికా మెరీన్ బ్యాండ్.. దేశభక్తి కవాతును నిర్వహించింది. 'అమెరికా గెలుస్తోంది.. అమెరికా గెలుస్తోంది.. గతంలో ఎన్నడూ లేని విధంగా గెలుస్తోంది' అని ట్రంప్ వ్యాఖ్యానించారు. బిల్లుపై సంతకం చేసేముందు ఆయన 22 నిమిషాలపాటు మాట్లాడారు. 'హామీలిచ్చాం.. హామీలను నిలబెట్టుకున్నాం' అని పేర్కొన్నారు. దేశాన్ని వ్యతిరేకించేవారే ఈ చట్టాన్ని వ్యతిరేకిస్తున్నారని ట్రంప్ పేర్కొన్నారు. ఈ చట్టంవల్ల ప్రతి ఒక్కరూ ఆరోగ్య బీమా లేక చనిపోతారని డెమోక్రాట్లు అంటున్నారని, కానీ ఇది ప్రతి ఒక్కరినీ బతికించేదని స్పష్టంచేశారు.

చట్టంలో ఏముంది?

ట్రిలియన్లకొద్దీ డాలర్ల పన్ను మినహాయింపులతోపాటు 1.2 ట్రిలియన్ డాలర్ల విలువైన మెడిక్‌ఎయిడ్, ఆహార కూపన్ల కోతకు ఉద్దేశించిన చట్టమిది. దీంతోపాటు వలస సేవల విభాగానికి ఇది మరిన్ని నిధులను అందించనుంది.

■ కాంగ్రెస్ బడ్జెట్ కార్యాలయం అంచనాల ప్రకారం.. పదేళ్లలో 3.3 ట్రిలియన్ల ద్రవ్యలోటును తీర్చనుంది. అదే సమయంలో 1.2 కోట్ల మంది ఆరోగ్య బీమాకు దూరమవుతారు.

సంపన్నులకే లాభం: ప్రతిపక్షం

కోట్ల మంది తక్కువ ఆదాయం ఉన్న ప్రజలను కొట్టి సంపన్నులకు దోచి పెట్టడానికే ఈ చట్టాన్ని ట్రంప్ తీసుకొచ్చారని డెమోక్రటిక్ పార్టీ విమర్శించింది. దీనివల్ల కోట్ల మంది ఆరోగ్య బీమాకు దూరమవుతారని ధ్వజమెత్తింది.

అమెరికాలో నీరవ్ మోదీ సోదరుడి అరెస్టు



నేహల్ మోదీ

దిల్లీ: భారతీయ బ్యాంకులను రూ.వేల కోట్ల మేర మోసంచేసి విదేశాలకు పారిపోయిన వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ తమ్ముడు నేహల్ మోదీని అమెరికా అధికారులు అరెస్టుచేశారు. నేహల్‌ను అప్పగించాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ), కేంద్ర దర్యాప్తు సంస్థ(సీబీఐ) అభ్యర్థించిన నేపథ్యంలో శుక్రవారం అమెరికా అధికారులు అరెస్టు చేశారు. అతడిపై కేసు విచారణ ఈ నెల 17న ఉంటుందని, ఆ రోజున నేహల్ బెయిల్ కోసం దరఖాస్తు చేసుకునే వీలుందని అధికారులు తెలిపారు. పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) నుంచి రూ.13,000 కోట్ల మేర రుణాలు తీసుకుని, మోసం చేసిన కేసులో ఈ అరెస్టు జరిగింది. నేహల్, నీరవ్ మోదీలతో పాటు వారి సమీప బంధువు మెహుల్ చోక్సీ కూడా ఈ మోసంలో పాలు పంచుకున్నట్లు అభియోగాలున్నాయి. అక్రమ నిధులను దాచడంలో, వాటిని బదిలీ చేయడంలో, కీలక ఆధారాలను ధ్వంసం చేయడంలో నీరవ్‌కు నేహల్ సాయం చేసినట్లు దర్యాప్తు సంస్థలు గుర్తించాయి. ఈడీ తన ఛార్జిషీట్‌లో నేహల్ పేరును చేర్చింది. మోసం వెలుగులోకి వచ్చిన తర్వాత నేహల్ మోదీ తన సోదరునికి అత్యంత సన్నిహితుడైన మిహిర్ బన్సాలీతో కలిసి దుబాయ్ నుంచి 50 కిలోల బంగారం, అధిక మొత్తంలో నగదు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.

సైఫ్ అలీఖాన్ కుటుంబానికి మధ్యప్రదేశ్ హైకోర్టులో ఎదురుదెబ్బ



- రూ.15 వేల కోట్ల ఆస్తుల యాజమాన్యంపై తిరిగి విచారణ

జబల్‌పుర్: బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్ పటౌడీ కుటుంబ ఆస్తులకు సంబంధించి మధ్యప్రదేశ్ హైకోర్టు సంచలన నిర్ణయం వెలువరించింది. ప్రస్తుత అంచనాల ప్రకారం దాదాపు రూ. 15 వేల కోట్ల విలువచేసే ఈ ఆస్తులకు పటౌడీలు (సైఫ్, ఆయన తల్లి షర్మిలా టాగోర్, తోబుట్టువులు సోహా, సబా) యజమానులంటూ కింది కోర్టు రెండు దశాబ్దాల క్రితం వెలువరించిన తీర్పును పక్కనపెట్టిన హైకోర్టు.. ఈ కేసుపై తిరిగి విచారణ జరపాల్సిందిగా ట్రయల్ కోర్టును ఇటీవల ఆదేశించింది. కేసు విచారణను ఏడాది లోగా పూర్తి చేయాలని న్యాయమూర్తి జస్టిస్ సంజయ్ ద్వివేది నేతృత్వంలోని ఏకసభ్య ధర్మాసనం తీర్పు వెలువరించింది. ఈ ఆస్తి భోపాల్ సంస్థానానికి చివరి పాలకుడైన నవాబ్ హమీదుల్లాకు సంబంధించింది. మగ సంతానం లేని భోపాల్ నవాబుకు ఆబిదా, సాజిదా, రాబియా అనే ముగ్గురు కుమార్తెలున్నారు. వీరిలో సాజిదాను ఇఫ్తికార్ అలీఖాన్ పటౌడీకి ఇచ్చి వివాహం చేశారు. వీరి కుమారుడే భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మన్సూర్ అలీఖాన్ పటౌడీ. ప్రముఖ సినీనటి షర్మిలా టాగోర్‌ను ఆయన వివాహం చేసుకున్నారు. వారి సంతానమే బాలీవుడ్ ప్రముఖుడు సైఫ్ అలీఖాన్ పటౌడీ, సోహా, సబా. వీరికి అనుకూలంగా 2000 ఫిబ్రవరి 14న భోపాల్ జిల్లా కోర్టు ఇచ్చిన తీర్పును భోపాల్ నవాబు ఇతర వారసులు హైకోర్టులో సవాలు చేశారు.

టెక్సాస్‌ను ముంచెత్తిన వరదలు.. 27 మంది మృతి

- 23 మంది బాలికల గల్లంతు

కెర్‌విల్: అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రాన్ని వరదలు ముంచెత్తాయి. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వానలకు ఇక్కడి నదులు పొంగిపొర్లుతున్నాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. 27 మంది ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో ఆరుగురు చిన్నారులు. వరదల్లో చిక్కుకున్న దాదాపు 200 మందికి పైగా పౌరులను సహాయక బృందాలు రక్షించాయి. మరోవైపు కెర్ కౌంటీలోని గ్వాడలూప్ నది ఉప్పొంగి సమీపంలోని మిస్టిక్ క్యాంప్ వేసవి శిక్షణా శిబిరాన్ని ముంచెత్తింది. దీంతో శిబిరంలోని 23 మంది బాలికలు గల్లంతయ్యారు. వారి కోసం అధికారులు తీవ్రంగా గాలిస్తున్నారు. బాలికల సమాచారాన్ని తెలపాలని వారి కుటుంబాలు సామాజిక మాధ్యమాల వేదికగా వేడుకుంటున్నాయి.



శాన్ ఏంజెలోలో ఉప్పొంగి ప్రవహిస్తున్న గ్వాడలూప్ నది

ఈనెల 25 నుంచి శ్రీ రామాయణ రైలు యాత్ర

- అయోధ్య నుంచి రామేశ్వరం వరకు
- 17 రోజులు, 30 ప్రాంతాలు
- యాత్ర ప్యాకేజీ రూ.1.17 లక్షల నుంచి మొదలు: ఐఆర్‌సీటీసీ



దిల్లీ: ఐదో 'శ్రీరామాయణ యాత్ర'ను ఈనెల 25న ప్రారంభిస్తున్నట్లు ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సీటీసీ) తెలిపింది. 17 రోజుల ఈ రైలు యాత్రలో శ్రీరామచంద్రునితో సంబంధమున్న 30 ప్రదేశాలను భక్తులు సందర్శిస్తారు. ఇది అయోధ్య నుంచి మొదలై నందిగ్రామ్, సీతామఢి, జానక్‌పుర్, బక్సర్, వారణాసి, ప్రయాగ్‌రాజ్, చిత్రకూట్, నాసిక్, హంపి, తదితర ప్రదేశాలు మీదుగా సాగి రామేశ్వరంతో ముగుస్తుంది. యాత్ర ప్యాకేజీ ధర(ఒక్కరికి) థర్డ్ ఏసీ- రూ.1,17,975, సెకండ్ ఏసీ- రూ.1,40,120, ఫస్ట్ క్లాస్ ఏసీ క్యాబిన్- రూ.1,66,380, ఫస్ట్ ఏసీ కూపె- రూ.1,79,515. దిల్లీలోని సఫ్దర్‌జంగ్ రైల్వేస్టేషన్ నుంచి ఈ యాత్ర ప్రారంభమవుతుంది. త్రీ స్టార్ హోటళ్లలో భోజన, వసతితో పాటు ప్రయాణ బీమా వంటి సదుపాయాలు కల్పిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

ఐదు బస్సులు ఢీ.. 36 మంది అమర్‌నాథ్ యాత్రికులకు గాయాలు

జమ్ము: అమర్‌నాథ్ యాత్రకు జమ్మూలోని భగవతీ నగర్ బేస్ క్యాంప్ నుంచి పహల్గాం బయలుదేరిన వాహనశ్రేణిలోని ఐదు బస్సులు ఢీకొని 36 మందికి స్వల్పగాయాలయ్యాయి. రాంబన్ జిల్లాలోని చందర్‌కోట్ వద్ద శనివారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. యాత్రికులు అల్పాహారం చేయడం కోసం చందర్‌కోట్ వద్ద వాహనాలు నిలిపి ఉంచారు. వాహనశ్రేణిలోని ఓ బస్సుకు బ్రేకులు పనిచేయకపోవడంతో అది అక్కడ ఆగి ఉన్న మిగతా బస్సులను ఢీకొట్టింది.


ఎముక ఆరోగ్యంపై శుక్లా అధ్యయనం



ఐఎస్ఎస్‌లో శుభాంశు శుక్లా

దిల్లీ: అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లో ఉన్న భారత వ్యోమగామి శుభాంశు శుక్లా శనివారం పలు ప్రయోగాలు నిర్వహించారు. భారరహిత స్థితిలో ఎముకలు ప్రతిస్పందించే తీరుపై అధ్యయనం చేశారు. ఆస్టియోపొరోసిస్ రుగ్మతకు మెరుగైన చికిత్సలను రూపొందించడానికి ఈ ప్రయోగం వీలు కల్పించే అవకాశం ఉంది. అలాగే ఐఎస్ఎస్‌పై రేడియోధార్మికత తాకిడిని విశ్లేషించడానికి ఒక ప్రయోగాన్ని శుక్లా నిర్వహించారు. భవిష్యత్‌లో సుదీర్ఘ అంతరిక్ష యాత్రలు చేసే వ్యోమగాములకు మెరుగైన రక్షణ కల్పించడానికి ఇది దోహదపడుతుందని భావిస్తున్నారు. సూక్ష్మ ఆల్గేపై కూడా ఆయన ప్రయోగాలు నిర్వహించారు. టార్డిగ్రేడ్లు అనే జీవులపై అధ్యయనాన్ని పూర్తి చేశారు.

ఈడీ అభియోగాలన్నీ తెలివైన అసత్యాలే



- అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్‌ను విక్రయించే ఉద్దేశం ఏఐసీసీకి లేదు
- నేషనల్ హెరాల్డ్ కేసులో రాహుల్ తరఫున వాదనలు

దిల్లీ: స్వాతంత్ర్య ఉద్యమంలో భాగంగా స్థాపించిన అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ (ఏజేఎల్)కు చెందిన ఆస్తులను విక్రయించే ఉద్దేశం అఖిల భారత కాంగ్రెస్ కమిటీ(ఏఐసీసీ)కి లేదని, ఆ సంస్థను పునరుద్ధరించాలన్నదే తమ లక్ష్యమని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. నేషనల్ హెరాల్డ్ పత్రికను ప్రచురించే ఏజేఎల్‌కు చెందిన రూ.2వేల కోట్లకు పైగా విలువైన ఆస్తులను అక్రమంగా స్వాధీనం చేసుకునే కుట్ర జరిగిందన్న ఈడీ అభియోగాలను తోసిపుచ్చారు. దిల్లీ కోర్టు ప్రత్యేక జడ్జి విశాల్ గోగ్నే ఎదుట శనివారం రాహుల్ తరఫున సీనియర్ న్యాయవాది ఆర్.ఎస్.చీమా వాదనలు వినిపించారు. నగదు అక్రమ చలామణి (మనీ లాండరింగ్) చట్టం కింద కాంగ్రెస్ నేతలు సోనియా, రాహుల్ తదితరులపై నమోదైన అభియోగాలను ఖండించారు. జవహర్‌లాల్ నెహ్రూ, జె.బి.కృపలానీ, రఫీ అహ్మద్ కిద్వాయ్ తదితరులు 1937లో స్థాపించిన ఏజేఎల్ నియమావళిని కోర్టులో ప్రవేశపెట్టడానికి ఈడీ తరఫు న్యాయవాదులు ఎందుకు వెనుకాడుతున్నారని ప్రశ్నించారు. 'ఏజేఎల్ నియమావళి ప్రకారం.. భారత జాతీయ కాంగ్రెస్ విధానమే ఆ సంస్థ విధానం. ఏజేఎల్ లాభాపేక్షతో పనిచేయలేదు. స్వాతంత్ర్యానికి పూర్వం, తర్వాత కూడా ఇది వ్యాపార సంస్థ కాదు. స్వాతంత్ర్యోద్యమ వారసత్వ స్ఫూర్తిని తిరిగి తీసుకురావాలన్నదే ఏఐసీసీ ప్రయత్నం. అసలు సమస్య..ఏజేఎల్‌కు ఇచ్చిన రుణాన్ని వసూలు చేయడం కాదు..ఆ సంస్థను పునరుద్ధరించడమే. ఆ సంస్థ ఆస్తుల విక్రయం ద్వారా లాభాలు పొందాలని ఏఐసీసీ ఆశించడంలేదు' అని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలపై ఈడీ మోపిన అభియోగాలన్నీ తెలివైన అసత్యాలేనని న్యాయవాది ఆర్.ఎస్.చీమా అభివర్ణించారు. ఈడీ అభియోగాలు మోపిన 'యంగ్ ఇండియన్' లాభాపేక్ష రహిత కంపెనీ అని వివరించారు. ఈ కేసులో సోమవారం కూడా కోర్టులో వాదనలు కొనసాగనున్నాయి.

తుర్కియేలో ముగ్గురు విపక్ష మేయర్ల అరెస్టు

ఇస్తాంబుల్: దక్షిణ తుర్కియేలో ప్రతిపక్ష నేతల అణచివేత తీవ్ర రూపం దాల్చింది. విపక్ష రిపబ్లికన్ పీపుల్స్ పార్టీకి చెందిన ముగ్గురు మేయర్లను తుర్కియే ప్రభుత్వం శనివారం అరెస్టు చేసింది. వీరు ముగ్గురూ దేశంలోని మూడు ప్రధాన నగరాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అవినీతి, అక్రమాల ఆరోపణలతో అదియామన్ మేయర్ అబ్దుర్రహ్మాన్ తుట్డేరే, అదాన మున్సిపాలిటీ అధిపతి జైదాన్ కరాలర్‌లను ఇస్తాంబుల్ సమీపంలో శనివారం తెల్లవారుజామున అరెస్ట్ చేశారు. అంటాల్య మేయర్ సహా మరో ఇద్దరు అనుమానితులనూ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఏడాది మార్చిలో ఇస్తాంబుల్ మేయర్ ఎక్రం ఇమామోగ్లు అరెస్ట్‌కు నిరసనగా తుర్కియే అంతటా తీవ్ర నిరసనలు వెల్లువెత్తాయి.

రష్యా వైమానిక స్థావరంపై ఉక్రెయిన్ దాడి

కీవ్: ఉక్రెయిన్-రష్యా యుద్ధంలో దాడులు ప్రతిదాడులు కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా రష్యాలోని వొరొనెజ్ ప్రాంతంలో ఉన్న బోరిసోగ్లెబ్స్క్ వైమానిక స్థావరంపై తమ బలగాలు దాడి చేశాయని ఉక్రెయిన్ సైనిక ప్రధానాధికారి ప్రకటించారు. దీనిపై రష్యా నుంచి ఎలాంటి స్పందనా లేదు. తాము దాడి చేసిన వైమానిక స్థావరం రష్యాకు చెందిన ఎస్‌యూ-34, ఎస్‌యూ-35ఎస్, ఎస్‌యూ-30ఎస్ఎం ఫైటర్ జెట్ విమానాలకు నెలవు అని ఉక్రెయిన్ ప్రకటించింది. వైమానిక స్థావరంలో భారీగా మంటలు చెలరేగాయని కీవ్ తెలిపింది. వైమానిక స్థావరంలోని గ్లైడ్ బాంబుల గిడ్డంగిని, ఓ శిక్షణ విమానాన్ని, మరో యుద్ధ విమానాన్ని కూడా ధ్వంసం చేశామని ఉక్రెయిన్ సైన్యం పేర్కొంది. 322 డ్రోన్లతో శుక్రవారం రాత్రి నుంచి రష్యా దాడులు చేసిందని, వీటిలో 157 కాల్చివేశామని, 135 జాడ తెలియకుండా పోయాయని తెలిపింది.

ప్రాణ హననమే పుతిన్ పద్ధతి: ట్రంప్

ఉక్రెయిన్‌తో యుద్ధంలో భాగంగా రష్యా సాగిస్తున్న దాడుల పరంపరపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అసహనం వ్యక్తం చేస్తున్నారు. రష్యా అధినేత వ్లాదిమిర్ పుతిన్‌తో తాను జరిపిన తాజా టెలిఫోన్ సంభాషణపై ట్రంప్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజల ప్రాణాలు తీస్తూనే ఉండాలని పుతిన్ కోరుకుంటున్నట్లుందని శుక్రవారం ట్రంప్ పేర్కొన్నారు. ఆంక్షల్ని గురించి చాలాసేపు తాను పుతిన్‌తో చర్చించానని, మాస్కోపై ఆంక్షలు తప్పకపోవచ్చని అన్నారు. ఉక్రెయిన్ యుద్ధం తదితర అంశాలపై పుతిన్‌తో ట్రంప్ సుమారు గంటసేపు జరిపిన చర్చలు ఫలవంతం కాలేదు. ట్రంప్ స్వయంగా ఈ విషయాన్ని అంగీకరించారు. పుతిన్ సహాయకుడు యూరీ ఉషకోవ్ మాట్లాడుతూ యుద్ధానికి కారణమైన లక్ష్యాలను సాధించడానికి రష్యా కట్టుబడి ఉన్నట్లు తేల్చిచెప్పారు.

ఇజ్రాయెల్ దాడుల్లో 24 మంది పాలస్తీనియన్ల మృతి

డెయిర్ అల్-బలా: గాజాపై ఇజ్రాయెల్ కొనసాగిస్తున్న దాడుల్లో మరో 24 మంది పాలస్తీనియన్లు మరణించారు. ఇందులో 10 మంది ఆహార పంపిణీ కేంద్రంవద్ద ఇజ్రాయెలీ బలగాలు జరిపిన కాల్పుల్లో మృతి చెందగా.. మిగిలిన 14 మంది వైమానిక దాడుల్లో మరణించారు. మరోవైపు గుర్తు తెలియని దుండగులు జరిపిన గ్రెనేడ్ దాడిలో గాజా మానవతా ఫౌండేషన్‌కు చెందిన ఇద్దరు అమెరికన్లు గాయపడ్డారు.



ఇజ్రాయెల్ దాడితో గాజాలో ధ్వంసమైన భవనం

అపరాధ భారం మోయలేకపోతున్నా..
గతంలో రెండు హత్యలు చేశా

- కేరళలో ఓ వ్యక్తి స్వచ్ఛంద లొంగుబాటు




మహమ్మదాలి

తిరువనంతపురం: దశాబ్దాల క్రితం.. యుక్తవయసులో చేసిన నేరాలు అతడిని వెంటాడాయి. ఓ ప్రమాదంలో పెద్ద కుమారుడు చనిపోగా.. చిన్న కుమారుడికి తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబం కూడా వరుస సమస్యలతో సతమతమవుతోంది. ఈ క్రమంలో మానసిక సంఘర్షణకు గురైన అతడు.. దాదాపు నలభై ఏళ్ల క్రితం రెండు హత్యలు చేశానంటూ పోలీసుల ముందు లొంగిపోయాడు. ఈ రహస్యాన్ని దాచిపెట్టి బతకడం ఇక తన వల్ల కావడం లేదని, అపరాధ భారాన్ని మోయలేకపోతున్నానని చెప్పాడు. మొదట విస్తుపోయిన పోలీసులు.. తర్వాత దర్యాప్తు చేపట్టి ఆ రెండు కేసులను ఛేదించడంలో నిమగ్నమయ్యారు. కేరళలోని కొయ్‌కోడ్‌కు చెందిన మహమ్మదాలి (53) మలప్పురం జిల్లాలోని వెంగరా పోలీస్‌స్టేషనులో ఈ మేరకు నెల రోజుల క్రితమే లొంగిపోయాడు.

■ 1986 ప్రాంతంలో ఓ వ్యక్తి (20) తనను వేధించేవాడని, ఆత్మరక్షణలో భాగంగా అతడిని తన్నడంతో ఓ కాలువలో పడిపోయినట్లు మహమ్మదాలి పోలీసులకు చెప్పాడు. భయంతో పారిపోయి, రెండు రోజుల తర్వాత వచ్చి చూస్తే ఆ నీటిలోనే అతడు విగతజీవిగా పడి ఉన్నట్లు వివరించాడు. పోలీసులు దీన్ని సాధారణ మరణంగా పేర్కొని, మృతుడి తరఫున ఎవరూ రాకపోవడంతో కేసును క్లోజ్ చేశారు.

■ వెల్లయిల్ బీచ్‌లో 1989లో మరో వ్యక్తిని హత్య చేసినట్లు నిందితుడు చెప్పడంతో పోలీసులు దానిపై ఆరా తీశారు. అప్పట్లో ఓ గుర్తుతెలియని మృతదేహం లభ్యమైన మాట వాస్తవమేనని, ఆధారాలు దొరక్కపోవడంతో ఆ కేసునూ మూసివేసినట్లు గుర్తించారు. ఈ రెండు కేసుల్లో పాత ఫైళ్లను బయటకు తీసే ప్రయత్నంలో పోలీసులు ఉన్నారు. మహమ్మదాలి చెబుతున్న విషయాలు వాస్తవాలా?.. కాదా? అన్న కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నామన్నారు.

బిహార్‌లో ప్రముఖ వ్యాపారవేత్త దారుణ హత్య



పట్నా: బిహార్ రాజధాని పట్నాలో ప్రముఖ వ్యాపారవేత్త గోపాల్ ఖేమ్కాపై గుర్తు తెలియని దుండగులు కాల్పులు జరిపారు. దీంతో ఆయన అక్కడికక్కడే మరణించారు. ఈ ఘటన బిహార్ రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపింది. గోపాల్ మృతిపై ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్)ను ఏర్పాటు చేసినట్లు డీజీపీ వినయ్ కుమార్ తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. పట్నాలో గాంధీ మైదాన్ ఠాణా పరిధిలోని రాంగులాం చౌక్ పనాష్ హోటల్ సమీపంలో గోపాల్ ఖేమ్కా దారుణ హత్యకు గురయ్యారు. శుక్రవారం రాత్రి 11.40 గంటల సమయంలో తన ఇంటికి చేరుకున్న ఆయన కారు దిగుతుండగా బైక్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు విచక్షణా రహితంగా కాల్పులు జరిపారు. తీవ్రంగా గాయపడిన ఖేమ్కాని సమీప ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. గోపాల్ కుమారుడు గుంజన్ కూడా ఆరేళ్ల క్రితం ఇదే తరహాలో హత్యకు గురయ్యారు.

ఇద్దరు టీచర్లు, ముగ్గురు పిల్లలు.. బడి నిర్వహణకు రూ.12 లక్షలు



ఈటీవీ భారత్: ఛత్తీస్‌గఢ్‌లోని ధమ్‌తరీ జిల్లాలో అడవుల నడుమ ఉన్న నాథుకోన్హా గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్న ముగ్గురు విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారు. వీరిలో ఒకరు ప్రధానోపాధ్యాయుడు కాగా, మరొకరు అసిస్టెంట్ టీచరు. ఈ పాఠశాల నిర్వహణకు విద్యాశాఖ ఏటా దాదాపు రూ.12 లక్షల వరకు ఖర్చు చేస్తోంది. స్టేషనరీ, పిల్లలకు పోషకాహారం, విద్యుత్తు, నీటి ఖర్చులు అదనం. హెచ్ఎం ఈశ్వర్‌లాల్ మాట్లాడుతూ.. గ్రామంలో అంగన్‌వాడీ భవనం లేకపోవడం వల్ల ఆ పిల్లలకు కూడా ఇక్కడే ఓ గదిలో వసతి కల్పించినట్లు తెలిపారు. "అటవీ ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్నప్పటికీ ప్రభుత్వ సూచనల ప్రకారం నిర్వహిస్తున్నాం. నాథుకోన్హా గ్రామ జనాభా తక్కువగా ఉన్నందున విద్యార్థులు ముగ్గురు మాత్రమే ఉన్నారు" అని ధమ్‌తరీ జిల్లా విద్యాశాఖ అధికారి టి.ఆర్.జగదల్లే తెలిపారు.

ఒకటేమో 90 డిగ్రీల వంతెన.. మరొకచోట పాములా మెలికలు!



భోపాల్: చిత్ర విచిత్రమైన వంతెనలకు మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్ నగరం కేంద్రంగా మారుతోంది. 90 డిగ్రీల మలుపుతో నిర్మించిన ఓ రైల్వే వంతెన ఇటీవల చర్చనీయాంశంగా మారి ఏడుగురు ఇంజినీర్ల సస్పెన్షనుకు దారి తీసిన విషయం తెలిసిందే. ఈ వంతెనకు సమీపంలోనే సుభాష్‌నగర్‌లో నిర్మించిన రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్వోబీ) పాములా మెలికలు తిరిగి సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ వంతెనతో సుభాష్ నగర్ ప్రాంతంలో రద్దీ తగ్గినప్పటికీ, నిర్మాణం పలుచోట్ల మెలికలు తిరిగి ఉన్నందున పలు మలుపులు తీసుకోవాల్సి వస్తోంది. రూ.40 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ వంతెన కారణంగా రాత్రివేళ ప్రమాదాలు పెరిగాయని వాహనదారులు మండిపడుతున్నారు.

జగన్ పర్యటనకు 10 వేల మందికి అనుమతివ్వండి

● చిత్తూరు జిల్లా వైకాపా నేతల పట్టు

ఈనాడు, చిత్తూరు: తోతాపురి మామిడి రకానికి ధరలు తగ్గినా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదంటూ వైకాపా అధినేత జగన్ మోహన్‌రెడ్డి ఈ నెల 9న చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మార్కెట్ యార్డుకు వచ్చి రైతులను పరామర్శించనున్నారు. ఈ పర్యటనకు ఏకంగా 10 వేల మంది వస్తారని.. ఇందుకు తగిన విధంగా ఏర్పాట్లు చేసుకోవాలని ఆ పార్టీ నేతలు పోలీసులను కోరారు. అన్నదాతలను పరామర్శించేందుకు ఇంత భారీ సంఖ్యలో వైకాపా శ్రేణులను వెంటేసుకుని రావడమేంటని పోలీసు వర్గాలు ప్రశ్నిస్తున్నాయి. ఈ సంఖ్యను కొంత తగ్గించి మార్కెట్ యార్డులోని కర్షకులతో మాట్లాడితే ఎలాంటి అభ్యంతరం లేదంటున్నారు. ఇప్పటివరకు హెలిప్యాడ్ ఎక్కడ ఏర్పాటు చేయాలనుకుంటున్నారనే కచ్చితమైన సమాచారం కూడా వైకాపా నేతలు ఇవ్వలేదు. గతంతో పోలిస్తే గుజ్జు పరిశ్రమల వద్ద ఇప్పుడు ట్రాక్టర్ల బారులు సైతం తగ్గాయి. బంగారుపాళ్యం మార్కెట్ యార్డుకు ఎక్కువగా టేబుల్ వెరైటీలు వస్తాయి. తోతాపురి రకం.. గుజ్జు పరిశ్రమలు, ర్యాంపుల వద్దకు వెళుతుంది. సీజన్ ప్రారంభానికి ముందు మండీ వ్యాపారుల వద్ద అప్పు తీసుకున్న రైతులే తోతాపురిని ఎక్కువగా మార్కెట్‌కు తీసుకొస్తారు. అవేమీ తెలియకుండానే జగన్ వచ్చి ఏం పరామర్శిస్తారని అన్నదాతల నుంచి వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

రెంటపాళ్ల పర్యటన.. 113 మందికి నోటీసులు

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: వైకాపా అధినేత జగన్‌మోహన్‌రెడ్డి రెంటపాళ్ల పర్యటన సందర్భంగా గత నెల 18న పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో నిబంధనలు ఉల్లంఘించి బలప్రదర్శన చేయడం, ప్రజల ఆస్తులు ధ్వంసం చేయడంపై నమోదైన కేసులో వైకాపా నాయకులు, కార్యకర్తలు, మద్దతుదారులు 113 మందికి పోలీసులు నోటీసులు జారీ చేశారు. సత్తెనపల్లి పట్టణ పోలీస్‌స్టేషన్‌కు విచారణకు రావాలని వారిని కోరారు. రప్పా రప్పా నరుకుతాం అంటూ ప్లకార్డులు ప్రదర్శించిన కేసులో వైకాపా నియోజకవర్గ సమన్వయకర్త గజ్జల సుధీర్ భార్గవరెడ్డికి ముందస్తు నోటీసు జారీ చేశారు. శుక్రవారం రాత్రి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సీఐ నాగమల్లేశ్వరరావు ఆయనను విచారించారు. మరో కేసులో ఆదివారం విచారణకు హాజరవ్వాలని నోటీసిచ్చారు.



అనారోగ్యకర జీవనశైలితో గుండెపోటు ముప్పు

అకస్మాత్తుగా గుండెపోటు రావడమంటూ ఉండదు. ఏళ్ల తరబడి కొనసాగించే అనారోగ్యకర జీవనశైలి కారణంగా శరీరంలో పేరుకుపొయ్యే కొవ్వే క్రమంగా ఆ విపత్తుకు దారితీస్తుంది. అందుకే నడక, వ్యాయామాలను మీ జీవనశైలిలో భాగం చేసుకోండి.

– గేబ్ ఫ్లుగ్వైజ్, లైఫ్‌స్టైల్ కోచ్

పేరులో గమ్మత్తు.. రుచిలో మహత్తు!

బిర్యానీ.. మాంసంతో చేసినా...కూరగాయలతో చేసినా... దాని ఘుమఘుమలకు చవులూరాల్సిందే... ఒక్క ముద్ద నోట్లో పెట్టుకుంటే వహ్వా అనాల్సిందే... ఇది కేవలం ఆహారమే కాదు..ఓ సాంస్కృతిక చిహ్నం.. అందుకే హైదరాబాదీలైనా, అవధ్ వాసులైనా, చెట్టినాడ్ ప్రజలైనా, మలబార్ తీరంలో వాళ్లయినా తమదైన రుచులను జోడించి సొంత వంటకంగా మార్చేసుకున్నారు. నేడు ప్రపంచ బిర్యానీ దినోత్సవం సందర్భంగా ఈ ఘుమఘుమల విశేషాలు కొన్ని తెలుసుకుందాం రండి!



నవాబుల నుంచి సామాన్యుల దాకా...

మొఘల్ సామ్రాజ్యం దక్షిణ భారత్‌లో విస్తరించినపుడు ఈ బిర్యానీ మొదట భాగ్యనగరానికి పరిచయమైందని చెబుతుంటారు. మొఘల్, అరబ్ దేశస్థుల వంటకాలతో స్థానిక దక్కనీ రుచుల మేళవింపుతో వినూత్న బిర్యానీ పుట్టుకువచ్చింది. నవాబుల ఆతిథ్యానికి వచ్చిన ప్రముఖులంతా బిర్యానీ ఆరగించి ఔరా అనేవారట. క్రమంగా రాజ ఆస్థానాల నుంచి స్థానిక సామాన్య ప్రజలకు చేరువైంది. భాగ్యనగరానికి హైదరాబాదీ బిర్యానీ ప్రత్యేక గుర్తింపును తెచ్చిపెట్టింది. ఇప్పుడు హైదరాబాద్‌తో పాటు విజయవాడ, విశాఖపట్నం, వరంగల్, కడప, గుంటూరులాంటి చోట్ల ప్రతీ గల్లీలో బిర్యానీ పాయింట్ ఉంటుంది.

పొట్లం బిర్యానీ కథ ఇదీ..

బిర్యానీలను ఎక్కువగా పెద్ద హండీల్లో వండుతుంటారు. కాలక్రమంలో పలు మార్పులు చోటుచేసుకుని, వినూత్నంగా వండుతూ ఆహార ప్రియుల్ని ఆకర్షిస్తున్నారు. వెదురు బొంగులో చేసిన బిర్యానీ ఏపీలోని మారేడుమిల్లిలో చాలా ఫేమస్. ఏపీలో బిర్యానీని గోంగూర పచ్చడితో తినేవాళ్ల సంఖ్య తక్కువేం కాదు. హైదరాబాద్‌లోని పలు రెస్టారెంట్లలో వినూత్నంగా వండుతున్నారు. ఇటీవల 'పొట్లం బిర్యానీ' ఫేమస్ అయింది. ఇందులో సాధారణ బిర్యానీయే ఉన్నా.. దాని చుట్టూ పలుచటి ఆమ్లెట్‌తో పొట్లం చుట్టి ఇస్తారు. అందుకే బిర్యానీకి ఆ పేరు వచ్చింది.

నిమిషానికి... 34

ఫుడ్ డెలివరీ సంస్థల 2024 వార్షిక నివేదిక ప్రకారం.. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఏడాదిలో 2.5 కోట్ల బిర్యానీ ఆర్డర్లు రాగా.. హైదరాబాద్‌లోనే 1.57 కోట్లు ఆర్డర్లు వచ్చాయి. నిమిషానికి సగటున 34 బిర్యానీలు లాగించేశారు. విజయవాడ, విశాఖ నగరాల్లోనూ గణనీయంగా ఆర్డర్ చేశారు. రెస్టారెంట్లు, హోటళ్లలో బిర్యానీని ఆస్వాదించే వారి సంఖ్య వీటికి అదనం.

కరవులో పుట్టింది..!

1784లో అవధ్ ప్రాంతంలో (నేటి ఉత్తర్‌ప్రదేశ్) భయంకరమైన కరవు వచ్చింది. ఆ సమయంలో ప్రజలకు ఉపాధి కల్పించేందుకు నవాబు అసఫ్ ఉద్దౌలా లఖ్‌నవూలో భారీ నిర్మాణాన్ని చేపట్టారు. ఇందులో కష్టపడి పనిచేసే 20 వేల మంది కార్మికులకు పోషకాలతో నిండిన ఆహారాన్ని ఇవ్వాలనుకున్నారు. ఆయన ఆదేశాల మేరకు వంటవారు బియ్యం, మాంసం, బంగాళాదుంపలు, కుంకుమపువ్వు, మీగడలతో చేసిన అవధ్ బిర్యానీ నవాబుకు తెగనచ్చేసింది. అప్పటికప్పుడే ఆయన దానికి రాజహోదా ఇచ్చి తన మెనూలో చేర్చేశారు.

పేరు అక్కడిది...

బిర్యానీ అనే పేరు పర్షియాకు భాషలోని బిరింజ్ నుంచి వచ్చిందంటారు. బిర్యానీని దమ్ చేసే పద్ధతిని మొదట మొఘలులు పరిచయం చేశారు. కుంకుమ పువ్వు, యోగర్ట్‌లను మొదట వాడింది కూడా వారే. కుంకుమ పువ్వు బిర్యానీకి మంచి రంగు, సువాసనలను అందిస్తే... యోగర్ట్ మాంసాన్ని మృదువుగా చేస్తుంది.

అంత బరువేం కాదు..!

బరువు తగ్గాలనుకుంటారు.. కానీ.. బిర్యానీ తినాలని ఉంటుంది.. అప్పుడు ఎలా వండాలి?

- బాస్మతీ బియ్యానికి బదులుగా బ్రౌన్‌రైస్ లేదా చిరుధాన్యాలు వాడొచ్చు. బ్రౌన్‌రైస్‌లో ఎక్కువగా ఫైబర్ ఉంటుంది. ఇది కడుపు నిండిన భావనను కలిగిస్తుంది. అరికలతో బిర్యానీ చేయడం మంచి ఎంపిక.
- నూనె లేదా నెయ్యి పరిమాణాన్ని బాగా తగ్గించాలి.
- బిర్యానీలో ఎక్కువగా కూరగాయలను చేర్చండి. క్యారెట్, బీన్స్, బఠాణీలు, కాలీఫ్లవర్, బ్రోకలీ వంటివి పోషకాలతో నిండి ఉంటాయి. కేలరీలు తక్కువగా ఉంటాయి.
- చికెన్ బిర్యానీ అయితే స్కిన్‌లెస్ చికెన్‌ను ఉపయోగించవచ్చు! శాఖాహారులు పనీర్ లేదా సోయా ముక్కలను చేర్చుకోవచ్చు మసాలాలు మితంగా ఉపయోగించాలి. అయితే బిర్యానీ ఆకు బరువు తగ్గేందుకు సహాయపడుతుందని కొన్ని అధ్యయనాలు సూచిస్తున్నాయి.
- రైతాతో బిర్యానీ తీసుకోవడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. అదనపు ప్రోబయోటిక్స్ లభిస్తాయి. దోసకాయ రైతా వంటి తక్కువ కేలరీల రైతాలను ఎంచుకోవచ్చు.

మితిమీరొద్దు...

బిర్యానీ ఎంత శక్తిమంతమైనా, రుచికరమైనా దాన్ని అతిగా తినకూడదు. అందులో తగిన మోతాదులోనే నూనె వాడాలి. చికెన్, మటన్ బిర్యానీలతో అందులోని మాంసాల వల్ల శరీరానికి ఐరన్ లభిస్తుంది. మొక్కలు, ఆకుకూరలతో చేసిన వంటకాల ద్వారా కేవలం 5శాతం ఐరన్ లభిస్తుంది. రక్తహీనతతో బాధపడే వారికి బిర్యానీ మంచి ఆహారం. కావాల్సిన ఐరన్ చేరడంతో రక్తం వృద్ధి చెందుతుంది. అయితే బిర్యానీతో ఒకేసారి ఎక్కువ మోతాదులో కాలరీలు శరీరానికి చేరతాయి.

– డా.అవుల లక్ష్మయ్య, రిటైర్డ్ సీనియర్ సైంటిస్ట్, ఎన్ఐఎన్

- ఈనాడు, హైదరాబాద్, ప్రత్యేక విభాగం

కత్తితో పొడిచాడు.. తాళి కట్టాడు!

● రక్తపు మడుగులో విలవిల్లాడుతుండగా సెల్ఫీ
● మైసూరులో ప్రేమోన్మాది ఘాతుకానికి మహిళ బలి



అభిషేక్ పూర్ణిమ

మైసూరు, న్యూస్‌టుడే: కర్ణాటకలోని మైసూరులో దారుణం చోటుచేసుకుంది. నగర శివారులోని పాండవపురకు చెందిన పూర్ణిమ(36) అనే మహిళ.. క్యాతనహళ్లికి చెందిన అభిషేక్(30) అనే ప్రేమోన్మాది చేతిలో హత్యకు గురయ్యారు. పూర్ణిమ మైసూరులో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. తనను ప్రేమించాలని కొద్ది నెలలుగా అభిషేక్ ఆమె వెంటపడేవాడు. శుక్రవారం పాఠశాల నుంచి ఇంటికి వస్తున్న పూర్ణిమ వెంటపడి పెళ్లి చేసుకోవాలంటూ ఒత్తిడి తెచ్చాడు. ఆమె నిరాకరించడంతో వెంట తెచ్చుకున్న కత్తితో పొడిచాడు. రక్తపు మడుగులో గాయాలతో విలవిల్లాడుతున్న బాధితురాలి మెడలో బలవంతంగా తాళి కట్టాడు. సెల్ఫీ తీసుకున్నాడు. అనంతరం ఆమెను మైసూరులోని ఓ ఆసుపత్రిలో చేర్పించాడు. పూర్ణిమ పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు చెప్పడంతో అభిషేక్ పరారయ్యాడు. చికిత్స పొందుతూ ఆమె శనివారం ఉదయం మరణించారు. లక్ష్మీపురం ఠాణా పోలీసులు శనివారం సాయంత్రం అభిషేక్‌ను అరెస్టుచేశారు.

కన్నడిగులను కించపరిచే వ్యాఖ్యలు చేయొద్దు

● కమల్‌హాసన్‌కు కోర్టు విస్పష్ట సూచన

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే: కన్నడిగులు, కర్ణాటకను కించపరుస్తూ ఇకపై ఎటువంటి వ్యాఖ్యలూ చేయొద్దని ప్రముఖ నటుడు కమల్‌హాసన్‌ను బెంగళూరు నగర 31వ అదనపు సివిల్ న్యాయస్థానం శనివారం ఆదేశించింది. ఇటీవల 'తమిళం నుంచి కన్నడ భాష పుట్టింది' అన్న కమల్ వ్యాఖ్యలపై కన్నడిగులు భగ్గుమన్నారు. అతనిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కన్నడ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు మహేశ్ జోషి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై తాజాగా న్యాయమూర్తి విచారణను పూర్తిచేశారు. మరోసారి కన్నడ భాషను, కన్నడిగులను, కర్ణాటకను కించపరుస్తూ వ్యాఖ్యలు చేస్తే కోర్టు ధిక్కరణ కింద చర్యలు తీసుకుంటామని కమల్ హాసన్‌ను హెచ్చరించారు.

ఆదర్శప్రాయుడు కంచర్ల రామయ్య

నారా భువనేశ్వరి



రామయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న భువనేశ్వరి. చిత్రంలో కంచర్ల శ్రీకాంత్ తదితరులు

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంత వాసులకు సాంకేతిక విద్యను అందుబాటులోకి తెచ్చిన ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాల అధినేత కంచర్ల రామయ్య ఆదర్శప్రాయుడని ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి అన్నారు. ఇటీవల రామయ్య అనారోగ్యంతో మరణించగా.. శనివారం శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా కందుకూరులోని కళాశాల ఆవరణలో ఆయన దశ దిన కర్మ కార్యక్రమం నిర్వహించారు. దీనికి ఆమె హాజరై.. రామయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుమారులైన ఎమ్మెల్సీ, శాసనమండలి విప్ కంచర్ల శ్రీకాంత్, కళాశాల డైరెక్టర్ విజయ్ శ్రీనివాస్, కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, బి.ఎన్.విజయ్‌కుమార్, ఉగ్రనరసింహారెడ్డి, బొజ్జల సుధీర్ కుమార్‌రెడ్డి, జగన్‌మోహన్, కాకర్ల సురేష్ తదితరులు హాజరయ్యారు.

నానీ.. వంశీ ఎక్కడ?

పరామర్శ సందర్భంలో ఆసక్తికర సంభాషణ



వంశీని పరామర్శిస్తున్న పేర్ని నాని, కొడాలి నాని

హనుమాన్ జంక్షన్, న్యూస్‌టుడే: కృష్ణా జిల్లా బాపులపాడు మండలం ఎ.సీతారాంపురంలో నివాసం ఉంటున్న వైకాపా నేత, మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీని శనివారం మాజీ మంత్రులు కొడాలి నాని, పేర్ని నానిలు పరామర్శించారు. సాధారణ ఎన్నికల్లో ఓటమి తర్వాత కొడాలి నాని, వల్లభనేని వంశీ బహిరంగంగా కలవడం ఇదే మొదటిసారి. వీరిద్దరి భేటీ తర్వాత పేర్ని నాని కూడా అక్కడకు వచ్చారు. వంశీ ఎదురుగా కనిపిస్తున్నా గమనించనట్లుగా పేర్ని నాని ముందుకువచ్చారు. వంశీ ఎక్కడ అంటూ అడిగి, వెంటనే గుర్తుపట్టలేకపోయా అని బదులిచ్చారు.

పోలీసు స్టేషన్‌కు మాజీ మంత్రి కొడాలి

● వైకాపా నాయకులను వెంటబెట్టుకుని సంతకానికి రాక



వైకాపా నాయకులతో కలిసి పోలీసు స్టేషన్‌కు వస్తున్న కొడాలి నాని

గుడివాడ, న్యూస్‌టుడే: వైకాపా మాజీ మంత్రి కొడాలి నాని శనివారం గుడివాడ వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో సంతకం చేయడానికి మంది మార్బలంతో వచ్చారు. గుడివాడ మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రావి వెంకటేశ్వరరావుపై, తెదేపా పార్టీ కార్యాలయంపై దాడి చేసిన కేసులో తనను నిందితుడిగా చేర్చే అవకాశం ఉన్నందున.. బెయిలు మంజూరు చేయాలని నాని గత నెల 3న గుడివాడ 11వ అదనపు జిల్లా కోర్టులో అప్పీలు చేశారు. దీంతో కోర్టు షరతులతో కూడిన ముందస్తు బెయిలు మంజూరు చేసింది. వారంలో రెండు రోజులు మంగళ, శని వారాల్లో వన్‌టౌన్ ఠాణాలో హాజరై సంతకాలు చేయాలని షరతులు విధించింది. దీంతో ఆయన సీఐ కొండపల్లి శ్రీనివాస్ సమక్షంలో సంతకం చేసి వెళ్లారు. ఆయన వెంట మండలి హనుమంతరావు, పాలేటి చంటి, కొంకితల ఆంజనేయ ప్రసాద్, చుండూరు శేఖర్ తదితరులున్నారు.

ఆదిత్య ఫార్మసీ అధినేత నరసింహరాజు ఆత్మహత్య

● ఆర్థిక ఇబ్బందులే కారణమని లేఖ ● ఇద్దరు వ్యక్తుల వల్లేనంటూ పోలీసులకు ఫిర్యాదుచేసిన భార్య శాంతి



వెంకట నరసింహరాజు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే: ఆదిత్య ఫార్మసీ అధినేత సాగి వెంకట నరసింహరాజు (55) శనివారం విజయవాడలో ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆయనకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో దాదాపు 100 వరకు ఆదిత్య ఫార్మసీ ఫ్రాంఛైజీలు ఉన్నాయి. గతేడాది వరకు విజయవాడ అయోధ్య నగర్‌లో ఉండేవారు. అక్టోబరులో తన మిత్రుడైన మహ్మద్ రఫీని ఆయన హత్య చేసినట్లు అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ కేసులో జైలుకు వెళ్లి బెయిల్‌పై బయటకు వచ్చిన నరసింహరాజు.. హైదరాబాద్‌కు వెళ్లిపోయారు. తర్వాత వ్యాపార భాగస్వాములు అప్పులు చెల్లించాలని ఆయనపై ఒత్తిడి తీసుకురాగా సర్దిచెప్పారు. అప్పులు, హత్య కేసుతో కుంగిపోయి తీవ్ర మనస్తాపానికి గురైనట్లు బంధువులు చెబుతున్నారు. దాదాపు రూ.10 కోట్ల వరకు అప్పులు ఉండొచ్చని అనుమానిస్తున్నారు.

నాలుగు రోజుల క్రితం విజయవాడకు వచ్చి...

నరసింహరాజు హైదరాబాద్‌లో ఉంటూ.. వారంలో రెండు రోజులు విజయవాడకు వచ్చి వ్యాపార లావాదేవీలు చూసుకుంటారు. ఇలా తన భార్య శాంతితో కలిసి నాలుగు రోజుల క్రితం విజయవాడకు వచ్చారు. అయోధ్యనగర్‌లో క్షత్రియ సంఘం భవనంలో దిగారు. రెండు రోజుల క్రితం ఆయన భార్య తిరిగి హైదరాబాద్ వెళ్లిపోయారు. శనివారం నిద్ర లేచిన తర్వాత నరసింహరాజు.. ఉదయపు నడకకు వెళుతున్నట్లు డ్రైవర్‌కు చెప్పారు. అనంతరం తాను ఉంటున్న భవనంలోని మరో అంతస్తుకు వెళ్లి అక్కడ ఉరి వేసుకున్నారు. చుట్టుపక్కల వారు గమనించి అజిత్‌సింగ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నరసింహరాజు రాసిన ఆత్మహత్య లేఖను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగానే ఆత్మహత్య చేసుకుంటున్నట్లు అందులో ఉందని తెలిపారు. తన భర్త ఆత్మహత్యకు బుద్దిరాజు శివాజీ, పిన్నమనేని పరంధామయ్యలే కారణమని, వారి వల్లే తన భర్త చనిపోయాడని అజిత్‌సింగ్‌నగర్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో నరసింహరాజు భార్య శాంతి పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వెంకట నరసింహరాజుకు ఒక కుమారుడు ఉన్నారు.

నన్ను ముందుకు నెట్టి.. వారు తప్పించుకున్నారు!

● అజీజ్, సుఫియార్ ఇద్దరూ పోలీసులేనని అనుమానంగా ఉంది
● సన్నిహితులతో ఉగ్ర కుట్ర కేసు నిందితుడు రెహ్మాన్

ఈనాడు, విజయనగరం: 'అజీజ్, సుఫియార్ నాకు వేర్వేరుగా ఆన్‌లైన్‌లో పరిచయమయ్యారు. నన్ను ముందుకు తోసి చివరి నిమిషంలో తెరమరుగయ్యారు' అని విజయనగరం ఉగ్ర కుట్ర కేసు నిందితుడు సిరాజ్ ఉర్ రెహ్మాన్ ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిసింది. విజయనగరం పోలీసులు మే 16న అరెస్టు చేసిన రెహ్మాన్ ప్రస్తుతం విశాఖపట్నం కేంద్ర కారాగారంలో రిమాండ్ ఖైదీగా ఉన్నాడు. ములాఖత్‌లో కలిసిన సన్నిహితుల వద్ద ఆ ఇద్దరూ ఈ కేసు నుంచి ఎలా తప్పించుకున్నారో అర్థం కావడం లేదని వాపోయినట్లు తెలిసింది. 'పోటీ పరీక్షల శిక్షణకు హైదరాబాద్ వెళ్లా. ముస్లింలపై దాడులు జరిగినప్పుడు సామాజిక మాధ్యమాల్లో అభిప్రాయాలు పోస్టు చేసేవాణ్ని. ఇలా ఆన్‌లైన్‌లో అజీజ్, సుఫియార్ నాకు పరిచయమయ్యారు. నాలాంటి వాళ్లతో గ్రూపులు ఏర్పాటు చేయాలని సూచించారు. అల్లాను దూషించేవారిని, ముస్లింలను హతమార్చే వారిని, కరడుగట్టిన ఆర్ఎస్ఎస్ వాదులను చంపేద్దామని ఉసిగొల్పారు. చిన్నపాటి మిసైల్ నమూనా పరీక్షల వీడియోలను పంపించారు. వాటిని ఎలా తయారు చేయాలో సూచించారు. అప్పటికే పరిచయమైన హైదరాబాద్ వాసి సయ్యద్ సమీర్‌కు బాధ్యత అప్పగించమని చెప్పా. పేలుడు పదార్థాల తయారీకి సమీర్‌కు రూ.5 వేలు, తర్వాత రూ.3వేలు ఇచ్చారు. హైదరాబాద్ నుంచి విజయనగరం వచ్చిన నాతో రాకెట్ లాంచర్ల వంటి పేలుడు పదార్థాలు తయారు చేద్దామన్నారు. పదార్థాలు కొని, సిద్ధమైన తర్వాత రేపు (మే 17)న వస్తామన్నారు. వారి కోసం ఎదురుచూస్తుండగానే.. పోలీసులు అరెస్టు చేశారు' అని రెహ్మాన్ చెప్పినట్లు భోగట్టా.

వారిద్దరి పేర్లూ ఎఫ్ఐఆర్‌లో లేవు

'పోలీసు కస్టడీలో విచారణాధికారులకు అజీజ్, సుఫియార్‌ల గురించి అంతా చెప్పా. కానీ వారి పేర్లు ఎఫ్ఐఆర్‌లో లేవు. ఇంత వరకు వారిద్దరినీ అరెస్టు చేయలేదు. వారిద్దరూ ముమ్మాటికీ పోలీసు విభాగానికి చెందినవారే. వలేసి అరెస్టు చేయించారని అనుమానిస్తున్నా. నాకు ఉగ్రవాద భావజాలాన్ని నూరిపోసింది వారే' అని రెహ్మాన్ వివరించినట్లు తెలిసింది.

కేసు బదిలీకి డీజీపీ ఆదేశాలు?

విజయనగరం పోలీసులు నమోదు చేసిన ఉగ్ర కుట్ర కేసును జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ)కు అప్పగించాలని డీజీపీ నుంచి జిల్లా అధికారులకు ఆదేశాలు అందినట్లు తెలిసింది. ఎన్ఐఏకు కేసు బదిలీ అయినా ఎన్ఐఏ కోర్టు విశాఖలో ఉన్నందున వారిని ఇక్కడి జైల్లోనే ఉంచి, దర్యాప్తు చేపడతారు.

మాలిలో తెలుగు ఉద్యోగి అపహరణ

● మరో ఇద్దరు కూడా కిడ్నాప్
● బందీల్లో ఒకరు హైదరాబాద్ వాసి
● మరో ఇద్దరిది ఒడిశా, రాజస్థాన్ రాష్ట్రాలు
● కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని కలసిన తెలుగు కుటుంబం





వెంకటరమణ అమరలింగేశ్వరరావు

కిడ్నాపర్ల చెరలో బందీలు

ఈనాడు, హైదరాబాద్, మిర్యాలగూడ పట్టణం, బ్రహ్మపుర నగరం, మాచర్ల–న్యూస్‌టుడే: పశ్చిమ ఆఫ్రికాలోని మాలిలో కిడ్నాప్‌నకు గురైన ముగ్గురు భారతీయుల విడుదలపై ఉత్కంఠ కొనసాగుతోంది. బాధితుల్లో ఒకరు తెలుగు వారు కాగా.. మరో ఇద్దరు ఒడిశా, రాజస్థాన్ రాష్ట్రాలకు చెందినవారు. అపహరణకు గురైన వారిలో తెలుగు వారైన కూరాకుల అమరలింగేశ్వరరావు ఉండటంతో ఆయన కుటుంబసభ్యుల్లో ఆందోళన నెలకొంది. మాలిలో డైమండ్ సిమెంట్ ఫ్యాక్టరీలో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్న అమరలింగేశ్వరరావుతో పాటు మరో ఇద్దరు ఉద్యోగులను జులై 1న ఉగ్రవాదులు కిడ్నాప్ చేశారు. ఏపీలోని పల్నాడు జిల్లా మాచర్ల మండలం జమ్మలమడక గ్రామానికి చెందిన అమరలింగేశ్వరావుకు నల్గొండ జిల్లా అడవిదేవులపల్లికి చెందిన రమణతో వివాహమైంది. వీరికి ముగ్గురు సంతానం. అమరలింగేశ్వరరావు మాలిలో పదకొండేళ్లుగా పనిచేస్తుండగా.. భార్య, పిల్లలు ప్రస్తుతం హైదరాబాద్‌లో నివసిస్తున్నారు. కాగా అమరలింగేశ్వరరావు కుటుంబం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని శనివారం హైదరాబాద్‌లో కలిసింది. రిపబ్లిక్ మాలిలోని భారత రాయబార కార్యాలయాన్ని సంప్రదించి త్వరగా బందీలను విడిపించేలా చర్యలు తీసుకోవాలని ఆయన విదేశాంగశాఖకు లేఖ రాశారు.

ఆందోళనలో ఒడిశా వాసి కుటుంబం

ఉగ్రవాదులు అపహరించిన వారిలో ఒడిశాలోని గంజాం జిల్లా సమరఝొళ గ్రామానికి చెందిన పి.వెంకటరమణ (28) ఉన్నారు. ఆయన ఆర్నెల్ల కిందట ముంబయికి చెందిన బ్లూస్టార్ అనే కంపెనీ ద్వారా మాలిలోని సిమెంట్ ఫ్యాక్టరీలో చేరి పర్యవేక్షకునిగా పనిచేస్తున్నారు. ఉగ్రవాదులు తమ కుమారుడు వెంకటరమణను కిడ్నాప్ చేసినట్లు బ్లూస్టార్ వర్గాలు సమాచారం ఇచ్చాయని వెంకటరమణ తల్లి పి.నర్సమ్మ శనివారం 'ఈటీవీ భారత్'కు తెలిపారు. వెంకటరమణను త్వరగా, సురక్షితంగా భారత్‌కు తీసుకురావాలని కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రి డాక్టర్ జైశంకర్‌ను కోరుతూ మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ 'ఎక్స్'లో పోస్టు చేశారు.

కిడ్నాప్ ఇలా..

మాలిలోని కేఎస్ నగరంలో ఉన్న డైమండ్ సిమెంట్ ఫ్యాక్టరీ ఆవరణలోకి జులై 1న మిలిటెంట్ల బృందంతో కూడిన సాయుధులు బైక్‌లపై వచ్చారు. అక్కడి నుంచి అమరలింగేశ్వరరావు, వెంకటరమణ, మరో వ్యక్తిని కిడ్నాప్ చేశారు. బాధితుల్లో మరొకరు రాజస్థాన్ జైపుర్‌కు చెందిన ప్రసాద్ అని తెలుస్తోంది. అనంతరం తామే వారిని అపహరించామంటూ అల్‌ఖైదాకు అనుబంధంగా కార్యకలాపాలు సాగిస్తున్న జమాత్ నుస్రత్ అల్ ఇస్లాం వాల్ ముస్లిమీన్ (జేఎన్ఐఎం) అనే సంస్థ ప్రకటించుకుంది. వీరిని కిడ్నాప్ చేసి 4 రోజులు గడిచినా ఉగ్రవాదులు ఎలాంటి డిమాండ్లు వెల్లడించకపోవడంతో ఉత్కంఠ నెలకొంది.

ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్ కప్‌నకు ఉమామహేష్



విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: చైనాలో సెప్టెంబరు 5 నుంచి 15 వరకు జరగనున్న ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్ కప్‌నకు రాష్ట్రానికి చెందిన షూటర్ మద్దినేని ఉమామహేష్ అర్హత సాధించాడు. గత నెల 25, 26న దెహ్రాదూన్‌లో జరిగిన భారత జట్టు ఎంపిక పోటీల్లో 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ విభాగంలో సత్తా చాటాడు. వ్యక్తిగత, మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్లలో భారత్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తాడు. మిక్స్‌డ్‌లో రమిత (హరియాణా)తో జోడీ కట్టనున్నాడు. ఈ మేరకు ఎన్ఆర్ఏఐ ప్రకటన విడుదల చేసింది.

అమెరికాలోని జలపాతంలో చిక్కాల యువకుడి గల్లంతు



హరికిరణ్ గౌడ్

చాగల్లు, న్యూస్‌టుడే: తూర్పు గోదావరి జిల్లా చాగల్లు మండలం చిక్కాలకు చెందిన శెనగన హరికిరణ్ గౌడ్(25) అమెరికాలోని ఓ జలపాతంలో గల్లంతయ్యాడు. ఈ మేరకు కుటుంబసభ్యులకు సమాచారం అందింది. ఎం.ఎస్. చదివేందుకు హరికిరణ్ 2023లో అమెరికా వెళ్లాడు. కాన్సస్ రాష్ట్రంలోని ఓవర్‌ల్యాండ్ పార్క్ నగరంలో నివాసం ఉంటూ ఓ సంస్థలో తాత్కాలిక ఉద్యోగం చేస్తున్నాడు. స్నానం చేసేందుకు శుక్రవారం స్నేహితులతో కలిసి జలపాతానికి వెళ్లిన ఆయన అదుపు తప్పి గల్లంతైనట్లు కుటుంబసభ్యులకు శనివారం తెల్లవారుజామున సమాచారం అందింది. కుటుంబసభ్యులు విషాదంలో మునిగిపోయారు. హరికిరణ్ తండ్రి రామకృష్ణ పీఎంపీ వైద్యుడిగా గ్రామస్థులకు సుపరిచితుడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. హరికిరణ్ పెద్దకుమారుడు.

2,088 టన్నుల హెచ్‌డీ బర్లీ పొగాకు కొనుగోలు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో రైతులకు మేలు చేసేలా హెచ్‌డీ బర్లీ పొగాకు కొనుగోళ్లు పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు ఏపీ మార్క్‌ఫెడ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. ప్రభుత్వ ఆదేశాలతో 2025 సీజన్‌లో కొనుగోళ్లు ప్రారంభించామని పేర్కొంది. 2024 రబీ సీజన్‌లో ఈ ఏడాది జులై 5 నాటికి బాపట్ల, గుంటూరు, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో ఏర్పాటుచేసిన 11 కొనుగోలు కేంద్రాల ద్వారా 724 మంది రైతుల నుంచి రూ.17.20 కోట్ల విలువైన 2,088 టన్నుల (2,245 బేళ్లు) పొగాకు కొనుగోలు చేసినట్లు వివరించింది. ఈ ఏడాది సెప్టెంబరు చివరి వరకు కొనుగోళ్లు కొనసాగుతాయని స్పష్టంచేసింది.

సింహాచలం క్షేత్రంలో కూలిన షెడ్డు నిర్మాణం

● గిరి ప్రదక్షిణ ఏర్పాట్లు చేస్తుండగా ఘటన



కూలిన షెడ్డు ఇనుప గొట్టాలు

విశాఖపట్నం (సింహాచలం), న్యూస్‌టుడే: సింహాచలం క్షేత్రంలో గిరి ప్రదక్షిణ మహోత్సవం కోసం నిర్మిస్తున్న భారీ షెడ్డు కూలింది. ఈ నెల 9న గిరి ప్రదక్షిణ మహోత్సవం ప్రారంభం కానుండటంతో అధికారులు ఏర్పాట్లు చేపట్టారు. ఈ క్రమంలో సింహాచలం కొండ దిగువన తొలిపావంచా వద్ద నిర్మాణంలో ఉన్న తాత్కాలిక షెడ్డు ఒకవైపు కూలిపోయింది. ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు.. షెడ్డు పనులు జరుగుతుండగా శనివారం మధ్యాహ్నం 3.30 గంటలకు ఇనుప స్తంభాలు ఒకవైపు ఒరిగాయి. వాటిని సరిచేసేందుకు గుత్తేదారు సిబ్బంది క్రేన్‌తో పైకప్పును ఒక వైపు లాగారు. ఈ క్రమంలో పైకప్పును అతికించేందుకు ఇనుప గొట్టాలను అనుసంధానిస్తూ చేసిన వెల్డింగ్ ఊడిపోవడంతో షెడ్డు కూలిపోయింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది.

చదును చేయకుండానే పనులు: షెడ్డు నిర్మిస్తున్న స్థలాన్ని చదును చేయకుండానే పనులు ప్రారంభించారు. షెడ్డు స్తంభాలను చట్రం వంటి ఇనుప గొట్టాల్లో ఉంచారు. ఎగుడు దిగుడు స్థలంలో ఆ చట్రాలు సరిగా కుదురుకోక ఒక వైపు ఒరిగి ప్రమాదం జరిగింది. ఘటనా స్థలాన్ని సింహాచలం ఈఓ త్రినాథరావు పరిశీలించారు. షెడ్డు నిర్మాణాన్ని నిలిపివేయాలని ఆదేశించారు. బహిరంగ ప్రదేశంలో బురద లేకుండా చేసి అక్కడే క్యూలైన్లు ఏర్పాటు చేస్తామన్నారు. ఘటనపై విచారణ చేపడతామన్నారు.

వైకాపాలో ఆధిపత్య పోరు.. నల్లగుంట్లలో ప్రతీకార హత్య

పీర్ల ఊరేగింపు సందర్భంగా ఘటన




బైరబోయిన వెంకటేశ్వర్లు

పెద్దదోర్నాల, న్యూస్‌టుడే: ప్రకాశం జిల్లా దోర్నాల మండలం నల్లగుంట్లలో శుక్రవారం అర్ధరాత్రి ప్రతీకార హత్య జరిగింది. సర్పంచి భర్తను చంపిన కేసులో ప్రధాన నిందితుడైన బైరబోయిన వెంకటేశ్వర్లు(38)ను ప్రత్యర్థులు నరికి చంపారు. మొహర్రం సందర్భంగా పీర్లను ఊరేగించే సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. గత పంచాయతీ ఎన్నికల్లో సర్పంచి పీఠం కోసం వైకాపాలోని రెండు వర్గాలకు చెందిన మొద్దు వెంకటేశ్వర్లు, బైరబోయిన వెంకటేశ్వర్లు పోటీ పడ్డారు. ఆ పోటీలో మొద్దు వెంకటేశ్వర్లు భార్య నాగలక్ష్మి సర్పంచిగా గెలుపొందారు. దీంతో ఇరువర్గాల మధ్య గొడవలకు దారితీశాయి. కొట్లాటతో తన భార్యను అవమానించారనే కోపంతో బైరబోయిన వెంకటేశ్వర్లు సర్పంచి భర్త మొద్దు వెంకటేశ్వర్లును 2022 ఫిబ్రవరి 9న రాత్రి కత్తితో దాడి చేసి చంపాడు. ఆ కేసులో జైలుకు వెళ్లి వచ్చిన అతను భార్య స్వగ్రామమైన పల్నాడు జిల్లా రెంటచింతల మండల రెంట్యాలలో ఉంటున్నాడు. అప్పుడప్పుడు నల్లగుంట్ల వచ్చి వెళుతుండేవాడు. వారం రోజులుగా గ్రామంలోనే ఉండి పొలాన్ని బాగు చేయించుకుంటున్నాడు. శుక్రవారం నల్లగుంట్లలో పీర్ల ఊరేగింపు నిర్వహిస్తుండగా ఇంటి సమీపంలో ఉన్న బైరబోయిన వెంకటేశ్వర్లును మొద్దు తిరుపతిరావు, మరికొంత మంది కత్తులతో నరికి చంపారు.

రాష్ట్రంలో సిబా ప్రాంతీయ కేంద్రం ఏర్పాటుచేయాలి

- నేషనల్ బ్యూరో ఆఫ్ ఫిష్ జెనెటిక్ రిసోర్సెస్ కేంద్రమూ పెట్టాలి
- జాతీయ మత్స్య అభివృద్ధి బోర్డును అమరావతికి తరలించాలి
- కేంద్ర మంత్రులు శివరాజ్‌సింగ్ చౌహాన్, రాజీవ్‌రంజన్ సింగ్‌లకు ముఖ్యమంత్రి చంద్రబాబు లేఖలు



ఈనాడు, అమరావతి: 'ఆంధ్రప్రదేశ్‌లో సిబా (సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్రాకిష్ వాటర్ ఆక్వాకల్చర్) ప్రాంతీయ కేంద్రాన్ని ఏర్పాటుచేయాలి. చెన్నైలో ఈ సంస్థ ప్రధాన కార్యాలయం ఉంది. దేశంలోనే ఆక్వా సాగుకు ఆంధ్రప్రదేశ్ కేంద్రంగా ఉన్నా, రాష్ట్రంలో పరిశోధన కేంద్రం లేదు. సాంకేతిక నిపుణులు లేరు. వ్యాధుల నిర్ధారణకు ఆధునిక వసతుల్లేవు. ఉప్పునీటి ఆక్వా సాగులో కొత్త ఆవిష్కరణలకు ఆస్కారం లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో సిబా ప్రాంతీయ కేంద్రాన్ని ఏర్పాటుచేయాలి' అని కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్, కేంద్ర మత్స్య, పశుసంవర్ధక శాఖ మంత్రి రాజీవ్‌రంజన్ సింగ్‌లకు ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం వేర్వేరుగా లేఖలు రాశారు. 'ఈనాడు'లో తాజాగా ఆక్వా పరిశ్రమ వ్యాధుల బారినపడి ఎలా నష్టపోతోందో, ఇక్కడ పరిశోధన కేంద్రం లేని వైనంపై కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తాజాగా కేంద్రానికి సీఎం లేఖలు రాశారు. వాటిలోని ప్రధానాంశాలు ఇలా ఉన్నాయి.

'దేశ ఆక్వా ఉత్పత్తుల్లో ఆంధ్రప్రదేశ్ వాటా 75%. 2.30 లక్షల హెక్టార్లలో ఆక్వా సాగవుతోంది. రొయ్యల సాగుకు ఏపీ కేంద్రంగా ఉంది. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు స్థూలవిలువ జోడింపులో ఆక్వా రంగం కీలకం. ఈ రంగంలో వేల మంది చిన్న, సన్నకారు రైతులు భాగస్వాములు. రొయ్యలకు వచ్చే వ్యాధుల నివారణకు శాస్త్రీయ పరిష్కారాలు కనుగొనాలి. ఫీడ్ అభివృద్ధి, పర్యావరణ సుస్థిరత, జన్యు ఆధారిత రొయ్య రకాల అభివృద్ధిపై దృష్టి సారించాలి. రాష్ట్రంలో రొయ్యలకు వైట్‌స్పాట్ సిండ్రోమ్ వైరస్, ఈహెచ్‌పీ, వైట్ గట్ లాంటి వ్యాధులు ప్రబలుతున్నాయి. వీటివల్ల రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. రాష్ట్రంలో కేంద్రీయ మత్స్య పరిశోధన సంస్థలు ఏపీ లేవు' అని ముఖ్యమంత్రి తన లేఖలో వివరించారు.

మత్స్యరకాల అభివృద్ధికి దోహదం

'ఉత్తర్‌ప్రదేశ్‌లోని లఖ్‌నవూలో ఐకార్ గుర్తింపు ఉన్న నేషనల్ బ్యూరో ఆఫ్ ఫిష్ జెనెటిక్ రిసోర్సెస్ ఇన్‌స్టిట్యూట్ ఉంది. ఆ సంస్థ ప్రాంతీయ కార్యాలయం ఏపీలో ఏర్పాటుచేయాలి. అలా చేస్తే జన్యు ఆధారిత మత్స్యరకాలు అభివృద్ధి చేయడం వల్ల ఆర్థికంగా ఎంతో తోడ్పాటు లభిస్తుంది. ఈ కార్యాలయం ఏర్పాటుచేస్తే జన్యు స్వచ్ఛతను పర్యవేక్షించడంతో పాటు నాణ్యమైన బ్రూడ్‌స్టాక్ (పునరుత్పత్తి కోసం ఎంపిక చేసిన పరిపక్వ చేపలు) నిర్వహణ సాధ్యమవుతుంది' అని సీఎం పేర్కొన్నారు.

హైదరాబాద్ నుంచి ఇక్కడకు తెండి

'జాతీయ మత్స్య అభివృద్ధి బోర్డును (ఎన్ఎఫ్‌డీబీ) 2006లో ఏర్పాటుచేసి దేశంలోనే మత్స్య అభివృద్ధి కార్యకలాపాలకు అవకాశం కల్పించారు. ఈ బోర్డును ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని హైదరాబాద్‌లో ఏర్పాటుచేశారు. ప్రస్తుతం రాష్ట్రం విడిపోయినా ఆక్వా, మత్స్య ఉత్పత్తుల్లో ఆంధ్రప్రదేశ్‌దే కీలక వాటా. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో ఉన్న మత్స్య అభివృద్ధి బోర్డును అమరావతికి తరలించాలి' అని కేంద్ర మత్స్య, పశుసంవర్ధక శాఖ మంత్రి రాజీవ్‌రంజన్ సింగ్‌కు రాసిన లేఖలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. లేఖలోని అంశాలిలా ఉన్నాయి.

'దేశ మత్స్యరంగంలో ఆంధ్రప్రదేశ్ పాత్రను గుర్తించి అభివృద్ధి బోర్డును హైదరాబాద్‌లో ఏర్పాటుచేశారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ దేశ ఆక్వారంగానికి నాయకత్వం వహిస్తోంది. రాష్ట్రంలో విస్తృతమైన తీరప్రాంతం ఉంది. రొయ్యల పరిశ్రమ విస్తృతంగా పెరుగుతోంది. జాతీయస్థాయి మత్స్య సంస్థను ఇక్కడ ఏర్పాటు చేయడానికి అనుకూల పరిస్థితులున్నాయి. విభజన తర్వాత హైదరాబాద్ తెలంగాణకు వెళ్లింది. అందువల్ల ఎన్ఎఫ్‌డీబీని అమరావతికి తరలించాలి. దేశ చేపల ఉత్పత్తిలో రాష్ట్రవాటా 29.1%గా ఉంది. ఈ రంగం ద్వారా రాష్ట్రంలో 16.50 లక్షల మందికి జీవనోపాధి లభిస్తోంది. రాష్ట్ర సముద్ర ఉత్పత్తుల ఎగుమతుల విలువ రూ.19,420 కోట్లు. మొత్తం దేశంలో సముద్ర ఉత్పత్తుల ఎగుమతుల్లో రాష్ట్రం వాటా 32%. ఈ పరిస్థితుల్లో కేంద్రప్రభుత్వ మత్స్య అభివృద్ధి సంస్థలను ఇక్కడ ఏర్పాటుచేయడం అత్యవసరం' అని ఆ లేఖలో వివరించారు.

తానా సభలో 'నేను-నా అమరావతి' పుస్తకావిష్కరణ

- భావోద్వేగానికి గురైన రచయిత బాలకోటయ్య





సభలో పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కోమటి జయరాం, ఏబీ వెంకటేశ్వరరావు. చిత్రంలో బాలకోటయ్య తదితరులు ★ సభలో మాట్లాడుతున్న బాలకోటయ్య

ఈనాడు, అమరావతి: అమెరికాలోని డెట్రాయిట్‌లో జరుగుతున్న ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) 24వ మహాసభలో అమరావతి బహుజన ఐకాస అధ్యక్షుడు పోతుల బాలకోటయ్య రాసిన 'నేను- నా అమరావతి' పుస్తకాన్ని ఆవిష్కరించారు. తానా మాజీ అధ్యక్షుడు కోమటి జయరాం, విశ్రాంత ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు చేతుల మీదుగా శనివారం ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రచయిత బాలకోటయ్య భావోద్వేగానికి గురయ్యారు. "అమెరికాలోని తానా సభలో నేను రాసిన పుస్తకాన్ని ఆవిష్కరించడం ప్రజారాజధాని అమరావతి నాకు ఇచ్చిన గొప్ప వరం. నా జీవన ప్రయాణంలో నేను రాజధాని ఉద్యమంలో పాల్గొంటానని, అమరావతిపై రాసిన పుస్తకం అమెరికాలో ఆవిష్కరిస్తానని ఊహించలేదు. నా జన్మ ధన్యమైంది. వేల కి.మీ. ప్రయాణం చేసి మీ ముందుకు వచ్చాను. చరిత్ర లిఖించాల్సిన అవసరం ఉంది. లేకపోతే భావితరాలకు అమరావతి ఉద్యమ స్ఫూర్తి, భూములు ఇచ్చిన రైతుల గురించి తెలియదు. వారి త్యాగం నాలుగైదు మాటల్లో చెప్పేదికాదు. అదొక అద్భుతం' అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యలమంచిలి ప్రసాద్ (షికాగో), శ్యామ్ అరబింది (కాలిఫోర్నియా), అప్పసాని రాజేష్, మహాసేన రాజేష్, లక్ష్మి, బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

యుద్ధ నౌకల ఆగమనం.. నేవీ మరింత శక్తిమంతం

గత 7 నెలల్లో జలాంతర్గామి, కీలక నౌకల జల ప్రవేశం



ఈనాడు-విశాఖపట్నం, న్యూస్‌టుడే-సింధియా: అధునాతన యుద్ధ నౌకలు, జలాంతర్గామి ప్రవేశంతో భారత నౌకాదళం మరింత పటిష్ఠమైంది. రక్షణ వ్యవస్థను బలోపేతం చేసేలా గత ఏడు నెలల్లో పలు యుద్ధనౌకలను జాతికి అంకితం చేశారు. 'ఆత్మనిర్భర్ భారత్' స్ఫూర్తితో ఈ నౌకల్లో చాలా భాగాలు పూర్తిగా స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో, ఎంఎస్ఎంఈల భాగస్వామ్యంతో తయారు కావడం మరో విశేషం.

సంక్రాంతి రోజున వాగ్‌షీర్!

ఈ ఏడాది సంక్రాంతి రోజున అత్యాధునిక జలాంతర్గామి ఐఎన్ఎస్ వాగ్‌షీర్‌ను జాతికి అంకితం చేశారు. అదే రోజు ఐఎన్ఎస్ సూరత్, ఐఎన్ఎస్ నీలగిరి రక్షణ బాధ్యతలు స్వీకరించాయి. గత ఏడాది డిసెంబరులో ఐఎన్ఎస్ తుషీల్ యుద్ధ నౌకను రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ జాతికి అంకితం చేశారు. ఐఎన్ఎస్ అర్నాలా నౌకను జూన్‌లో విశాఖ నేవల్ డాక్‌యార్డులో కమిషనింగ్ చేశారు. భారత సముద్ర జలాల సరిహద్దులను అంచనా వేయడానికి రూపొందించిన ఐఎన్ఎస్ నిర్దేశక్ గత డిసెంబరు నుంచి సేవలందిస్తోంది. రష్యా సహకారంతో నిర్మించిన ఐఎన్ఎస్ తమాల్‌ను ఇటీవల జాతికి అంకితం చేశారు. భారత యుద్ధనౌకల్లో తలెత్తే సాంకేతిక లోపాలను సరిచేయడానికి డీఎస్‌వీ-ఐఎన్ఎస్ నిస్తార్‌ను విశాఖ హిందుస్థాన్ షిప్‌యార్డులో నిర్మించారు. దీనిని జులైలో కమిషనింగ్ చేయనున్నారు.









వెంకటేశ్వర్లు, పెంచలయ్యలను చదివిస్తాం

మంత్రి లోకేశ్ హామీ

ఈనాడు-అమరావతి, న్యూస్‌టుడే-నెల్లూరు(టౌన్): నెల్లూరులోని వీఆర్ హైస్కూల్‌లో తమను చేర్పించాలంటూ భిక్షాటన చేస్తున్న ఇద్దరు చిన్నారులు ఇటీవల నగరపాలక సంస్థ కమిషనర్‌ను కోరిన విషయంపై మంత్రి లోకేశ్ స్పందించారు. వారిని చదివించడానికి ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. "నెల్లూరులోని వీఆర్ హైస్కూల్ వద్ద పెంచలయ్య, వెంకటేశ్వర్లు అనే ఇద్దరు చిన్నారులు తమకు చదువు చెప్పించాలని కమిషనర్‌ను ప్రాధేయపడుతుండటం మీడియాలో వచ్చింది. అది నన్ను కదిలించింది. ఆ చిన్నారుల విద్యాభ్యాసానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాల్సిందిగా అధికారులను ఆదేశించా. పేదరికం నుంచి బయటకు తెచ్చే ఒకేఒక్క సాధనం విద్య. జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్న కసి, పట్టుదల ఉంటే ఎన్ని కష్టాలు ఎదురైనా లక్ష్యాన్ని చేరవచ్చు. నెల్లూరులోని ఈ చిన్నారుల కలలను సాకారం చేసుకునేందుకు అన్ని విధాలా అండగా నిలుస్తాం' అంటూ మంత్రి లోకేశ్ 'ఎక్స్'లో పేర్కొన్నారు.

పోతిరెడ్డిపాడు నుంచి సీమ జిల్లాలకు కృష్ణా జలాలు

నేటి నుంచి విడుదలకు చర్యలు

కర్నూలు జలమండలి, న్యూస్‌టుడే: రాయలసీమ జిల్లాలకు కృష్ణా జలాలను విడుదల చేసేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదివారం నుంచి పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా నీటి విడుదలకు జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ శనివారం అనుమతి ఇచ్చారు. నీటి విడుదల చేసేందుకు ప్రొటోకాల్ ప్రకారం ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలని కర్నూలు సీఈ కబీర్‌బాషాకు సూచించారు. పోతిరెడ్డిపాడు నుంచి విడుదల చేసే శ్రీశైలం వెనుక జలాలను తొలుత వెలుగోడు జలాశయానికి తరలిస్తారు. వారం తర్వాత ఎస్కేప్ ఛానల్, ఏఆర్‌బీసీ, జీఎన్ఎస్ఎస్ కాల్వల ద్వారా కుందూ నదితో పాటు గోరుకల్లు, అవుకు రిజర్వాయర్లకు తరలిస్తారు. గతేడాది జులై 27న నీరివ్వగా.. ఈ సారి 21 రోజుల ముందుగానే విడుదల చేస్తున్నట్లు పోతిరెడ్డిపాడు ఈఈ నాగేంద్రకుమార్ తెలిపారు.

వచ్చేస్తున్నాయ్... బుజ్జాయిల క్రెష్‌లు!

- మహిళా ఉద్యోగుల పని ప్రదేశాల్లో చిన్నారుల సంరక్షణ కేంద్రాలు
- తొలి విడతగా 216 చోట్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు



అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో చిన్నారుల సంరక్షణ కేంద్రం

ఈనాడు, అమరావతి: భార్యాభర్తలిద్దరూ ఉద్యోగాలు చేస్తున్న పరిస్థితుల్లో పిల్లల సంరక్షణ వారికి పెద్ద సవాలు. ఇది ముఖ్యంగా మహిళలకు సంబంధించి పని ఉత్పాదకతపై ప్రభావం చూపుతోంది. ఓ పక్క బిడ్డల ఆలనాపాలనా చూడటం, మరోపక్క ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించడం వారికి కష్టంగా మారుతోంది. మహిళా ఉద్యోగుల ఇబ్బందులను తొలగించేందుకు పని ప్రదేశాల్లో చిన్నారుల సంరక్షణ కేంద్రాల(క్రెష్‌లు) ఏర్పాటు చేస్తామని ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ఆ దిశగా మహిళా శిశు సంక్షేమ శాఖ తొలి అడుగు వేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగినులు అధికంగా ఉండే 216 ప్రాంతాలను గుర్తించింది. ఆయా చోట్ల క్రెష్‌లు ఏర్పాటుకు ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి నివేదించింది. కేంద్ర సహకారం కోసం మరో నివేదికను పంపింది.

వీలైనంత వరకూ ప్రభుత్వ భవనాల్లోనే...

పది మంది కంటే ఎక్కువ మహిళలు పనిచేస్తున్న చోట్ల క్రెష్‌ల ఏర్పాటుకు మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఆ ప్రకారం అన్ని విభాగాధిపతుల కార్యాలయాలు, జిల్లా కోర్టులు, కలెక్టరేట్‌లు, ప్రభుత్వ ఆసుపత్రులు, జిల్లా పంచాయతీ కార్యాలయాలు, మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయాలు, పురపాలక కార్యాలయాల వద్ద ఏర్పాటుకు ప్రతిపాదించింది. వీలైనంత వరకు ప్రభుత్వ భవనాల్లోనే సంరక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసేలా అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఇందుకు అమరావతిలోని సచివాలయంలో ఇప్పటికే ఏర్పాటుచేసిన క్రెష్‌ను ప్రాతిపదికగా తీసుకున్నారు. ఆరు నెలలు దాటిన పిల్లల సంరక్షణ బాధ్యతను క్రెష్‌లలో చూస్తారు. ఇందుకోసం కార్యకర్త, సహాయకురాలు ఉంటారు. ఈ కేంద్రాల్లో ఆట వస్తువులు, ఊయల, బరువు తూచే యంత్రం, బెడ్లు, రిఫ్రిజిరేటర్, మరుగుదొడ్లు, ఫర్నిచర్‌ను ఏర్పాటు చేస్తారు. తల్లిదండ్రులు తెచ్చిన ఆహారాన్నే బుజ్జాయిలకు అందించాలని నిర్ణయించారు.





స్వర్ణాల చెరువులో కోర్కెల రొట్టెలు పంచుకుంటున్న భక్తులు ★ విద్యుత్తు వెలుగుల మధ్య బారాషహీద్ దర్గా

నేటి నుంచి రొట్టెల పండగ

- 7న వేడుకకు మంత్రి లోకేశ్ హాజరు

ఈనాడు, నెల్లూరు: మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే రొట్టెల పండగ ఆదివారం ప్రారంభం కానుంది. నెల్లూరు నగరంలోని బారాషహీద్ దర్గాలో ఏటా నిర్వహించే సంప్రదాయ పండగకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. 5 రోజులపాటు నిర్వహించే వేడుకకు రెండు రోజుల ముందు నుంచే భక్తుల తాకిడి మొదలైంది. దర్గాను విద్యుత్తు దీపాలతో అలంకరించారు. ఈ ఏడాది సుమారు 15 లక్షల మంది భక్తులు రావొచ్చని అంచనా. 6న సొందల్‌మాలితో పండగ మొదలవుతుంది. 7న గంధం ఊరేగింపు, 8న రొట్టెల పండగ, 9న తహలీల్ ఫాతెహా, 10న ముగింపు ఉత్సవం నిర్వహిస్తారు. వివిధ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఆదివారం రాత్రి నెల్లూరుకు చేరుకోనున్న మంత్రి లోకేశ్.. సోమవారం సాయంత్రం బారాషహీద్ దర్గాను సందర్శించి, రొట్టెను అందుకోనున్నారు.

దేవుని గడపలో ఇ-హుండీ!



దేవుని గడపగా పేరొందిన కడప నగరంలోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఇ-హుండీ ఏర్పాటు చేశారు. ఆలయంలో ఏర్పాటు చేసిన డిజిటల్ తెరపైనున్న క్యూఆర్ కోడ్‌ను సెల్‌ఫోన్‌తో స్కాన్ చేసి, యూపీఐ ద్వారా విరాళం మొత్తం పే చేస్తే సరి. ఏటీఎం లాగా ఉండే మెషీన్ రసీదు కూడా ఇచ్చేస్తుంది. రూపాయి నుంచి రూ.లక్ష వరకు ఇలా విరాళం ఇవ్వచ్చు. శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయం తితిదేకు అనుబంధంగా ఉండటంతో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఈ యంత్ర సేవలను అందుబాటులోకి తెచ్చింది.

– ఈనాడు, కడప; న్యూస్‌టుడే, దేవుని కడప

మొక్కల ఖర్చు నాది.. సంరక్షించే బాధ్యత మీది: మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లిలో సొంత నిధులు రూ.30 లక్షల కేటాయింపు



ఆసుపత్రి ఆవరణలో మొక్క నాటి నీరు పోస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, కలెక్టర్ రాజకుమారి

బనగానపల్లి, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ ఓ మొక్క నాటి సంరక్షించే బాధ్యత తీసుకోవాలని రోడ్లు, భవనాలశాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి కోరారు. నంద్యాల జిల్లా బనగానపల్లి పట్టణంలో శనివారం భారీఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. పట్టణాన్ని పచ్చదనంతో ఆదర్శంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో మొదటి దశలో 5 వేల మొక్కలు తెప్పించినట్లు మంత్రి తెలిపారు. కుండీలు, ఇతర ఖర్చుల కోసం సొంత నిధులు రూ.30 లక్షలు వెచ్చించినట్లు పేర్కొన్నారు. మొక్కల పెంపకానికి అయ్యే ఖర్చు తమ కుటుంబం భరిస్తుందని, వాటిని సంరక్షించే బాధ్యత ప్రజలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కలెక్టర్ రాజకుమారి, తెదేపా నాయకులు బీసీ రామనాథరెడ్డి, బురానుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

7 నుంచి ముందుగా రిజర్వేషన్ ఛార్టులు

గుంటూరు రైల్వే, న్యూస్‌టుడే: రైలు బయల్దేరడానికి 8 గంటల ముందుగానే రిజర్వేషన్ ఛార్టును తయారుచేసే విధానం దక్షిణ మధ్య రైల్వే పరిధిలో ఈనెల 7 నుంచి అమల్లోకి రానుంది. ఇప్పటివరకు 4 గంటల ముందుగా మాత్రమే వెల్లడించేవారు. నూతన విధానంతో వెయిటింగ్ లిస్టులోని ప్రయాణికులు తమకు బెర్తులు ఖరారయ్యాయా? లేదా? అని ముందుగానే తెలుసుకునే అవకాశం ఉంది. మధ్యాహ్నం 2 గంటల్లోపు బయలుదేరే రైళ్ల ఛార్టులను ముందురోజు రాత్రి 9 గంటలకల్లా వెల్లడిస్తారు. దీనివల్ల బెర్తు దొరకనివారు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవడానికి సమయం దొరుకుతుంది. రైలు ప్రయాణాల్లో అనిశ్చితి తొలగించడానికి కేంద్రం తాజాగా ఈ నిర్ణయం తీసుకుంది.

16న శ్రీవారి ఆలయంలో ఆణివార ఆస్థానం


రెండ్రోజులు వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు

తిరుమల, న్యూస్‌టుడే: ఈ నెల 16న శ్రీవారి ఆలయంలో ఆణివార ఆస్థానం నిర్వహించనున్నారు. 15న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం చేపడతారు. ఈ కారణంగా 15, 16 తేదీల్లో వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు చేశామని తితిదే శనివారం ఓ ప్రకటనలో తెలిపింది. 14, 15 తేదీల్లో ప్రొటోకాల్ ప్రముఖులకు మినహా వీఐపీ బ్రేక్ దర్శనాలకు సిఫార్సు లేఖలు స్వీకరించమని పేర్కొంది.

నేలమ్మకు పునరుజ్జీవం.. బయోచార్!

భూముల్లో సేంద్రియ కర్బనాన్ని పెంచే బొగ్గు

పంట వ్యర్థాలతో తక్కువ ఖర్చుతో తయారీ



ఒకే రకమైన పంటలు సాగు.. వ్యర్థాలను పొలాల్లోనే కాల్చడం.. పరిమితికి మించి రసాయన ఎరువుల వాడకంతో తెలుగు రాష్ట్రాల్లోని భూముల్లో సేంద్రియ కర్బనం అడుగంటుతోంది. ఇదే కొనసాగితే భూములు సాగుకు పనికిరావు. దీనికి పరిష్కారంగా పంట వ్యర్థాలతో తయారుచేసే బయోచార్(జీవ బొగ్గు) నేలలో సేంద్రియ కర్బనాన్ని పెంచుతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అనంతపురం జిల్లాలోని రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానంలో జీవ బొగ్గు తయారీ, ఉపయోగాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

సాధారణంగా పంటలు పూర్తయ్యాక వ్యర్థాలను పొలాల్లోనే కాలుస్తుంటారు. ఫలితంగా వాయు కాలుష్యం పెరగడంతో పాటు మిత్ర పురుగులు, సూక్ష్మజీవులు నశిస్తున్నాయి. భూసారం క్షీణిస్తోంది. ఇది క్రమంగా నేలలో సేంద్రియ కర్బనం తగ్గడానికి కారణమవుతోంది. ఈ సమస్యను పంటల వ్యర్థాలతోనే పరిష్కరించుకోవచ్చు. పత్తి, కంది, మిరప, ఆముదం తదితర పంటల వ్యర్థాలను ప్రత్యేక పద్ధతిలో బొగ్గుగా మార్చి తక్కువ ఖర్చుతో నేలకు అధిక మొత్తంలో సేంద్రియ కర్బనాన్ని అందించవచ్చు.

తయారీ ఎలాగంటే...



- ఇనుప డ్రమ్ముకు కిందిభాగంలో రంధ్రాలు చేసుకోవాలి. పైభాగంలో మూతను తొలగించి నాలుగు కడ్డీలను అమర్చుకోవాలి.





- ఎండిన పంటల వ్యర్థాలను 20 నుంచి 25 సెం.మీ. ముక్కలుగా కత్తిరించి డ్రమ్ములో ఖాళీ లేకుండా నింపుకోవాలి. పైభాగంలో ఇనుప కడ్డీల మీద మూతను పెట్టి లోపలికి గాలి వెళ్లకుండా బంక మట్టితో అతికించుకోవాలి.
- డ్రమ్మును పొయ్యిపై ఉంచి మంటపెట్టాలి. డ్రమ్మును మూయడంతో ఆక్సిజన్ పరిమితంగా సరఫరా కావడం వల్ల వ్యర్థాలు నిదానంగా మండుతాయి.
- పైభాగంలో మూతకు అతికించిన బంక మట్టి నుంచి నీలం రంగు వాయువు బయటకు వచ్చేదాకా మండించాలి.



డ్రమ్ములో ఉష్ణోగ్రత 300-400 డిగ్రీలకు చేరుకుంటుంది. ఇందుకు 20-25 నిమిషాలు పడుతుంది. తర్వాత పొయ్యి ఆర్పేసి డ్రమ్మును నేలపై పెట్టాలి.



- డ్రమ్ములో ఉష్ణోగ్రత బయటకు పోకుండా కింది భాగంలోని రంధ్రాలను జాగ్రత్తగా బంకమట్టితో మూసేయాలి. ఈ దశలో ఆక్సిజన్ సరఫరా కాక పంట వ్యర్థాలు 'డైరెక్ట్ ఆఫ్ డ్రాఫ్ట్' సూత్రం ప్రకారం బొగ్గుగా మారతాయి.
- డ్రమ్మును 2 గంటల పాటు అలాగే వదిలేస్తే చల్లబడుతుంది. పైభాగంలో మూత తీసి బూడిద నుంచి బొగ్గును వేరుచేసి తీసుకోవాలి. దానిని పొడి చేసి పొలాల్లో చల్లుకోవాలి.



మరింత సారవంతంగా..

- నేలలో సేంద్రియ కర్బనం ఎక్కువ ఉంటే పంటలకు పోషకాలు విరివిగా అందుతాయి.
- నేల ఆరోగ్యంగా ఉండాలంటే కనీసం 0.7 శాతం సేంద్రియ కర్బనం అవసరం. ఐదు రాష్ట్రాలలోని భూముల్లో 30 ఏళ్ల కిందట 0.5 శాతం. ప్రస్తుతం 0.2 నుంచి 0.3 శాతం మధ్య ఉంది. అనంతపురంలో 0.1 శాతానికి పడిపోయింది.
- ఎర్రనేలల్లో ఆరు దఫాల్లో ఎకరాకు టన్ను, నల్లరేగడిలో అర టన్ను.. జీవ బొగ్గు పొడి చల్లుకోవాలి.
- బొగ్గు పొడి చల్లిన పొలాల్లో సేంద్రియ కర్బనం 0.5 శాతం పెరిగింది. ఏటా చల్లుకుంటే భూములు మరింత సారవంతమవుతాయి.

అవగాహన అవసరం

– డాక్టర్ కె.నటరాజ్, శాస్త్రవేత్త, రేకులకుంట వ్యవసాయ పరిశోధన స్థానం

పంట వ్యర్థాలను పూర్తిగా కాల్చి బూడిదగా మార్చకుండా నాణ్యమైన బొగ్గు వచ్చేలా చూసుకోవాలి. డ్రమ్ములో వేసిన పంట వ్యర్థాల బరువులో 25 నుంచి 30 శాతం బయోచార్ వస్తుంది. తయారీపై రైతులకు అవగాహన అవసరం. బొగ్గును పెద్దమొత్తంలో తయారు చేసి ఇతరులకు విక్రయించి ఆదాయాన్నీ పొందొచ్చు.

- ఈనాడు, అనంతపురం



క్యాథ్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ఎయిమ్స్ సంచాలకులు ఆచార్య అహంతేమ్ శాంతాసింగ్

ఎయిమ్స్‌లో అత్యాధునిక కార్డియాలజీ సేవలు ప్రారంభం

వారంలో ఐదు రోజులు గుండె సంబంధిత వ్యాధులకు ఓపీ

మంగళగిరి, న్యూస్‌టుడే: మంగళగిరి ఎయిమ్స్ వైద్యశాలలో కార్డియాలజీ సేవలను ఎయిమ్స్ సంచాలకులు ఆచార్య అహంతేమ్ శాంతాసింగ్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అత్యాధునిక ఇంటర్వెన్షనల్ ఇమేజింగ్ ప్లాట్‌ఫాం అయిన ఏడో తరం అజూరియన్ బైప్లేన్ క్యాథ్ ల్యాబ్ సిస్టం సేవలను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు వెల్లడించారు. దీనికోసం రూ.11 కోట్లు ఖర్చు చేశామన్నారు. గుండె సంబంధిత వ్యాధులకు వారంలో ఐదు రోజులు ఓపీ ఉంటుందని తెలిపారు. శస్త్రచికిత్సలకు బుధవారం ప్రత్యేక ఓపీ నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఇకపై కార్డియాక్, న్యూరో వాస్క్యులర్ చికిత్స కోసం రోగులు దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ ఏఆర్ నటరాజ్, వైద్యులు అమ్రిత గణేష్, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడిన 13 మంది విద్యార్థుల సస్పెన్షన్

ఎయిమ్స్ ప్రతినిధి వంశీకృష్ణ

మంగళగిరి, న్యూస్‌టుడే: మంగళగిరి ఎయిమ్స్ వైద్య కళాశాలలో ర్యాగింగ్‌కు పాల్పడిన 13 మంది విద్యార్థులను సస్పెండ్ చేశామని ప్రొటోకాల్ విభాగం ప్రతినిధి డాక్టర్ వంశీకృష్ణ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. 'కళాశాలలో గత నెల 22న ర్యాగింగ్ జరిగితే.. 23న మెయిల్ ద్వారా ఫిర్యాదు అందింది. 24న యాంటీ ర్యాగింగ్ కమిటీ సమావేశంలో ప్రాథమికంగా తీసుకున్న నిర్ణయం మేరకు తొలుత 15 మంది విద్యార్థులను సస్పెండ్ చేశాం. పూర్తిస్థాయి విచారణ తర్వాత ఈ ఘటనతో ఇద్దరికి సంబంధం లేదని గుర్తించాం. 13 మందిలో ఆరుగురిని ఏడాది పాటు, మరో ముగ్గురిని ఏడాదిన్నర, నలుగురిని ఆరు నెలల పాటు సస్పెండ్ చేసి, రూ.25 వేల చొప్పున జరిమానా విధించాం' అని వంశీకృష్ణ వెల్లడించారు.



బలహీనమైన వ్యక్తిత్వానికి 5 సంకేతాలు

1. ఇతరుల మెప్పు కోసం ప్రయత్నిస్తూ అభిప్రాయాలను మార్చుకోవడం.
2. ఇతరులతో పోల్చుకోవడం.
3. బాధ్యతల నుంచి పారిపోతూ అందమైన భవిష్యత్తు గురించి కలలు కనడం.
4. స్వీయ సందేహాలతో ఆత్మన్యూనతకు లోనుకావడం.
5. సౌకర్యవంతమైన పరిస్థితులకు అలవాటు పడి సవాళ్లను స్వీకరించకపోవడం.

– రోబ్ డాన్స్, ఆంత్రప్రెన్యూర్


సమగ్ర ప్రగతి పత్రాల్లో..

విద్యార్థులు, తల్లిదండ్రుల అభిప్రాయాలకు స్థానం

మార్కులతోపాటు పిల్లల లక్ష్యాలకు కూడా..

విద్యార్థి పూర్తి సమాచారం అందించేలా సమగ్ర ప్రగతి పత్రాల రూపకల్పన

ఈనాడు, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పాఠశాల విద్యాశాఖ విద్యార్థి సమగ్ర ప్రగతి పత్రం (హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డు)లను అందించనుంది. ప్రాథమిక, సెకండరీ స్థాయి విద్యార్థులకు విడివిడిగా రూపొందించింది. ఈ నెల 10న జరగనున్న తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మెగా సమావేశం సందర్భంగా వీటిని అందించనున్నారు. విద్యార్థులకు సంబంధించి ఆరోగ్యం, అకడమిక్, లక్ష్యాలు, నైపుణ్యాలను సమగ్రంగా



ఇందులో పొందుపర్చనున్నారు. తల్లిదండ్రుల అభిప్రాయాలు తీసుకోనున్నారు. మొత్తం ఎనిమిది పేజీలుగా సమగ్ర ప్రగతి పత్రాన్ని రూపొందించారు.

అభిరుచులు, ఆసక్తుల నమోదు..

- సెకండరీ తరగతుల విద్యార్థులకు ఇచ్చే కార్డుల్లో విద్యార్థి అభిరుచులు, విద్యాపరమైన సామర్థ్యాలు, ఉద్యోగపరమైన ఆశయాలను ప్రతి ఆరు నెలలకు ఒకసారి నమోదు చేస్తారు.
- విద్యార్థుల ఎదుర్కొంటున్న సవాళ్లు, దానికి కావాల్సిన సహకారాన్ని పేర్కొంటారు. విద్యాపరమైన, వ్యక్తిగత సవాళ్లు, వాటి పరిష్కారానికి అవసరమయ్యే సహకారాన్ని ఉపాధ్యాయులు కార్డులో నమోదు చేస్తారు.
- సహ పాఠ్యాంశాలుగా విలువలు, జీవన నైపుణ్యాలు, కళలు, కంప్యూటర్, వృత్తి విద్య, ఆటలు, యోగాలో విద్యార్థి ప్రతిభ ఆధారంగా మార్కులు ఇస్తారు. మొత్తం 50 మార్కులకు ఇవి ఉంటాయి.
- సంవత్సరం ముగింపులో ఉపాధ్యాయుడి అభిప్రాయం నమోదు చేస్తారు. విద్యార్థి నేర్చుకునే స్థాయిలో ఉన్నాడు, ప్రావీణ్యం కలవాడు, అడ్వాన్స్‌డ్ కేటగిరీలను నిర్ధరిస్తారు.

1. ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఇచ్చే కార్డులో 'నేను, నా పరిసరాలు' అనే విభాగంలో విద్యార్థి, కుటుంబం ఫొటో, పుట్టిన రోజు, అతడి స్నేహితుల పేర్లు, నివాస ప్రాంతం వివరాలు ఉంటాయి. గత విద్యా సంవత్సరంలో తెలుగు, ఆంగ్లం, గణితం, ఈవీఎస్ సబ్జెక్టుల్లో వచ్చిన మార్కుల గ్రేడ్‌లను పొందుపరుస్తారు. విద్యార్థికి తల్లికి వందనం వచ్చిందా? ఎంతమందికి ఇచ్చారు? తదితర వివరాలను పేర్కొంటున్నారు.
2. ఆరోగ్యానికి సంబంధించి రక్తం గ్రూపు, ఎత్తు, బరువును నమోదు చేస్తారు. శారీరక అభివృద్ధి, సామాజిక భావోద్వేగం, మేధస్సు, భాషాభివృద్ధి, కళాత్మక అభివృద్ధిని ఏడాదికి రెండు పర్యాయాలు నమోదు చేస్తారు.
3. విద్యార్థి స్వల్పకాలిక లక్ష్యాలు, దీర్ఘకాలిక లక్ష్యాలు, లక్ష్య సాధనకు విద్యార్థి కార్యాచరణ ప్రణాళిక వివరాలను కార్డులో రాస్తారు. ఇంట్లో ఉండే వస్తువుల్లో పుస్తకాలు, వార్త పత్రికలు, సెల్‌ఫోన్ వంటి వివరాలు నమోదు చేస్తారు.
4. విద్యార్థి రాసేందుకు మూడు ప్రశ్నలు ఇచ్చారు. విద్యాపరమైన పని చేయడం నచ్చుతుంది, అర్థం కాకపోతే సహాయం అడుగుతాను. ఇలాంటి వాటికి అవును లేదా కాదు అని టిక్ చేయాల్సి ఉంటుంది.
5. పాఠ్యాంశాలకు సంబంధిత అంశాల్లో విద్యార్థి అవగాహన, స్పందించే తత్వం, సృజనాత్మక పరిస్థితిని ఏడాదికి రెండు పర్యాయాలు నమోదు చేస్తారు.
6. తల్లిదండ్రుల అభిప్రాయాన్ని చెప్పేందుకు మూడు ప్రశ్నలు ఉన్నాయి. పాఠశాల, తరగతి గదులు, స్నేహపూర్వక, సురక్షిత ప్రదేశంగా అనిపిస్తున్నాయా? తరగతి స్థాయికి అనుగుణంగా విద్యార్థి మంచి పురోగతి సాధిస్తున్నాడా? ఇలాంటి వాటికి తల్లిదండ్రులు సమాధానాలు రాయాల్సి ఉంటుంది. ఇంటి వద్ద పిల్లలకు ఏ సబ్జెక్టులో సహాయం చేస్తారో తల్లిదండ్రులు నమోదు చేసేలా దీన్ని రూపొందించారు.

మీ హృ'దయ' స్పందన.. చిన్నారి ప్రాణానికి రక్షణ!

మూత్రపిండాల సమస్యతో బాధపడుతున్న పదేళ్ల బాలుడు



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విజయ్

పాతపట్నం, న్యూస్‌టుడే: ఆ బాలుడు తొమ్మిదేళ్లుగా కిడ్నీ సమస్యతో బాధపడుతున్నాడు. ప్రాణాలతో పోరాడుతున్న తమ కుమారుడికి ఖరీదైన చికిత్స చేయించే స్తోమత లేదని.. దాతలు స్పందించి ఆదుకోవాలని ఆ బాలుడి తల్లిదండ్రులు వేడుకుంటున్నారు. శ్రీకాకుళం జిల్లా పాతపట్నానికి చెందిన పోతల సోమేష్, హిమబిందు దంపతులకు కుమార్తె యామిని, కుమారుడు విజయ్ సంతానం. విజయ్‌కు ప్రస్తుతం పదేళ్ల వయసు. పుట్టిన తొమ్మిది మాసాలకే మూత్రవిసర్జన కాక ఆసుపత్రిలో చేర్పించగా, మూత్రపిండాల్లో సమస్య ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఆసుపత్రుల్లో పరీక్షలు చేయించగా.. మూత్రపిండాలకు అనుసంధానంగా ఉండే బ్లాడర్ నుంచి మూత్రం కొంత బయటకు వచ్చి, కొంత మళ్లీ మూత్రపిండాలకు చేరుకుంటోందని తేల్చారు. దీనివల్ల మూత్రపిండాలు చాలావరకు దెబ్బతిన్నాయి. బ్లాడర్ సైతం బలహీనపడింది. కొన్నేళ్లుగా మూత్రాన్ని ఫీడింగ్ ట్యూబ్ ద్వారా బయటకు తీస్తున్నారు. ఈ సమస్యతో కాళ్లు వంగిపోయాయి. ఐదో తరగతి వరకు చదువుకున్న బాలుడు అనారోగ్యం కారణంగా ఇంట్లోనే ఉంటున్నాడు. వెంటనే మూత్రపిండాల మార్పిడి, బ్లాడర్‌కు చికిత్స అందించకపోతే ప్రాణాపాయమని హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రి వైద్యులు తెలిపినట్లు తల్లిదండ్రులు చెప్పారు. విజయ్ తండ్రి సోమేష్ కిడ్నీ సరిపోతుందని వైద్యులు నిర్ధారించినా.. మూత్రపిండం మార్పిడి కంటే ముందు బ్లాడర్‌కు చికిత్స చేయాలని వైద్యులు తెలిపారు. కారు డ్రైవరైన సోమేష్ ఇప్పటివరకు సుమారు రూ.20 లక్షల వరకు ఖర్చు పెట్టినట్లు వెల్లడించారు. మూత్రాశయ బ్లాడర్ చికిత్సకు రూ.4 లక్షలు, మూత్రపిండాల మార్పిడికి రూ.10 లక్షలు, ఇతర వైద్య ఖర్చుల నిమిత్తం మరో రూ.4 లక్షల వరకు ఖర్చవుతుందని చెబుతున్నారు. దాతలు స్పందించి ఆపన్నహస్తం అందించాలని తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.

● సంప్రదించాల్సిన మొబైల్ నంబరు: 73307 10414

రిమాండ్ విషయంలో 'అర్నేష్ కుమార్' కేసు మార్గదర్శకాలను పాటించండి

- 'సోషల్ మీడియా' కేసులకు సంబంధించి జ్యుడిషియల్ మేజిస్ట్రేట్లకు హైకోర్టు ఆదేశం
- తమ సూచనలను ఉల్లంఘిస్తే తీవ్రంగా పరిగణిస్తామని వెల్లడి



ఈనాడు, అమరావతి: సామాజిక మాధ్యమాల్లో పోస్టులు/వ్యాఖ్యలు చేసిన వ్యవహారానికి సంబంధించిన కేసుల్లో నిందితులకు రిమాండ్ విధించే ముందు 'అర్నేష్‌కుమార్ వర్సెస్ స్టేట్ ఆఫ్ బిహార్' కేసులో సుప్రీం కోర్టు ఇచ్చిన మార్గదర్శకాలకు కట్టుబడి ఉండాలని రాష్ట్రంలోని జ్యుడిషియల్ మేజిస్ట్రేట్లను హైకోర్టు ఆదేశించింది. హైకోర్టు రిజిస్ట్రార్ (జ్యుడిషియల్)ఎస్.కమలాకరరెడ్డి శనివారం ఈ మేరకు సర్క్యులర్ జారీచేశారు. సోషల్ మీడియాలో పోస్టింగ్‌ల కేసుల్లో అర్నేష్ కుమార్ కేసు తీర్పులోని మార్గదర్శకాలను పాటించకుండా ఎక్కువ మంది జ్యుడిషియల్ మేజిస్ట్రేట్‌లు నిందితులకు రిమాండ్ విధిస్తున్నట్లు హైకోర్టు దృష్టికి వచ్చిందన్నారు. స్వేచ్ఛగా అభిప్రాయాలను వ్యక్తంచేయకుండా అణచివేసే విషయంలో 'క్రిమినల్ లా'ను దుర్వినియోగం చేయకుండా ఉండేందుకు ఈ ఏడాది మార్చి 28న 'ఇమ్రాన్ ప్రతాప్ గాధి వర్సెస్ స్టేట్ ఆఫ్ గుజరాత్' కేసులో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని గుర్తుచేశారు. ప్రసంగం, రచన, కళాత్మక వ్యక్తీకరణలకు సంబంధించిన (3-7 ఏళ్లలోపు శిక్షకు వీలున్నవి) వ్యవహారాలపై కేసు నమోదుకు ముందు పోలీసులు బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 173(3) ప్రకారం ప్రాథమిక విచారణ జరపాలని పేర్కొన్నారు. ఆ విచారణకు డీఎస్పీ ఆమోదం తప్పనిసరి అని, దానిని 14 రోజుల్లో పూర్తి చేయాల్సి ఉందన్నారు. ఈ నేపథ్యంలో సోషల్ మీడియాలో పోస్టింగ్‌లకు సంబంధించిన కేసుల్లో నిందితులకు రిమాండ్ విధించే ముందు.. అర్నేష్ కుమార్, ఇమ్రాన్ ప్రతాప్ గాధి కేసుల్లోని మార్గదర్శకాలకు దర్యాప్తు అధికారి(ఐఓ) కట్టుబడి వ్యవహరించారా? లేదా? పరిశీలించాలని పేర్కొన్నారు. నిందితుడు ఇదే తరహా నేరాన్ని పునరావృతం చేసే అవకాశం ఉందా, బహుళ నేరాలకు పాల్పడి ఉన్నారా, రిమాండ్‌కు పంపకపోతే సాక్షులను ప్రభావితం చేసే అవకాశం ఉందా, సాక్ష్యాలను తారుమారు చేస్తాడా, నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించాల్సిన అవసరం ఉందా తదితర వివరాలపై సంతృప్తి చెందాకే రిమాండ్‌కు పంపే విషయంలో మెజిస్ట్రేట్లు నిర్ణయం తీసుకోవాలన్నారు. తాము జారీచేసిన సర్క్యులర్‌లోని సూచనలను అందరు జ్యుడిషియల్ మెజిస్ట్రేట్లు తు.చ తప్పకుండా పాటించాలని స్పష్టంచేశారు. ఈ సూచనలను అతిక్రమిస్తే/ఉల్లంఘిస్తే తీవ్రంగా పరిగణిస్తామన్నారు. సర్క్యులర్‌ను ఉల్లంఘించిన మెజిస్ట్రేట్లు హైకోర్టులో కోర్టుధిక్కరణకు బాధ్యులవుతారని, దీంతోపాటు శాఖాపరమైన విచారణ ఎదుర్కోవాల్సి ఉంటుందని తెలిపారు.



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి నారాయణ తదితరులు

వైద్య సదస్సులతో మెరుగైన చికిత్సలకు అవకాశం

మంత్రి నారాయణ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే: వైద్య సదస్సులు, ఈ రంగంలో వచ్చిన నూతన ఆవిష్కరణలు, కొత్త ఔషధాలు, రోగనిర్ధారణలో నవీన విధానాలతో రోగులకు మరింత మెరుగైన చికిత్సలు అందించవచ్చని మంత్రి నారాయణ పేర్కొన్నారు. నెల్లూరు రూరల్ నారాయణ మెడికల్ కళాశాలలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి 32వ ఏపీ న్యూరో కాన్ సదస్సులో రెండోరోజైన శనివారం ఆయన పాల్గొని మాట్లాడారు. వివిధ ప్రాంతాలకు చెందిన ప్రఖ్యాత న్యూరాలజిస్టులు, న్యూరో సర్జన్లు వివరించిన మెలకువలు యువ వైద్యులకు ఉపయుక్తంగా ఉంటాయని చెప్పారు. మంత్రి కుమార్తె, కళాశాల డైరెక్టర్ షరిణి మాట్లాడుతూ.. వినూత్న వైద్య విధానాల గురించి చర్చించుకోవడం ద్వారా విజ్ఞానాన్ని మరింతగా పెంపొందించుకోవచ్చని తెలిపారు. సదస్సుకు లండన్‌లోని కింగ్స్ కళాశాల వైద్యులు, నెల్లూరుకు చెందిన మెట్టా వినోద్‌కుమార్, ఆంధ్రప్రదేశ్ న్యూరో సైన్సెస్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ, అపోలో హాస్పిటల్ న్యూరాలజిస్ట్ డాక్టర్ ఏవీ రమణమూర్తి, నెల్లూరు న్యూరో క్లబ్ ప్రెసిడెంట్ డాక్టర్ పీఎస్.రెడ్డి, సదస్సు నిర్వాహక కార్యదర్శి సంపత్‌కుమార్ తదితరులు హాజరయ్యారు.

లోక్ అదాలత్‌లకు భారీ స్పందన

రాష్ట్రవ్యాప్తంగా 78,168 కేసుల పరిష్కారం



ఏపీ హైకోర్టులో శనివారం లోక్ అదాలత్ సందర్భంగా ఏపీ న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి హిమబిందు, హైకోర్టులో నిర్వహించిన లోక్ అదాలత్ బెంచ్‌లో సభ్యురాలు కె.అరుణ, జస్టిస్ కుంచం మహేశ్వరరావు, జస్టిస్ రవినాథ్ తిల్హరీ, జస్టిస్ ఆర్.రఘునందన్‌రావు, జస్టిస్ వై.లక్ష్మణరావు, లోక్ అదాలత్ బెంచ్‌లో సభ్యుడు దూదేకుల ఖాసిం సాహెబ్, న్యాయసేవాధికార సంస్థ ఉప కార్యదర్శి అమర రంగేశ్వరరావు

ఈనాడు, అమరావతి: జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన లోక్ అదాలత్‌లకు భారీ స్పందన లభించింది. శనివారం ఒక్క రోజే 78,168కి పైగా కేసులు పరిష్కారమయ్యాయి. రూ.65 కోట్ల పరిహారం చెల్లింపునకు అవార్డులు జారీచేశారు. జాతీయ న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, ఏపీ న్యాయసేవాధికార సంస్థ కార్యనిర్వాహక అధ్యక్షుడు జస్టిస్ రవినాథ్ తిల్హరీ, హైకోర్టు న్యాయసేవల కమిటీ అధ్యక్షులు జస్టిస్ ఆర్.రఘునందన్‌రావు మార్గదర్శకాల్లో రాష్ట్రంలోని దిగువ న్యాయస్థానాల్లో శనివారం 411 లోక్ అదాలత్ బెంచ్‌లు నిర్వహించారు. రాజీకి అవకాశమున్న పలు కేసులను ఇరువర్గాల మధ్య సామరస్య పూర్వకంగా పరిష్కరించారు.

■ హైకోర్టు ప్రాంగణంలో ఏపీ హైకోర్టు న్యాయసేవల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన లోక్ అదాలత్‌లో జస్టిస్ కుంచం మహేశ్వరరావు, జస్టిస్ వై.లక్ష్మణరావు పాల్గొన్నారు. 135 కేసులను పరిష్కరించారు. రూ.3.85 కోట్ల పరిహారం అందజేసేందుకు అవార్డులు జారీచేశారు. లోక్ అదాలత్ విజయవంతం కావడానికి సహకరించినవారికి ఏపీ న్యాయసేవాధికార సంస్థ సభ్య కార్యదర్శి బీఎస్‌వీ హిమబిందు కృతజ్ఞతలు తెలిపారు.

నాన్న అడుగు జాడల్లో నేను

- భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ వ్యాఖ్య

విశాఖపట్నం (అక్కయ్యపాలెం), న్యూస్‌టుడే: "మా నాన్న ప్రజల అభిమానధనుడిగా కీర్తి సంపాదించారు. ఈ రోజు చలపతిరావు అబ్బాయిగా ప్రజల ఆత్మీయ అభిమానాన్ని నింపుకొన్నాను" అని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్.మాధవ్ పేర్కొన్నారు. భాజపా రాష్ట్ర అధ్యక్షుడిగా మాధవ్ బాధ్యతలు చేపట్టడంతో విశాఖలోని పోర్టు కళావాణి ఆడిటోరియంలో భాజపా విశాఖ జిల్లా అధ్యక్షుడు పరశురామరాజు ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం ఆత్మీయ అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాధవ్ మాట్లాడుతూ.. అధ్యక్ష బాధ్యతను సక్రమంగా నిర్వర్తించేందుకు కృషి చేస్తానని, నాయకులు, కార్యకర్తలతో కలసి పార్టీని బలోపేతం చేస్తానని తెలిపారు. భాజపాలోని ముఖ్య నాయకులంతా సామాన్య కుటుంబాల నుంచి వచ్చిన వారేనని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్‌తో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీతో పాటు పరిశ్రమల ఏర్పాటుకు కావాల్సిన అనేక మౌలిక సదుపాయాలను కల్పించారన్నారు. దేశంలో ఎక్కడికెళ్లినా ముందుగా అక్కడివారు 'హౌ ఈజ్ యువర్ చంద్రబాబునాయుడు' అని అడుగుతుంటారన్నారు. తమిళనాడులో నిర్వహించిన మురుగన్ భక్తుల మహానాడులో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ మాట్లాడిన మాటలకు ముగ్ధుడినయ్యానన్నారు. తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, విశాఖ, అనకాపల్లి, విజయనగరం ఎంపీలు ఎం.శ్రీభరత్, సి.ఎం.రమేశ్, కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు పి.గణబాబు, వెలగపూడి రామకృష్ణబాబు, బండారు సత్యనారాయణమూర్తి, వంశీకృష్ణ శ్రీనివాస్, పంచకర్ల రమేశ్‌బాబు, సుందరపు విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌ను సత్కరిస్తున్న తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎంపీలు శ్రీభరత్, సీఎం రమేశ్ తదితరులు

ఆసుపత్రి భవన నిర్మాణానికి రూ.కోటి సాయం

- ముందుకొచ్చిన పరమేశు బయోటెక్

రాజమహేంద్రవరం(కలెక్టరేట్), గోపాలపురం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోన్న పీ4 కార్యక్రమానికి పలువురు దాతలు స్పందిస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం నియోజకవర్గ పరిధిలోని దేవరపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం శిథిలావస్థకు చేరింది. ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు సూచన మేరకు ఈ ఆసుపత్రికి కొత్త భవనం నిర్మాణానికి పరమేశు బయోటెక్ లిమిటెడ్ యాజమాన్యం ముందుకొచ్చింది. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) కింద ప్రస్తుతం ఉన్న పాత బిల్డింగ్ పక్కన నూతన భవనం నిర్మాణానికి రూ.కోటి ఇచ్చేందుకు యాజమాన్యం అంగీకరించింది. పరిపాలన అనుమతుల నిమిత్తం ఎమ్మెల్యే, పరమేశు బయోటెక్ ఎండీ ఆనంద్ స్వరూప్ అద్వానీ శనివారం కలెక్టర్ ప్రశాంతిని కలిశారు. ఆసుపత్రి నిర్మాణానికి సంబంధించిన అంగీకారపత్రం ఆమెకు అందించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు అనుమతులు త్వరలో మంజూరు చేస్తామని ఆమె తెలిపారు.



కలెక్టర్ ప్రశాంతికి అంగీకారపత్రం అందజేస్తున్న ఆనంద్ స్వరూప్, పక్కన ఎమ్మెల్యే మద్దిపాటి

13 నుంచి ఈఏపీసెట్ వెబ్ ఆప్షన్ల నమోదు

ఈనాడు, అమరావతి: ఇంజినీరింగ్, ఫార్మసీ కళాశాలల ఎంపికకు నిర్వహించే ఈఏపీసెట్ వెబ్ ఆప్షన్ల నమోదును ఈ నెల 13 నుంచి 18 వరకు నిర్వహించనున్నారు. మొదట ప్రకటించిన షెడ్యూల్ మేరకు వెబ్ కౌన్సెలింగ్ నమోదు ఈ నెల 10న జరగాల్సి ఉండగా దాన్ని 13కు మార్చారు. ప్రవేశాల ప్రకటనను శనివారానికి బదులు ఆదివారానికి మార్చారు. ఇంజినీరింగ్ కళాశాలలకు విశ్వవిద్యాలయాల అనుబంధ గుర్తింపు, ప్రభుత్వం అనుమతులు రావాడానికి కొంత సమయం పడుతుందనే ఉద్దేశంతో వెబ్ ఐచ్ఛికాల నమోదు షెడ్యూల్‌ను మార్చారు.

విశాఖలో మాదకద్రవ్యాల కలకలం

రూ.3.60 లక్షల విలువైన కొకైన్ స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న కొకైన్ ప్యాకెట్లు, నగదు, సెల్‌ఫోన్లు, పాస్‌పోర్ట్

విశాఖపట్నం(జగదాంబకూడలి), న్యూస్‌టుడే: విశాఖపట్నంలో కొకైన్ తరలిస్తూ ఇద్దరు నిందితులు మూడో పట్టణ పోలీసులకు పట్టుబడ్డారు. స్థానిక సీతమ్మధార ప్రాంతానికి చెందిన అక్షయ్‌కుమార్‌కు అందజేసేందుకు దక్షిణాఫ్రికాకు చెందిన థామస్ 25 గ్రాముల కొకైన్ తీసుకొచ్చాడు. వారిద్దరూ శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత 2 గంటల సమయంలో ఆంధ్ర యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల రోడ్డులో ఉన్నట్లు మూడో పట్టణ పోలీసులకు సమాచారం అందింది. సీఐ పైడియ్య, ఎస్ఐ సురేష్‌కుమార్ తమ సిబ్బందితో అక్కడకు చేరుకుని ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. నిందితుల దగ్గర నుంచి రూ.3.60 లక్షల విలువైన కొకైన్‌ను స్వాధీనం చేసుకున్నారు. అక్షయ్‌కుమార్‌తో పాటు, అతడి స్నేహితులు రఘు, కృష్ణచైతన్య, గౌతం కలిసి కొకైన్ సేవించాలనే ఉద్దేశంతో దిల్లీకి చెందిన ప్రిన్సీ అనే వ్యక్తి ద్వారా ఆర్డర్ చేసినట్టు విచారణలో వెల్లడైందని విశాఖ నగర పోలీసు కమిషనర్ శంఖబ్రతబాగ్చీ తెలిపారు. నిందితుల వద్ద కొకైన్‌తో పాటు, కారు, రూ.3.60 లక్షల నగదు, 3 సెల్‌ఫోన్లు, ఓ డైరీని స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

EENADU Vol: 51, Issue: 327 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

ఇంకో 30-40 ఏళ్లు బతకాలనుంది

సామూహిక ప్రార్థన కార్యక్రమంలో దలైలామా



ధర్మశాలలో దలైలామా ఆశీస్సులు తీసుకుంటున్న కేంద్రమంత్రి కిరణ్ రిజిజు

ధర్మశాల: తన వారసత్వం కొనసాగుతుందని ప్రకటించిన తర్వాత నుంచి వస్తున్న వదంతులకు టిబెటన్ల ఆధ్యాత్మిక గురువు దలైలామా తెరదించారు. తాను ఇంకా 30-40 ఏళ్లు బతకాలనుకుంటున్నానని తెలిపారు. హిమాచల్ ప్రదేశ్‌లోని ధర్మశాలలో ఆదివారం దలైలామా 90వ పుట్టిన రోజు వేడుకలు అట్టహాసంగా జరగనున్నాయి. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని సుగ్లాంగ్‌ఖాన్ మందిరంలో శనివారం సామూహిక ప్రార్థనలు జరిగాయి. ఆ సమయంలో దలైలామా మాట్లాడుతూ..."అవలోకితేశ్వరుని ఆశీస్సులు నాపై ఉన్నాయని కచ్చితమైన సంకేతాలు కనిపిస్తున్నాయి. ఇప్పటివరకు నా వంతు కృషి చేశాను. మరో 30-40 ఏళ్లు జీవించాలని ఆశిస్తున్నాను. మీ ప్రార్థనలు ఫలించాయి. ఇప్పటివరకు బౌద్ధ ధర్మానికి, టిబెట్ ప్రజలకు సేవలు చేయగలిగాను. 130 సంవత్సరాల వరకు జీవించాలని ఉంది" అని పేర్కొన్నారు. తన వారసత్వం కొనసాగుతుందని, వారసుడిని గాడెన్ ఫోడ్రాంగ్ ట్రస్టు మాత్రమే ఎంపిక చేస్తుందని తాజాగా దలైలామా ప్రకటించిన విషయం తెలిసిందే. ఆయన ఆరోగ్యం క్షీణించిందని, త్వరలోనే వారసుడిని ఎంపిక చేసే అవకాశం ఉందని వదంతులు పుట్టుకొస్తున్నాయి. వీటిపైనే తాజాగా దలైలామా స్పందించారు.

గుజరాత్‌లో దేశ తొలి సహకార వర్సిటీ

- శంకుస్థాపన చేసిన అమిత్ షా



ఆణంద్ జిల్లాలో జరిగిన సభలో మాట్లాడుతున్న కేంద్ర హోం, సహకార శాఖల మంత్రి అమిత్ షా

ఆణంద్: దేశంలో మొట్టమొదటి సహకార రంగ విశ్వవిద్యాలయానికి కేంద్ర హోం, సహకార శాఖల మంత్రి అమిత్ షా గుజరాత్‌లోని ఆణంద్ జిల్లాలో శనివారం శంకుస్థాపన చేశారు. దేశ సహకార ఉద్యమ ఆద్యుల్లో ఒకరు, అమూల్ సహకార సంఘ వ్యవస్థాపకుల్లో ఒకరైన త్రిభువన్ కిషిభాయ్ పటేల్ పేరుతో ఈ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఇక్కడి జల, భూ నిర్వహణ సంస్థ ప్రాంగణ పరిసరాల్లో ఈ విశ్వవిద్యాలయాన్ని 125 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్నారు. త్రిభువన్ సహకారి విశ్వవిద్యాలయం(టీఎస్‌యూ) అనే పేరుతో ఏర్పాటుచేస్తున్న ఈ విద్యా సంస్థ నిర్మాణం కోసం రూ.500 కోట్లు వ్యయం చేయనున్నారు. సహకార రంగంలో బంధుప్రీతిని ఈ విశ్వ విద్యాలయం నివారిస్తుందని ఈ సందర్భంగా అమిత్ షా అన్నారు. గతంలో సహకార రంగ ఉద్యోగాల్లో నియామకం జరిగిన తర్వాతే శిక్షణ ఇచ్చేవారని, ఈ విశ్వ విద్యాలయ ఆవిర్భావం తర్వాత కేవలం శిక్షణ పొందిన అభ్యర్థులకే ఉద్యోగాలుంటాయని ఆయన చెప్పారు. త్రిభువన్ సహకారి విశ్వ విద్యాలయం సహకార రంగ అవసరాలను పూర్తిచేసే నైపుణ్యాలు అందించడానికి శిక్షణ ఇస్తుందని ప్రభుత్వం ఒక ప్రకటనలో పేర్కొంది. గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర భాయ్ పటేల్, కేంద్ర సహకార శాఖ సహాయ మంత్రులు కిషన్ పాల్ గుర్జర్, మురళీధర్ మొహోల్‌లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మోదీ, యోగి మామిడిపండ్లకు భలే గిరాకీ!



ఈటీవీ భారత్: మోదీ, యోగి, అమిత్ షా, రాజ్‌నాథ్, ములాయం, అఖిలేశ్.. దేశ రాజకీయరంగంలో ప్రముఖులైన వీరి పేర్లను యూపీ రైతులు మామిడిపండ్లకు పెడుతున్నారు. రంగు, రుచి, సువాసన, సైజు.. ఇలా ప్రతీ అంశంలో భిన్నంగా ఉండే తీరొక్క రకాల మామిడిపండ్లు ఇప్పుడు లఖ్‌నవూలో జరుగుతున్న మూడు రోజుల మ్యాంగో ఫెస్టివల్‌లో సందడి చేస్తున్నాయి. శుక్రవారం మొదలైన ఈ ప్రదర్శనకు దాదాపు వెయ్యి రకాల మామిడిపండ్లను రైతులు తీసుకువచ్చారు. వీటిలో ప్రధానంగా మోదీ, యోగి రకాల మామిడిపండ్ల గురించే సందర్శకుల్లో చర్చ జరుగుతోంది. పొడవుగా, సగటున 500 గ్రాముల బరువు ఉన్న 'మోదీ' మామిడిపండ్ల సృష్టికర్త బాగ్వాన్ ఉపేంద్రకుమార్. వీటి రుచి, వాసన గొప్పగా ఉన్నాయి. యోగి రకం మామిడిని యూపీలోని మలిహాబాద్‌కు చెందిన మ్యాంగోమ్యాన్, పద్మశ్రీ అవార్డు గ్రహీత హాజీ కలీముల్లాఖాన్ సాగు చేశారు. ఒక్కో పండు కిలో బరువుతో గుజ్జు మృదువుగా.. రుచి అద్భుతంగా ఉంది. ఈ మామిడి వంగడం విత్తనం చాలా చిన్న పరిమాణంలో ఉంటుంది. మామిడి సాగులో వైవిధ్యాన్ని చాటుకున్నందుకు హాజీ కలీముల్లాఖాన్‌కు 2008లో పద్మశ్రీ పురస్కారం లభించింది.

స్టడీ వీసా...

విద్యార్థుల జీవన వ్యయం పెంచిన కెనడా

ఇంటర్నెట్ డెస్క్: వీసా నిబంధనల్ని కఠినతరం చేసిన కెనడా తాజాగా అంతర్జాతీయ విద్యార్థుల కోసం నిర్దేశించిన జీవన వ్యయాన్ని 11 శాతం పెంచేసింది. సెప్టెంబరు 1 నుంచి దరఖాస్తు చేసుకునే వారికి కొత్త నిబంధన వర్తించనుంది. క్యూబెక్ తప్ప కెనడాలోని అన్ని రాష్ట్రాలకూ మారిన నిబంధన వర్తిస్తుంది. దీంతో విద్యార్థులు కలిగి ఉండాల్సిన కనీస నిధుల మొత్తం 22.89వేల కెనడియన్ డాలర్లకు చేరుకుంది. కెనడాలో ఉన్నత చదువుల కోసం వెళ్లే విదేశీ విద్యార్థులు ఏడాది పాటు ఆర్థిక అవసరాలకు సరిపడా నిధులు తమ దగ్గర ఉన్నట్లు ఇమిగ్రేషన్ అధికారులకు చూపించాల్సి ఉంటుంది. ఈ పరిమితి (ట్యూషన్ ఫీజు, ట్రావెల్ ఖర్చులు కాకుండా) ప్రస్తుతం ఒక్కో వ్యక్తికి ఏడాదికి 20,635 కెనడా డాలర్లుగా ఉండగా.. ఈ ఏడాది సెప్టెంబరు 1 నుంచి 22,895 డాలర్లకు పెంచారు. కెనడా స్టడీ పర్మిట్ కోసం దరఖాస్తు చేసుకునే సమయంలోనే ట్యూషన్ ఫీజు, ట్రావెల్ ఖర్చులు కాక నివాసం, ఆహారం, రవాణా వంటి అవసరాల కోసం సరిపడా నిధులు తమ ఖాతాల్లో ఉన్నాయని నిరూపించుకోవాల్సి ఉంటుంది.

బిహార్‌లో ఓటర్ల జాబితా సవరణకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో ఏడీఆర్ పిటిషన్

దిల్లీ: బిహార్‌లో ప్రత్యేక సమగ్ర సవరణ పేరుతో ఎన్నికల సంఘం (ఈసీ) చేపట్టిన ఓటర్ల జాబితా సవరణకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ సవరణ కోసం జూన్ 24న ఈసీ జారీ చేసిన ఉత్తర్వును రద్దు చేయాలని అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫామ్స్ (ఏడీఆర్) ఈ పిటిషన్‌లో కోరింది. విదేశీ అక్రమ వలసదారులు, అనర్హులైన ఓటర్లను జాబితాల నుంచి తొలగించి అర్హులైన పౌరులకు మాత్రమే ఓటు హక్కు కల్పించడం కోసం ప్రత్యేక సమగ్ర సవరణను చేపట్టినట్లు ఈసీ చెబుతోంది. అయితే, ఈసీ ఉత్తర్వు భారత రాజ్యాంగంలోని 14, 19, 21, 325, 326 అధికరణలను, ప్రజాప్రాతినిధ్య చట్టం-1950, ఓటర్ల నమోదు నిబంధనలు-1960లోని నిబంధనలను ఉల్లంఘించేలా ఉందని ఏడీఆర్ ఆరోపించింది. ఎన్నికల సంఘం సరైన విధానాన్ని పాటించకపోవడం, సంబంధిత పత్రాల సమర్పణకు తగినంత సమయం ఇవ్వకపోవడం, తక్కువ వ్యవధి వల్ల లక్షల మంది ఓటు హక్కు కోల్పోయే ప్రమాదం ఉందని ఏడీఆర్ తరఫున పిటిషన్ వేసిన న్యాయవాది ప్రశాంత్ భూషణ్ ఆందోళన వ్యక్తం చేశారు.

ఈసీకి పత్రాలు చూపించొద్దు: రబ్రీదేవి

ఓటర్ల పరిశీలన కోసం ఎన్నికల సంఘం తరఫున వచ్చే అధికారులకు ఓటరు గుర్తింపు కార్డు మినహా మిగిలిన పత్రాలేవీ చూపించవద్దని బిహార్ మాజీ ముఖ్యమంత్రి రబ్రీదేవి రాష్ట్ర ప్రజలకు సూచించారు. ఆర్జేడీ వ్యవస్థాపక దినోత్సవ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ... పేదల ఓటు హక్కును హరించేందుకు ప్రత్యేక సమగ్ర సవరణను చేపట్టారని ఆరోపించారు.

నాలుగు నెలల్లో 5వేల సార్లు పార్టీలతో సమావేశమయ్యాం

- ప్రతిపక్షాల విమర్శలపై సీఈసీ జ్ఞానేశ్ కుమార్



ఫిరోజాబాద్: ఎన్నికల సంఘం తమ సమస్యలను పెడచెవిన పెడుతోందని ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న విమర్శలపై ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ స్పందించారు. ఈసీ అన్ని పార్టీలతో క్రమం తప్పకుండా సమావేశాలు జరుపుతోందని తెలిపారు. అసెంబ్లీ స్థాయి నుంచి ప్రారంభించి గత నాలుగు నెలల్లో 5వేల సార్లు పార్టీలతో ఈసీ చర్చలు జరిపిందని, ఈ సమావేశాల్లో రాజకీయ నాయకులు సహా 28,000 పాల్గొన్నారని స్పష్టం చేశారు. అంతేకాకుండా ప్రతి ప్రాంతీయ, జాతీయ పార్టీతో ఎన్నికల సంఘం భేటీ అవుతోందని అన్నారు. ఓటర్ల తర్వాత రాజకీయ పార్టీలే తమకు ముఖ్యమైన భాగస్వాములని వెల్లడించారు.

..సుప్రీం అంతర్గత నివేదికకు రాజ్యాంగబద్ధత లేదు

- జస్టిస్ వర్మ ఉదంతంపై కపిల్ సిబల్

దిల్లీ: అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ కేసులో సుప్రీంకోర్టు అంతర్గత విచారణ నివేదికకు ఎలాంటి రాజ్యాంగబద్ధత లేదని.. 'న్యాయమూర్తుల విచారణ చట్టం' ప్రకారమే దర్యాప్తు జరగాలని రాజ్యసభ సభ్యుడు కపిల్ సిబల్ అభిప్రాయపడ్డారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'న్యాయమూర్తిని తొలగించాలంటే అభిశంసన తీర్మానానికి ఎంపీలు నోటీసు ఇవ్వాలి. అప్పుడు ఏర్పడే కమిటీ దర్యాప్తు తర్వాత న్యాయమూర్తి దుష్ప్రవర్తన లేదా అసమర్థత గుర్తించి నిర్ణయం తీసుకుంటుంది. ఉభయ సభల సంయుక్త సమావేశంలో మూడింట రెండొంతుల మెజార్టీతో అభిశంసన తీర్మానాన్ని ఆమోదించాలి. ఇవేవీ అనుసరించకముందే జస్టిస్ వర్మ దోషి అని మంత్రులు ఎలా చెబుతారు? పార్లమెంటు సమావేశాలు మొదలైన మొదటి రోజే అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టి మూడు నెలల్లో దీన్ని పూర్తిచేస్తామని చెబుతున్నారు. గత ఏడాది వీహెచ్‌పీ కార్యక్రమంలో పాల్గొని మతపరమైన వ్యాఖ్యలు చేసిన జస్టిస్ శేఖర్ యాదవ్‌ను ప్రభుత్వం ఎందుకు రక్షిస్తోంది? ఆయనపై అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టడానికి ప్రతిపక్ష ఎంపీలు 2024 డిసెంబరు 13న నోటీసు ఇచ్చారు. మూడు నెలలు ఎప్పుడో గడిచాయి. 2026లో జస్టిస్ శేఖర్ యాదవ్ పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో ఈ అంశంపై కావాలనే ప్రభుత్వం జాప్యం చేస్తోంది' అని సిబల్ ఆరోపించారు.

మనస్సాక్షికి అనుగుణంగా పనిచేయండి

- న్యాయమూర్తులకు సీజేఐ హితవు

ముంబయి: చట్టానికి, భారత రాజ్యాంగానికి అందించే వ్యాఖ్యానం ఆచరణాత్మకంగా, సమాజ అవసరాలకు అనుగుణంగా ఉండాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ అభిప్రాయపడ్డారు. బాంబే హైకోర్టు ఏర్పాటుచేసిన సన్మాన కార్యక్రమంలో మాట్లాడుతూ కొందరు న్యాయమూర్తి సహచరులు దురుసుగా వ్యవహరిస్తున్నారన్న ఫిర్యాదులు అందుతున్నాయని, న్యాయమూర్తులు వ్యవస్థ ప్రతిష్ఠను పరిరక్షించే విధంగా వ్యవహరించాలని జస్టిస్ గవాయ్ సూచించారు. గతంలో సుప్రీంకోర్టు వెలువరించిన ఒక తీర్పును ఉటంకిస్తూ ప్రస్తుత తరం ఎదుర్కొంటున్న సమస్యల దృష్టికోణంలోనే రాజ్యాంగానికి వ్యాఖ్యానం ఇవ్వాలని ఆయన అన్నారు. ఒకసారి వ్యాజ్యంపై నిర్ణయం వెలువరించాక ఇక దానిపై ఎన్నటికీ విచారించకూడదని అభిప్రాయపడ్డారు. తాను బాంబే హైకోర్టు నుంచే వృత్తి జీవితం ప్రారంభించిన విషయాన్ని ప్రస్తావిస్తూ ఈ హైకోర్టు మంచి తీర్పు ఇచ్చిందని ఎవరైనా ప్రశంసించిన ప్రతిసారీ గర్వానుభూతి పొందుతానని జస్టిస్ గవాయ్ అన్నారు. "న్యాయమూర్తిగా పనిచేయడం అంటే ఉదయం 10 నుంచి సాయంత్రం 5 వరకూ పనిచేసి చేతులు దులుపుకోవడం కాదు. సమాజానికి సేవ చేయడం" అని కొందరు న్యాయమూర్తుల ప్రవర్తనను ప్రస్తావిస్తూ వ్యాఖ్యానించారు.

జనగణన మార్గసూచీపై దిశానిర్దేశం

- రెండు రోజుల సమావేశంలో సెన్సస్ డైరెక్టర్లకు వివరించిన ఆర్‌జీఐ

దిల్లీ: జనగణనకు సంబంధించిన మార్గసూచీపై రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల సెన్సస్ డైరెక్టర్లకు రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా (ఆర్‌జీఐ) మృత్యుంజయ్ కుమార్ నారాయణ్ దిశానిర్దేశం చేశారు. డిజిటల్ వినియోగం, ప్రశ్నావళి, బృందాల ఏర్పాటు, హౌస్ లిస్టింగ్‌పై వివరించారు. జనగణనపై రెండు రోజులపాటు జరిగిన సమావేశం శనివారం ముగిసింది. ఇందులో ఆర్‌జీఐ దిశానిర్దేశంతోపాటు పలు అంశాలపై చర్చించారు. 'జన గణన సన్నద్ధతపై చర్చ జరిగింది. బృంద స్ఫూర్తితో సాధించాల్సిన లక్ష్యాల గురించి ప్రముఖంగా చర్చించాం. సమగ్ర రీతిలో జన గణన, కుల గణన పూర్తి చేయాలని అందరికీ సూచించాం' అని ఆర్‌జీఐ తన సోషల్ మీడియా పోస్టులో పేర్కొన్నారు. ప్రజలందరికీ జన గణనపై సమాచారం ఎప్పటికప్పుడు చేరవేసేందుకు ఒక డిజిటల్ వేదికను ఆర్‌జీఐ ఏర్పాటు చేయబోతున్నారు.

ఉద్రిక్త పరిస్థితుల్లోనూ

భారత్-పాక్ మధ్య కొనసాగిన వాణిజ్యం

- డాన్ పత్రిక వెల్లడి

ఇస్లామాబాద్: పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు నెలకొని, సరిహద్దులు మూసివేసినప్పటికీ మే నెలలో తృతీయపక్ష దేశం ద్వారా రెండు దేశాల మధ్య వాణిజ్యం కొనసాగిందని డాన్ పత్రిక పేర్కొంది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ పాకిస్థాన్ (ఎస్‌బీపీ) వెల్లడించిన గణాంకాలను అందులో వివరించింది. దాని ప్రకారం.. భారత్ నుంచి పాక్ మూడేళ్లలో అత్యధిక దిగుమతుల్ని 2024 జులై నుంచి 2025 మే మధ్యకాలంలో చేసుకుంది. ఒక్క మే నెలలోనే 1.5 కోట్ల డాలర్ల విలువైన ఉత్పత్తులను దిగుమతి చేసుకుంది. 2022-23లో 1.90 కోట్ల డాలర్లు, 2023-24లో 20.7 కోట్ల డాలర్లు, 2024-25లో 11 నెలల్లోనే 21.15 కోట్ల డాలర్ల విలువైన దిగుమతులు చేసుకుంది. ఇదే సమయంలో పాక్ నుంచి భారత్‌కు ఎగుమతులు తగ్గిపోయాయి. మే నెలలో భారత్‌కు ఎగుమతుల విలువ వెయ్యి డాలర్లు ఉండగా.. 2024 జులై నుంచి ఈ మే నెల మధ్య అది 50 లక్షల డాలర్లు మాత్రమే ఉంది. భారత్-పాకిస్థాన్ మధ్య 2019 నుంచి వాణిజ్యం దెబ్బతినగా.. ఈ ఏడాది పహల్గాం ఉగ్రదాడి తర్వాత మరింత దెబ్బతింది.

మసూద్ అజార్ ఆచూకీ తెలీదు!

- మా గడ్డపైనే ఉన్నట్లు భారత్ సాక్ష్యాలు సమర్పిస్తే అరెస్టు చేస్తాం
- పాక్ విదేశాంగ మాజీ మంత్రి బిలావల్ భుట్టో

ఇస్లామాబాద్: జైషే మహమ్మద్ సంస్థ నేత మసూద్ అజార్ తమ దేశంలో లేడని, ఒక వేళ ఉన్నట్లు భారత్ కచ్చితమైన సాక్ష్యాలు సమర్పిస్తే అతణ్ని అరెస్టు చేస్తామని ఓ వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పాకిస్థాన్ విదేశాంగ మాజీ మంత్రి బిలావల్ భుట్టో జర్దారీ పేర్కొన్నారు. లష్కరే తయ్యిబా అధిపతి హఫీజ్ సయీద్, జైషే మహమ్మద్ (జేఎం) చీఫ్ మసూద్ అజార్‌లను భారత్‌కు అప్పగించడం గురించి అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిస్తూ.. "హఫీజ్ సయీద్ పాకిస్థాన్‌లో స్వేచ్ఛగా తిరుగుతున్నాడంటూ వస్తున్న వార్తలు అవాస్తవం. అతను కస్టడీలోనే ఉన్నాడు. మసూద్ అజార్ ఎక్కడున్నాడో మాకు తెలియదు. అఫ్గానిస్థాన్‌లో ఉన్నాడేమో. ఒకవేళ అతడు పాక్ గడ్డపైనే ఉన్నట్లు భారత ప్రభుత్వం మాకు కచ్చితమైన సమాచారం ఇస్తే వారిని అప్పగించడానికి ఎటువంటి అభ్యంతరం లేదు" అని భుట్టో పేర్కొన్నారు.



దుక్కి దున్ని, నాట్లేసిన ముఖ్యమంత్రి

దేహ్రాదూన్: ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్‌సింగ్ ధామి ఉధంసింగ్ నగర్ జిల్లాలోని నాగ్లా తరై గ్రామంలో గల తన పొలంలో దుక్కి దున్ని, కూలీలతో కలిసి కొద్దిసేపు వరినాట్లు వేశారు. ఈ చిత్రాలను శనివారం తన 'ఎక్స్' ఖాతాలో ఆయన షేర్ చేశారు. "పాత రోజులు గుర్తుకొచ్చాయి. ఈ రైతులు.. మన ఆర్థికవ్యవస్థకు వెన్నెముక మాత్రమే కాదు.. భావితరాలకు మన సంస్కృతిని అందించే వారధులు" అని రాసుకొచ్చారు. వరినాట్ల సమయంలో జరుపుకొనే 'హుడ్కియా బౌల్' అనే సంప్రదాయ వేడుకలో భాగంగా భూమి, నీరు, మేఘాలకు పుష్కర్‌సింగ్ పూజలు చేశారు.

రాసి పెట్టుకోండి.. మోదీ తలొగ్గుతారు: రాహుల్ గాంధీ

దిల్లీ: అమెరికా- భారత్ వాణిజ్య ఒప్పందం విషయంలో దేశ ప్రయోజనాలకే ప్రాధాన్యమిస్తామని, తుది గడువులను పట్టించుకోబోమని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పందించారు. "సుంకాల తుది గడువుకి ముందే ప్రధాని మోదీ ట్రంప్ ముందు తలొగ్గుతారు. పీయూష్ గోయల్ గుండెలు బాదుకోవడం తప్ప ఏం చేయలేరు. కావాలంటే నా మాటలు రాసి పెట్టుకోండి" అని శనివారం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. వాణిజ్య ఒప్పందాన్ని ఖరారు చేయడానికి ట్రంప్ విధించిన గడువు ఈ నెల 9తో ముగియనుంది.

దిల్లీ షాపింగ్ మాల్‌లో అగ్ని ప్రమాదం

- ఇద్దరి మృతి

దిల్లీ: దేశ రాజధానిలోని కరోల్‌బాగ్ ప్రాంతంలో ఉన్న విశాల్ మెగామార్ట్‌లో శనివారం అగ్నిప్రమాదం సంభవించి ఇద్దరు మరణించారు. ఇందులో ఒకరిని కుమార్ ధీరేందర్ ప్రతాప్ (25)గా, మరో మృతుణ్ని ఉత్తరప్రదేశ్‌లోని అలీగఢ్‌కు చెందిన పవన్ గౌతం (30)గా గుర్తించారు. పదంసింగ్ రోడ్డులోని వాణిజ్య భవనం రెండో అంతస్తులో అగ్ని ప్రమాదం జరిగినట్టు సాయంత్రం 6.44కు తమకు సమాచారం అందిందని అగ్నిమాపక శాఖ, పోలీసులు తెలిపారు. ప్రమాదం జరిగిన సమయంలో భవనంలో 50 మంది ఉన్నారని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ప్రమాదానికి దారితీసిన కచ్చితమైన కారణమేదని ఇంకా రూఢి కాలేదు. అయితే షార్ట్ సర్క్యూట్ వల్ల మంటలు చెలరేగి ఉండవచ్చని అనుమానిస్తున్నారు.

కూలింగ్ టవర్ల ఏర్పాటు నుంచి

థర్మల్ విద్యుత్తు కేంద్రాలకు మినహాయింపు

- కేంద్ర పర్యావరణ, అటవీశాఖ నోటిఫికేషన్

ఈనాడు, దిల్లీ: కూలింగ్ టవర్ల ఏర్పాటు నుంచి థర్మల్ విద్యుత్తు కేంద్రాలకు మినహాయింపునిచ్చే వెసులుబాటును కేంద్ర పర్యావరణ, అటవీశాఖ తీసుకొచ్చింది. ఇందుకు సంబంధించి పర్యావరణ పరిరక్షణ నిబంధనలు-1986లో సవరణలు చేస్తూ శనివారం నోటిఫికేషన్ జారీ చేసింది. కేంద్ర విద్యుత్తు ప్రాధికార సంస్థ, కేంద్ర కాలుష్య నియంత్రణ మండలితో సంప్రదించిన అనంతరం థర్మల్ విద్యుత్తు కేంద్రాలకు కూలింగ్ టవర్ల ఏర్పాటు నుంచి మినహాయింపునిస్తూ ఉత్తర్వులు జారీచేసే అధికారాన్ని కేంద్ర పర్యావరణ మంత్రిత్వశాఖకు అప్పగిస్తున్నట్లు ఇందులో పేర్కొన్నారు. అయితే ఇలాంటి మినహాయింపునిచ్చేటప్పుడు అందుకుగల కారణాలను లిఖితపూర్వకంగా వివరించి, అధికారిక ఉత్తర్వులు జారీ చేయాలన్న షరతు విధించారు. థర్మల్ విద్యుత్తు కేంద్రాల నుంచి పెద్ద ఎత్తున ఉత్పత్తి అయ్యే వేడిని చల్లార్చడంలో కూలింగ్ టవర్లు కీలకపాత్ర పోషిస్తాయి.

పరారీలో ఉన్న ఆర్థిక నేరగాడిగా సంజయ్ భండారీ

- ఈడీ విజ్ఞప్తి మేరకు ప్రకటించిన దిల్లీ కోర్టు

దిల్లీ: ఆయుధాల సలహాదారు సంజయ్ భండారీని 'పరారీలో ఉన్న ఆర్థిక నేరస్థుడి' (ఎఫ్ఈవో)గా దిల్లీలోని న్యాయస్థానం ప్రకటించింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విజ్ఞప్తిపై శనివారం ఈ మేరకు ఉత్తర్వులు ఇచ్చింది. బ్రిటన్‌లో నివసించేందుకు భండారీకి చట్టపరమైన హక్కు ఉందని, ఆయన్ను ఎఫ్ఈఓగా ప్రకటించడం తగదని న్యాయవాదులు పేర్కొన్నారు. న్యాయస్థానం ఈడీ వాదనలతోనే ఏకీభవించింది. మానవ హక్కుల రీత్యా భండారీని భారత్‌కు అప్పగించడానికి నిరాకరిస్తూ బ్రిటన్ న్యాయస్థానం ఇటీవలే తీర్పు ఇచ్చింది. విదేశీ ఆస్తులను దాచిపెట్టడం, తప్పుడు పత్రాలు ఉపయోగించడం, పన్ను అధికారులకు తప్పుడు సమాచారం ఇవ్వడం వంటి ఆరోపణలు భండారీపై ఉన్నాయి. ఆయనకు చెందిన రూ.21 కోట్ల ఆస్తులను పీఎంఎల్ఏ కింద ఇదివరకే ఈడీ జప్తు చేసింది. 2016లో దిల్లీలో ఆదాయపు పన్ను (ఐటీ) విభాగం సోదాలు చేసిన వెంటనే భండారీ లండన్‌కు పారిపోయారు. భండారీ, ఇతరులపై ఐటీ ఛార్జిషీటును పరిగణనలోకి తీసుకొని 2017 ఫిబ్రవరిలో 'నగదు అక్రమ చలామణి నిరోధక చట్టం' (పీఎంఎల్ఏ) కింద ఈడీ క్రిమినల్ కేసు నమోదు చేసింది. 2020లో మొదటి ఛార్జిషీటు, 2023లో అనుబంధ ఛార్జిషీటు దాఖలు చేసింది. ప్రియాంకాగాంధీ భర్త రాబర్ట్ వాద్రాతో భండారీకి సంబంధాలున్నట్లు ఆరోపణలు వచ్చాయి. వీటిని రాజకీయ వేధింపులుగా వాద్రా కొట్టిపారేశారు.

ఏ తరహా విధుల్లో ఉన్నా సైనికుడి జీవనశైలి సంక్లిష్టమైనదే

- దివ్యాంగ పింఛన్‌లపై రక్షణశాఖ పిటిషన్‌లను కొట్టేస్తూ దిల్లీ హైకోర్టు వ్యాఖ్య

దిల్లీ: పలువురు సైనికులకు దివ్యాంగ పింఛన్లు ఇవ్వాలని సైనిక దళాల ట్రైబ్యునల్ ఇచ్చిన తీర్పును సవాలుచేస్తూ రక్షణశాఖ దాఖలు చేసిన సుమారు 200 పిటిషన్లను దిల్లీ హైకోర్టు ఇటీవల కొట్టేసింది. యుద్ధానికి సంబంధం ఉండని కార్యాలయంలో సైనికుడు వైకల్యం బారిన పడ్డాడని లేదా జీవనశైలి కారణంగా ఆ సమస్య ఉత్పన్నమైందనే కారణంతో దివ్యాంగ పింఛన్‌ను తిరస్కరించలేరని న్యాయమూర్తులు జస్టిస్ నవీన్ చావ్లా, జస్టిస్ శాలిందర్ కౌర్‌ల ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ తరహా పింఛన్లు దానం కాదని.. సైనికుడికి ఒక గౌరవప్రదమైన గుర్తింపు అని పేర్కొంది. కఠిన క్రమశిక్షణ, సుదీర్ఘ పని వేళలు, మానసిక ఒత్తిడి, ఎప్పుడూ సంసిద్ధంగా ఉండటం తదితర కారణాలతో యుద్ధంలో అయినా శాంతియుత విధుల్లో అయినా సైనికుడి జీవితం సంక్లిష్టమైనదేనని అభిప్రాయపడింది. అధిక రక్తపోటు, టైప్ 2 డయాబెటిస్ అనేవి ఏ కోణంలో చూసినా రక్షణ విధులకు సంబంధం లేనివని రక్షణ శాఖ కోర్టులో వాదించగా.. ధర్మాసనం స్పందిస్తూ రిలీజ్ మెడికల్ బోర్డు (ఆర్ఎంబీ) నిర్దిష్టంగా నివేదికలను సిద్ధంచేసి, పలానా వ్యక్తికి వైకల్యం సైనిక కార్యకలాపాల కారణంగా తలెత్తలేదని నిరూపించాలని సూచించింది. దీనికి భిన్నంగా ప్రచారంలో ఉన్న విషయాలతో అస్పష్టమైన నివేదికను సిద్ధం చేయడాన్ని ఆక్షేపించింది.



చైనాలో తొలి లెగోల్యాండ్ ప్రారంభం

షాంఘై: చైనాలోని షాంఘై నగరంలో తొలిసారిగా లెగోల్యాండ్ రిసార్ట్ ప్రారంభమైంది. 85 మిలియన్ల లెగోలతో నిర్మించిన ఈ పార్కును తిలకించేందుకు భారీగా జనం తరలివచ్చారు. చైనాలో కలిపి ప్రపంచ వ్యాప్తంగా ఈ రిసార్టులు 11 దేశాల్లో మాత్రమే ఉండటం విశేషం. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రసిద్ధ కట్టడాలను ప్రతిబింబించేలా లెగోలతో తయారుచేసిన మినీల్యాండ్ పార్కులో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దీనిని షాంఘై ప్రభుత్వంతో కలిసి మెర్లిన్ ఎంటర్‌టైన్‌మెంట్స్, లెగో గ్రూప్ నిర్మించాయి.



స్పెయిన్‌లో విమానం నుంచి దూకిన ప్రయాణికులు

ఇంటర్నెట్‌డెస్క్: స్పెయిన్ నుంచి మాంచెస్టర్‌కు బయల్దేరేందుకు సిద్ధంగా ఉన్న ఓ విమానంలో అగ్ని ప్రమాద హెచ్చరిక ప్రయాణికుల్లో తీవ్ర అలజడి రేపింది. భయాందోళనలకు గురైన ప్రయాణికులు పరుగులు తీస్తూ విమానం అత్యవసర ద్వారాల నుంచి బయటకు దిగే ప్రయత్నం చేశారు. మరికొందరు విమానం రెక్కలపైకి చేరుకుని అక్కడి నుంచి కిందకు దూకేశారు. ఈ ఘటనలో 18 మంది స్వల్పంగా గాయపడినట్లు అధికారులు తెలిపారు. స్పెయిన్‌లోని పాల్మా డె మేయర్క్ విమానాశ్రయంలో శుక్రవారం ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ఘటన దృశ్యాలు వైరల్‌గా మారడంతో విమానయాన సంస్థ స్పందించింది. అగ్నిప్రమాద హెచ్చరిక వచ్చిన వెంటనే స్పందించి ప్రయాణికులను టెర్మినల్‌కు తరలించామని తెలిపింది. అయితే, ఎటువంటి ప్రమాదం జరగలేదని, అనుకోకుండా హెచ్చరిక వచ్చి లైట్ వెలిగినట్లు తెలిపింది. దీంతో టేకాఫ్‌ను నిలిపివేయాల్సి వచ్చిందని వివరణ ఇచ్చింది.

నకిలీ ధ్రువపత్రాలతో రెండేళ్లు ఎస్.ఐ.గా చలామణి!



జైపుర్: రాజస్థాన్‌లోని సీకర్ జిల్లాలో మూలీదేవి అలియాస్ మోనా అనే కిలాడీ మహిళను పోలీసులు అరెస్టు చేశారు. ఈమె నకిలీ ధ్రువపత్రాలతో ఏకంగా రెండేళ్లు రాజస్థాన్ పోలీస్ అకాడమీ (ఆర్‌పీఏ)లో ఎస్.ఐ.గా చలామణి అయ్యింది. మూలీ అద్దెకు ఉంటున్న ఇంటి నుంచి రూ.7 లక్షల నగదు, మూడు పోలీసు యూనిఫాంలు, ఆర్‌పీఏ పరీక్ష పత్రాలు, నకిలీ ధ్రువపత్రాలు స్వాధీనం చేసుకున్నారు. యూనిఫారం ధరించి ఆర్‌పీఏ శిక్షణ కార్యక్రమాలకు హాజరవుతూ సీనియర్ అధికారులతోనూ ఈమె ఫొటోలు దిగేది. రాజస్థాన్‌లోని నాగౌర్ జిల్లాకు చెందిన ఓ ట్రక్కు డ్రైవరు కుమార్తె అయిన మూలీ 2021లో రాజస్థాన్ సబ్ ఇన్‌స్పెక్టర్ రిక్రూట్‌మెంటు పరీక్ష తప్పింది. ఆ తర్వాత నకిలీ ధ్రువపత్రాలు సృష్టించి, ఎస్.ఐ. పరీక్షలో తాను ఉత్తీర్ణురాలైనట్లుగా సోషల్ మీడియాలో వైరల్ చేసింది. పరీక్షలో ఉత్తీర్ణులైన ఎస్.ఐ.ల వాట్సప్ గ్రూపులో చేరి, రాజస్థాన్ పోలీసు అకాడమీలో క్రీడల కోటా కింద చేరిన మునుపటి బ్యాచ్ అభ్యర్థిగా పరిచయం చేసుకొంది. రెండేళ్ల అకాడమీలో అలాగే నెట్టుకొచ్చింది. కొంతమంది ట్రైనీ ఎస్.ఐ.లకు ఈమె మీద అనుమానం రావడంతో విషయం సీనియర్ అధికారుల దృష్టికి వెళ్లి అంతర్గత విచారణ మొదలైంది. బండారం బయటపడ్డాక గత రెండేళ్లుగా పరారీలో ఉన్న మూలీదేవి ఎట్టకేలకు పట్టుబడింది.

చిన్న పనులకు 'చాంతాడు' కూలీలు!

- మధ్యప్రదేశ్ స్కూళ్లలో బిల్లుల గోల్‌మాల్



సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న బిల్లులు

శహడోల్: మధ్యప్రదేశ్‌లోని శహడోల్ జిల్లా ప్రభుత్వ పాఠశాలల కాంట్రాక్టు పనుల్లో గణితపరమైన అద్భుతాలు జరిగాయి. సకందీ గ్రామ పాఠశాలలో ఓ గోడకు నాలుగు లీటర్ల పెయింటు వేసేందుకు ఏకంగా 168 మంది కార్మికులను, 65 మంది మేస్త్రీలను నియమించారట! ఈ పనికి రూ.1.07 లక్షల బిల్లు పెట్టారు. నిపానియా అనే మరో గ్రామంలోని పాఠశాలలో పది కిటికీలు, నాలుగు తలుపులకు 20 లీటర్ల రంగులు వేసేందుకు 275 మంది కార్మికులను, 150 మంది మేస్త్రీలను పురమాయించారట! ఈ పనికి రూ.2.3 లక్షల బిల్లు పెట్టారు. పనుల కాంట్రాక్టు తీసుకొన్న సుధాకర్ కన్‌స్ట్రక్షను వారు రూపొందించిన బిల్లులను పాఠశాలల బాధ్యులు ఆమోదించారు. నియమానుసారం తనిఖీ చేయాల్సిన పనులు చేపట్టకముందు.. తర్వాత ఫొటోలను కూడా పరిశీలించలేదు. ప్రజాధనాన్ని పప్పుబెల్లాల్లా పంచుకునేందుకు సిద్ధం చేసిన ఈ బిల్లులను ఎవరో వైరల్ చేయడంతో అధికారుల దృష్టికి వెళ్లాయి. బిల్లులను పరిశీలించి, బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటామని డీఈవో ఫూల్‌సింగ్ తెలిపారు.

టాయిలెట్‌లో ఉండి వర్చువల్ విచారణకు హాజరు

- వ్యక్తిపై ధిక్కరణ చర్యలకు గుజరాత్ హైకోర్టు ఆదేశం


అహ్మదాబాద్: టాయిలెట్‌లో నుంచి వర్చువల్‌గా విచారణకు హాజరైన ఓ వ్యక్తిపై గుజరాత్ హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. అతడి చర్యలను సుమోటోగా తీసుకుని కోర్టు ధిక్కరణ కింద నమోదు చేయాలని రిజిస్ట్రార్‌కు ఆదేశాలను జారీచేసింది. జూన్ 20వ తేదీన ఓ కేసును జస్టిస్ నజీర్ ఎస్. దేశాయ్ వర్చువల్‌గా విచారిస్తున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది.

అప్పుడు ఈ విషయాన్ని న్యాయమూర్తి గుర్తించలేదు. అనంతరం వీడియో సామాజిక మాధ్యమంలో వైరల్‌గా మారడంతో కోర్టు దృష్టికి వచ్చింది. వెంటనే నిందితుడిని సూరత్‌కు చెందిన కిమ్ గ్రామస్థుడు అబ్దుల్ సమద్‌గా గుర్తించారు. అతడిపై సుమోటోగా కోర్టు ధిక్కరణ చర్యలను నమోదు చేయాలని జూన్ 30న జరిగిన విచారణలో జస్టిస్ ఏ.ఎస్.సుపెహియా, జస్టిస్ టీ.ఆర్.వచ్ఛనీలతో కూడిన డివిజన్ బెంచ్ రిజిస్ట్రార్‌ను ఆదేశించింది. వర్చువల్ విచారణ సమయంలో ఇటువంటి చర్యలు పునరావృతం కాకుండా ఉండేలా ఎలా నివారించాలో కోర్టుకు తెలపాలని సమాచార, సాంకేతిక రిజిస్ట్రార్‌ను బెంచ్ కోరింది. వైరల్ అయిన వీడియో ప్రకారం... నిందితుడు అబ్దుల్ సమద్ విచారణ జరుగుతున్న సమయంలో టాయిలెట్‌లోకి వెళ్లి మొబైల్ ఫోనును తాను కెమెరాలో కనిపించేలా నేలపై పెట్టాడు. కాలకృత్యాలు తీర్చుకున్న తర్వాత వర్చువల్ విచారణ నుంచి డిస్కనెక్ట్ అయ్యాడు. కొద్దిసేపటి తర్వాత మరోసారి విచారణకు హాజరయ్యాడు.

ఈనాడు సినిమా



ఎన్టీఆర్




హృతిక్

వార్ 2తో ఓ గొప్ప రైడ్ ప్రారంభం

కథానాయకులు హృతిక్ రోషన్, ఎన్టీఆర్ కలిసి నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'వార్ 2'. అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాని యశ్‌రాజ్ ఫిల్మ్స్ సంస్థ నిర్మిస్తోంది. కియారా అడ్వాణీ కథానాయిక. ముగింపు దశలో ఉన్న ఈ చిత్రం ఆగస్టు 14న థియేటర్లలోకి రానుండగా.. ఈ చిత్ర తెలుగు హక్కుల్ని ప్రముఖ చిత్ర నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ దక్కించుకుంది. ఈ విషయాన్ని ఆ సంస్థే శనివారం అధికారికంగా ప్రకటించింది. "అరవింద సమేత', 'దేవర' లాంటి విజయాల తర్వాత మా డిస్ట్రిబ్యూషన్‌లో హ్యాట్రిక్ హిట్ కోసం 'వార్ 2'తో ఓ గొప్ప రైడ్‌ను ప్రారంభిస్తున్నాం. దీన్ని మేము తెలుగు రాష్ట్రాల్లో విడుదల చేయబోతున్నందుకు చాలా ఆనందంగా ఉంది. వచ్చే నెల 14న థియేటర్లలో ఈ ఉత్సవం మొదలు కానుంద"ని సితార సంస్థ పేర్కొంది. విజయవంతమైన స్పై థ్రిల్లర్ 'వార్'కు కొనసాగింపుగా ఈ చిత్రం రూపొందింది. ఇందులో హృతిక్ - తారక్‌ల మధ్య ఉండే పోటాపోటీ యాక్షన్ ప్రేక్షకులకు కనులవిందుగా ఉండనుందని చిత్ర వర్గాలు తెలిపాయి. ఇది ప్రపంచ వ్యాప్తంగా ఐమ్యాక్స్ ఫార్మాట్‌లోనూ విడుదల కానుంది.

గర్ల్‌ఫ్రెండ్.. తొలి పాటతో సిద్ధం



రష్మిక

'ది గర్ల్‌ఫ్రెండ్'గా సినీప్రియుల్ని పలకరించనుంది రష్మిక. ఆమె టైటిల్ పాత్రలో నటిస్తున్న ఈ చిత్రాన్ని రాహుల్ రవీంద్రన్ తెరకెక్కిస్తున్నారు. అల్లు అరవింద్ సమర్పణలో ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. దీక్షిత్ శెట్టి హీరో. ఇప్పటికే టాకీ పార్ట్ పూర్తి చేసుకున్న ఈ సినిమా.. హైదరాబాద్‌లో పాట చిత్రీకరణ చేసుకుంటోంది. రష్మిక, దీక్షిత్ శెట్టిలపై దీన్ని తెరకెక్కిస్తున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ నెలలోనే ఈ చిత్ర తొలి గీతాన్ని విడుదల చేయనున్నారు. అలాగే త్వరలోనే విడుదల తేదీపైనా స్పష్టత ఇవ్వనున్నారు. భావోద్వేగాలతో నిండిన అందమైన ప్రేమ కథతో ముస్తాబవుతున్న చిత్రమిది. దీనికి హేషమ్ అబ్దుల్ వహాబ్ సంగీతమందిస్తున్నారు. కృష్ణన్ వసంత్ ఛాయాగ్రాహకుడిగా వ్యవహరిస్తున్నారు.

పిల్లలు ర్యాంకులు సాధించడమే ముఖ్యమా?

బ్రో.. ఓ లుక్కేయొచ్చు!



సిరీస్: 'ఏఐఆర్'
జానర్: కామెడీ డ్రామా
ప్లాట్‌ఫామ్: ఈటీవీ విన్

ప్రపంచంతో పోటీపడి తమ పిల్లలు మంచి స్థాయిలో ఉండాలని ఆరాటపడుతుంటారు తల్లిదండ్రులు. వారు మంచి ర్యాంకులు సాధించాలని కలలు కంటుంటారు. స్థోమత లేకపోయినా.. అప్పులు చేసి పెద్ద పెద్ద కాలేజీల్లో బోలెడు డబ్బులు పోసి చేర్పిస్తారు. చదువుల కోసం తమ జీవితాల్ని త్యాగం చేసే చాలామంది తల్లిదండ్రులు.. కేవలం ర్యాంకులు సాధించడమే పిల్లల లక్ష్యంగా భావిస్తుంటారు. కానీ దాని వల్ల వారు ఎలాంటి ఒత్తిడికి గురవుతున్నారో ఆలోచించేవారు చాలా తక్కువ. ఇలాంటి ఎంతో మంది తల్లిదండ్రులకు మంచి సందేశాన్ని ఇస్తుందీ ఓ సిరీస్. మరోవైపు విద్యను వ్యాపారంగా మార్చేసిన విద్యావ్యవస్థలోని లోపాలను ఎత్తిచూపిస్తూ సమాజాన్ని ఆలోచింపజేసేలా సాగే సిరీస్ 'ఏఐఆర్'.

కథాంశం: పదవ తరగతి అప్పుడే పూర్తి చేసుకొని విజయవాడలోని 'ఆల్ ఇండియా ర్యాంకర్స్' (ఏఐఆర్) కాలేజీలో ఐఐటీ ఇంటిగ్రేటెడ్ ఇంటర్‌లో చేరేందుకు వెళ్తారు అర్జున్(హర్ష్ రోషన్), ఇమ్రాన్(భాను ప్రకాశ్), రాజు(జయతీర్థ). ప్రియురాలి కోసం ఒకరు.. తండ్రి బలవంతం మీద మరొకరు.. భవిష్యత్తు కోసం ఇంకొకరు.. ఇలా వేర్వేరు కారణాలతో ఈ కళాశాలకు వచ్చిన వీరు.. పరిస్థితులు, వాతావరణం నచ్చక అక్కడి నుంచి వెళ్లిపోవాలని నిర్ణయించుకుంటారు. ఈ క్రమంలోనే ఒకరితో ఒకరికి ముఖ పరిచయం లేని ఈ ముగ్గురి మధ్య స్నేహం ఏర్పడుతుంది. సాధ్యమైనంత తొందరగా కాలేజ్ నుంచి బయటపడాలని ప్లాన్ చేస్తుంటారు. మరి ఈ క్రమంలో ఈ ముగ్గురు ఎలాంటి పరిస్థితుల్ని ఎదుర్కొన్నారు? తమ పిల్లలు మంచి ర్యాంకులు సాధించాలని ఆశపడిన వారి తల్లిదండ్రుల కల నెరవేరిందా? చివరకు వారు చదువుపై శ్రద్ధ పెట్టారా? లేదా? అనే ఆసక్తికర ప్రశ్నలకు సమాధానమే 'ఏఐఆర్'. జోసెఫ్ క్లింటన్ దర్శకత్వం వహించిన ఈ సిరీస్‌లో సందీప్ రాజ్, వైవా హర్ష, సునీల్ కీలక పాత్రలు పోషించారు.

- 'ఇంటర్ విద్యార్థి దశలో కీలకమైన ఘట్టం. తప్పటడుగులు వేసే వయసు ఇదే.. భవిష్యత్తును నిలబెట్టే నిర్ణయాలను తీసుకునే సమయమూ ఇదే. ఎన్నో కొత్త ఆశలతో జీవితంలో మరో ముందడుగు వేసే ప్రతి ఇంటర్ విద్యార్థి కథే ఈ సిరీస్. ఇందులో ప్రేక్షకులు చాలా సందర్భాల్లో కాలేజీ రోజులను గుర్తు చేసుకుంటూ.. తమని తాము చూసుకునేలా తీర్చిదిద్దిన దర్శకుడి ప్రయత్నానికి ఎంత మెచ్చుకున్న తక్కువే. సునీల్, సందీప్ రాజ్ వారి నటనతో సిరీస్‌కు మరింత ఆకర్షణగా నిలిచారు. 'ఫీజు తగ్గితే ర్యాంక్ తగ్గుతుంది' లాంటి సంభాషణలతో ప్రస్తుత సమాజంలో విద్యావ్యవస్థలు ఎలా ఉన్నాయో ఆవిష్కరించిందీ సిరీస్. అంతేకాదు ర్యాంకుల కోసం పలు ప్రైవేటు విద్యాసంస్థలు విద్యార్థులపై ఎంతగా ఒత్తిడి తీసుకొస్తున్నాయన్నది శక్తిమంతమైన సంభాషణలతో చూపించారు. ఫీజు కట్టలేకపోతే కాలేజీ యాజమాన్యాలు వ్యవహరించే తీరు ప్రతి ప్రేక్షకుడిని భావోద్వేగానికి గురిచేస్తుంది. విద్యార్థులు పడే ఒత్తిడి కన్నా.. ర్యాంకులు కొట్టడమే ముఖ్యమా? అని ప్రశ్నిస్తున్న ఈ సిరీస్ నేటి తరం తల్లిదండ్రులకు కనువిప్పు కలిగిస్తుంది. విద్యార్థులు, తల్లిదండ్రులు చూడాల్సిన సిరీస్ ఇది. మరి వినోదంతో కూడిన సందేశాన్ని ఇస్తున్న ఈ సిరీస్‌పై ఆదివారం సరదాగా మీరూ ఓ లుక్కేయ్యండి.

'బకాసుర రెస్టారెంట్'లో నవ్వులు



ప్రవీణ్, అనిల్ రావిపూడి

హాస్యనటుడు ప్రవీణ్ ప్రధాన పాత్రధారిగా ఎస్‌జే శివ తెరకెక్కించిన చిత్రం 'బకాసుర రెస్టారెంట్'. వైవా హర్ష టైటిల్ పాత్రలో నటించిన ఈ సినిమాని లక్ష్మయ్య ఆచారి, జనార్దన్ ఆచారి సంయుక్తంగా నిర్మించారు. గరుడ రామ్, కృష్ణ భగవాన్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రం త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే దర్శకుడు అనిల్ రావిపూడి ఈ చిత్ర టైటిల్ గీతాన్ని విడుదల చేశారు. ఈ ర్యాప్ పాటకు వికాస్ బాడిస స్వరాలు సమకూర్చడంతో పాటు రోల్ రైడాతో కలిసి స్వయంగా ఆలపించారు. ఈ సందర్భంగా అనిల్ రావిపూడి మాట్లాడుతూ.. "టైటిల్ బాగుంది. ఈ చిత్ర కథాలోచన కూడా చాలా కొత్తగా ఉంది. ప్రవీణ్ హీరోగా నటిస్తున్న ఈ సినిమా మంచి విజయాన్ని అందుకోవాలని కోరుకుంటున్నా" అన్నారు. "వినూత్నమైన హంగర్ కామెడీ కథతో రూపొందిన చిత్రమిది. ప్రతి సీన్ ప్రేక్షకుల్ని నవ్వించడంతో పాటు థ్రిల్‌కు గురి చేస్తుంది. త్వరలో విడుదల తేదీ ప్రకటిస్తాం" అన్నారు దర్శకుడు శివ.

వెంకీ జోడీ ఎవరో!



త్రిష



నిధి అగర్వాల్



రుక్మిణీ వసంత్



వెంకటేశ్

ఈ ఏడాది ఆరంభంలో 'సంక్రాంతికి వస్తున్నాం'తో భారీ విజయాన్ని ఖాతాలో వేసుకున్నారు కథానాయకుడు వెంకటేశ్. ఇప్పుడీ జోష్‌లోనే తన తదుపరి సినిమాకి శ్రీకారం చుట్టేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. త్రివిక్రమ్ దర్శకత్వంలో రూపొందనున్న ఆ చిత్రాన్ని హారిక అండ్ హాసిని సంస్థ నిర్మించనుంది. దీనిపై ఇంత వరకు అధికారిక ప్రకటన వెలువడనప్పటికీ.. తెర వెనుక పూర్వ నిర్మాణ పనులు చకచకా జరిగిపోతున్నాయి. ఈ నేపథ్యంలోనే ఇప్పుడీ సినిమాకి సంబంధించిన మరో ఆసక్తికర విషయం బయటకొచ్చింది. త్రివిక్రమ్ గత చిత్రాల్లాగే ఇందులో ఇద్దరు నాయికలకు అవకాశముందని సమాచారం. ఇప్పుడా పాత్రల కోసం త్రిష, నిధి అగర్వాల్‌తో పాటు రుక్మిణీ వసంత్ పేర్లు పరిశీలనలో ఉన్నట్లు ప్రచారం బలంగా వినిపిస్తోంది. వీళ్లలో త్రిష ఇప్పటికే వెంకీతో 'ఆడవారి మాటలకు అర్థాలే వేరులే', 'నమో వెంకటేశ', 'బాడీగార్డ్' చిత్రాల్లో కలిసి సందడి చేసింది. ప్రస్తుతం ఆమె చేతిలో ఉన్న 'విశ్వంభర', 'కరుప్పు' పూర్తయిన నేపథ్యంలో.. వెంకీ సినిమాలో సీనియర్ భామగా ఆమెను రంగంలోకి దింపేందుకు చిత్ర వర్గాలు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. అలాగే మరో పాత్ర కోసం తొలుత రుక్మిణి పేరు వినిపించగా.. ఇప్పుడు నిధి అగర్వాల్ రేసులో ఉన్నట్లు వార్తలొస్తున్నాయి. మరి వీళ్లలో వెంకీతో జోడీ కట్టేది ఎవరన్నది తెలియాలంటే మరికొన్ని రోజులు వేచి చూడక తప్పదు. ఇది వినోదంతో నిండిన కుటుంబ కథా చిత్రంగా కానున్నట్లు చిత్ర వర్గాల్లో ప్రచారం సాగుతోంది. వచ్చే నెలలో చిత్రీకరణ మొదలయ్యే అవకాశముంది. ఇక వెంకీ ప్రస్తుతం చిరంజీవి - అనిల్ రావిపూడి సినిమాలో ఓ కీలక పాత్ర పోషించనున్నారు.

'ది 100'.. ఓ ఆయుధం!



ఆర్కే సాగర్, పవన్‌కల్యాణ్

ఆయుధం చేత పట్టకూడదని తనకి తానుగా ఓ నిర్ణయం తీసుకున్నాడు ఐపీఎస్ అధికారి విక్రాంత్. అప్పట్నుంచి ఆయన ఎలాంటి పరిస్థితుల్ని ఎదుర్కొన్నాడు? తన నిర్ణయాన్ని మార్చుకుని మళ్లీ ఆయుధం చేతపట్టాల్సిన అవసరం ఎందుకొచ్చింది? ఆ తర్వాత ఏం జరిగిందనే విషయాలు తెలియాలంటే 'ది 100' చూడాల్సిందే. ఆర్కే సాగర్ కథానాయకుడిగా... రాఘవ్ ఓంకార్ శశిధర్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రమిది. మిషా నారంగ్ కథానాయిక. రమేశ్ కరుటూరి, వెంకీ పూశడపు నిర్మాతలు. ఈ చిత్రం ఈ నెల 11న రానుంది. ఈ సందర్భంగా థియేట్రికల్ ట్రైలర్‌ని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, అగ్ర హీరో పవన్‌కల్యాణ్ విడుదల చేశారు. 'జీవితంలో జరిగిపోయింది మనం మార్చలేం, కానీ జరగబోయే దాన్ని కచ్చితంగా ఆపొచ్చు...' అంటూ సాగే ట్రైలర్ ఆద్యంతం ఆసక్తిని రేకెత్తిస్తుంది. ఇందులో ఐపీఎస్ విక్రాంత్ పాత్రలో ఆర్కే సాగర్ కనిపించనున్నారు.

ఓ సహాయ దర్శకుడి ప్రేమ ప్రయాణం



సుహాస్, మాళవిక

రామ్ జీవితంలోకి వచ్చిన ఓ భామ కథేమిటో తెలియాలంటే 'ఓ భామ అయ్యో రామ' చూడాల్సిందే. సుహాస్ కథానాయకుడిగా నటించిన చిత్రమిది. మాళవిక మనోజ్ కథానాయిక. రామ్ గోధల దర్శకుడు. హరీశ్ నల్ల నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ఈ నెల 11న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా ట్రైలర్‌ని విడుదల చేశారు. ఒక సహాయ దర్శకుడి ప్రేమ ప్రయాణంతోపాటు, ఓ ప్రామిస్‌తో ముడిపడిన కథ అని ట్రైలర్ చాటుతోంది. నిర్మాత మాట్లాడుతూ "సుహాస్ కెరీర్‌లోనే అత్యధిక వ్యయంతో రూపొందించిన చిత్రమిది. నాయకానాయికల మధ్య ప్రేమ సన్నివేశాలు, భావోద్వేగాలు మనసుల్ని హత్తుకుంటాయ"న్నారు. దర్శకుడు మాట్లాడుతూ "నవతరం ప్రేక్షకుల్ని మెప్పించేలా రూపొందించిన చిత్రమిది. ప్రతీ సన్నివేశం కలర్‌ఫుల్‌గా ఉంటుంది. రథన్ సంగీతం, మణికందన్ విజువల్స్ చాలా బాగుంటాయి" అన్నారు. దర్శకుడు హరీశ్ శంకర్ అతిథి పాత్రలో కనిపించనున్నారు.

సంతోషం మత్తు పదార్థాలతో రాదు



మిత్రశర్మ

థియేటర్లలో డబ్బుల వర్షం... ఐఫోన్ బహుమతులు అంటూ ప్రేక్షకుల్ని ఊరిస్తోంది 'వర్జిన్‌బాయ్స్' బృందం. మిత్ర శర్మ, గీతానంద్, శ్రీహాన్, జెన్నీఫర్ ఇమ్మాన్యుయేల్, రోనిత్, అన్షుల ప్రధాన పాత్రధారులుగా తెరకెక్కిన చిత్రమిది. దయానంద్ గడ్డం దర్శకత్వం వహించారు. రాజా దారపునేని నిర్మాత. ఈ చిత్రం ఈ నెల 11న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా శనివారం హైదరాబాద్‌లో ట్రైలర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కథానాయకుడు గీతానంద్ మాట్లాడుతూ "నిజమైన సంతోషం మత్తు పదార్థాల్లో ఉండదని, మనం ఏదైనా సాధించినప్పుడే వస్తుందని చెప్పే కథ" అన్నారు. మిత్రశర్మ మాట్లాడుతూ "గీతానంద్, శ్రీహాన్‌తో కలిసి నటించడం మంచి అనుభవం" అన్నారు. నిర్మాత మాట్లాడుతూ "కొన్ని థియేటర్లలో ప్రేక్షకులపై డబ్బుల వర్షం కురిసేలా... అలాగే ఈ సినిమా టికెట్ కొన్న 11 మందికి బహుమతిగా ఐఫోన్లు అందజేసేలా ఏర్పాట్లు చేశాం" అన్నారు. ఈ కార్యక్రమంలో చిత్ర బృందం పాల్గొంది.

నిబంధనల మేరకు ఛాంబర్ ఎన్నికలు జరపాల్సిందే!

తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ పాలకవర్గం గడువు ఈ నెలతో ముగుస్తోందని... నిబంధనల ప్రకారం ఎన్నికల నిర్వహణకి వెంటనే ఏర్పాట్లు చేయాలని పలువురు నిర్మాతలు డిమాండ్ చేశారు. కొంతమంది తమ సొంత ఎజెండాతో ఇప్పుడున్న పాలకవర్గాన్నే కొనసాగించాలనే ప్రతిపాదనని తెరపైకి తీసుకొచ్చారని, అందుకు తాము అంగీకరించే ప్రసక్తే లేదన్నారు. శనివారం హైదరాబాద్‌లో ఫిల్మ్ ఛాంబర్ మాజీ అధ్యక్షుడు బసిరెడ్డి నేతృత్వంలో పలువురు నిర్మాతలు సమావేశమై ఎన్నికల గురించి చర్చించారు. ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికలు జరపాలని సోమవారం ఛాంబర్‌కి వినతిపత్రం సమర్పించాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో ప్రతాని రామకృష్ణగౌడ్, మోహన్ గౌడ్, రమేశ్‌నాయుడు, సాయివెంకట్ తదితరులు పాల్గొన్నారు.

కాక్‌టెయిల్ 2 కోసం..



కృతి సనన్

త్వరలో 'తేరే ఇష్క్ మే' చిత్రంతో ప్రియుడి కోసం పోరాటం చేసే ఓ ప్రేమికురాలిగా ప్రేక్షకుల్ని పలకరించనుంది బాలీవుడ్ తార కృతి సనన్. ఇటీవలే ఈ సినిమా చిత్రీకరణ పూర్తయినట్లు తెలిపింది చిత్రబృందం. ఇప్పుడామె తన తదుపరి ప్రాజెక్టు కోసం రంగంలోకి దిగనున్నట్లు సమాచారం. కృతి, షాహిద్ కపూర్ జంటగా 'కాక్‌టెయిల్ 2' చిత్రంలో నటిస్తున్నట్లు కొన్ని రోజులుగా వార్తలు వస్తోన్న సంగతి తెలిసిందే. రష్మిక కీలక పాత్ర పోషిస్తుంది. హోమీ అదజానియా దర్శకుడు. తాజాగా ఆగస్టులో ఈ సినిమా షూటింగ్‌ను మొదలు పెట్టనున్నట్లు తెలుస్తోంది. ఈ మొదటి షెడ్యూల్‌లో కృతి భాగం కానున్నట్లు చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి. మడాక్ ఫిల్మ్స్ నిర్మిస్తోన్న ఈ చిత్రం 2026లో విడుదల కానుంది.

హీరోగా 'టూరిస్ట్ ఫ్యామిలీ' దర్శకుడు?



అభిషాన్ జీవింత్

ఇటీవలే 'టూరిస్ట్ ఫ్యామిలీ' సినిమాతో ప్రేక్షకుల మనసుల్ని హత్తుకున్న దర్శకుడు అభిషాన్ జీవింత్. ఈ చిత్రంతో సినీప్రియులకు నవ్వుతూ బతకడం నేర్పించి తొలి అడుగులోనే మంచి హిట్ కొట్టిన ఆయన.. ఇప్పుడు హీరోగా తెరపైకి రావడానికి రంగం సిద్ధం చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. తాజాగా అభిషాన్ కథానాయకుడిగా 'కరెక్టెడ్ మాచి' అనే సినిమా రూపొందుతున్నట్లు సమాచారం. ఇందులో ఆయనకు జోడీగా అనస్వర రాజన్ నటించనుందట. "ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన స్క్రిప్ట్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ చిత్రానికి 'టూరిస్ట్ ఫ్యామిలీ' చిత్రబృందంలోని ఓ వ్యక్తి దర్శకత్వం వహించనున్నారు. త్వరలో ఈ చిత్రంలోని ఇతర నటీనటులు, నిర్మాణ సంస్థ వివరాల్ని అధికారికంగా వెల్లడించనున్నార"ని అభిషాన్ సన్నిహిత వర్గాలు తెలిపాయి.

కష్టానికి తగిన ప్రతిఫలం దక్కింది



శ్వేత, గౌతమ్ కృష్ణ, సతీశ్

గౌతమ్ కృష్ణ హీరోగా నవీన్ కుమార్ తెరకెక్కించిన చిత్రం 'సోలో బాయ్'. సెవెన్ హిల్స్ సతీశ్ నిర్మించారు. రమ్య పసుపులేటి, శ్వేత అవస్తి కథానాయికలు. ఈ సినిమా ఇటీవల విడుదలైన నేపథ్యంలో చిత్ర బృందం శనివారం హైదరాబాద్‌లో థాంక్యూ మీట్ ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా హీరో గౌతమ్ కృష్ణ మాట్లాడుతూ.. "ఒక మంచి సినిమా చూశామనే అనుభూతితో ప్రేక్షకులు థియేటర్ల నుంచి బయటకొస్తుంటే నాకు చాలా ఆనందంగా ఉంది. ఈ చిత్రానికి కథే హీరో. దీన్ని చూసి ఆదరిస్తున్న అందరికీ మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు" అన్నారు. "ఈ చిత్రాన్ని ప్రేక్షకులు గొప్పగా ఆదరిస్తున్నారు. మౌత్ టాక్‌తో ముందుకు తీసుకెళ్తున్నారు. మా కష్టానికి తగిన ప్రతిఫలం దక్కింది" అన్నారు నిర్మాత సతీశ్. దర్శకుడు నవీన్ కుమార్ మాట్లాడుతూ.. "మంచి కథా బలమున్న చిత్రం వస్తే దాన్ని తెలుగు ప్రేక్షకులు ఎంతలా ఆదరిస్తారో మా సినిమాతో మరోసారి నిరూపించారు" అన్నారు. ఈ కార్యక్రమంలో అనిత చౌదరి, పూర్ణాచారి, శ్వేత అవస్తి తదితరులు పాల్గొన్నారు.

భార్యాభర్తలా... పందెం కోళ్లా!



తరుణ్ భాస్కర్, ఈషా రెబ్బా


దర్శకుడు తరుణ్ భాస్కర్ హీరోగా ఏఆర్ సజీవ్ దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కింది. ఎస్ ఒరిజినల్స్, మూవీవేర్స్ స్టూడియోస్ సంస్థలు సంయుక్తంగా నిర్మించాయి. ఈషా రెబ్బా కథానాయిక. ఈ చిత్రానికి 'ఓం శాంతి శాంతి శాంతిః' అనే పేరును ఖరారు చేశారు. ఈ మేరకు శనివారం ఈ చిత్ర టైటిల్, కాన్సెప్ట్ వీడియోను విడుదల చేశారు. ఆ ప్రచార చిత్రంలో ఈషాను కొండవీటి ప్రశాంతి అనే పల్లెటూరి అమ్మాయిగా.. తరుణ్‌ను వ్యాన్ యజమాని అంబటి ఓంకార్ నాయుడుగా పరిచయం చేశారు. పెళ్లి తర్వాత వీళ్లిద్దరి మధ్య జరిగే గొడవల్ని పందెంకోళ్లను తలపించేట్టుగా ఆసక్తికరంగా చూపించారు. మరి ఈ ఫ్యామిలీ డ్రామా తెరపై ఎలాంటి అనుభూతి పంచనుందో తెలియాలంటే ఆగస్టు 1న విడుదలయ్యే సినిమా చూడాల్సిందే. ఈ చిత్రానికి సంగీతం: జై క్రిష్, మాటలు: నంద కిశోర్ ఈమాని, ఛాయాగ్రహణం: దీపక్ యెరగరా.

ఈనాడు బిజినెస్ వారాంతం

నవతరం సంపన్నుల ఆలోచన మారుతోంది

- రిస్కు తీసుకోవడానికి సిద్ధం
- సంపద కాపాడుకుంటూనే, మరింత పెంచడంపై దృష్టి
- పీఈ, వెంచర్ క్యాపిటల్, ఏఐఎఫ్ వైపు మొగ్గు

ధనికులు తమ వద్ద ఉన్న సొమ్మును ఏం చేస్తారు.. పెట్టుబడులకు సాధ్యమైనంత ఎక్కువ మొత్తం కేటాయించి, మిగిలిన సొమ్మునే ఖర్చు చేస్తారు. వారు ఎక్కడ పెట్టుబడి పెడతారనే సందేహం రాక మానదు. మనదేశంలో అత్యధికులు స్థిరాస్తులు, బంగారం, షేర్లు వంటివి కొంటారు. కొంత భిన్నమైన ఆసక్తి ఉన్నవాళ్లు పెయింటింగ్‌లు, కళాకృతులపైనా పెట్టుబడి పెడుతున్నారు. ఇటీవల మరింత భిన్నమైన పెట్టుబడి సాధనాలైన ప్రైవేట్ ఈక్విటీ (పీఈ), ఏఐఎఫ్ (ఆల్టర్నేటివ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్స్)లలోనూ వీరు పెట్టుబడి పెడుతున్నారు. ఇవి కూడా ఈక్విటీ షేర్ల తరహా పెట్టుబడులే అయినా, సాధారణ ఈక్విటీ షేర్లకు కాస్త భిన్నమైనవి. కుటుంబ సంపదను నిర్వహించే 'ఫ్యామిలీ ఆఫీసు'లు.. పీఈ, ఏఐఎఫ్ పెట్టుబడులకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాయి. ఇందులో రిస్కు (నష్టభయం) ఎక్కువ. లాభాలూ అధికమే. అంటే ఎక్కువ రిస్కు తీసుకోవడానికి నవతరం సంపన్నులు సిద్ధంగా ఉంటున్నారు. అనుకోని విధంగా కొంత సంపదను కోల్పోయినా, ఇబ్బంది పడే పరిస్థితి లేకపోవడమే.. వీరి ధైర్యానికి కారణం. సంప్రదాయ పెట్టుబడి సాధనాల కంటే మిన్నగా ఆర్జించే వీలున్నందునే కొత్త పథకాలతో ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. తాజాగా 'ద ఇండియన్ ఫ్యామిలీ ఆఫీస్ ప్లేబుక్' పేరుతో ఈవై, జూలియస్ బేర్ విడుదల చేసిన నివేదిక ఈ విషయాన్ని స్పష్టం చేసింది.



గణనీయంగా పెరుగుతున్న ఫ్యామిలీ ఆఫీసులు

మనదేశంలో ఫ్యామిలీ ఆఫీసుల సంఖ్య 2018లో 45 మాత్రమే. ఇప్పుడు 300కు మించాయి. నాలుగో వంతు ఫ్యామిలీ ఆఫీసుల ప్రాధాన్యం, సంపదను కాపాడటమే. మూడొంతుల ఆఫీసులు మాత్రం 'సంపదను పెంచుకోవడానికి అందుబాటులో ఉన్న భిన్నమైన పెట్టుబడుల'పై మొగ్గు చూపుతున్నట్లు ఈవై ఇండియా కో-లీడర్, పార్టనర్ సురభి మార్వా వివరించారు.

- ప్రైవేట్ ఈక్విటీతో పాటు వెంచర్ కేపిటల్ పెట్టుబడులు, విదేశాల్లో స్థిరాస్తులు కొనడం, ఇతర సంప్రదాయేతర పెట్టుబడులు పెట్టడం చేస్తున్నారు.

2030కి రూ.100 లక్షల కోట్లకు చేరే వీలు

ఈ నివేదిక కోసం నిర్వహించిన సర్వేల్లో పాల్గొన్న ఫ్యామిలీ కార్యాలయాల పెట్టుబడులను పరిశీలిస్తే.. సగం కంటే ఎక్కువ సొమ్మును అధిక వృద్ధికి అవకాశం ఉన్న ఆస్తుల్లో పెట్టినట్లు స్పష్టమవుతోంది. ప్రైవేట్ ఈక్విటీ, వెంచర్ కేపిటల్ పెట్టుబడులు 20% కంటే ఎక్కువగా ఉన్నాయి. సంప్రదాయ పెట్టుబడులైన షేర్లు, బాండ్లు కొనుగోలు చేయడంతో పాటు కొంత నగదు కూడా అందుబాటులో ఉంచుకుంటున్నారు. ప్రైవేట్ క్రెడిట్, రీట్, ఇన్విట్, ఆర్ట్ పెట్టుబడులు కూడా ఉంటున్నాయి. మనదేశంలో పీఎంఎస్ (పోర్ట్‌ఫోలియో మేనేజ్‌మెంట్ సర్వీస్), ఏఐఎఫ్ పెట్టుబడులు 2030 నాటికి రూ.100 లక్షల కోట్లకు చేరుకుంటాయని ఈ నివేదిక అంచనా వేసింది.

నిబంధనల సరళీకరణ

కేటగిరీ-2 ఏఐఎఫ్ లకు వర్తించే నిబంధనలను మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ ఇటీవల సులభతరం చేసింది. ఏఐఎఫ్ పెట్టుబడులకు దీర్ఘకాలిక మూలధన పన్ను విధానం వర్తిస్తుందని స్పష్టం చేసింది. దీంతో ఏఐఎఫ్‌లకు ఆకర్షణ ఏర్పడింది.

- ఇదేకాకుండా విదేశాల్లో పెట్టుబడి పెట్టేందుకూ అవకాశాలు పెరిగాయి. ఇందుకు వర్తించే నిబంధనలూ సరళంగా మారాయి. అందువల్ల మనదేశం నుంచి విదేశాల్లో పెట్టిన పెట్టుబడుల మొత్తం 2019-20 లో 18.8 బిలియన్ డాలర్లు (సుమారు రూ.1.60 లక్షల కోట్లు) కాగా, 2023-24 నాటికి ఈ మొత్తం 31.7 బిలియన్ డాలర్ల (సుమారు రూ.2.71 లక్షల కోట్ల)కు పెరిగింది. సంపన్నులైన భారతీయులు అమెరికా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, యూఏఈ, ఐరోపా దేశాల్లో స్థిరాస్తి, ప్రైవేట్ ఈక్విటీ, వెంచర్ కేపిటల్ పెట్టుబడులు అధికంగా పెడుతున్నారని తెలుస్తోంది.
- గుజరాత్‌లోని గిఫ్ట్ సిటీలో ఫ్యామిలీ ఆఫీసులు అధికంగా ఏర్పాటవుతున్నాయి. పన్ను రాయితీలు, ప్రోత్సాహకాలు దీనికి ప్రధాన కారణం.



వారసత్వ ప్రణాళికా కీలకమే

వివిధ పెట్టుబడులు పెడుతూనే.. అధిక సామర్థ్యం, వారసత్వ ప్రణాళిక, సంస్థాగత నిర్మాణానికి ఫ్యామిలీ ఆఫీసులు ప్రాధాన్యమిస్తున్నాయి. సంపన్న కుటుంబాల్లో 59% వీలునామాలు సిద్ధం చేసుకోవడం ఆసక్తికర అంశం. దాదాపు 19% సంపన్న కుటుంబాలు ఎల్ఎల్‌పీ/ట్రస్ట్‌లు పెట్టుకున్నాయి. ఇవన్నీ పరిశీలిస్తే.. సంస్థాగత నిర్మాణం వైపు సంపన్నులు మొగ్గుచూపుతున్నట్లు స్పష్టమవుతోంది. స్థిర వృద్ధి, దాతృత్వ కార్యక్రమాలకు కొంతమొత్తం కేటాయింపు, నైతిక విలువలకు ప్రాధాన్యం ఇవ్వడమూ కనిపిస్తోంది. దీని కోసం అవసరమైన వృత్తి నిపుణులను నియమించుకుంటున్నారు కూడా.

- ఈనాడు, హైదరాబాద్

డ్రోన్ల తయారీకి ప్రోత్సాహకాలు!



దిల్లీ: పౌర, రక్షణ రంగ అవసరాలను తీర్చే డ్రోన్లను తయారు చేసే కంపెనీల కోసం 234 మిలియన్ డాలర్ల (దాదాపు రూ.2000 కోట్ల) ప్రోత్సాహక పథకాన్ని ప్రభుత్వం ఆవిష్కరించనున్నట్లు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ వార్తా సంస్థ రాయిటర్స్ తెలిపింది. పహల్గాంలో పాకిస్థాన్ జరిపిన మారణహోమం అనంతర పరిణామాల్లో, ఇరు దేశాల మధ్య జరిగిన యుద్ధంలో డ్రోన్లు కీలక పాత్ర పోషించాయి. ఈ నేపథ్యంలోనే దేశీయంగానే డ్రోన్ల తయారీ పెంచాలని నిర్ణయించినట్లు చెబుతున్నారు.

పథకం పరిధిలోకి ఇవి: మూడేళ్ల పాటు ఈ పథకం ఉంటుంది. డ్రోన్లు, విడిభాగాలు, సాఫ్ట్‌వేర్, కౌంటర్ డ్రోన్ వ్యవస్థలు, సేవలు.. తదితరాలు ఈ పథకం పరిధిలోకి రావొచ్చని సమాచారం.

ఆంక్షలున్నా..: డ్రోన్ల దిగుమతిపై మనదేశం నిషేధం విధించింది. కానీ విడిభాగాల దిగుమతులపై ఆంక్షలు లేవు. దేశీయంగానే విడిభాగాలను సమీకరించే డ్రోన్ల తయారీదార్లకు అదనపు ప్రోత్సాహకాలు ఇవ్వాలని కేంద్రం భావిస్తున్నట్లు ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.

పారిశ్రామిక దుర్ఘటనల్లో ప్రాణాలు పోతే..

బీమా పరిహారాలు ఇలా

ఈనాడు - హైదరాబాద్

పరిశ్రమల్లో జరిగే ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్న వారి కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతుంటాయి. అలాంటి సందర్భాల్లో కంపెనీల యాజమాన్యాలు/ప్రభుత్వం ప్రకటించే ఆర్థికసాయంతో పాటు బీమా పరిహారం ఏమైనా లభిస్తుందా అనే విషయమై చర్చ సాగుతోంది.

తెలంగాణలోని పాశమైలారంలో ఉన్న రసాయన, ఫార్మా రంగ కంపెనీ సిగాచీ ఇండస్ట్రీస్ ప్లాంటులో ఇటీవల సంభవించిన ఘోర ప్రమాదంలో కాలిపోయిన వారు ఎవరో గుర్తించేందుకు, మృతదేహాలకు డీఎన్ఏ టెస్టులు చేయాల్సిన పరిస్థితి. ఈ నిర్ధారణలు పూర్తయ్యే వరకు పరిహారం అందడం కుదరకపోవచ్చు.

ఇలాంటి పరిశ్రమల్లో..

సాధారణంగా రసాయన, ఫార్మా సంస్థలు ఇండస్ట్రియల్ ఆల్ రిస్క్ (ఐఏఆర్) పాలసీ తీసుకుంటాయి. ఈ పాలసీ అగ్ని ప్రమాదం, పేలుడు, యంత్రాల బ్రేక్‌డౌన్, ప్రకృతి వైపరీత్యాలు, ఇతర ఆకస్మిక నష్టాలను భర్తీ చేస్తుంది. ఈ పాలసీలో ప్రధానంగా రెండు భాగాలుంటాయి. ప్రమాదం కారణంగా ఆస్తికి కలిగిన నష్టానికి పరిహారం, వ్యాపారం సాగకపోవడం వల్ల వచ్చిన నష్టాన్ని భర్తీ చేయడం.

- సిగాచీ ఇండస్ట్రీస్‌కు పూర్తి కవరేజీ ఉన్న ఐఏఆర్ ఉన్నట్లు అందుబాటులో ఉన్న నివేదికల ప్రకారం తెలుస్తోంది. ఈ పాలసీ కింద ప్లాంటులోని యంత్రాలు, భవన నిర్మాణాలు, ఇతర ఆస్తులకు జరిగిన నష్టానికి పూర్తి పరిహారం అందుతుంది. వ్యాపారానికి ఆటంకం కింద.. పేలుడు కారణంగా ఉత్పత్తి నిలిచిపోవడం వల్ల కంపెనీకి వచ్చే ఆదాయ నష్టం, స్థిర వ్యయాలు (సిబ్బంది జీతాలు, అద్దెలు, విద్యుత్ బిల్లుల వంటివి) కవర్ అవుతాయి. సిగాచీకి 90 రోజుల ఇండెమ్నిటీ వ్యవధితో వ్యాపార నష్టం (బిజినెస్ ఇంటరప్షన్-బీఐ) ఉన్నట్లు కంపెనీ నివేదికలు చెబుతున్నాయి. అంటే, మూడు నెలల వరకూ కంపెనీకి ఆదాయ నష్టం, స్థిర వ్యయాలకు పరిహారం లభిస్తుందని అనుకోవచ్చు.



సిబ్బందికి రూ.10 లక్షల వరకు

కంపెనీలు గ్రూప్ పర్సనల్ యాక్సిడెంట్ పాలసీని కూడా కలిగి ఉంటాయి. ఇది సంస్థ ఉద్యోగులు ఆకస్మికంగా మరణించడం, శాశ్వత వైకల్యం లాంటివి సంభవించినప్పుడు పరిహారం ఇస్తుంది. సిగాచీ కంపెనీకి కూడా ఈ పాలసీ ఉంటే మరణించిన కార్మికుల కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ.10 లక్షల వరకు నష్టపరిహారం లభించే అవకాశం ఉంది. హానికారక రసాయనాలు వాడే కంపెనీలు థర్డ్ పార్టీ బీమానూ కలిగి ఉంటాయి.

దేశ వ్యాప్తంగా చర్చ..

సిగాచీ దుర్ఘటన తర్వాత దేశంలోని రసాయన, ఫార్మా పరిశ్రమలలో భద్రతా ప్రమాణాలపై తీవ్రంగా చర్చ జరుగుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నాయి. తెలంగాణలో ఉన్న పరిశ్రమల్లో భద్రతా తనిఖీలు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆధునిక యంత్రాల వినియోగం, కార్మికులకు శిక్షణ, భద్రత అంశాల ప్రాముఖ్యాన్ని పెంచాల్సిన అవసరాన్ని ఈ దుర్ఘటన సూచిస్తోంది.

బీమా క్లెయింనకు సమయం పడుతుంది

ఇలాంటి పెద్ద పారిశ్రామిక దుర్ఘటనల్లో క్లెయిం సెటిల్‌మెంట్‌కు కొంత సమయం పడుతుంది. నష్టాన్ని అంచనా వేయడం, బాధితుల వివరాలు కచ్చితంగా నివేదించడం ఎంతో కీలకం. బీమా సంస్థ నియమించిన సర్వేయర్లు దుర్ఘటన స్థలాన్ని సందర్శించి, నష్ట తీవ్రతను అంచనా వేస్తారు. ఆస్తి నష్టం లాంటివి త్వరగానే తేల్చినా, ఇతర అంశాలకు సంబంధించిన నష్టాలను లెక్కించేందుకు సమయం పడుతుంది. ఇవన్నీ పూర్తయ్యాకే బీమా సంస్థ క్లెయిం చెల్లించేందుకు అంగీకరిస్తుంది. కొన్నిసార్లు రీఇన్సూరెన్స్ సంస్థలూ ఈ లెక్కలను మరోసారి తనిఖీ చేయొచ్చు. అప్పుడు మరింత ఆలస్యం అయ్యే అవకాశాలు లేకపోలేదు. పబ్లిక్ లయబిలిటీ, వర్క్‌మన్ కాంపన్సేషన్, గ్రూప్ పర్సనల్ యాక్సిడెంట్ పాలసీలు బాధితుల కుటుంబాలకు త్వరగా నష్ట పరిహారం అందించేందుకు రూపొందించినవి.

ఎల్ఐసీ నుంచి 2 కొత్త పాలసీలు

ఈనాడు, హైదరాబాద్: యువతరాన్ని లక్ష్యంగా చేసుకుని లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ) రెండు కొత్త పాలసీలను ఆవిష్కరించింది. పొదుపు, బీమాను ఒకే చోట అందించే నాన్ పార్టిసిపేటింగ్, నాన్ లింక్డ్ ఎండోమెంట్ పాలసీలివి.

పొదుపును ప్రోత్సహించేలా..: చిన్న వయసు నుంచే పొదుపు చేసి, పదవీ విరమణ తర్వాత అవసరాలకు ఉపయోగపడేలా చూసుకోవాలనుకునే వారిని లక్ష్యంగా చేసుకుని తెచ్చిన పాలసీ ఎల్ఐసీ నవ జీవన్ శ్రీ. ఈ పాలసీని 30 రోజుల వయసు నుంచి 60 ఏళ్ల వారి వరకు ఎంచుకోవచ్చు.

- ఇది పరిమిత వ్యవధి ప్రీమియం చెల్లింపు పాలసీ. ప్రీమియాన్ని 6, 8, 10, 12 ఏళ్ల పాటు చెల్లించేలా ఎంచుకోవచ్చు.
- పాలసీ వ్యవధి 10-16 ఏళ్లపాటు ఎంచుకోవచ్చు. గరిష్ఠంగా 20 ఏళ్లపాటు కొనసాగుతుంది. కనీస పాలసీ విలువ రూ.5 లక్షలు. గరిష్ఠ పరిమితి లేదు.
- పాలసీకి గ్యారంటీడ్ అడిషన్స్ వర్తిస్తుంది. ఇది పాలసీ వ్యవధిని బట్టి ఆధారపడి ఉంటుంది. చెల్లించిన ప్రీమియానికి 8.50 - 9.50% ఇది ఉంటుంది.

ఒకేసారి చెల్లించేవారికి: ఏక మొత్తంలో ప్రీమియం చెల్లించాలని ఆలోచించే వారికోసం ఎల్ఐసీ నవ జీవన్ శ్రీ సింగిల్ ప్రీమియం పాలసీని తీసుకొచ్చింది.

- ఇందులో కనీస ప్రీమియం రూ.1 లక్ష. చెల్లించిన ప్రీమియానికి 10 రెట్ల వరకు బీమా రక్షణ లభిస్తుంది. గరిష్ఠ పరిమితి లేదు.
- 30 రోజుల వయసు నుంచి 60 ఏళ్లవారెవరైనా తీసుకోవచ్చు. కనీస పాలసీ వ్యవధి 5 ఏళ్లు. గరిష్ఠంగా 20 ఏళ్లు.
- పాలసీ సంవత్సరంలో చెల్లించిన ప్రీమియంలో ప్రతి రూ.1,000కి రూ.85 చొప్పున గ్యారంటీడ్ అడిషన్స్‌ను ఎల్ఐసీ అందించనుంది.

ఈ రెండు పాలసీలకూ యాక్సిడెంటల్ డెత్ బెనిఫిట్ రైడర్, న్యూ టర్మ్ అస్యూరెన్స్, ప్రీమియం వేవర్ లాంటి అనుబంధ పాలసీలను జోడించుకోవచ్చు.

కోడి గుడ్లు

6న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	560
వరంగల్	562
విజయవాడ	570
గోదావరి	535
విశాఖపట్నం	560
చిత్తూరు	633

నాసిరకం హెల్మెట్ల తయారీ నియంత్రించాలి

రాష్ట్రాలకు కేంద్రం ఆదేశం



దిల్లీ: ద్విచక్ర వాహనదార్ల భద్రతకు ముప్పు తెస్తున్న నాసిరకం హెల్మెట్లను తయారు చేసే, విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. బీఐఎస్ (భారత ప్రమాణాల మండలి) గుర్తింపు ఉన్న హెల్మెట్లనే వాడాలని, వాహనదార్లకు వినియోగదారు వ్యవహారాల విభాగం, బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) సూచించాయి. బీఐఎస్ ధ్రువీకరణ లేని హెల్మెట్ల తయారీ, విక్రయంపై కఠిన చర్యలు తీసుకోవాలని వినియోగదారు వ్యవహారాల విభాగం స్పష్టం చేసింది. 'భారత రహదారులపై సుమారు 21 కోట్ల ద్విచక్ర వాహనాలు పరుగులు తీస్తున్నాయి. మోటారు వాహనాల చట్టం-1988 ప్రకారం వీరంతా హెల్మెట్ ధరించడం తప్పనిసరి' అని వెల్లడించింది. 2025 జూన్ వరకు చూస్తే, దేశవ్యాప్తంగా బీఐఎస్ లైసెన్సులున్న హెల్మెట్ తయారీ సంస్థలు 176 ఉన్నాయి. 'రోడ్ల పక్కన విక్రయిస్తున్న చాలా హెల్మెట్లకు బీఐఎస్ ధ్రువీకరణ లేదని గుర్తించాం. ఇలాంటివి వాడటం వల్ల, రోడ్డు ప్రమాదం జరిగినప్పుడు వాహనదారు ప్రాణానికి ముప్పు వాటిల్లే అవకాశం ఎక్కువగా ఉంటుంద'ని అధికారిక ప్రకటన వివరించింది. తయారీదార్లు నాణ్యతా ప్రమాణాలు పాటించేలా చూసేందుకు, ఆయా ప్లాంట్ల పర్యవేక్షణకు చర్యలు చేపడుతున్నామని తెలిపింది. గతేడాది 500కి పైగా హెల్మెట్ల శ్యాంపిళ్లను పరీక్షించడంతో పాటు, 30కి పైగా తనిఖీలను నిర్వహించారు. దిల్లీలోనే లైసెన్సు రద్దు అయిన /గడువు తీరిన 9 తయారీ సంస్థల నుంచి నిబంధనలకు విరుద్ధంగా ఉన్న 2,500కి పైగా హెల్మెట్లను అధికారులు జప్తు చేశారు.

రెండేళ్లలో 2,000 తెరలకు

పీవీఆర్ ఐనాక్స్ ఈడీ సంజీవ్ కుమార్



దిల్లీ: సినిమా ఎగ్జిబిటర్ పీవీఆర్ ఐనాక్స్ సంస్థ వచ్చే రెండేళ్లలో మరో 200 తెరలను జత చేర్చుకోవాలనే ప్రణాళికలో ఉంది. ఇందుకోసం సుమారు రూ.400 కోట్ల వరకు పెట్టుబడులు పెట్టబోతున్నట్లు సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంజీవ్ కుమార్ బిజ్లి తెలిపారు. ప్రధానంగా దక్షిణాదిపై దృష్టి సారించామని, తాజాగా హైదరాబాద్‌లో 4 తెరలను ప్రారంభించినట్లు పేర్కొన్నారు. చిన్న నగరాలు, పట్టణాల్లోనూ తెరలను జత చేస్తామని వెల్లడించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే 100 తెరలను ప్రారంభించేందుకు ప్రణాళిక సిద్ధం చేయగా, ఏప్రిల్-జూన్‌లోనే అందులో 20 అందుబాటులోకి వచ్చాయన్నారు. 100 తెరల్లో 40 తెరలను హైదరాబాద్, బెంగళూరు, హుబ్లీ సహా మరికొన్ని దక్షిణాది నగరాల్లో ప్రారంభిస్తామని వెల్లడించారు. మిగతా వాటిని ముంబయి, దిల్లీ, గురుగ్రామ్‌తో పాటు సిలిగురి, జబల్‌పుర్, లేహ్, గ్యాంగ్‌టక్ వంటి చిన్న పట్టణాల్లో నిర్మిస్తున్నట్లు తెలిపారు. కొత్త తెరల్లో చిన్న పట్టణాల్లో 20%, దక్షిణాది రాష్ట్రాల్లో 40% జత చేయాలనుకుంటున్నామన్నారు. 2026-27లో 80 కొత్త తెరలను ప్రారంభించాలన్నది ప్రణాళిక అని, ఇవి 100కు చేరే అవకాశమూ ఉందని.. ఇందులో 40% తెరలు దక్షిణాదినే ఉంటాయని వివరించారు.

- తెలంగాణలో పీవీఆర్ ఐనాక్స్‌కు 114 తెరలున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో మరో 22 కొత్త తెరలు జత కాబోతున్నాయి. 'తెలుగు ప్రజలు సినిమాలను ఎక్కువగా ఇష్టపడతారు. వేగంగా వృద్ధి చెందుతున్న హైదరాబాద్‌లో మల్టీప్లెక్స్‌లకు ఇంకా అవకాశం ఉంద'ని సంజీవ్ కుమార్ తెలిపారు.

ఒక్కో తెరకు రూ.3.50 కోట్లు: ఒక కొత్త తెర ప్రారంభానికి సగటున రూ.3.5 కోట్లు వ్యయం అవుతుందని సంజీవ్ తెలిపారు. ఫోకో (ఫ్రాంఛైజ్ ఓన్డ్ కంపెనీ ఆపరేటెడ్) నమూనాలో అయితే ఇందులో తాము 50%, మిగిలింది స్థానిక యజమాని పెట్టుబడి పెడతారని వివరించారు. రెండేళ్లలో జత కాబోయే 200 తెరలను కలుపుకుంటే పీవీఆర్ ఐనాక్స్ 2,000 తెరలకు చేరుకుంటుందని చెప్పారు.

కొత్త ఇంధనంతో రిలయన్స్ విలువ జూమ్!

- రూ.4.25 లక్షల కోట్లు పెరిగే అవకాశం
- మోర్గాన్ స్టాన్లీ నివేదిక

దిల్లీ: కొత్త ఇంధనంతో పాటు కృత్రిమ మేధ (ఏఐ)లో పెట్టిన పెట్టుబడుల వల్ల రిలయన్స్ ఇండస్ట్రీస్ (ఆర్ఐఎల్) మార్కెట్ విలువను మరో 50 బిలియన్ డాలర్లు (సుమారు రూ.4.25 లక్షల కోట్లు) పెరుగుతుందని అంతర్జాతీయ ఆర్థిక సేవల సంస్థ మోర్గాన్ స్టాన్లీ తాజా నివేదికలో అంచనా వేసింది. ముకేశ్ అంబానీకి చెందిన ఆర్ఐఎల్ ప్రస్తుత మార్కెట్ విలువ 240 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.20.50 లక్షల కోట్లు)గా ఉంది. భవిష్యత్తు వృద్ధి కోసం కొత్త ఇంధనం, జెన్ ఏఐపై ఎక్కువగా పెట్టుబడులు పెడతామని సంస్థ ఇప్పటికే ప్రకటించడాన్ని గుర్తు చేసింది.

- జెన్ ఏఐకి అవసరమైన మౌలిక వసతులను జామ్‌నగర్ కాంప్లెక్స్‌లో సంస్థ ఏర్పాటు చేస్తోంది. ఇవి రెండేళ్లలో పూర్తవుతాయి. 1 గిగావాట్ సామర్థ్యంతో డేటా కేంద్రాన్నీ నిర్మిస్తోంది. ఈ డేటా కేంద్రం కోసం 24 గంటల పాటు 1.3 గిగావాట్ విద్యుత్తు సరఫరా కావాలి. జియో కోసం ఎన్‌విడియా చిప్‌సెట్లను సంస్థ భారీగా వినియోగించనుంది.
- రిలయన్స్ కొత్త ఇంధన ప్రణాళికల్లో భాగంగా, గుజరాత్‌లోని 2,000 ఎకరాల సముదాయంలో లిథియం ఫాస్పేట్ బ్యాటరీల తయారీ, గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి వంటివి ఉన్నాయి. 2026 చివరికి 10 గిగావాట్ సౌర విద్యుత్తు సామర్థ్యాన్ని సమకూర్చుకోవాలని సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది.

ప్రొప్రైటరీ ట్రేడింగ్ సంస్థలు లేకపోతే.. రిటెయిల్ ట్రేడింగ్‌పై ప్రభావం పడొచ్చు!

జెరోధా సీఈఓ నితిన్ కామత్



దిల్లీ: జేన్ స్ట్రీట్ వంటి ప్రొప్రైటరీ ట్రేడింగ్ సంస్థలు, మార్కెట్‌లో పాల్గొనకపోతే రిటెయిల్ ట్రేడింగ్ కార్యకలాపాలపై ప్రభావం పడే అవకాశం ఉందని జెరోధా వ్యవస్థాపకుడు, సీఈఓ నితిన్ కామత్ పేర్కొన్నారు. ఆప్షన్స్ ట్రేడింగ్ పరిమాణంలో 50% వరకు ఈ సంస్థల నుంచే వస్తున్నాయని తెలిపారు. ప్రొప్రైటరీ ట్రేడింగ్ దిగ్గజాలపై మనం ఎంతలా ఆధారపడుతున్నామో, రాబోయే కొన్ని రోజుల్లో ఎఫ్ అండ్ ఓ పరిమాణాలు వెల్లడిస్తాయని వివరించారు. న్యూయార్క్‌కు చెందిన హెడ్జ్ ఫండ్ జేన్ స్ట్రీట్ (జేఎస్) మన స్టాక్ మార్కెట్లో చట్ట వ్యతిరేక విధానాల ద్వారా రూ.36,671 కోట్లు అక్రమంగా ఆర్జించిందని సెబీ గుర్తించి, రూ.4,843 కోట్ల భారీ మొత్తం జరిమానా విధించింది.

అధిక పరిమాణంపై ఆధారపడటం వల్లే.. ఉదయ్ కోటక్: ఫీజుల రూపంలో అధిక ఆదాయం ఆర్జించేందుకు 'వాల్యూమ్స్‌పై ఎక్కువగా ఆధారపడటం, మూలాలపై తక్కువగా దృష్టి సారించడం' వంటి ఎక్స్ఛేంజీలు, బ్రోకరేజీల వ్యాపార నమూనాపై కోటక్ మహీంద్రా బ్యాంక్ ప్రమోటర్, నాన్-ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఉదయ్ కోటక్ 'ఎక్స్' వేదికగా ఆందోళన వెలిబుచ్చారు. స్టాక్ మార్కెట్‌లో ఇటీవలి కార్యకలాపాలు గమనిస్తే.. అధిక డబ్బు కలిగిన మదుపర్లకు ప్రయోజనం కలుగుతోందని తేలుతుందన్నారు. మార్కెట్ ప్రాథమిక విధి 'మూలనిధి ఏర్పాటును ప్రోత్సహించడం, సహేతుక ధరను ఆవిష్కరించడం'గా ఆయన పేర్కొన్నారు.

మార్కెట్లో మోసాలను సహించం: సెబీ ఛైర్మన్

ముంబయి: మార్కెట్లో మోసపూరిత లావాదేవీలను ఎట్టిపరిస్థితుల్లోనూ సహించబోమని సెబీ ఛైర్మన్ తుహిన్ కాంత పాండే పేర్కొన్నారు. మన స్టాక్‌మార్కెట్లో చట్టవ్యతిరేక విధానాల ద్వారా, అక్రమంగా రూ.వేల కోట్లు ఆర్జించిన, న్యూయార్క్ కేంద్రంగా పని చేసే హెడ్జ్‌ఫండ్ మేనేజర్ జేన్ స్ట్రీట్‌పై సెబీ రూ.4843 కోట్ల జరిమానా విధించిన నేపథ్యంలో, ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. ఎక్స్ఛేంజీలు, సెబీ పరిధిలో మార్కెట్ లావాదేవీలపై నిఘా పెంచినట్లు వివరించారు. ఇతర విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపర్లు ఎవరైనా ఇలా చేశారా అని ప్రశ్నించగా.. అక్రమాలకు ఎవరు పాల్పడినా సహించేది లేదని పాండే తేల్చి చెప్పారు. నియంత్రణను మరీ అధికం చేయబోమని.. అయితే పారదర్శకత కోసం నిశిత పరిశీలన మాత్రం కొనసాగిస్తామని పాండే స్పష్టం చేశారు.

10 నుంచి స్మార్ట్‌వర్క్స్ ఐపీఓ

దిల్లీ: హైదరాబాద్ సహా ప్రధాన నగరాల్లో కార్యాలయ స్థలాలను నిర్వహిస్తున్న స్మార్ట్‌వర్క్స్ కో-వర్కింగ్ స్పేసెస్ సంస్థ, నిధులు సమీకరించడానికి తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ)కు వస్తోంది. ఇష్యూ ఈనెల 10న మొదలై 14న ముగియనుంది. తాజాగా జారీ చేసే షేర్ల పరిమాణాన్ని రూ.550 కోట్ల నుంచి రూ.445 కోట్లకు తగ్గించింది. ఆఫర్ ఫర్ సేల్ కింద ప్రస్తుత వాటాదార్లు విక్రయించే షేర్ల పరిమాణమూ 67.59 లక్షల నుంచి 33.79 లక్షలకు తగ్గించింది. సమీకరించిన నిధుల్లో రూ.226 కోట్లను కొత్త సెంటర్ల ఏర్పాటు, సెక్యూరిటీ డిపాజిట్ల కోసం వినియోగించనున్నారు. రూ.114 కోట్లను రుణాలు - సాధారణ కార్పొరేట్ అవసరాలకు ఉపయోగించనున్నారు.

మరో 3 వ్యూహాత్మక చమురు నిల్వ కేంద్రాలు

- దేశీయ ఇంధన భద్రతే ప్రధానం
- సాధ్యాసాధ్యాలు పరిశీలిస్తున్న ఇంజినీర్స్ ఇండియా



దిల్లీ: అంతర్జాతీయంగా సరఫరా అంతరాయాలు ఏర్పడినా, ఇంధన భద్రత కోసం మన దేశం కొత్తగా 3 వ్యూహాత్మక చమురు నిల్వ కేంద్రాలను నిర్మించాలని యోచిస్తోంది. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం, మంగళూరు (కర్ణాటక), పాదూరు (తమిళనాడు)ల్లో ఇలాంటి కేంద్రాలుండగా. . కొత్తగా బికనీర్ (రాజస్థాన్), మంగళూరు (కర్ణాటక), బినా (మధ్యప్రదేశ్)లలో నిర్మిస్తారు. ఇందుకోసం ఆయా ప్రాంతాల్లో సాధ్యాసాధ్యాలను ప్రభుత్వ రంగ ఇంజినీరింగ్ కన్సల్టెన్సీ సంస్థ ఇంజినీర్స్ ఇండియా అధ్యయనం చేస్తోంది. అన్నీ అనుకూలిస్తే, మంత్రి వర్గ ఆమోదం తరవాత నిర్మాణాలు చేపడతారని ఇండియన్ స్ట్రాటెజిక్ పెట్రోలియం రిజర్వ్ లిమిటెడ్ సీఈఓ ఎల్ఆర్ జైన్ వెల్లడించారు.

- ప్రపంచంలో మూడో అతి పెద్ద దిగుమతిదారు, వినియోగదారుగా మన దేశం ఉంది. దేశీయ చమురు అవసరాల్లో 80 శాతానికి పైగా దిగుమతులే తీరుస్తున్నాయి. భౌగోళిక, రాజకీయ సంక్షోభాల సమయంలో సరఫరాకు ఆటంకాలు ఎదురైనా, దేశీయంగా ఇబ్బందులు ఎదురవకుండా ఉండేందుకు మరిన్ని చోట్ల చమురు నిల్వ చేయాలనుకుంటున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి.


ఇప్పుడు 53.3 లక్షల టన్నుల నిల్వకు వీలు: ప్రస్తుతం మంగళూరు, పాదూరు, వైజాగ్‌లలో 53.3 లక్షల టన్నుల ముడి చమురు నిల్వ చేయొచ్చు. అంతర్జాతీయ సరఫరా అవాంతరాలు ఎదురైతే ఈ నిల్వలను వినియోగిస్తుంటారు. కొత్తగా బికనీర్‌లో 52-53 లక్షల టన్నులు, మంగళూరులో 17.5 లక్షల టన్నుల చమురును నిల్వ చేయాలన్నది యోచన. బినాలో నిల్వ సామర్థ్యాన్ని ఇంకా నిర్ణయించలేదు. పాదూరులో మరో 25 లక్షల టన్నులు, చండీఖోల్ (ఒడిశా)లో 40 లక్షల టన్నుల మేర వ్యూహాత్మక పెట్రోలియం రిజర్వ్‌లకు ఇప్పటికే అనుమతులు లభించాయి.

90 రోజుల అవసరాలకు సరిపడేలా: అంతర్జాతీయ ఇంధన ఏజెన్సీలో మనదేశం చేరేందుకూ కొత్తగా విస్తరిస్తున్న చమురు నిల్వల సామర్థ్యం దోహదం చేయనుంది. అందులో సభ్యత్వం పొందాలంటే, 90 రోజుల వినియోగానికి అవసరమైన చమురు నిల్వలను సభ్య దేశాలు కలిగి ఉండాలి. ప్రస్తుతం మన కంపెనీల నిల్వ కేంద్రాలు, రవాణాలో ఉన్న చమురుతో కలిపి 75 రోజుల ఇంధన గిరాకీకి సరిపోతుంది.

విద్యార్థులకు టీసీఎస్ ఇన్‌క్విజిటివ్

ఈనాడు, హైదరాబాద్: కృత్రిమ మేధ, డిజిటల్ ఆవిష్కరణల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో విద్యార్థులు వీటిపై పట్టు సాధించడం కీలకం అవుతుంది. దీన్ని క్విజ్‌లు, గేమిఫైడ్ ద్వారా నేర్పించేందుకు వీలుగా టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) దేశవ్యాప్తంగా 12 నగరాల్లోని విద్యార్థుల కోసం టీసీఎస్ ఇన్‌క్విజిటివ్ 2025ని ప్రారంభించింది. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై తదితర నగరాల్లో 8-12 తరగతుల విద్యార్థులు ఇందులో పాల్గొనొచ్చని తెలిపింది. ప్రాంతీయంగా పోటీలుంటాయని, ఇందులో విజయం సాధించిన జట్లకు జాతీయ స్థాయిలో చివరి పోటీని ముంబయిలో నిర్వహించనున్నట్లు వెల్లడించింది.

గ్రామసభ అధ్యక్షుడు..
పంచాయతీ ప్రథమ పౌరుడు!



పంచాయతీరాజ్ వ్యవస్థపై ప్రభుత్వాలు వివిధ కమిటీలను ఏర్పాటు చేయగా, అవి తమ నివేదికల్లో పలు సిఫార్సులు చేశాయి. దేశంలో పంచాయతీరాజ్ సంస్థలను సమర్థవంతంగా తీర్చిదిద్దడానికి ఏకీకృత చట్టం అవసరమని సర్కారియా కమిషన్ సూచించింది. పి.వి.నరసింహారావు ప్రధానిగా ఉన్న సమయంలో కేంద్ర ప్రభుత్వం పంచాయతీరాజ్ సంస్థలకు రాజ్యాంగ ప్రతిపత్తి కల్పించాలనే ఉద్దేశంతో 1991 సెప్టెంబరులో పార్లమెంట్‌లో బిల్లును ప్రతిపాదించారు. దీనికి పార్లమెంట్ ఆమోదంతో పాటు, మెజార్టీ రాష్ట్ర శాసనసభల ఆమోదం దక్కింది. ఈ బిల్లునే ప్రస్తుతం 73వ రాజ్యాంగ సవరణ చట్టం-1992గా పిలుస్తున్నారు.

73వ రాజ్యాంగ సవరణ చట్టం - 1992

పంచాయతీరాజ్ వ్యవస్థపై పలు కమిటీలు ఇచ్చిన సిఫార్సులను అధ్యయనం చేసి గ్రామీణ, నగరపాలక సంస్థలకు రాజ్యాంగబద్ధత కల్పించడానికి 1989లో రాజీవ్‌గాంధీ ప్రభుత్వం రెండు బిల్లులను (64, 65 రాజ్యాంగ సవరణ బిల్లులు) పార్లమెంట్‌లో ప్రవేశపెట్టింది. ఈ సమయంలోనే లోక్‌సభ రద్దు కావడంతో ఈ బిల్లులు కూడా రద్దయ్యాయి. తర్వాత పి.వి.నరసింహారావు ప్రభుత్వం 64, 65 సవరణ బిల్లులను కొద్దిపాటి మార్పులతో 73, 74 రాజ్యాంగ సవరణ బిల్లులుగా పార్లమెంట్‌లో ప్రవేశపెట్టగా, వీటికి ఆమోదం లభించింది.

- 73వ రాజ్యాంగ సవరణ చట్టం 1993 ఏప్రిల్ 24 నుంచి అమల్లోకి వచ్చింది. కాబట్టి ఆ రోజును జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవంగా నిర్వహిస్తున్నారు.
- ఈ చట్టం ద్వారా రాజ్యాంగంలో 9వ భాగాన్ని ప్రవేశపెట్టి, కొత్తగా 11వ షెడ్యూల్‌ను చేర్చారు. ఇందులో 243 నుంచి 243 (O) వరకు ప్రకరణలు ఉన్నాయి.
- ఈ చట్టం ద్వారా రాష్ట్ర ప్రభుత్వాల నుంచి 29 అంశాలపై అధికారాలను స్థానిక ప్రభుత్వాలకు రాజ్యాంగబద్ధంగా బదిలీ చేశారు.

చట్టంలోని ముఖ్యాంశాలు:

ఈ చట్టం కొత్తగా జిల్లా, గ్రామసభ, పంచాయతీ, గ్రామం అనే పదాలను చేర్చింది.

- ప్రతి గ్రామానికి ఒక గ్రామసభ ఏర్పాటైంది. ఈ సభ గ్రామస్థాయిలో శాసన నిర్మాణ సంస్థగా వ్యవహరిస్తుంది.
- రాష్ట్ర ప్రభుత్వాలన్నీ పంచాయతీరాజ్ మూడంచెల విధానాన్ని ఏర్పాటు చేయాల్సి ఉంటుంది.
- అన్ని రాష్ట్రాల శాసనసభలు తప్పనిసరిగా పంచాయతీల నిర్మాణానికి సంబంధించిన చట్టాలు రూపొందించాలి.
- షెడ్యూల్డ్ కులాలు, తెగలకు పంచాయతీల్లో రిజర్వేషన్‌లు కల్పించారు. మొత్తం సీట్లలో 1/3వ వంతునకు మించకుండా మహిళలకు రిజర్వేషన్లు కేటాయించారు.
- పంచాయతీల కాలపరిమితి అయిదేళ్లు. గడువుకు ముందే కొత్తగా ఎన్నికలు నిర్వహించుకోవచ్చు.
- ఈ చట్టం స్థానిక సంస్థలకు పోటీచేసే అభ్యర్థుల అర్హతలు, అనర్హతల వివరాలతో పాటు ఆర్థిక సంఘాన్ని ఏర్పాటు చేసింది.
- స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు స్వయంప్రతిపత్తి ఉన్న ఎన్నికల సంఘం ఏర్పాటు.
- కేంద్రపాలిత ప్రాంతాల్లో పంచాయతీల ఏర్పాటు, రద్దుకు సంబంధించి పంచాయతీ అధికారులు, ప్రజాప్రతినిధులు రాష్ట్రపతి సూచనల మేరకు వ్యవహరించాల్సి ఉంటుంది.
- స్థానిక సంస్థల ఎన్నికల వివాదాల పరిష్కారం కోసం ప్రత్యేక ట్రైబ్యునళ్ల ఏర్పాటు.

పోటీ పరీక్షల ప్రత్యేకం
ఇండియన్ పాలిటీ

గ్రామ పంచాయతీలు

పంచాయతీరాజ్ సంస్థల్లో అట్టడుగు స్వపరిపాలన సంస్థ గ్రామపంచాయతీ. సాధారణంగా కనీసం 250కి తగ్గకుండా జనాభా ఉంటే గ్రామ పంచాయతీ ఏర్పాటవుతుంది. వార్షిక ఆదాయం ప్రాతిపదికన గ్రామ పంచాయతీలను ప్రకటిత పంచాయతీలు, అప్రకటిత పంచాయతీలుగా విభజించారు.

నిర్మాణం: ప్రతి గ్రామ పంచాయతీలో నాలుగు అంగాలు ఉంటాయి. అవి:

పంచాయతీ: ఇది మూడంచెల విధానంలో దిగువ భాగాన ఉంటుంది. పంచాయతీ గ్రామస్థాయిలో గ్రామ సంబంధ విషయాలపై చర్చావేదికగా వ్యవహరిస్తుంది. ఇందులో సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు ఉంటారు. వీరందరినీ గ్రామంలోని రిజిస్టర్డ్ ఓటర్లందరూ అయిదేళ్లకొకసారి ఎన్నుకుంటారు. గ్రామ జనాభాను అనుసరించి వార్డుల సంఖ్య 5కి తగ్గకుండా 21కి మించకుండా ఉంటాయి.

- సర్పంచ్ పంచాయతీ సమావేశాలకు అధ్యక్షత వహించగా, గ్రామపాలనాధికారి సమావేశ తీర్మానాలు, రికార్డులను (వీపీఓ) నిర్వహిస్తారు.
- సర్పంచ్‌ను గ్రామంలోని వయోజన ఓటర్లు ప్రత్యక్షంగా ఎన్నుకుంటే, గ్రామపాలనాధికారిని రాష్ట్ర ప్రభుత్వం నియమిస్తుంది. సర్పంచ్ పదవుల్లో కొన్నింటిని షెడ్యూల్డ్ కులాలు, తెగలు, బలహీనవర్గాలు, మహిళలకు కేటాయిస్తారు.

విధులు

ఆవశ్యక విధులు: వీధి దీపాల ఏర్పాటు, జనన మరణాలను ధ్రువీకరించడం.

- పన్నుల విధింపు, శ్మశానవాటికల నిర్మాణం, నిర్వహణ.
- రహదారుల నిర్మాణం, మరమ్మతులు, నిర్వహణ
- తాగునీటి సౌకర్యాలు కల్పించడం, అంటువ్యాధుల నివారణ చర్యలు తీసుకోవడం.

విచక్షణాత్మక విధులు: విశ్రాంతి గృహాల నిర్మాణం, నిర్వహణ, గ్రంథాలయాలు, వైద్యశాలలు, పార్కుల ఏర్పాటు, నిర్వహణ.

ఆర్థిక వనరులు

గ్రామ పంచాయతీకి మూడు రకాల ప్రధాన ఆదాయ మార్గాలు ఉంటాయి. అవి:

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేసే సహాయ గ్రాంట్లు
- కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు కోసం నిర్దేశించిన నిధులు
- ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు కేంద్ర ప్రభుత్వం అందించే గ్రాంట్లు

గ్రామపంచాయతీ విధించే పన్నులు: ఇంటిపన్ను. దీని ద్వారానే గ్రామ పంచాయతీకి అత్యధిక ఆదాయం వస్తుంది. కాటా రుసుంను విధిస్తుంది.



రచయిత
డా. వి.కుమారస్వామి
విషయ నిపుణులు

సర్పంచ్

గ్రామ పంచాయతీకి ప్రథమ పౌరుడు. రాజకీయ కార్యనిర్వాహక అధిపతి. గ్రామపంచాయతీ సమావేశాలు, గ్రామసభలకు అధ్యక్షత వహిస్తారు. పంచాయతీ సెక్రటరీపై పరిపాలనాపరమైన నియంత్రణ కలిగి ఉంటాడు. పంచాయతీ ఆస్తులు, కార్యక్రమాలు, సిబ్బందిపై పరిపాలనా నియంత్రణను చెలాయిస్తాడు. పార్టీ గుర్తు లేకుండా స్వతంత్ర ప్రాతిపదికన సర్పంచ్ ఎన్నికలు నిర్వహిస్తారు.

పంచాయతీ కార్యదర్శి

ప్రతి పంచాయతీకి పూర్తికాల ప్రభుత్వ అధికారిగా పంచాయతీ కార్యదర్శి వ్యవహరిస్తాడు. సర్పంచ్ పాలనాపరమైన నియంత్రణ, ప్రత్యక్ష పర్యవేక్షణలో పనిచేస్తాడు.

కార్యదర్శి విధులు: పంచాయతీ బడ్జెట్, వార్షిక పాలనా నివేదికలు, నెలవారీ, త్రైమాసిక, ఆర్థిక గణాంకాలు తయారు చేయడం.

- నగదు పుస్తక నిర్వహణ, పంచాయతీ రికార్డులను తన అధీనంలో భద్రపరచడం.
- గ్రాంట్ కోసం దరఖాస్తు చేయడం, గ్రాంట్ ఇన్‌ఎయిడ్ రిజిస్టర్ చేయడం.
- పంచాయతీలో జరిగే పనుల తనిఖీ, ప్రగతిని పరిశీలించడం.
- అభివృద్ధి పనులకు సంబంధించిన ఫిర్యాదులను స్వీకరించి, పరిశీలించి తగిన చర్యలు తీసుకోవడం.
- పంచాయతీ పరిధిలో జనన, మరణాలను నమోదు చేయడం.

గ్రామసభ: ప్రతి గ్రామ పంచాయతీలో గ్రామసభ శాసనసభలా పనిచేస్తుంది. సర్పంచ్ దీనికి అధ్యక్షత వహిస్తారు.

- గ్రామసభను సర్పంచ్ ఆదేశం లేదా సూచనల మేరకు కార్యదర్శి ఏర్పాటు చేస్తారు.
- ఇందులో గ్రామానికి చెందిన రిజిస్టర్డ్ ఓటర్లు సభ్యులుగా ఉంటారు.
- గ్రామసభ పంచాయతీకి సంబంధించిన వార్షిక పరిపాలన, ఆడిట్ నివేదికలను పరిశీలించి ఆమోదిస్తుంది.

702 Word of the Day

Churlish

Telugu meaning: మర్యాద లేని, అసభ్య


English meaning: The word churlish (చర్లిష్) is an adjective that describes someone who is rude, unfriendly, or lacks civility and manners.

Synonyms: Rude, Ill-mannered

Antonyms: Polite, Courteous

Usage: **1.** It would be churlish to ignore the help after everything she has done for you.
2. His churlish remarks offended many guests at the gathering.

నోటిఫికేషన్స్



లోకల్ బ్యాంక్ ఆఫీసర్ ఉద్యోగాలు

గుజరాత్ రాష్ట్రం వడోదరలోని బ్యాంక్ ఆఫ్ బరోడా దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో ఉన్న బ్రాంచీల్లో రెగ్యులర్ ప్రాతిపదికన 2,500 లోకల్ బ్యాంక్ ఆఫీసర్ (ఎల్‌బీఓ) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. దరఖాస్తు ఫీజు రూ.850. అర్హులైన అభ్యర్థులు 2025 జులై 24లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

క్లరికల్ ట్రైనీ పోస్టులు

విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ - డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన వివిధ శాఖల్లో క్లరికల్ ట్రైనీ పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. మొత్తం పోస్టుల సంఖ్య 45. ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ 10 జులై 2025.

జూనియర్ ఇంజినీర్ పోస్టులు

స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సీ) 2025 సంవత్సరానికి సంబంధించి జూనియర్ ఇంజినీర్ (సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. మొత్తం పోస్టుల సంఖ్య 1,340. ఫీజు రూ.100. ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ 21 జులై 2025.

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.


వరల్డ్ జూనోసిస్ డే

జులై 6
చరిత్రలో ఈనాడు

మానవులు, జంతువుల మధ్య సంక్రమించే జూనోటిక్ వ్యాధుల గురించి అవగాహన కల్పించే లక్ష్యంతో ఏటా జులై 6న 'వరల్డ్ జూనోసిస్ డే'గా నిర్వహిస్తారు. పూర్వం అడవి జంతువులను వేటాడి తినడం వల్ల మానవులకు జూనోటిక్ వ్యాధులు సంక్రమించగా.. ప్రస్తుతం కుక్క, పిల్లి, వివిధ పక్షులు మొదలైనవాటిని మచ్చిక చేసుకుని పెంచడం వల్ల వాటి బారిన పడుతున్నారు. పెంపుడు జీవుల వల్ల మనుషులే కాదు.. మానవుల కారణంగా అవి కూడా రోగాల బారిన పడుతున్నాయి. జూనోటిక్ వ్యాధుల నివారణే ధ్యేయంగా పరిశోధనలు ప్రోత్సహించడం, పెంపుడు జంతువులకు వ్యాక్సిన్లు వేయించేలా ప్రజలను చైతన్యపరచడం ఈ రోజు ముఖ్య ఉద్దేశం.

> ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) ప్రకారం, మానవులకు సంక్రమించే అంటువ్యాధుల్లో దాదాపు 60% జూనోటిక్ సంబంధితమైనవే. శాస్త్రవేత్తలు, వైద్యుల అంచనాల ప్రకారం జంతువుల నుంచి మనుషులకు దాదాపు 200 రకాల వ్యాధులు సోకుతాయి.

- పందుల ద్వారా మెదడువాపు వ్యాధి, కుక్క కాటు వల్ల రేబిస్, గొర్రెలు - మేకల ద్వారా ఆంత్రాక్స్, ఆవులు - గేదెల నుంచి క్షయ, పాల ద్వారా బ్రూసెల్లోసిస్ వ్యాపిస్తుంది. ఇవేకాకుండా పక్షులవల్ల సిటాకోసిస్, ఎలుకలతో ప్లేగు, పిల్లుల ద్వారా పాగోప్లాస్మోక్రాండై, కోళ్లద్వారా బర్డ్‌ఫ్లూ, కుందేళ్ల నుంచి టాక్సోప్లాస్మోసిస్, కోతుల ద్వారా లెప్రసీ.. ఇతరత్రా జంతువులు, పక్షుల ద్వారా చర్మ, శ్వాస సంబంధిత వ్యాధులు మనుషులకు వ్యాపిస్తాయి. పెంపుడు జంతువులకు టీకాలు వేయించడం, ఎప్పటికప్పుడు వాటికి వైద్యపరీక్షలు చేయించడం, పరిసరాల శుభ్రత పాటించడం ద్వారా జూనోటిక్ వ్యాధుల సంక్రమణను అడ్డుకోవచ్చు.



చారిత్రక నేపథ్యం:

ఫ్రెంచ్ జీవశాస్త్రవేత్త లూయిస్ పాశ్చర్ 1885, జులై 6న కుక్కకాటుకు గురైన జోసెఫ్ మీస్టర్ అనే బాలుడికి మొదటిసారి రేబిస్ టీకాను ఇచ్చారు. ఇది విజయవంతంగా ఆ వ్యాధిని నివారించగలిగింది. ఈ సంఘటన వైద్యశాస్త్రంలో ఒక ముఖ్య ఘట్టంగా నిలిచింది. ఈ విజయం ఇతర వ్యాక్సిన్ల అభివృద్ధికి ప్రేరణగా నిలిచింది. రేబిస్‌కు వ్యతిరేకంగా మొదటి టీకాను అందించిన గుర్తుగా 'వరల్డ్ జూనోసిస్ డే'ను 2007, జులై 6న మొదటిసారి నిర్వహించారు.

జనరల్ స్టడీస్ - బయాలజీ

పత్ర రూపాంతరాలు



మొక్కల్లో కిరణజన్య సంయోగక్రియ, ట్రాన్స్‌పిరేషన్ లాంటి సాధారణ విధులతోపాటు కొన్ని ప్రత్యేక విధులను నిర్వహించడానికి పత్రాలు రూపాంతరాలతో సవరణకు గురవుతాయి. కొన్నిసార్లు ఈ మార్పులు పలు పర్యావరణ పరిస్థితులకు ప్రతిస్పందనగా ఉంటాయి.

నిల్వ పత్రాలు

నీరు లభించని పరిస్థితుల్లో (జిరోఫైటిక్ ఆవాసాల్లో) కొన్ని మొక్కలు, క్రాసులేసి కుటుంబానికి చెందినవి సాధారణంగా నీటి నిల్వ కణజాలాల్లో బాగా దగ్గరగా అమరి ఉండే కణజాలంతో రసవంతమైన పత్రాలను కలిగి ఉంటాయి.

లీఫ్-స్పైన్స్

కొన్ని మొక్కల పత్రాలు పూర్తిగా లేదా పాక్షికంగా రక్షణ ప్రయోజనం కోసం స్పైన్స్ లేదా కంటకం అనే పదునైన, కోణాల నిర్మాణాలుగా మార్పు చెందుతాయి. అందుకే ఒపన్షియాలో పార్శ్వ మొగ్గ సూక్ష్మ పత్రాలు కంటకాలుగా మారతాయి.

కరపత్ర హుక్స్

బిగ్నోనియాలో పత్రం మూడు టెర్మినల్ లేదా గ్రీవ పత్రాలు మొక్క ఎగబాకడానికి సహాయపడే హుక్స్‌లాగా మారతాయి.

కీటకాలను పట్టుకునే పత్రాలు

- పత్రం - పిచ్చర్
- లీఫ్ బ్లాడర్
- డ్రోసెరా

లీఫ్ టెండ్రిల్స్, స్కేల్ - పత్రాలు, పత్రం మూలాలు, ఫైలోడ్ మొదలైన అంశాలతో పాటు మాదిరి ప్రశ్నలతో సహా పూర్తి సమాచారం ఈ-బుక్ రూపంలో 'ఈనాడు ఈప్రతిభ జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Current Affairs



India and Trinidad and Tobago inked six agreements to shore up their cooperation in several sectors, including infrastructure, pharmaceuticals and culture following talks between Prime Minister Narendra Modi and his counterpart Kamla Persad-Bissessar on 4 July 2025. It is the first bilateral visit by an Indian prime minister to this Caribbean island nation since 1999.

Steel Authority of India Limited (SAIL) has inaugurated its Representative Office in Dubai. Steel and Heavy Industries Minister H.D. Kumaraswamy inaugurated SAIL's first international office in West Asia, marking a significant step in its global expansion strategy.

India has set up its first Equine Disease-Free Compartment (EDFC) at the Remount Veterinary Corps (RVC) Centre & College in Meerut Cantonment, Uttar Pradesh on 4 July 2025. The facility was officially recognised by the World Organisation for Animal Health (WOAH), marking a crucial step in enabling Indian sport horses to compete internationally in compliance with global biosecurity standards.

Indian researchers have developed a new green energy material that could revolutionize energy storage performance. Scientists from the Centre for Nano and Soft Matter Sciences (CeNS), Bengaluru, in collaboration with Aligarh Muslim University (AMU), have engineered a lanthanum-doped silver niobate compound that significantly enhances supercapacitor performance.

For more Current Affairs: Scan QR code

Railway Exams
Reasoning

Alphabetical Order & Position of Letters

1. The position of how many letters will remain unchanged if each of the letters in the word "FREEDOM" is rearranged in alphabetical order?
A) One B) Two C) Three D) Four

2. How many letters remain in the same position when "HARMONY" is arranged alphabetically?
A) One B) Two C) Three D) Four

3. When "SOFTWARE" is alphabetically sorted, how many letters retain their original position?
A) One B) Two C) Three D) Four

4. After sorting "CAMPUS" alphabetically, how many letters stay in their original position?
A) One B) Two C) Three D) Four

5. After sorting "COMMERCE" alphabetically, how many letters remain in the same spot?
A) One B) Two C) Three D) Four

6. How many letters remain unchanged when "COMPUTER" is rearranged alphabetically?
A) One B) Four C) Three D) Two

7. How many letters remain unchanged when "BALANCE" is rearranged alphabetically?
A) Three B) Two C) One D) Four

8. How many letters remain unchanged when "CAMERA" is rearranged alphabetically?
A) One B) Two C) Three D) Four

9. How many letters remain unchanged when "PACKAGE" is rearranged alphabetically?
A) One B) Three C) Two D) Four

10. How many letters remain unchanged when "BRIDGE" is rearranged alphabetically?
A) One B) Two C) Three D) Four

11. How many letters remain unchanged when "JOURNEY" is rearranged alphabetically?
A) One B) Two C) Three D) Four

12. How many letters remain unchanged when "HORIZON" is rearranged alphabetically?
A) Four B) Two C) Three D) One

13. How many letters remain unchanged when "RESEARCH" is rearranged alphabetically?
A) One B) Two C) Three D) Four

14. How many letters remain unchanged when "DEVELOP" is rearranged alphabetically?
A) One B) Two C) Three D) Four

15. How many letters remain unchanged when "STUDIO" is rearranged alphabetically?
A) One B) Two C) Three D) None

16. How many letters remain unchanged when "LIBRARY" is rearranged alphabetically?
A) One B) Four C) Three D) Two

17. How many letters remain unchanged when "PATIENT" is rearranged alphabetically?
A) One B) Two C) Three D) Four

18. How many letters remain unchanged when "EXAMPLE" is rearranged alphabetically?
A) Zero B) Two C) Three D) None

19. How many letters remain unchanged when "ORANGE" is rearranged alphabetically?
A) One B) Two C) Three D) Four

20. How many letters remain unchanged when "MARKET" is rearranged alphabetically?
A) Three B) Two C) One D) Four

21. How many letters remain unchanged when "FAMILY" is rearranged alphabetically?
A) One B) Two C) Three D) Four

22. How many letters remain unchanged when "FRIEND" is rearranged alphabetically?
A) Four B) Two C) Three D) One

23. How many letters remain unchanged when "GARDEN" is rearranged alphabetically?
A) One B) Two C) Three D) Zero

24. How many letters remain unchanged when "SHELTER" is rearranged alphabetically?
A) One B) Two C) Three D) Four

25. How many letters remain unchanged when "TUNING" is rearranged alphabetically?
A) One B) Two C) Three D) Four

26. How many letters remain unchanged when "VISUAL" is rearranged alphabetically?
A) Three B) Two C) One D) Four

27. How many letters remain unchanged when "WONDER" is rearranged alphabetically?
A) One B) Two
C) Three D) Four

Scan the QR code for Key

These model questions were prepared by subject experts

ముచ్చటైన ముంబై ఐస్ హల్వా

నేను మహారాష్ట్ర స్నేహితురాలి దగ్గర నేర్చుకున్న 'ముంబై ఐస్ హల్వా' మా వాళ్లందరూ ఇష్టంగా తింటారు. ఇది మీకూ నచ్చుతుందని మీతో పంచుకుంటున్నాను.

ముంబై ఐస్ హల్వా కోసం.. పాలు - కప్పున్నర, మైదా, మొక్కజొన్న పిండి, నెయ్యి - పావు కప్పు చొప్పున, పంచదార - కప్పు, యాలకుల పొడి - పావు చెంచా, కుంకుమపువ్వు - కొద్దిగా, ఫుడ్ కలర్ - ఒక చుక్క, బాదం, పిస్తా పలుకులు - రెండూ కలిపి గుప్పెడు తీసుకోవాలి. ఎలా చేయాలంటే.. కుంకుమపువ్వును రెండు చెంచాల వెచ్చటి పాలలో నానబెట్టాలి. అడుగుభాగం మందంగా ఉన్న పాత్రలో పాలు, నెయ్యి, మైదా, మొక్కజొన్న పిండి, పంచదార, యాలకుల పొడి వేసి



ఉండలు కట్టకుండా కలపాలి. ఈ పాత్రను సన్న సెగ మీదుంచి కలియబెడుతుండాలి. దగ్గరగా అయ్యాక, కుంకుమపువ్వు పాలు, ఫుడ్ కలర్ జోడించి.. అర నిమిషం ఉంచి దింపేయాలి. చల్లారాక రిఫ్రిజిరేటర్‌లో ఉంచాలి. రెండు గంటల తర్వాత బయటకు తీసి.. నాలుగు భాగాలుగా విడగొట్టాలి. ఒక్కోదాన్నీ రెండు బటర్ పేపర్ల మధ్యలో ఉంచి చపాతీకర్రతో పల్చని రొట్టెలు చేయాలి. వాటిని రోలింగ్ పిన్ సాయంతో నచ్చిన ఆకృతిలో ముక్కలుగా కట్ చేయాలి. అంతే.. 'ముంబై ఐస్ హల్వా' రెడీ.



– వైద్యం శ్రావణి, బెంగళూరు

చూడచక్కటి స్వీటిది



ఉత్తర ప్రదేశ్‌లో 'పర్వల్ మిఠాయి' ప్రసిద్ధం. ఇది చూపులకు ఎంత ఆకర్షణీయంగా ఉంటుందో రుచిలోనూ అంతే బెస్ట్ అనిపిస్తుంది. దాన్ని మనం కూడా రుచి చూద్దామా..

పర్వల్ మిఠాయి కోసం- పంచదార పొడి - పావు కప్పు, పంచదార - ఒకటిన్నర కప్పు, మావా - 200 గ్రాములు, యాలకుల పొడి - పావు చెంచా, బాదం, పిస్తా పలుకులు - 2 చెంచాలు, జీడిపప్పులు - [illegible], పర్వల్ - అర కిలో తీసుకోవాలి. ఎలా చేయాలంటే.. పర్వల్ కాయలను కడిగి, చెక్కు తీయాలి. మధ్యలో నిలువుగా చీల్చినట్లు కోసి.. గింజలు తీసేయాలి. వాటిని నాలుగైదు నిమిషాలు ఉడికించాలి. సెగ తీసేసి కొంతసేపు అలాగే ఉంచితే ఇంకాస్త మెత్తబడతాయి. తర్వాత నీళ్లు వార్చేయాలి. పంచదారలో నీళ్లు పోసి వేడిచేయాలి. అందులో పర్వల్ వేసి, తునగకుండా కలియతిప్పుతూ రంగు మారే వరకూ ఉడికించాలి. పాకం చిక్కగా అయ్యాక సెగ తీసేసి ఒక గంట పక్కనుంచాలి. జీడిపప్పును పొడి చేయాలి. మావాను చిదిమి బాణలిలో సన్న సెగ మీద కలియబెడుతుండాలి. మావా కరిగి, కాస్త రంగు మారాక దించేయాలి. అందులో యాలకుల పొడి, బాదం, పిస్తా పలుకులు, జీడిపప్పుపొడి, పంచదార పొడి వేసి బాగా కలపాలి. ఈ ఫిల్లింగ్‌ను పాకంలో నానిన ఒక్కో పర్వల్‌లో కూరాలి. అంతే.. రుచికరమైన 'పర్వల్ మిఠాయి' తయారైపోతుంది.

కమ్మటి గుమ్మడి

ఔషధాల గని బూడిదగుమ్మడి. అందుకే ఉదయాన్నే గుమ్మడిరసం తాగమంటున్నారు ఆహారనిపుణులు. దీంతో రైతా, సాంబార్, సబ్జీ, సలాడ్, అవియల్, కఢీ, పెటా, స్మూథీ, జ్యూస్, ఖీర్.. ఇలా ఎన్నెన్నో చేయొచ్చు. మీ కోసం కొన్ని కమ్మటి రెసిపీలు



మిఠాయి

కావలసినవి: బూడిదగుమ్మడి - 350 గ్రాములు, పంచదార - 250 గ్రా, నెయ్యి - మూడు టేబుల్ స్పూన్లు, జీడిపప్పు - 20, కిస్‌మిస్ - గుప్పెడు, కుంకుమపువ్వు - కొద్దిగా, యాలకుల పొడి - పావు చెంచా, ఫుడ్ కలర్ - రెండు చుక్కలు

తయారీ: బూడిదగుమ్మడికాయ చెక్కు, గింజలు తీసేసి తురమాలి. కడాయిలో చెంచా నెయ్యిలో కిస్‌మిస్, జీడిపప్పులను వేయించి తీయాలి. అందులోనే బూడిదగుమ్మడి తురుము వేసి కలియతిప్పి మూతపెట్టాలి. మధ్యమధ్యలో కలియబెడుతూ సన్నసెగ మీద ఉడకనివ్వాలి. సాధారణంగా కాయలో ఉండే నీరే సరిపోతుంది. అడుగంటుతున్నట్లు అనిపిస్తే కొన్ని నీళ్లు పోయొచ్చు. సుమారు పావుగంట తర్వాత.. అంటే పచ్చి వాసన పోయి, తురుము ఉడికాక పంచదార, కుంకుమపువ్వు, ఫుడ్ కలర్, యాలకుల పొడి, మిగిలిన నెయ్యి జోడించాలి. మిశ్రమం చిక్కబడే వరకూ కలియబెడుతూనే ఉండాలి. దగ్గరగా అయ్యాక కిస్‌మిస్, జీడిపప్పు జతచేసి దించేయాలి.

వడియాలు

కావలసినవి: బూడిద గుమ్మడికాయ - ఒకటి, ఉప్పు - రుచికి తగినంత, పసుపు - అర చెంచా, పచ్చిమిరపకాయలు - పన్నెండు, అల్లం - రెండంగుళాల ముక్క, మినప్పప్పు - ముప్పావు కిలో, జీలకర్ర - 3 చెంచాలు

తయారీ: గుమ్మడికాయను కడిగి తడి లేకుండా తుడిచి, సన్నగా ముక్కలు కోసుకోవాలి. వాటిల్లో ఉప్పు వేసి.. ఓ అరగంట పక్కనుంచితే నీరు ఊరుతుంది. ఆ ముక్కలను శుభ్రమైన వస్త్రంలో వేసి వడకట్టి నీళ్లను తీసేయాలి. ఆ మూట మీద చిన్న రోలు లేదా రుబ్బురాయిని ఉంచితే.. కాసేపటికి మిగిలిన నీరు కూడా వచ్చేస్తుంది. మినప్పప్పును రాత్రి నానబెట్టి, ఉదయం ఆ నీళ్లు తీసేసి తగినంత ఉప్పు, జీలకర్ర జతచేసి గ్రైండ్ చేయాలి. అల్లం, పచ్చిమిరపకాయలను నూరి పిండిలో కలపాలి. అందులో బూడిద గుమ్మడి ముక్కలను కూడా జోడించి కలియబెట్టాలి. ఈ మిశ్రమంతో పాలిథిన్ పేపర్ మీద కాస్త పెద్ద సైజులో వడియాలు పెట్టి.. రెండు రోజులు ఎండబెట్టాలి. వీటిని తడి లేని సీసాలో భద్రం చేసుకుంటే.. ఇష్టమైనప్పుడల్లా వేయించుకోవచ్చు.



ధోరన్



కావలసినవి: బూడిదగుమ్మడి - 200 గ్రాములు, ఉల్లి తరుగు - ముప్పావు కప్పు, పచ్చిమిర్చి - 2, కొబ్బరి తరుగు - అర కప్పు, ఆవాలు, శనగపప్పు, మినప్పప్పు, జీలకర్ర, పసుపు - అర చెంచా చొప్పున, ఉప్పు - రుచికి తగినంత, కరివేపాకు - 2 రెబ్బలు, నూనె - 2 టేబుల్ స్పూన్లు

తయారీ: పచ్చిమిర్చిని కచ్చాపచ్చా దంచాలి. బూడిదగుమ్మడికాయ చెక్కు తీసి అంగుళం వెడల్పున ముక్కలు కోసుకోవాలి. కడాయిలో నూనె వేడయ్యాక ఆవాలు.. అవి చిటపటలాడుతున్నప్పుడు శనగపప్పు, మినప్పప్పు, జీలకర్ర, కరివేపాకు ఒక్కొక్కటిగా వేయాలి. అవి వేగాక ఉల్లి తరుగు జతచేసి లేత గోధుమరంగులోకి మారే వరకూ వేయించాలి. అందులో బూడిద గుమ్మడి ముక్కలు, పసుపు జోడించి మూతపెట్టి సన్నసెగ మీద ఉడికించాలి. ముక్కల్లోనే నీరుంటుంది కనుక నీళ్లు పోయనవసరం లేదు. ఏడెనిమిది నిమిషాల్లో ముక్కలు మెత్తబడతాయి. లేకుంటే ఇంకో రెండు నిమిషాలు ఉంచవచ్చు. తర్వాత కొబ్బరి తురుము, పచ్చిమిర్చి, ఉప్పు చేర్చి కలియబెట్టాలి. ఒకట్రెండు నిమిషాల తర్వాత దించేస్తే రుచికరమైన 'ధోరన్' సిద్ధమైపోతుంది. ఇది అన్నం, చపాతీ ఎందులోకైనా బాగుంటుంది.

కువలే సాసమ్

కావలసినవి: కొబ్బరి తురుము - 2 టేబుల్ స్పూన్లు, బూడిద గుమ్మడి - పావు కిలో, ఉప్పు - రుచికి తగినంత, పసుపు - అర చెంచా, వెజిటబుల్ స్టాక్ పౌడర్ (ఆన్‌లైన్‌లో దొరుకుతుంది) - 3 చెంచాలు, బెల్లం పొడి - 3 టేబుల్ స్పూన్లు, చింతపండు - నిమ్మకాయంత, కశ్మీరీ మిరపకాయలు - 5, సాధారణ మిరపకాయలు - నాలుగు, కరివేపాకు - రెండు రెబ్బలు, నూనె - మూడు టేబుల్ స్పూన్లు, ఆవాలు - ఒకటిన్నర చెంచా, మెంతులు, శనగపప్పు - అర చెంచా చొప్పున, ఇంగువ - పావు చెంచా

తయారీ: చింతపండును నానబెట్టి గుజ్జు తీయాలి. ప్యాన్‌లో రెండు రకాల మిరపకాయలు, చెంచా ఆవాలను వేయించి.. చల్లారాక గ్రైండ్ చేయాలి. బూడిద గుమ్మడి చెక్కు, గింజలు తీసి ముక్కలు కోయాలి. వాటిలో పావు లీటర్ నీళ్లు పోసి ఉడికించాలి. పది నిమిషాల తర్వాత పసుపు, ఉప్పు, వెజిటబుల్ స్టాక్ పౌడర్, బెల్లం పొడి జోడించి నాలుగు నిమిషాలుంచాలి. అందులో రెండున్నర కప్పుల నీళ్లు, నూరిన మిర్చి-ఆవాల మిశ్రమం వేసి ఇంకో రెండు నిమిషాలుంచి సెగ తీసేయాలి. కడాయిలో నూనె వేడయ్యాక మిగిలిన ఆవాలు, శనగపప్పు, ఇంగువ, కరివేపాకులతో తాలింపు వేయాలి. అంతే.. ఘుమఘుమలాడే 'కువలే సాసమ్' తిని ఆనందించటమే తరువాయి.



కుర్మా



కావలసినవి: బూడిద గుమ్మడి - పావు కిలో, నూనె - 3 చెంచాలు, ఉల్లి తరుగు - అర కప్పు, ఉప్పు - రుచికి తగినంత, పసుపు - పావు చెంచా, పెరుగు - ఒకటిన్నర కప్పు, అల్లం - అంగుళం ముక్క, కొబ్బరి తురుము - అర కప్పు, పచ్చిమిర్చి - 4, ఎండుమిర్చి - 2, ఆవాలు, శనగపప్పు - అర చెంచా చొప్పున, జీలకర్ర - ఒకటిన్నర చెంచా, బియ్యప్పిండి - చెంచా, కరివేపాకు - 2 రెబ్బలు, కొత్తిమీర తరుగు - గుప్పెడు

తయారీ: బూడిద గుమ్మడికాయ చెక్కు తీసి, ముక్కలు కోసి ఉడికించాలి. సుమారు పది నిమిషాలకు ముక్కలు మెత్తగా అయ్యాక దించేయాలి. మిక్సీజార్‌లో కొబ్బరి తురుము, సగం జీలకర్ర, పచ్చిమిర్చి, అల్లం, బియ్యప్పిండి, పసుపు, ఉప్పు వేసి గ్రైండ్ చేయాలి. ఈ ముద్దను పెరుగులో కలపాలి. కడాయిలో నూనె వేడయ్యాక.. ఆవాలు, శనగపప్పు, మిగిలిన జీలకర్ర, ఎండుమిర్చి, కరివేపాకు, ఉల్లి తరుగులను ఒక దాని తర్వాత ఒకటిగా వేయాలి. ఉల్లి లేత గోధుమ రంగులోకి మారాక.. గుమ్మడికాయ ముక్కలు జతచేసి వేయించాలి. అందులో కొబ్బరి మిశ్రమం జతచేసి కలియబెడుతుండాలి. రెండు నిమిషాల తర్వాత కొత్తిమీర వేసి దించేయాలి.

మనలో కొందరు కూరల్లో నూనె ఎక్కువవేస్తేనే రుచి అనుకుని పైకి తేలేలా వేస్తుంటారు. నిజానికి తక్కువ నూనెతోనూ, అసలే వేయకుండా కూడా చక్కటి వంటలు చేయొచ్చు. వాటిల్లో మనందరికీ చాలా ఇష్టమైన 'దాల్ తడకా' ఒకటి.

నూనె లేని దాల్ తడకా



జీరో ఆయిల్ దాల్ తడకా కోసం.. కందిపప్పు - ఒక కప్పు, ఉప్పు - రుచికి తగినంత, ఉల్లి తరుగు - అర కప్పు, వెల్లుల్లి - 2 రెబ్బలు, పచ్చిమిర్చి - 2, అల్లం ముద్ద - చెంచా, గరం మసాలా, కసూరీ మేథీ, పసుపు, ఆవాలు - అర చెంచా చొప్పున, జీలకర్ర, కారం, ధనియాల పొడి, నిమ్మరసం - చెంచా చొప్పున, ఇంగువ - చిటికెడు, ఎండుమిర్చి - 1, కరివేపాకు - రెండు రెబ్బలు, కొత్తిమీర తరుగు - పావు కప్పు తీసుకోవాలి. ఎలా చేయాలంటే.. కందిపప్పును కడిగి ఉడికించాలి. ప్యాన్‌లో అల్లం, వెల్లుల్లి, ఉల్లి తరుగులను సన్న సెగ మీద వేయించాలి. అడుగంటుతున్నట్టు అనిపిస్తే నాలుగు చుక్కల నీళ్లు చిలకరించాలి. లేత గోధుమ రంగులోకి మారాక పచ్చిమిర్చి ముక్కలు, ఉప్పు, పసుపు, ధనియాల పొడి, గరం మసాలా, కసూరీ మేథీ జతచేయాలి. అర నిమిషం వేయించాక.. దీన్ని ఉడికిన పప్పులో కలపాలి. మరో పాత్రలో ఆవాలు, జీలకర్ర, ఎండుమిర్చి, ఇంగువ, కరివేపాకులను ఒక్కొక్కటిగా వేస్తూ వేయించాలి. మంచి వాసన వస్తుండగా సెగ తీసేసి.. ఈ దినుసులను కూడా పప్పులో కలపాలి. ఇక కొత్తిమీర తరుగు, నిమ్మరసం కూడా జోడిస్తే.. నూనె లేని దాల్ తడకా తయారైపోతుంది.

సబ్జీ మసాలా చేసేద్దాం!

కూరల్లో ఉల్లి తరుగు మాత్రం వేస్తే సరిపోదు. వాటికి మంచి రుచీ, చక్కటి ఘుమాయింపూ రావాలంటే సబ్జీ మసాలా దట్టించాలి. దాన్ని ఇంట్లోనే చేసుకోవచ్చు.



సబ్జీ మసాలా కోసం పల్లీలు - కప్పు, నూనె - 2 చెంచాలు, వెల్లుల్లి రెబ్బలు - 7, తురిమిన ఎండుకొబ్బరి, జీలకర్ర, ఆమ్‌చూర్ పౌడర్ - రెండు టేబుల్‌స్పూన్ల చొప్పున, ధనియాలు - అర కప్పు, పసుపు, సోంపు, గరం మసాలా - టేబుల్‌స్పూన్ చొప్పున, కరివేపాకు - రెండు రెబ్బలు, కారం, నువ్వులు, కసూరీ మేథీ - పావు కప్పు చొప్పున, ఉప్పు - రుచికి తగినంత తీసుకోవాలి. ఎలా చేయాలంటే.. కడాయిలో నూనె వేడిచేసి వెల్లుల్లి రెబ్బలను వేయించాలి. వాటిని తీసి పల్లీలు వేయాలి. అవి వేగాక.. కొబ్బరి తురుమును జోడించాలి. సన్నసెగ మీద ఓ నిమిషం వేయించి దించేయాలి. చల్లారాక కొంచెం బరకగా గ్రైండ్ చేయాలి. ప్యాన్‌లో ధనియాలు, జీలకర్ర, సోంపు, నువ్వులను మంచి వాసన వచ్చేదాకా వేయించాలి. వీటిని కూడా పొడి చేయాలి. గ్రైండ్ చేసిన ఈ రెండు పౌడర్లనూ వెడల్పాటి పాత్రలోకి తీసి.. కారం, పసుపు, ఆమ్‌చూర్, గరం మసాలా, కసూరీ మేథీ, ఉప్పు వేసి కలపాలి. ఈ సబ్జీ మసాలాను తడిలేని, గాలి చొరబడని సీసాలో భద్రం చేసుకోవాలి. ఇది సిద్ధంగా ఉందంటే అప్పటికప్పుడు దంచాల్సిన పని లేకుండా సమయం కలిసొస్తుంది, పని సులువవుతుంది.

వర్షాకాలం కదా.. తరచూ జలుబు చేస్తుంటుంది. కొన్నిసార్లు వైరల్ జ్వరాలూ వస్తుంటాయి. వాటితో అవస్థపడుతూ మందులు వేసుకునే కంటే.. రాకుండానే తరిమేస్తే బాగుంటుంది కదూ!

జలుబూ జ్వరాలకు దూరంగా



- రోగనిరోధకశక్తి ఉంటే వైరస్‌లూ, బ్యాక్టీరియాలూ అంత త్వరగా దాడి చేయవు. కనుక ఎ, బి, సి, డి, ఇ విటమిన్లు, జింక్, సెలీనియం ఉండే ఆహారం తీసుకోవాలి.
- సి-విటమిన్ ఇమ్యూనిటీ పెంచి, శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది. అర చెంచా నిమ్మరసం గ్లాసు గోరువెచ్చటి నీళ్లలో కలిపి తాగటం అలవాటు చేసుకుంటే అనారోగ్యాలకు దూరంగా ఉన్నట్టే. నారింజ, దానిమ్మ, బెర్రీస్, కివీలు కూడా సి-విటమిన్‌ను పెంచుతాయి.
- వెల్లుల్లిలో రోగనిరోధకశక్తిని పెంచే విటమిన్లు, ఖనిజాలతో పాటు బ్యాక్టీరియాను నశింపచేసే ఎలిసిన్ ఉంటుంది. అల్లంలో వైరస్‌లను తరిమేసే గుణాలున్నాయి. కనుక తగిన మోతాదులో అల్లం, వెల్లుల్లి తింటుండాలి.
- బాదంపప్పులో ఇమ్యూనినిటీ పెంచే ఇ-విటమిన్, జింక్, ప్రొటీన్లు, పీచు ఎక్కువగా ఉంటాయి. రోజూ ఐదారు బాదంపప్పులు నానబెట్టి పొట్టు తీసేసి తినటం అలవాటు చేసుకోవాలి.
- తేనెలో యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు విస్తారంగా ఉంటాయి. కనుక రోజూ ఒక స్పూన్ తేనె తీసుకోవటం మంచిది.
- పుట్టగొడుగుల్లో ఇన్ఫెక్షన్ల నుంచి కాపాడే సెలీనియం, జింక్, బి, డి విటమిన్లు ఉంటాయి. కనుక మష్రూమ్స్‌ను తింటుండాలి.
- క్యారెట్లు, చిలకడదుంపల్లో రోగనిరోధకశక్తిని పెంచే ఎ-విటమిన్ విస్తారంగా ఉంటుంది. అందువల్ల వీటిని తరచూ తింటుండాలి. ఓట్స్, బార్లీ గింజలు కూడా ఇమ్యూనిటీ పెంచుతాయి.
- పోషకాహారంతో పాటు వ్యాయామం కూడా ఇమ్యూనిటీ పెంచి చురుగ్గా ఉండేలా చేస్తుంది. కనుక రోజూ కనీసం అరగంటసేపు వ్యాయామం చేస్తుండాలి.
- పరిశుభ్రంగా ఉండటం, మురికి పరిసరాల్లో దొరికే ఆహారం తినకపోవటం వల్ల రోగాలకు దారితీసే సూక్ష్మ క్రిములు శరీరంలో చేరవు.
- నిద్ర అనేక అనారోగ్యాలను తరిమేస్తుంది. కనుక నిద్రను ఎంతమాత్రం అలక్ష్యం చేయకూడదు.

భళారే ఛత్రం!

చిత్రంగా..



వర్షా కాలం ఆకాశాన్ని నమ్మలేం. ఎప్పుడు మబ్బుపడుతుందో, ఎక్కడ వాన కురుస్తుందో తెలీదు. కనుక గొడుగు చేతిలో ఉండటం మేలు. ఈ కాలానికి సంకేతం అన్నట్టుగా.. కేకుల్ని ఛత్రాల్లా మలిచారు. బాగున్నాయి కదూ! నచ్చితే మీరు కూడా ఇలాంటి అంబ్రెల్లాలు ప్రయత్నించి చూడండి!

వారెవా తేనె బిళ్లలు!

ఆరోగ్యాన్ని అందించటంలో తేనెను మించింది లేదు. అందుకే గోరు వెచ్చటి నీళ్లలో కాస్త తేనె కలిపి తాగుతుంటాం. అదలా ఉంచితే తేనె బిళ్లలు ఎప్పుడైనా తిన్నారా! చాలా సులువుగా ఇలా చేసి చూడండి..

హనీ క్యాండీల కోసం... స్వచ్ఛమైన తేనె - కప్పు, యాపిల్ సైడర్ వెనిగర్ - పావు కప్పు, వెనీలా ఎక్స్‌ట్రాక్ట్ - చెంచా తీసుకోవాలి. ఎలా చేయాలంటే.. సాస్‌ప్యాన్‌లో తేనె, వెనిగర్ వేసి సన్న సెగ మీద వేడి చేయాలి. అడుగంటకుండా కలియతిప్పుతూ నిమిషం తర్వాత సెగ తీసేయాలి. అది చల్లారాక.. వెనీలా ఎక్స్‌ట్రాక్ట్‌ను ఒకేసారి కాకుండా చుక్క చుక్క చొప్పున వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని సిలికాన్ క్యాండీ మౌల్డ్‌లో లేదా బటర్ పేపర్ పరిచిన బేకింగ్ ట్రేలో పోసి.. రిఫ్రిజిరేటర్‌లో ఉంచాలి. ఓ అరగంట తర్వాత బయటకు తీసి నచ్చిన ఆకృతిలో ముక్కలుగా కట్ చేసుకుంటే తేనె క్యాండీలు సిద్ధం. రకరకాల క్యాండీల్లో ఇవి మరింత ప్రత్యేకం అనిపించడం ఖాయం.



మసాలా గుడ్డు వేపుడు

కోడిగుడ్లతో ఇగురు, పులుసు చేయడం సాధారణం. అభిరుచీ, ఆసక్తీ ఉండాలే గానీ వీటితో వందల వెరైటీలు చేయొచ్చు. వాటిల్లో 'మసాలా గుడ్డు వేపుడు' ఒకటి. అదెంతో సులువు, రుచి కూడా..



కావలసినవి: ఉల్లిపాయలు - 2, ఉప్పు - రుచికి తగినంత, గుడ్లు - 4, గరం మసాలా - ముప్పావు చెంచా, కరివేపాకు - 2 రెబ్బలు, పచ్చిమిర్చి - 3, కారం, మిరియాల పొడి, అల్లం వెల్లుల్లి పేస్ట్ - చెంచా చొప్పున, పసుపు - అరచెంచా, నూనె - 2 టేబుల్ స్పూన్లు, కొత్తిమీర తరుగు - పావు కప్పు

తయారీ: పచ్చిమిర్చి, ఉల్లిపాయలను సన్నగా తరిగి ఉంచండి. కోడిగుడ్లను ఉడికించి.. రెండు మూడు గాట్లు పెట్టండి. ప్యాన్‌లో నూనె వేడయ్యాక.. ఆవాలు, కరివేపాకు వేయండి. ఆవాలు చిటపటలాడుతున్నప్పుడు ఉల్లితరుగు జతచేసి బంగారు రంగు వచ్చే వరకూ వేయించండి. అందులో అల్లం వెల్లుల్లి పేస్ట్ చేర్చండి. పచ్చి వాసన పోయేవరకూ వేయించి.. పచ్చిమిర్చి, గరం మసాలా, కారం, ఉప్పు, పసుపు వేసి కలపండి. నిమిషం తర్వాత గుడ్లు జోడించండి. సన్న సెగ మీదుంచి మధ్యమధ్యలో కలుపుతుండండి. గుడ్లు చక్కగా వేగి.. వాటికి మసాలా పట్టిందనుకున్నాక కొత్తిమీర చల్లి దించేయండి. వేడివేడిగా వడ్డించారంటే వహ్వా అనేస్తారంతా.



– శ్రీదేవి, హోటల్ మేనేజ్‌మెంట్ నిపుణురాలు

మాజీ మంత్రి బరితెగించి మాట్లాడుతున్నారు

మంత్రి కొల్లు రవీంద్ర ధ్వజం

ఈనాడు, అమరావతి: పేదల బియ్యం పక్కదారి పట్టించిన వైకాపా మాజీ మంత్రి ప్రెస్‌మీట్లు పెట్టి, బరితెగించి మాట్లాడుతున్నారని ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర మండిపడ్డారు. కక్ష సాధింపులకు చిరునామా వైకాపా అధ్యక్షుడు జగన్ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. పల్నాడు జిల్లాలోని గ్రామాల్లో వైకాపా వాళ్ల అరాచకాలకు చాలామంది ఊర్లు వదిలి వెళ్లిపోయారని, పచ్చటి పల్లెల్లో జగన్ నెత్తుటేర్లు పారించారని దుయ్యబట్టారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చివరికి ఐపీఎస్ అధికారి సిద్ధార్థ్ కౌశల్ రాజీనామాను కూడా వాళ్లు రాజకీయాలకు వాడుకుంటున్నారని ధ్వజమెత్తారు. "విజయవాడలో చెన్నుపాటి గాంధీ కన్ను పోగొట్టింది గత వైకాపా ప్రభుత్వమే. వైకాపా వాళ్ల బెదిరింపులు తాళలేక దళిత సామాజికవర్గానికి చెందిన సీఏ ఆనందరావు ఆత్మహత్య చేసుకున్నారు. తోట చంద్రయ్య, నందం సుబ్బయ్య ఇలా ఎందరో తెదేపా కార్యకర్తల్ని బలి తీసుకున్నారు" అని విరుచుకుపడ్డారు.

టాటా ఇన్నోవేషన్ హబ్‌కు.. సచివాలయ సిబ్బంది

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో ఏర్పాటు చేస్తున్న రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ (ఆర్‌టీఐహెచ్)కు గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందిని డిప్యుటేషన్‌పై పంపేలా ప్రభుత్వం శనివారం ఉత్తర్వు జారీ చేసింది. అమరావతిలోని ఆర్‌టీఐహెచ్ కేంద్ర హబ్‌కు 30 మంది, విశాఖపట్నం, రాజమహేంద్రవరం, ఎన్టీఆర్, తిరుపతి, అనంతపురం జిల్లాల్లోని ప్రాంతీయ స్పోక్‌లకు 20 మంది చొప్పున నియమించేలా ఆదేశించింది. ఆయా కేంద్రాల్లో సీఈవో డెస్క్, హెడ్ ఇంక్యుబేషియో, హెడ్ పార్టనర్‌షిప్స్, హెడ్ ఫైనాన్స్ పోస్టుల్లో వీరిని నియమించనున్నారు. హెడ్ ఫైనాన్స్ పోస్టుకు ఆయా జిల్లాల్లోని గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందిలో ఎంబీఏ ఫైనాన్స్, ఎంకామ్, సీఏ, ఫైనాన్స్ నేపథ్యం ఉన్న వారిని, ఇతర పోస్టులకు ఇంజినీరింగ్, సైన్స్, ఇతర సబ్జెక్టుల్లో పీజీ, గ్రాడ్యుయేషన్ చేసిన వారిని కలెక్టర్లు ఎంపిక చేసి డిప్యుటేషన్‌పై పంపాలని ఉత్తర్వు జారీ చేశారు.

సింగిల్ మేజర్ విధానంతో ఎలాంటి ఉపయోగం లేదు: ఏసీటీఏ

ఈనాడు, అమరావతి: డిగ్రీ కళాశాలల్లో సింగిల్ మేజర్ సబ్జెక్టు విధానం అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం పట్ల నిరసన వ్యక్తం చేస్తున్నట్లు అనుబంధ కళాశాలల టీచర్స్ అసోసియేషన్ (ఏసీటీఏ) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మోహన్‌రావు, శ్రీనివాస రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. 'ఒకే సబ్జెక్టును నాలుగేళ్లపాటు చదవడం వల్ల ఎలాంటి ప్రయోజనం లేదు. దాంతోపాటు ఈ విధానం ద్వారా బీఈడీ, ఇతర కోర్సుల్లో సైతం చేరడానికి వీలులేదు. డబుల్ మేజర్ విధానం వస్తుందని కళాశాలల యాజమాన్యాలు ప్రచారం చేసి విద్యార్థులను చేర్చుకుంటున్న సమయంలో సింగిల్ మేజర్ విధానం అమల్లో ఉంటుందని నిర్ణయం తీసుకోవడంతో అధ్యాపకులు, విద్యార్థుల్లో గందరగోళం నెలకొంది. గత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల వల్ల డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలు తగ్గిపోయాయి. అధ్యాపకులకు పని భారం తగ్గిపోయింది' అని పేర్కొన్నారు.

విదేశీ వైద్య పట్టభద్రుల సమస్యలు పరిష్కరించాలి: సీపీఐ

ఈనాడు, అమరావతి: విదేశాల్లో వైద్య విద్యనభ్యసించిన వారు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ సీఎం చంద్రబాబుకు లేఖ రాశారు. 'జాతీయ వైద్య కమిషన్ మార్గదర్శకాల ప్రకారం విదేశీ వైద్య విద్యలో గ్రాడ్యుయేట్ పరీక్ష రాసి ఉత్తీర్ణులై ఇంటర్న్‌షిప్‌లను పూర్తి చేసిన విద్యార్థులు ఏపీ వైద్య మండలి ఏకపక్ష నిర్ణయాలతో సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఎన్ఎంసీ నిర్దేశించిన సమానత్వ సూత్రాలను ఏపీ వైద్య మండలి ఉల్లంఘిస్తూ విదేశాల్లో వైద్య విద్య పూర్తి చేసి అర్హత కలిగిన వారు శాశ్వత రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు నిరాకరిస్తోంది. ఎలాంటి కారణాలూ లేకుండా ఇంటర్న్‌షిప్‌లను రెన్యూవల్ చేయాలని అంటోంది. భారతీయ వైద్యుల్లానే 24 గంటలు పని చేస్తున్నప్పటికీ వారికి ఎలాంటి ఉపకార వేతనాలు చెల్లించడం లేదు' అని పేర్కొన్నారు.



ఓటమెరుగని వారు గొప్ప వ్యక్తులు కారు

ఓటమంటూ ఎరుగని వ్యక్తులు గొప్పవారు కారు. ఓటమి ఎదురైనా ఆగిపోని వారే గొప్పోళ్లు. ఎందుకంటే పరిస్థితులు సజావుగా ఉన్నంతవరకూ, ప్రతికూల ఫలితాలు రానంతవరకూ ఎవ్వరైనా సరేని విశ్వాసంతోనే ఉంటారు. కానీ ఎదురుదెబ్బలు తగిలినా, వైఫల్యాలు ఎదురైనా చెదిరిపోకుండా, లేచి నిలబడి ధైర్యంగా ముందుకు వెళ్లేవారే అసలైన పోరాట యోధులు.

– జీన్ పాట్రిస్, మైండ్‌సెట్ కోచ్

ఉత్తరాంధ్ర ప్రాజెక్టులపై సర్కారు దృష్టి

- రూ.1,068 కోట్లతో కీలకమైనవి పూర్తి చేసే యోచన
- త్వరలో ముఖ్యమంత్రి సమీక్ష

ఈనాడు, అమరావతి: ఉత్తరాంధ్రలోని కీలక సాగునీటి ప్రాజెక్టులన్నీ పూర్తి చేయాలంటే రూ.2,678 కోట్లు అవసరమని తాజాగా అధికారులు లెక్కించారు. ఇందులో కేవలం రూ.1,068.32 కోట్లు ఉంటే 7 సాగునీటి ప్రాజెక్టులతో పాటు జైకా కింద చేపట్టిన మిగిలిన ప్రాజెక్టులూ పూర్తి చేసే అవకాశం ఉంది. వచ్చే వారం ప్రత్యేకంగా ఉత్తరాంధ్ర ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి సమీక్షించనున్నారు. వంశధార రెండో భాగం రెండో దశ, తోటపల్లి బ్యారేజీ ప్రాజెక్టు, వంశధార-నాగావళి అనుసంధానం, హిరమండలం ఎత్తిపోతల పథకం, నాగావళి చంపావతి అనుసంధానం, మడ్డువలస రెండో దశ, జంఝావతి రిజర్వాయర్ ప్రాజెక్టుతో పాటు జైకా నిధులతో చేపట్టిన ఆండ్ర, రైవాడ, పెద్దంకలం, వట్టిగడ్డ తదితరాల నిర్మాణం పూర్తి చేసే అవకాశం ఉందని తేల్చారు. ఈ ప్రాజెక్టుల్లో భూసేకరణ, పునరావాసం, ఇతర సమస్యలు ఏమైనా ఉన్నాయా అన్న పూర్తి సమాచారం క్రోడీకరిస్తున్నారు.

- వంశధార రెండో భాగం రెండో దశ ప్రాజెక్టు నిర్మాణం పూర్తికి రూ.188.20 కోట్లు అవసరమవుతాయి. దాదాపు 20 వేల ఎకరాల కొత్త ఆయకట్టు సాగులోకి వస్తుంది. ఈ ప్రాజెక్టులో భూసేకరణ నిమిత్తం రూ.12.46 కోట్లు, హిరమండలం జలాశయం ప్యాకేజీలో రూ.26.07 కోట్లు, ప్యాకేజీ 88లో రూ.14.58 కోట్లు, ప్యాకేజీ 87లో రూ.1.71 కోట్ల బిల్లులు పెండింగులో ఉన్నాయి. మూడు ప్యాకేజీల్లోనూ పనులు కొద్దిగా చేయాల్సి ఉంది. 2026 జూన్ నాటికి ఈ ప్రాజెక్టును పూర్తి చేయాలని ప్రస్తుత లక్ష్యం.
- తోటపల్లి బ్యారేజీ ప్రాజెక్టులో మిగిలిన పనులు పూర్తి చేయాలంటే రూ.263.36 కోట్లు ఖర్చు చేయాల్సి ఉంది. బ్యారేజీలో + 105 మీటర్ల స్థాయికి నీళ్లు నిల్వ చేసేలా పునరావాస పనులు చేయాలి. ఇందుకు రూ.119 కోట్లు అవసరం. మొదటి రెండు ప్యాకేజీల్లో పనులు 25% కన్నా తక్కువే చేశారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఆ పనులు రద్దు చేయాల్సి ఉంది. తక్షణమే పనులు పూర్తి చేయాల్సిన ఉన్నందున అనుమతులు ఇవ్వాలని అక్కడి జలవనరులశాఖ అధికారులు ప్రభుత్వానికి లేఖ రాశారు.
- వంశధార- నాగావళి అనుసంధానం ప్రాజెక్టు పూర్తి చేసేందుకు మరో రూ.50.23 కోట్లు అవసరమవుతాయి. ఈ ప్రాజెక్టు పూర్తి చేయడం వల్ల 5,000 ఎకరాల కొత్త ఆయకట్టు వస్తుంది. 18,327 ఎకరాల స్థిరీకరణ సాధ్యమవుతుంది. ప్రస్తుతం పని చేస్తున్న గుత్తేదారు సంస్థ తమ ఒప్పందం రద్దు చేసుకుంటామని కోరింది. ఈ ప్రాజెక్టుకు తాజా అంచనాల ప్రకారం ఎంత వ్యయమవుతుందో లెక్కించాలనే ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. దేవాదాయ శాఖకు చెందిన 7.50 ఎకరాల భూమి జలవనరుల శాఖకు రావాల్సి ఉంది. మరో 54.5 ఎకరాలు సేకరించాలి. ఇందుకు రూ.7.50 కోట్లు అవసరమవుతాయి.
- హిరమండలం ఎత్తిపోతల పథకం పనులు ఇంత వరకు 37% మాత్రమే పూర్తయ్యాయి. ఈ ప్రాజెక్టు 2.55 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణకు తోడ్పడుతుంది. వంశధార ఎడమ, కుడి కాలువల కింద ఉన్న ఆయకట్టు స్థిరీకరణకు ఇది ఉపయుక్తం. మొత్తం రూ.175.35 కోట్ల నిధులు అవసరమవుతాయి.
- మడ్డువలస రెండో దశ పనులకు రూ.30.04 కోట్లు అవసరమవుతాయి. ప్రస్తుతం 25% లోపు పనుల్లోకి ఇది వస్తుంది. నాగావళి- చంపావతి అనుసంధానం ప్రాజెక్టుకు మరో రూ.21.53 కోట్లు కావాలి. ఇది కూడా 25% లోపు మాత్రమే పని చేసిన జాబితాలోకి వస్తోంది. ఈ రెండు పనులూ కొనసాగించాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు.

బాలలపై లైంగిక వేధింపులు.. సమష్టి వైఫల్యం

వారి భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత ● పిల్లలపై దుర్మార్గాలు.. నమ్మక ద్రోహం

●'వాయిస్ ఫర్ వాయిస్ లెస్' చర్చా కార్యక్రమంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్

ఈనాడు, హైదరాబాద్: బాలలపై నిర్లక్ష్యం, వారిపై లైంగిక వేధింపులను సమష్టి వైఫల్యంగా పరిగణించాలని సుప్రీంకోర్టు న్యాయమూర్తి, జాతీయ న్యాయసేవాధికార సంస్థ కార్యనిర్వాహక ఛైర్మన్ జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. పిల్లలపై నేరాలు మారుమూల చీకట్లో కాదు.. నలుమూలలా జరుగుతున్నాయని చెప్పారు. ఇల్లు, పొరుగిల్లు, పాఠశాల... దేన్నీ భద్రమైన చోటుగా పరిగణించలేని పరిస్థితి ఉందన్నారు. పిల్లలపై జరిగే దుర్మార్గాలు నేరాలు మాత్రమే కాదని.. నమ్మక ద్రోహమని పేర్కొన్నారు. ఇందులో ప్రభుత్వాల వైఫల్యంతోపాటు తల్లిదండ్రుల బాధ్యత కూడా ఉందని స్పష్టం చేశారు. 'వాయిస్ ఫర్ వాయిస్ లెస్-పిల్లల హక్కులు, లైంగిక వేధింపుల నుంచి రక్షణ' అనే అంశంపై శనివారం హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ (ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీఏ)లో మహిళా భద్రతా విభాగం, మహిళా శిశు సంక్షేమశాఖ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ, యునిసెఫ్‌లు సంయుక్తంగా నిర్వహిస్తున్న రెండు రోజుల చర్చా కార్యక్రమం ప్రారంభోత్సవానికి జస్టిస్ సూర్యకాంత్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. '2012లో కేంద్రం పోక్సో చట్టం తీసుకొచ్చినా అమలు తీరుతోనే ఫలితాలు ఆధారపడి ఉంటాయి. బాధితులకు అండగా నిలవడం ఉమ్మడి బాధ్యత. ప్రతి పౌరుడు బాధ్యతగా తీసుకోవాలి. పిల్లల శ్రేయస్సు అన్నది కేవలం నైతిక బాధ్యత కాదు... సమాజ నిర్మాణానికి పునాది. లైంగిక వేధింపులు, ఇతర దాడులతో పిల్లలకు అయిన గాయాలు మానేలా చేయడం మన నైతిక బాధ్యతతో పాటు రాజ్యాంగ బాధ్యత కూడా. భౌతిక గాయాలు మానిపోయినా అంతర్గతంగా అవి ఎప్పటికీ ఉంటాయి. దీర్ఘకాలంగా వేధిస్తూ ఒత్తిడికి గురిచేసి ఆత్మహత్యలకు దారితీస్తాయి.

పిల్లలను రక్షించుకోవాలి

యునిసెఫ్ నివేదిక ప్రకారం దేశంలో 2024 నాటికి 14 ఏళ్లలోపు జనాభా 24 శాతం ఉంది. 18 ఏళ్ల యువ భారతం 345 మిలియన్ల దాకా ఉంటుంది. ఇది కొన్ని దేశాల జనాభా కంటే ఎక్కువ. దేశ భవిష్యత్తుగా భావిస్తున్న పిల్లలను రక్షించుకోకపోతే వారు భారంగా మారే ప్రమాదం ఉంది. అంతేకాకుండా రక్షణ కల్పించలేని వ్యవస్థపై విశ్వాసం కూడా కోల్పోతారు. పోలీసు, వైద్య, న్యాయవ్యవస్థలు ఒకే గొడుగు కిందికి వచ్చి పిల్లలకు రక్షణ కల్పించాలి. వేధింపులకు గురైన బాలలకు భరోసా ఇవ్వాలి. తెలంగాణలో ప్రవేశపెట్టిన భరోసా కేంద్రాలు పిల్లలకు రక్షణతోపాటు పునరావాసం కల్పించేలా ఉండాలి" అని జస్టిస్ సూర్యకాంత్ అన్నారు.

డీజీపీ జితేందర్ మాట్లాడుతూ రాష్ట్రంలో భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి న్యాయ, మానసిక, వైద్య సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. యునిసెఫ్ ప్రతినిధి సిన్ఫికాన్ మెక్ఫ్రే మాట్లాడుతూ పిల్లల హక్కులను రక్షించడం బాధ్యతగా తీసుకోవాలన్నారు. పిల్లల రక్షణకు అంతర్జాతీయ సహకారం అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు డీజీపీ చారు సిన్హా, ఐఏఎస్ అధికారిణి అనితా రామచంద్రన్, యునిసెఫ్ ప్రతినిధి డాక్టర్ జెలాలెం బి.టఫెస్సీ, అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వరరావు, అదనపు అడ్వొకేట్ జనరల్ తేరా రజనీకాంత్‌రెడ్డి, పలువురు న్యాయమూర్తులు, న్యాయాధికారులు పాల్గొన్నారు.

పోక్సో కేసుల తీరు ఆందోళనకరం: జస్టిస్ సుజయ్‌పాల్

పోక్సో చట్టం కింద నమోదవుతున్న కేసులు పెరుగుతున్న తీరు చూస్తే పరిస్థితి ఆందోళనకరంగా ఉందని హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజయ్‌పాల్ పేర్కొన్నారు. 2020లో 5,267 కేసులు నమోదు కాగా.. 2023 నాటికి 10,605 అంటే రెట్టింపు నమోదయ్యాయని తెలిపారు. నేరాలకు పాల్పడుతున్న వారిలో 98 శాతం మంది కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులే కావడం మరింత ఆందోళనకరమన్నారు. సామాజిక ఒత్తిడి, ఇతర కారణాలతో బాధితులు తమకు జరిగిన అన్యాయాన్ని వెల్లడించకుండా మాటమారుస్తున్నారని ఆయన చెప్పారు. విచారణలో జాప్యం పేరుతో వారిని మరింత వేదనకు గురిచేయకుండా అన్ని శాఖలు ఒకే వేదిక పైకి వచ్చి సమస్య పరిష్కారంపై చర్చించాలని అన్నారు. లైంగిక వేధింపులకు సంబంధించి పోలీసులు, జడ్జీల ముందుండేది ఫైల్ కాదని, లైఫ్ అన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని కోరారు.

విద్యార్థి మూడు రోజులు రాకపోతే తల్లిదండ్రులకు ఫోన్ చేయాలి

●పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు

ఈనాడు, అమరావతి: విద్యార్థులు మూడు రోజులకు మించి పాఠశాలకు రాకపోతే వెంటనే తల్లిదండ్రులకు ఫోన్ చేసి, వివరాలు తెలుసుకోవాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు తెలిపారు. ఒకవేళ ఐదు రోజుల కంటే ఎక్కువ బడికి రాకపోతే ఎంఈఓ, సీఆర్పీలు ఆ విద్యార్థి ఇంటికి వెళ్లాలని సూచించారు. విజయవాడలో శనివారం జిల్లా విద్యాధికారులు, అదనపు ప్రాజెక్టు సమన్వయకర్తలు, అకడమిక్ పర్యవేక్షణ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 'ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరుపై ప్రత్యేక దృష్టి సారించాలి. ఉదయం 9.30 గంటలకల్లా హాజరు నమోదు తీసుకొని.. ఎంఈఓలు, సీఆర్పీలు, డీఈఓలు, ఏపీసీలు పాఠశాలలను పరిశీలించాలి. ఉపాధ్యాయులు సెలవు పెడితే ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయాలి. సెలవు పెట్టకుండా గైర్హాజరయ్యే వారి జాబితా రూపొందించాలి. పదో తరగతిలో తక్కువ ఫలితాలు వచ్చిన సబ్జెక్టు టీచర్లకు శిక్షణ ఇవ్వాలి. వచ్చే ఏడాది నుంచి తల్లికి వందనం పథకానికి 75% హాజరు ఉండాలి. ప్రభుత్వ ఉపాధ్యాయులు ప్రైవేటు బడులు నిర్వహిస్తున్నట్లు తెలిసింది. ఎవరైనా ఉపాధ్యాయులు ప్రైవేటు బడుల్లో కనిపిస్తే చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వం ఇచ్చే ఐచ్ఛిక సెలవులు కేవలం ఉపాధ్యాయులకు మాత్రమే వర్తిస్తాయి. ఇవి పాఠశాల మొత్తానికి సెలవు ఇచ్చేందుకు కాదు" అని విజయరామరాజు పేర్కొన్నారు.

మట్టి, నీటి నాణ్యతను తరచూ పరీక్షించుకోండి

ఏపీఎస్ఏడీఏ కో-వైస్ ఛైర్మన్ ఆనం వెంకటరమణారెడ్డి

ఈనాడు, అమరావతి: ఆక్వా వ్యాధుల నియంత్రణలో భాగంగా చెరువుల్లో మట్టి, నీటి నాణ్యతను తరచూ పరీక్షించుకోవాలని హేచరీల ప్రతినిధులకు ఏపీఎస్ఏడీఏ కో-వైస్ ఛైర్మన్ ఆనం వెంకటరమణారెడ్డి, మత్స్య శాఖ కమిషనర్ శ్రీరామశంకర్‌నాయక్ సూచించారు. ఈ మేరకు శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు. 'గాలిలో తేమ శాతం ఎక్కువగా ఉన్నప్పుడు ఆక్వాలో వ్యాధులు ప్రబలుతాయి. పంటకు పంటకు మధ్య కొంత సమయం ఇవ్వాలి. చెరువుల్ని శుభ్రం చేసుకొన్నాకే తదుపరి పంట వేయాలి' అని వివరించారు. వ్యాధి ప్రభావానికి గురైన భీమవరం, కాకినాడ, అమలాపురం, బాపట్ల, కృష్ణ, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాల్లోని పలు చెరువుల నుంచి మట్టి, నీటి నమూనాల్ని సేకరిస్తున్నామన్నారు. రాష్ట్రంలో జాతీయ పరిశోధనా సంస్థ, అభివృద్ధి బోర్డులు, ప్రాంతీయ కేంద్రాల ఏర్పాటుకు కేంద్ర వ్యవసాయ, మత్స్య శాఖలకు సీఎం చంద్రబాబు లేఖలు రాసినట్లు తెలిపారు. త్వరలోనే రాష్ట్రంలో పరిశోధన సంస్థలు ఏర్పాటవుతాయన్నారు. అన్ని రకాల చర్యలు తీసుకొని రైతులకు వ్యాధి రహిత రొయ్య పిల్లల్ని సరఫరా చేస్తున్నట్లు హేచరీల ప్రతినిధులు తెలిపారు.

బోటు బోల్తాపడి ఇద్దరు మహిళల మృతి: మరొకరి పరిస్థితి విషమం

వికారాబాద్, న్యూస్‌టుడే: తెలంగాణలోని వికారాబాద్ మండలం సర్పన్‌పల్లి ప్రాజెక్టులో బోటు బోల్తాపడి ఇద్దరు మహిళలు మృత్యువాతపడ్డ ఘటన శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్‌కు చెందిన నాలుగు కుటుంబాల సభ్యులు సర్పన్‌పల్లి ప్రాజెక్టులో బోటింగ్‌కు వెళ్లారు. వారిలో రీతాకుమారి, పూనమ్‌సింగ్‌తోపాటు మరో ఇద్దరు పిల్లలకు లైఫ్‌జాకెట్లు లేకుండానే సిబ్బంది బోటులో ఎక్కించుకొని నీటిలోకి తీసుకెళ్లారు. కొద్దిసేపటికే భారీ వర్షం కురవడంతో బోటును వెనక్కి తిప్పుతుండగా బోల్తాపడింది. దీంతో రీతాకుమారి(55), పూనమ్‌సింగ్(56) నీటిలో మునిగి మృతిచెందారు. గట్టుపైనున్న బంధువు అలోక్‌కుమార్ వెంటనే నీటిలోకి దూకి ఇద్దరు చిన్నారులను ఒడ్డుకు చేర్చారు.

40కి చేరిన మృతుల సంఖ్య

- ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కార్మికుడి మృతి
- సిగాచీ పరిశ్రమ శిథిలాల్లో ఇంకా లభించని తొమ్మిది మంది ఆచూకీ



మున్మున్ సింగ్

ఈనాడు, సంగారెడ్డి- న్యూస్‌టుడే, పటాన్‌చెరు అర్బన్: తెలంగాణలోని సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం పాశమైలారం సిగాచీ పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో మృతుల సంఖ్య 40కి చేరింది. పటాన్‌చెరులోని ధ్రువ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం బిహార్‌కు చెందిన మున్మున్‌సింగ్ మృతిచెందారు. అంబులెన్సులో ఆయన మృతదేహాన్ని స్వస్థలానికి పంపారు. నగర శివారులోని వివిధ ఆసుపత్రుల్లో మరో 21 మంది క్షతగాత్రులు చికిత్స పొందుతున్నారు. గాయపడిన వారిలో ఇప్పటి వరకు 12 మంది కార్మికులు కోలుకుని ఇళ్లకు వెళ్లారని అధికారులు తెలిపారు. మొత్తం 38 మృతదేహాల వివరాలు గుర్తించగా.. మరో రెండింటిని గుర్తించాల్సి ఉంది. ప్రమాదం జరిగి ఆరు రోజులు గడిచినా ఇప్పటికీ తొమ్మిది మంది కార్మికుల ఆచూకీ లభించలేదు. పేలుడు ధాటికి కుప్పకూలిన భవనం శిథిలాల తొలగింపు ప్రక్రియ కొనసాగుతోంది. ఈ సందర్భంగా బయటపడుతున్న శరీర భాగాల ఆధారంగా ఆచూకీ లభించని వారిని గుర్తించే ప్రక్రియ చేపడుతున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ ఘటనలో మృతి చెందిన, గాయపడిన బిహార్ కార్మికుల కుటుంబాలను పరామర్శించేందుకు ఆ రాష్ట్రానికి చెందిన ఎంపీ రాజారామ్ సింగ్ శనివారం హైదరాబాద్ వచ్చారు. ఘటనాస్థలిని పరిశీలించారు. తమ రాష్ట్ర కార్మికులకు న్యాయం చేయాలని పరిశ్రమ నిర్వాహకులను కోరారు.

ముఖ్యమంత్రి దృష్టికి పంచాయతీరాజ్ సమస్యలు



సీఎంకు వినతిపత్రం అందిస్తున్న పంచాయతీ రాజ్ ఛాంబర్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్

ఈనాడు, అమరావతి: స్థానిక సంస్థల సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లానని ఏపీ పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి 'పల్లె పండగ' పేరుతో రూ.వేల కోట్లు కేటాయించినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ.. ఉపాధి హామీ పథకం కింద చేసిన పనులకు బిల్లులు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1,160 కోట్లు విడుదల చేసి సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులకు గౌరవ వేతనం అందించాలని కోరుతూ సీఎంకు వినతిపత్రం అందజేసినట్లు పేర్కొన్నారు. ఈ సమస్యలపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని రాజేంద్రప్రసాద్ వెల్లడించారు.

పెద్దిరెడ్డి కుటుంబం కిలో మామిడి రూ.3 కే కొంటోంది

- సిండికేట్‌గా ఏర్పడి రైతుల్ని దోచుకుంటున్న వైకాపా నేతలు
- వ్యవసాయ మిషన్ వైస్ ఛైర్మన్ మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి ధ్వజం

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో మామిడి పంటను కొనడం లేదంటూ దుష్ప్రచారం చేస్తున్న వైకాపా వాళ్లు.. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి యాజమాన్యంలోని 'పీఎల్‌ఆర్ ఫుడ్స్' ప్రభుత్వం నిర్దేశించిన ధర కంటే తక్కువగా కిలో రూ.3కే ఎందుకు కొంటుందో సమాధానం చెప్పాలని వ్యవసాయ మిషన్ వైస్ ఛైర్మన్ మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. "వైకాపా నాయకులకు చెందిన పీఎల్‌ఆర్ ఫుడ్స్, సీజీఆర్ ఫుడ్స్, టాసా, సన్నిధి వంటి కంపెనీలు రైతుల నుంచి కిలో మామిడిని రూ.3కే కొంటున్నాయి. పీఎల్‌ఆర్ ఫుడ్స్ డైరెక్టర్లు పెద్దిరెడ్డి ఇందిర, పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి" అని గుర్తుచేశారు. వైకాపా మరో నాయకుడు ప్రకాశ్‌రెడ్డికి చెందిన సీజీఆర్ ఫుడ్స్ కూడా రైతులకు అన్యాయం చేస్తోందని ఆరోపించారు. "వైకాపా నాయకులంతా సిండికేట్‌గా ఏర్పడి మామిడి రైతుల్ని దోచుకుంటూ.. ప్రభుత్వంపై బురద చల్లుతున్నారు. గతేడాదితో పోలిస్తే ఈసారి మామిడి దిగుబడి గణనీయంగా పెరిగింది. 1.5 లక్షల మెట్రిక్ టన్నుల మామిడి పల్ప్.. ఎగుమతులు లేక మిగిలిపోయింది. దీంతో ధరలు తగ్గాయి. అయినా ప్రభుత్వం రాయితీ అందిస్తూ కిలో మామిడి ధరను రూ.12గా నిర్ధారించింది. మామిడి పల్ప్‌పై 12 శాతం జీఎస్టీని పూర్తిగా తొలగించాలని, పండ్ల రసాల ఆధారిత జ్యూస్‌లపై 12 శాతంగా ఉన్న జీఎస్టీని 5 శాతానికి తగ్గించాలని కేంద్రానికి లేఖలు రాసింది" అని మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి వివరించారు.

వల్లభనేని వంశీ అనుచరుడి భూఆక్రమణ

తెదేపా కేంద్ర కార్యాలయంలో బాధితుడి ఫిర్యాదు



దివ్యాంగుడి నుంచి వినతిపత్రం స్వీకరిస్తున్న మాజీ ఎంపీ కంభంపాటి రామ్మోహన్‌రావు

ఈనాడు, అమరావతి: గతంలో ప్రభుత్వం తనకు ఇచ్చిన భూమిని గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అనుచరుడు ఆక్రమించాడని కృష్ణా జిల్లా బాపులపాడు మండలం బండారుగూడేనికి చెందిన సుబ్బారావు వాపోయారు. తన పొలంలో అక్రమంగా వేసిన రహదారుల్ని తొలగించాలని కోరుతూ మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో శనివారం ఫిర్యాదు చేశారు. వివిధ సమస్యలతో పెద్ద సంఖ్యలో తరలివచ్చిన బాధితుల నుంచి మాజీ ఎంపీ కంభంపాటి రామ్మోహన్‌రావు ఫిర్యాదులు స్వీకరించారు. దివ్యాంగుల దగ్గరకు వెళ్లి వినతులు తీసుకున్నారు. పలు సమస్యల పరిష్కారం దిశగా సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. వైకాపా ప్రభుత్వ హయాంలో తన కుమారుడిపై పెట్టిన అక్రమ కేసులు తొలగించాలని పల్నాడు జిల్లా అచ్చంపేట మండలానికి చెందిన లింగారావు వినతిపత్రం సమర్పించారు. పార్వతీపురం మన్యం జిల్లాలోని కొన్ని గ్రామాల్లో ప్రభుత్వ భూముల రికార్డులు మార్చి అధికారులే అక్రమార్కులకు కట్టబెడుతున్నారని.. దీనిపై దర్యాప్తు జరపాలని గార గౌరీశంకరరావు ఫిర్యాదు చేశారు. తన భూమిని ఆక్రమించిన కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని కర్నూలు జిల్లా గోనెగండ్లకు చెందిన చిన్నమాబు కోరారు.

టీచర్లకు బోధనేతర పనులు వద్దు: ఎస్టీయూ

ఈనాడు, అమరావతి: ఉపాధ్యాయులకు బోధనేతర పనుల నుంచి విముక్తి కల్పించాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం(ఎస్టీయూ) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సాయి శ్రీనివాస్, రఘునాథరెడ్డి కోరారు. యోగాంధ్ర కార్యక్రమం, తల్లిదండ్రుల సమావేశం పేరుతో 17 రకాల కమిటీలు ఏర్పాటు, కరపత్రాల పంపిణీ, సాక్షి కోసం అధికారిని చూసుకోవడం, విద్యార్థులకు మొక్కల పంపిణీ సహా వాటికి జియో ట్రాకింగ్ చేయడం, ఫొటోలు అప్‌లోడ్ చేయడం లాంటి కార్యక్రమాల వల్ల ఉపాధ్యాయులు బోధనపై పూర్తి దృష్టి సారించలేని పరిస్థితి ఉందని పేర్కొన్నారు. తల్లిదండ్రుల సమావేశాన్ని నిర్వహించే సమర్థత ఉపాధ్యాయులకుందని, ఇతర శాఖల అధికారులను సాక్షి పేరుతో నియమించుకోవాలనే నిబంధనలను తక్షణమే తొలగించాలని ఏపీ ప్రాథమిక ఉపాధ్యాయ సంఘం(అప్టా), ఏపీ ఉపాధ్యాయ సమాఖ్య(ఏపీటీఎఫ్) డిమాండ్ చేశాయి.

తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మెగా సమావేశంలో.. సాక్షి సంతకం గిన్నిస్ రికార్డు కోసమే: ఎస్పీడీ

ఈనాడు, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 10న నిర్వహించే తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మెగా సమావేశానికి(పీటీఎం) సాక్షి సంతకం నిబంధన గిన్నిస్ బుక్ రికార్డు కోసమేనని సమగ్ర శిక్షా అభియాన్ ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు తెలిపారు. పీటీఎంకు సాక్షి సంతకం ఉండాలని ఎస్ఎస్ఏ ఇచ్చిన ఆదేశాలపై ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో ఆయన వివరణ ఇచ్చారు. "గిన్నిస్ రికార్డుల నమోదు బృందం ఇచ్చిన సూచనల మేరకు సాక్షి సంతకం తీసుకుంటున్నాం. ఇందుకోసం విద్యార్థుల తల్లిదండ్రులు లేదా పాఠశాల పరిధిలోని సర్పంచి, ఎంపీటీసీ సభ్యుడు, విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగి, దాత, పూర్వ విద్యార్థి ఎవరైనా సాక్షిగా ఉండొచ్చు. ఆ వ్యక్తి వివరాలు ఇవ్వాల్సి ఉంటుంది. దీని కోసమే లీప్ యాప్‌లో సాక్షి నమోదు తప్పనిసరి చేశాం. సాక్షిగా ప్రభుత్వ ఉద్యోగి ఉండకూడదు. మెగా పీటీఎంలో 2.28 కోట్ల మందికిపైగా పాల్గొని గిన్నిస్ రికార్డు నెలకొల్పే ప్రయత్నం చేస్తున్నాం" అని తెలిపారు.

సీఎం ఆదేశాలు ఎన్నికల హామీకి వ్యతిరేకం: సీపీఎం

ఈనాడు, అమరావతి: ఫ్రీ హోల్డ్ భూములపై సీఎం చంద్రబాబు ఇచ్చిన ఆదేశాలు తెదేపా ఎన్నికల హామీకి వ్యతిరేకంగా, పేదలకు అన్యాయం చేసేలా ఉన్నాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఓ ప్రకటనలో విమర్శించారు. 'పేదల భూములను పెత్తందార్లు, కార్పొరేట్లకు కట్టబెట్టేలా ప్రభుత్వ నిర్ణయాలు ఉంటున్నాయి. తక్షణమే అఖిలపక్ష సమావేశం నిర్వహించి, భూ సమస్యలపై సమగ్ర విధానం రూపొందించాలి. నిషిద్ధ జాబితా నుంచి తప్పించిన ఫ్రీ హోల్డ్ భూముల విషయంలో అక్టోబరు 2 నాటికి సమగ్ర నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తామని అధికారులు ప్రకటించారు. అంతలోపు అన్ని రాజకీయ పార్టీలు, భూ సమస్యలపై అవగాహన ఉన్న వ్యక్తులు, వ్యవసాయ కార్మిక సంఘాలతో భూ కమిటీలను నియమించి సమగ్రంగా చర్చించాలి. నిజమైన పేదలు, చిన్న, సన్నకారు రైతులకు న్యాయం చేయాలి' అని ఆయన కోరారు.

అమరావతిలో స్థల కేటాయింపునకు కొత్త ప్రతిపాదనలు

సంస్థ పేరు	కేటాయించిన స్థలం (ఎకరాల్లో)	లీజు కాలం (ఏళ్లు)	ధర (ఎకరాకు)
ఆదాయపన్ను శాఖ	2	60	రూ.4 కోట్లు
ఏపీ గ్రామీణ బ్యాంకు	2	60	రూ.4 కోట్లు
సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా	0.40	60	రూ.4 కోట్లు
సబ్సిడరీ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబీ)	0.50	60	రూ.4 కోట్లు
బ్యూరో ఆఫ్ ఇమ్మిగ్రేషన్	0.50	60	రూ.4 కోట్లు
కిమ్స్ వైద్యకళాశాల	25	60	రూ.50 లక్షలు
భాజపా కార్యాలయం	2	33	ఏడాదికి రూ.వెయ్యి
మొత్తం	32.40		

2014-19 మధ్య చేసిన భూ కేటాయింపులకు సవరణ

సంస్థ పేరు	గతంలో కేటాయించింది (ఎకరాల్లో)	ఇప్పుడు సవరించిన విస్తీర్ణం (ఎకరాల్లో)	కేటాయింపు విధానం	ధర (ఎకరాకి)
సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్(సీబీఐ)	3.5	2	60 ఏళ్ల లీజు	రూ.4 కోట్లు
జూలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా	1	2	60 ఏళ్ల లీజు	రూ.కోటి
రాష్ట్ర ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్	3	5	11 ఏళ్ల అభివృద్ధి హక్కులు	చదరపు మీటరుకి ఏడాదికి అద్దె రూపాయి
ఏపీ కోఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్	3.095	0.495	ఫ్రీహోల్డ్	రూ.2 కోట్లు
పుల్లెల గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీ	12	12	ఫ్రీహోల్డ్	రూ.10 లక్షలు
ఇంటర్నేషనల్ క్రికెట్ అకాడమీ (ఎంఎస్‌కే ప్రసాద్)	12	12	ఫ్రీహోల్డ్	రూ.10 లక్షలు
మొత్తం	34.595	33.495		